సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 244
మంగళవారం 25-11-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

మహిళల కబడ్డీ జగజ్జేత భారత్

ప్రపంచకప్ మహిళల కబడ్డీ టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. రీతూ నేగి సారథ్యంలోని టీమిండియా 35–28 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీని చిత్తు చేసి.. రెండోసారి ట్రోఫీని సొంతం చేసుకుంది. రీతూ, పుష్ప, చంపా ఠాకూర్, భావన ఠాకూర్, సాక్షి శర్మ భారత విజయాల్లో కీలకంగా వ్యవహరించారు.

12లో



నేడు అయోధ్యలో మహా ఘట్టం

అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పరిపూర్తికి గుర్తుగా ప్రధాని మోదీ కాషాయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

వివరాలు 6లో ▸



నేవీలోకి 'ఐఎన్ఎస్ మాహె'

దాదాపు 80 శాతం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన 'ఐఎన్ఎస్ మాహె' నౌక భారత నావికా దళంలో చేరింది.

వివరాలు 6లో ▸

వాయు కాలుష్యంపై నిరసన

ఢిల్లీలో వాయుకాలుష్యంపై చేసిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులపై ఆందోళనకారులు పెప్పర్ స్ప్రేతో దాడి చేశారు.

వివరాలు 6లో ▸



లొంగిపోతాం.. సమయం ఇవ్వండి

'మేము లొంగిపోతాం. ఇందుకు కొంత సమయం ఇవ్వండి' అని 3 రాష్ట్రాల సీఎంలకు మావోయిస్టు నేత అనంత్ లేఖ రాశారు.

వివరాలు 10లో ▸

• భవనాలు కట్టే కంపెనీలకు భూ పందేరం...

ఐటీ ముసుగులో 'రియల్' లూటీ!

రూ.కోట్లలో అద్దెలు వసూలు చేసుకునే రియల్ ఎస్టేట్ సంస్థలకు విశాఖలో కారుచౌకగా భూములు

దీని వెనుక ప్రభుత్వ కీలక నేత పాత్ర

క్యాంపస్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు సర్కారు అప్పనంగా భూ కేటాయింపులు

రూ.వేల కోట్ల విలువైన భూమి కేవలం 99 పైసలకే

2లో

- అందులో 55 శాతమే క్యాంపస్.. మిగిలిందంతా రియల్ ఎస్టేట్ వ్యాపారానికే
- ఇవి కాకుండా పెట్టుబడిలో 60 నుంచి 70% ప్రోత్సాహకాల పేరిట వాటి ఖాతాలోకే
- తాజాగా కె.రహేజా గ్రూపునకు విశాఖలో 27.10 ఎకరాలు 99 పైసలకే కేటాయింపు
- ఇందులో 45 శాతం భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికి అనుమతి
- బెంగళూరుకు చెందిన 'సత్వా'కు రూ.1,500 కోట్ల భూమి రూ.45 కోట్లకే కేటాయింపు
- మధురవాడలో 30 ఎకరాల్లో 50 శాతం రియల్ ఎస్టేట్ చేసుకోవడానికి పచ్చజెండా
- కపిల్ చిట్‌ఫండ్స్ బీవీఎం ఎనర్జీకి 30 ఎకరాలు.. అందులో 40 శాతం స్థలంలో 'రియల్' వ్యాపారం.. ఏఎన్ఎస్ఆర్‌కు మధురవాడలో 10 ఎకరాలు కేటాయింపు
- రియల్ ఎస్టేట్ సంస్థ ఉర్సాకు కారుచౌకగా భూములిస్తూ గతంలో మంత్రివర్గ నిర్ణయం
- ఏపీఐఐసీ విలువైన భూములు ప్రైవేటు పార్కుల పాలసీ పేరిట అడ్డగోలుగా కేటాయింపు
- బాబు సర్కారు భూ దాహంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ ఐఏఎస్ అధికారులు

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

IT, E&C Dept - Promotions Wing – Approval for allotment of 27.10 acres of land at IT Hill No 3, Madhurawada, Visakhapatnam to M/s K Raheja Corp Real Estate Private Limited for developing IT/ITeS office space and residential space, and consideration of the project under AP IT & GCC Policy 4.0 (2024-29) for extending incentives, towards a proposed investment of INR 2,172 Crores with potential to create 9,681 jobs – Orders – Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT,E&C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.56 Date: 12.11.2025

7. The Government after careful examination of the proposal and keeping in the view the recommendations of the SIPB and the Council of Honourable Ministers, hereby approves the allotment of 27.10 acres of plottable land at Hill No.3, Madhurawada, Visakhapatnam, to M/s K Raheja Corp Real Estate Pvt Ltd. under Andhra Pradesh Land Incentive for Tech Hubs (LIFT) Policy (4.0) 2024-29, at a cost of INR 0.99. The

కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖ మధురవాడలోని ఐటీ హిల్ 3లో 99 పైసలకే 27.10 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 56 ఇది. ఈ భూముల్లో నివాస భవనాలు కూడా నిర్మించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టంగా తెలియజేసింది.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

జస్టిస్ సూర్యకాంత్ అనే నేను..

53వ సీజేఐగా ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

- పాల్గొన్న ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రధాని మోదీ, అమిత్ షా.. కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన ఏడు దేశాల ప్రధాన న్యాయమూర్తులు

6లో

హరియాణా నుంచి తొలి సీజేఐ

నోటిమాట వినతులు చెల్లవు!

అర్జెంట్ లిస్టింగ్ కేసులపై లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాల్సిందే

నూతన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టీకరణ

సరుకుకు సురుక్కు!

2లో

వాహనాల ఫిట్‌నెస్ చార్జీలు భారీగా పెంచిన చంద్రబాబు సర్కారు

కేటగిరీలుగా విభజించి మరీ బాదుడు

సరుకు రవాణా రంగంపై పెను ఆర్థిక భారం.. ఇక నిత్యావసరాల ధరలు మరింత పైపైకి!

వైద్య విద్య పీజీ సీట్లు సెల్ఫ్‌ఫైనాన్సే!

3లో

- కొత్త వైద్య కళాశాలల్లో ఈ విధానం వర్తింపునకు కసరత్తు
- వైద్య విద్య ఆశావహులను నమ్మించి మోసం చేస్తున్న బాబు సర్కార్
- సెల్ఫ్‌ఫైనాన్స్ విధానం ఎత్తేస్తామనే హామీతో గద్దెనెక్కిన ప్రభుత్వం

నేటి గుడ్లు & చికెన్
గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

'గబ్బర్ సింగ్.. మై ఆ రహా హూ'... అని గర్జిస్తే థియేటర్ హోరెత్తిపోయింది షోలేలో..

'ఖూన్ కా బద్లా ఖూన్' అని కత్తి దూస్తే కలెక్షన్ల జోరు పెరిగింది ధరమ్ వీర్‌లో..

'బియుటి బట్' అయితే 'పెయుటి పట్' ఎందుకు కాదని అడిగితే నవ్వుల జల్లు కురిసింది చుప్కే చుప్కేలో..

యాదోంకి బారాత్‌లో తమ్ములను కాచుకున్న అన్న అతడే. బర్నింగ్ ట్రైన్‌లో ప్రయాణికులను కాపాడిన వీరుడూ అతడే.

'డ్రీమ్‌గర్ల్... ఏక్ షాయర్‌కి గజల్' అని తెర మీద పాడి నిజ జీవితంలో హేమమాలినిని వివాహం చేసుకుందీ అతడే.

బాలీవుడ్ హీ మ్యాన్ ధర్మేంద్ర కన్నుమూత

తీవ్ర అస్వస్థతకు గురై కన్నుమూసిన దిగ్గజ నటుడు

ముంబైలో అంత్యక్రియలు.. నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

300కుపైగా చిత్రాల్లో ధర్మేంద్ర నటన

2012లో పద్మభూషణ్‌తో సత్కరించిన కేంద్రం

3లో

ధర్మేంద్ర నటన, 50 ఏళ్లుగా భారతీయప్రేక్షకుల జీవితంతో కలగలిసి పోయింది.

ఆయన మృతితో వారి మనసు ఖాళీ అయిన సినిమా హాలులా బోసిపోయింది.

ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తూ వాడపల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన ఇసుక అక్రమ రవాణా లారీలు

హద్దూ పొద్దూ లేకుండా ఇసుక అక్రమ రవాణా

యథేచ్ఛగా తెలంగాణకు ఇసుక వాహనాలు

చెక్‌పోస్టులు దాటిస్తున్న టీడీపీ కూటమి నేతలు

అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా రూట్ ఆఫీసర్లుగా మారి రెచ్చిపోతున్న వైనం

పట్టించుకోని అధికార యంత్రాంగం..

ఉమ్మడి గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రూ.కోట్లు దండుకుంటున్న తమ్ముళ్లు

10లో

ఇసుక అక్రమంగా తెలంగాణకు తరలిపోతోంది. టీడీపీ కూటమి నేతలే ప్రత్యేక ఏజెంట్లుగా, రూట్ ఆఫీసర్లుగా అవతారమెత్తి ఇసుక లారీలను చెక్‌పోస్టులు దాటిస్తున్నారు. రూ.కోట్లు దండుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది.

ఇలాంటివీ

రైతన్న కోసం ఎంతో చేశానని అలా శూన్యంలోకి చూపిస్తున్నాడేంటీ!!

భవనాలు కట్టే కంపెనీలకు భూ పందేరం...

ఐటీ ముసుగులో 'రియల్' లూటీ!

రూ.కోట్లలో అద్దెలు వసూలు చేసుకునే రియల్ ఎస్టేట్ సంస్థలకు విశాఖలో కారుచౌకగా భూములు కట్టబెట్టడం వెనుక ప్రభుత్వ కీలక నేత పాత్ర

రూ.వేల కోట్ల విలువైన భూమి కేవలం 99 పైసలకే

సాక్షి, అమరావతి: అసలవి ఐటీ కంపెనీలే కావు.. పక్కా రియల్ ఎస్టేట్ సంస్థలు! ఎంత ఖరీదైనా సరే భూములు కొనుగోలు చేసి, వాణిజ్య సముదాయాలు నిర్మించి విక్రయించుకోవడం లేదా లీజుకు ఇవ్వడం ద్వారా భారీగా సొమ్ము చేసుకుంటాయి. అలాంటి రియల్ ఎస్టేట్ దిగ్గజాలకు చంద్రబాబు సర్కారు ఐటీ డెవలప్‌మెంట్ పేరుతో విశాఖలో విలువైన భూములను పప్పు బెల్లాల మాదిరిగా పంచి పెట్టేస్తోంది. కారుచౌకగా భూములను కట్టబెట్టడమే కాకుండా, అవి నిర్మాణానికి చేసిన వ్యయంలో 50 నుంచి 60 శాతం తిరిగి ఇచ్చే విధంగా భారీ ప్రోత్సాహకాలను ఆఫర్ చేస్తోంది. కె.రహేజా, తెలుగు రాష్ట్రాలకు చెందిన కపిల్ చిట్‌ఫండ్స్ బీవీఎం ఎనర్జీ, బెంగళూరుకు చెందిన సత్వా డెవలపర్స్, ఏఎన్ఎస్ఆర్, ఫినోమ్ పీపుల్.. తదితర రియల్ ఎస్టేట్ సంస్థలకు ఐటీ ముసుగులో ఎటువంటి వేలం లేకుండా విలువైన భూములను చంద్రబాబు ప్రభుత్వం అప్పనంగా కట్టబెడుతోంది. ఐటీ ముసుగులో భూములిచ్చేస్తూ అందులో 40 నుంచి 50 శాతం స్థలంలో ఐటీ కార్యకలాపాలు కాకుండా గృహ, వాణిజ్య సముదాయాలు నిర్మించి అమ్ముకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునే విధంగా బంపర్ ఆఫర్ ఇస్తోంది. నిజానికి ఆ రియల్ ఎస్టేట్ సంస్థలు నిర్మించే వాణిజ్య సముదాయాల్లో ఒక్క ఐటీ ఉద్యోగం కూడా నేరుగా ఇవ్వవు. అవి నిర్మించిన భవనాల్లో వచ్చే ఐటీ కంపెనీలు మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తాయి. కానీ వాటిని రియల్ ఎస్టేట్ నిర్మాణ సంస్థల ఖాతాల్లో వేసి వేల ఉద్యోగాలంటూ భారీ రాయితీలను ప్రకటిస్తూ రెండిందాల ప్రయోజనాన్ని చేకూరుస్తుండటంపై అధికార యంత్రాంగం విస్మయం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ ప్రమోటర్లు తెరపైకి తెచ్చిన ఉర్సా లాంటి అనామక కంపెనీకి భూమి కేటాయిస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుని అభాసుపాలైనప్పటికీ భూ కేటాయింపుల విషయంలో చంద్రబాబు సర్కారు వెనక్కి తగ్గడం లేదు. భవనాలు నిర్మించి రూ.కోట్లలో అద్దెలు ముక్కుపిండి వసూలు చేసే రియల్ ఎస్టేట్ సంస్థలకు ప్రభుత్వం ఇలా కారుచౌకగా భూములు పందేరం చేయడం వెనుక ప్రభుత్వంలోని కీలక నేత చక్రం తిప్పుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇటీవల చంద్రబాబు సర్కారు రియల్ ఎస్టేట్ సంస్థలకు కేటాయించిన భూముల వివరాలివీ...

రూ.1,375 కోట్ల భూమి.. కేవలం 99 పైసలకే

ఉద్యోగాలిచ్చేది ఐటీ కంపెనీలు.. ప్రోత్సాహకాలు రియల్ ఎస్టేట్ సంస్థలకు

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

IT, E&C Dept - Promotions Wing – Approval for allotment of 27.10 acres of land at IT Hill No 3, Madhurawada, Visakhapatnam to M/s K Raheja Corp Real Estate Private Limited for developing IT/ITeS office space and residential space, and consideration of the project under AP IT & GCC Policy 4.0 (2024-29) for extending incentives, towards a proposed investment of INR 2,172 Crores with potential to create 9,681 jobs – Orders – Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT,E&C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.56 Date: 12.11.2025
Read the following

కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖ మధురవాడలోని ఐటీ హిల్ 3లో 99 పైసలకే 27.10 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 56 ఇది. ఈ భూముల్లో నివాస భవనాలు కూడా నిర్మించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టంగా తెలియజేసింది

రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కంపెనీ కె.రహేజా గ్రూపునకు చంద్రబాబు సర్కారు విశాఖలో అత్యంత కారుచౌకగా కేవలం 99 పైసలకే ఏకంగా 27.10 ఎకరాలు కేటాయించింది. మధురవాడలోని ఐటీ హిల్ నెంబర్ 3లో 27.10 ఎకరాలను ఏపీ లాండ్ ఇన్సెంటివ్స్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ పేరుతో ఇచ్చింది. ప్రస్తుతం మధురవాడ ఐటీ హిల్‌లో ఎకరా ధర రూ.50 కోట్లపైనే ఉంది. ఈ లెక్కన సుమారు రూ.1,375 కోట్ల విలువైన భూమిని కేవలం 99 పైసలకే కట్టబెట్టింది. అంతేకాదు.. రహేజాకు కేటాయించిన 27.10 ఎకరాల్లో 45 శాతం భూమిని ఐటీ కాకుండా ఇతర కార్యకలాపాలకు వినియోగించుకునేందుకు అనుమతించింది. వీటికి అదనంగా రూ.91.2 కోట్లతో రహదారులు, నీరు, విద్యుత్ లాంటి మౌలిక వసతులు కూడా కల్పిస్తామంటూ హామీ ఇచ్చింది. మొత్తం రూ.2,172.26 కోట్లతో నిర్మించనున్న ఐటీ క్యాంపస్‌ల ద్వారా 15,000 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నా ఆ ఉద్యోగాలేమీ రహేజా గ్రూపు సొంతంగా ఇవ్వదు. అది అభివృద్ధి చేసిన ఐటీ బిల్డింగ్‌లో ఏర్పాటయ్యే ఐటీ కంపెనీలే ఆ ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు ఐటీ కంపెనీలు కల్పిస్తుంటే.. ఆ పేరుతో పెట్టుబడి మొత్తంలో 60 నుంచి 70 శాతం ప్రోత్సాహకాల రూపంలో దోచిపెడుతుండటంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కపిల్ చిట్‌ఫండ్ ఖాతాలో..

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

ITE&C Dept. - Promotions Wing – Allotment of 10.29 Acres of land to M/s. ANSR Global Corporation Private Limited at Visakhapatnam for setting up Global Innovation City, and consideration of the project under the AP IT & GCC Policy (4.0) 2024-29 for extending incentives towards a proposed investment of Indian Rupees (INR) 1,000 crores with an employment potential of 10,000 jobs - Orders - Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT,E&C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.26 Date:01.08.2025
Read the following

6. Accordingly, the proposal was placed before the SIPB in its meeting held on 23.07.2025. The SIPB, based on the recommendations from SIPC, decided as follows:

a. "Approval for allotment of 2.5 acres of land at Plot No. 6, Hill No.3, IT SEZ, and 7.79 acres of land at Plot No. UDL 6, Hill No.4, at INR 0.99(ninety-nine paise only) for the entire extent, with a condition that the company should commence operations in both campuses within three years from the date of land allotment.

ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖ ఐటీ సెజ్‌లో 99 పైసలకే 10.29 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 26

d. Approval for allowing mixed usage of land up to 40% for associated infrastructure, including employee housing, retail, entertainment, medical, education and other social infra.

e. APIIC to lay two access roads to the site, at least 32 meters in width; the cost will be borne by the project proponent.

f. Energy Dept. to provide power supply to the boundary of the site; the cost will be borne by the project proponent.

g. APIIC to provide the water supply to the doorstep; the cost will be borne by the project proponent".

కపిల్ చిట్ ఫండ్స్ గ్రూప్‌నకు చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖ ఎండాడలో భూమి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 28లో హౌసింగ్, రిటైల్, ఎంటర్‌టైన్‌మెంట్, విద్య, వైద్య సంస్థల కోసం భూమిని వినియోగించుకునేందుకు అనుమతిచ్చింది

తెలుగు రాష్ట్రాల్లో చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్, మీడియా రంగాల్లో విస్తరించిన కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చంద్రబాబు సర్కారు విశాఖ పనోరమా హిల్స్ వెనుక ఎండాడ వద్ద ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున 30 ఎకరాలు కేటాయిస్తోంది. ఎండాడ వద్ద బహిరంగ మార్కెట్లో ఎకరా రూ.100 కోట్లు పెట్టినా భూమి దొరకని పరిస్థితి. అంటే సుమారు రూ.3,000 కోట్ల విలువైన భూమిని హెచ్ఎంటీవీ లాంటి మీడియా సంస్థలు కలిగిన కపిల్ గ్రూపునకు కేవలం రూ.45 కోట్లకే కేటాయిస్తోంది. కపిల్ గ్రూపు విశాఖలో రూ.1,250 కోట్ల పెట్టుబడితో 15,000 మందికి ఉపాధి కల్పించే విధంగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహాలో మరిన్ని కంపెనీలకు వాటి వ్యాపారాల కోసం ప్రభుత్వం భూములు ఇచ్చింది. వెంచర్ ఫండ్స్ నుంచి నిధులు సేకరించి ఐటీ పార్కులు ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)ను ఆకర్షించే పేరుతో బెంగళూరుకు చెందిన ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు మధురవాడ ఐటీ హిల్ నెం. 3పై ప్లాట్ నంబర్ 6 వద్ద 2.5 ఎకరాల భూమి, హిల్ నంబర్ 4పై ప్లాట్ నంబర్ యూడీఎల్ 6 వద్ద 7.79 ఎకరాలను కేవలం 99 పైసలకే కట్టబెట్టింది. అంతేకాకుండా ఐటీ ఇన్‌ఫ్రా డెవలపర్ కేటగిరీ కింద పలు రాయితీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఏఎన్ఎస్ఆర్ రూ.1,000 కోట్ల పెట్టుబడితో 10,000 మందికి ఉపాధి కల్పించనుంది. అలాగే ఫినోమ్ పీపుల్ ప్రై.లి.కు మధురవాడ ఐటీ హిల్ నంబర్–2లో 0.45 ఎకరాలు, రుషికొండ హిల్ నంబర్–4లో మరో 4ఎకరాలను ఎకరా రూ.4.05 కోట్లు చొప్పున కేటాయించింది. ఇలా చంద్రబాబు ప్రభుత్వం అత్యంత విలువైన భూములను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుండటంపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండటమే కాకుండా కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

రూ.1,500 కోట్ల భూమి 'సత్వా'కు రూ.45 కోట్లకే

రియల్ ఎస్టేట్ కంపెనీకి మధురవాడలో విలువైన స్థలం

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

ITE&C Dept - Promotions Wing – Allotment of 30 Acres of land to M/s. Sattva Developers Private Limited at Hill No. 4, Madhurawada, Visakhapatnam for setting up IT / ITES Space, Retail, Residential, Data Centers, and consideration of the project under the AP IT & GCC Policy (4.0) 2024-29 for extending incentives towards a proposed investment of INR 1,500 crores with an employment potential of 25,000 jobs – Orders – Issued.

A. Approval for allotment of 30 acres of land at Plot Nos. UDL1, UDL2, and UDL3, Hill No. 4, Madhurawada, Visakhapatnam at INR 1.50 Cr per acre.
B. Approval of the project under the IT infrastructure developer category in AP IT & GCC Policy (4.0) 2024-29 for extending incentives as per policy.
C. The project proponent is allowed to use mixed usage up to 50% in the allotted land.
D. The company shall commence commercial operations as per the following implementation schedule:
a. Year 1 to 3: Completion of 1 million sq. ft., including IT office space and other mixed development.
b. Year 3 to 5: Full-scale ramp-up and completion of remaining 9 million sq. ft. of mixed development.

సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మధురవాడ ఐటీ హిల్‌లో 30 ఎకరాలను కేటాయిస్తూ జారీ చేసిన జీవో నంబర్ 27 ఇది. ఈ కంపెనీకి ఐటీతోపాటు రిటైల్, రియల్ ఎస్టేట్, రెసిడెన్షియల్ భవనాల నిర్మాణానికి కూడా ప్రభుత్వం అనుమతిచ్చింది

బెంగళూరుకు చెందిన సత్వా గ్రూపు రెండు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉంది. పుణే, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో భారీ లగ్జరీ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసింది. బ్లాక్ స్టోన్ లాంటి పీఈ, వెంచర్ క్యాపిటల్ సంస్థల నుంచి నిధులు సేకరించి వ్యాపారం చేస్తుంది. 2017లో సత్వా గ్రూప్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ వద్ద 10 ఎకరాల స్థలాన్ని భారీ ధరకు కొనుగోలు చేసింది. తాజాగా అక్కడే కోకాపేట వద్ద 25 ఎకరాల భూమిని రూ.వేల కోట్లు పెట్టి సొంతం చేసుకుంది. ఇలా ప్రైవేటుగా స్థలాలు కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సత్వా సంస్థకు చంద్రబాబు సర్కారు విశాఖలో 30 ఎకరాల భూమిని కారుచౌకగా కట్టబెట్టింది. విశాఖ గ్రామీణ మండలం మధురవాడ ఐటీ హిల్ నెం.4 వద్ద ప్లాట్ నంబర్లు యూడీఎల్ 1, యూడీఎల్ 2, యూడీఎల్ 3 వద్ద 30 ఎకరాల భూమిని ఎకరా రూ.1.5 కోట్ల సబ్సిడీ ధరకే ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం మధురవాడ ఐటీ హిల్స్‌లో ఎకరా రూ.50 కోట్లపైనే పలుకుతోంది. రూ.1,500 కోట్ల విలువైన ఖరీదైన భూమిని కేవలం రూ.45 కోట్లకే ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి అప్పగించడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సత్వా గ్రూపునకు సబ్సిడీ ధర మీద భూమి కేటాయించడమే కాకుండా ఏపీ ఐటీ, జీసీసీ పాలసీ 4.0 కింద పెట్టుబడి రాయితీ, విద్యుత్ సబ్సిడీ, ఎస్‌జీఎస్టీ మినహాయింపు లాంటి అనేక అదనపు రాయితీలను కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. సత్వా డెవలపర్స్ హైదరాబాద్‌లో 10,350 చదరపు అడుగుల విస్తీర్ణానికి నెలకు రూ.10 లక్షలకుపైగా అద్దెను వసూలు చేస్తోందని, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఇక్కడ కూడా అదే స్థాయిలో అద్దెలను వసూలు చేస్తుందని పేర్కొంటున్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థలకు పారిశ్రామికపార్కులు

పేదల నుంచి కారు చౌకగా సేకరించిన భూములను పారిశ్రామిక పార్కుల పేరుతో ప్రైవేటు సంస్థలకు పప్పు బెల్లాల మాదిరి కట్టబెట్టేందుకు చంద్రబాబు సర్కారు రంగం సిద్ధం చేసింది. పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాల్సిన ఏపీఐఐసీ ఆ పని వదిలేసి రియల్ ఎస్టేట్ సంస్థల అడుగులకు మడుగులొత్తుతోంది. ఇప్పటికే ఐటీ పార్కుల ముసుగులో విశాఖలో రూ.వేల కోట్ల విలువైన భూములను ధారాదత్తం చేసిన బాబు సర్కారు తాజాగా రాష్ట్రవ్యాప్తంగా పేదల అసైన్డ్ భూములను కార్పొరేట్ రాబందులకు కట్టబెడుతోంది. ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ విత్ ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీ 2024–29 పేరిట కార్పొరేట్ సంస్థల పరం చేస్తోంది. ఇందులో భాగంగా తొలి విడతలో 39 పారిశ్రామిక పార్కుల అభివృద్ధి పేరిట 5,221.09 ఎకరాలను టీడీపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి కట్టబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. 100 ఎకరాలు పైబడిన వాటిని లార్జ్ పార్కులుగా, ఆ లోపు వాటిని ఎంఎస్ఎంఈ పార్కులుగా వర్గీకరించి డిజైన్, నిర్మాణం, నిర్వహణకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. మొత్తం 13 లార్జ్ పార్కుల కింద 4,737.86 ఎకరాలు, 16 ఎంఎస్ఎంఈ పార్కుల కింద 483.23 ఎకరాలను కట్టబెట్టనుంది. అంతేకాదు.. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల పాలసీ కింద ఎకరానికి రూ.3 లక్షల క్యాపిటల్ సబ్సిడీతో పాటు పలు రాయితీలను కల్పించనుంది. వాణిజ్య భవనాలు, గృహ సముదాయాలు, గిడ్డంగులు లాంటి నిర్మాణాలు చేపట్టే రియల్ ఎస్టేట్ సంస్థలు పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో పాలు పంచుకోవచ్చని నిర్ణయించడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు పార్కుల పాలసీ ముసుగులో తమకు కావాల్సిన రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములను కారుచౌకగా కట్టబెట్టడమే దీని వెనుక వ్యూహమని స్పష్టం చేస్తున్నారు. పారిశ్రామిక పార్కుల్లో కన్వెన్షన్ సెంటర్లు, విద్యా సముదాయాలు, ఆస్పత్రులు, హోటల్స్ , షాపింగ్ మాల్స్, వినోద కేంద్రాలు లాంటి నిర్మాణాలకు అనుమతిస్తున్నారంటే దీని వెనుక దాగిన 'రియల్' ఉద్దేశాలను అర్థం చేసుకోవచ్చని ఒక ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. కొత్తచోట్ల కాకుండా ఇప్పటికే ఏపీఐఐసీ సేకరించి అభివృద్ధి చేయడం ద్వారా రూ.వేల కోట్లు పలుకుతున్న జయంతిపురం, రాంబిల్లి, కోసల నగరం, రౌతు సురమాల, తిమ్మసముద్రం, సంతబొమ్మాళి లాంటి చోట్ల ప్రైవేటు వ్యక్తులకు భూముల కేటాయింపులు చేయడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని సంరక్షిస్తూ.. ఆయన పదవీకాలాన్ని విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షిస్తూ వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

'ఉయ్యాలవాడ'కు వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నివాళులర్పించారు. 'ఆంగ్లేయులపై తొలి తిరుగుబాటు జెండా ఎగురవేసి, బ్రిటీష్ వ్యతిరేక పోరాటానికి నాంది పలికిన స్వాతంత్ర్య సమరయోధుడు, మన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఆయన ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం. అటువంటి మహావీరుడి పేరు స్మరించుకుంటూ కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టుకోవడం మనందరికీ గర్వకారణం. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ధర్మేంద్ర మృతి పట్ల వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను ఎంతగానో కలిచివేసిందని పేర్కొన్నారు. 'మంచి నటునిగా, పార్లమెంటు సభ్యునిగా రాణించిన ఆయన నిరాడంబరత, మానవత్వం వంటి విలువలను ప్రతిబింబించారు. ధర్మేంద్ర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఈ కష్ట సమయంలో దేవుడు వారికి ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా' అంటూ వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

సరుకుకు సురుక్కు!

వాహనాల ఫిట్‌నెస్ చార్జీలు భారీగా పెంచిన బాబు సర్కారు

సాక్షి, అమరావతి: రవాణా రంగంపై ప్రభుత్వం పెను ఆర్థికభారాన్ని మోపింది. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) చార్జీలను భారీగా పెంచింది. వాహనాల జీవిత కాలాన్ని ఆధారంగా చేసుకుని భారీగా చార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చార్జీలను యథాతథంగా అమలు చేయకుండా రాయితీలు ప్రకటించేందుకు అవకాశం ఉన్నా సరే ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించనే లేదు. తద్వారా రవాణా రంగం నిర్వహణ వ్యయం పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు మరింతగా పెరుగుతాయనే సంకేతాలు సామాన్యులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఇంత భారీ పెరుగుదల ఇదే తొలిసారి

వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చార్జీలను ప్రభుత్వం భారీగా పెంచడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు వాహనాల ఎఫ్‌సీ కోసం రూ.1,340 చార్జీగా ఉండేది. కాగా ప్రస్తుతం వాహనాల జీవితకాలాన్ని ఆధారంగా చేసుకుని టెస్టింగ్ ఫీజు, సర్టిఫికెట్ చార్జీ, జీఎస్టీ కలిపి భారీగా పెంచుతూ వాహన యజమానులపై పెను ఆర్థిక భారాన్ని మోపారు.

కేటగిరీలుగా విభజించి మరీ బాదుడు

సరుకు రవాణా వాహనాలను కేటగిరీలుగా విభజించి మరీ బాబు సర్కారు బాదుడుకు పూనుకోవడం విస్మయపరుస్తోంది. ఎంజీవీ, హెచ్ఎంవీ వాహనాలను ఐదు విభాగాలుగా చేసి చార్జీలు వడ్డించారు. గతంలో రవాణా శాఖ అధికారులు వాహనాన్ని పరీక్షించి ఎఫ్‌సీ జారీ చేసేవారు. ఇప్పుడు ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. ఈ సంస్థలు ఎఫ్‌సీ జారీకి అనధికారికంగా మరి కొంత అధికంగా వసూలు చేస్తున్నాయి. దీంతో రవాణా రంగంపై భారం మరింత పెరగనుంది. ఇది నిత్యావసరాల పెరుగుదలకు దారితీయనుంది. ఇప్పటికే కూరగాయల నుంచి అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు తాజా నిర్ణయం సామాన్యులను కలవరపాటుకు గురిచేస్తోంది.

పెంచిన చార్జీలు ఇలా ఉన్నాయి..

వాహనం	వాహన జీవిత కాలం	ఫీజు (రూపాయల్లో)
క్యాబ్	15 ఏళ్ల వరకు	944
క్యాబ్	15 ఏళ్ల నుంచి 20 ఏళ్లు	5,310
క్యాబ్	20 ఏళ్లు దాటితే	10,620
ఎల్ఎంవీ(కార్లు)	15 ఏళ్ల వరకు	944
ఎల్ఎంవీ (కార్లు)	15 ఏళ్ల నుంచి 20 ఏళ్లు	10,030
ఎల్ఎంవీ (కార్లు)	20 ఏళ్లు దాటితే...	20,060
మీడియం సరుకు రవాణా వాహనాలు(ఎంజీవీ)	10 ఏళ్ల వరకు	1,416
ఎంజీవీ	10 ఏళ్ల నుంచి 13 ఏళ్లు	2,360
ఎంజీవీ	13 ఏళ్ల నుంచి 15ఏళ్లు	7,080
ఎంజీవీ	15 ఏళ్ల నుంచి 20 ఏళ్లు	13,334
ఎంజీవీ	20 ఏళ్లు దాటితే..	26,668
భారీ రవాణా వాహనాలు(హెచ్ఎంవీ)	10 ఏళ్ల వరకు	1,416
హెచ్ఎంవీ	10 ఏళ్ల నుంచి 13 ఏళ్లు	2,360
హెచ్ఎంవీ	13 ఏళ్ల నుంచి 15 ఏళ్లు	7,080
హెచ్ఎంవీ	15 ఏళ్ల నుంచి 20 ఏళ్లు	16,520
హెచ్ఎంవీ	20 ఏళ్లు దాటితే...	33,040

భారత మహిళా కబడ్డీ జట్టుకు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: కబడ్డీలో ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా కబడ్డీ జట్టుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. వరుసగా రెండోసారి దేశం గర్వించేలా విజయం సాధించారని కొనియాడారు. 'మన అమ్మాయిల టీం వర్క్, క్రమశిక్షణ, దృఢ సంకల్పం ప్రతిబింబించింది. క్రీడల్లో మహిళలు దేశ ప్రతిష్ట ఇనుమడించేలా వరుస విజయాలు సాధించటం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలి' అని వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

ప్రతాప్‌రెడ్డి త్వరగా కోలుకోవాలి

మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్న త్వరగా కోలుకోవాలి అని కోరుకుంటున్నా' అని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

నేటి నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో 75% నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు పునఃపంపిణీ చేయడం, కేడబ్ల్యూడీటీ–2 సగటు, 65% లభ్యత ఆధారంగా కేటాయించిన 194 టీఎంసీల మిగులు జలాలను ఏపీ, తెలంగాణకు పంపిణీ చేయడంపై ఈనెల 25 నుంచి 27 వరకూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేపట్టనుంది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా ఉన్న కేడబ్ల్యూడీటీ–2 వాదనలు విననుంది. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా తుది వాదనలను కొనసాగించనున్నారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

వైద్య విద్య పీజీ సీట్లు సెల్ఫ్ ఫైనాన్సే..!

కొత్త వైద్య కళాశాలల్లో ఈ విధానం వర్తింపునకు కసరత్తు

వైద్య విద్య ఆశావహులను నమ్మించి మోసంచేస్తున్న బాబు సర్కార్

సెల్ఫ్‌ఫైనాన్స్ విధానం ఎత్తేస్తామనే హామీతో గద్దెనెక్కిన ప్రభుత్వం

ప్రభుత్వం వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లను అమ్ముకోవడం చాలా దురదృష్టకరం. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు ఇవ్వాల్సిన సీట్లను డబ్బులకు అమ్ముకోవడం అన్యాయం.

– 2023 అక్టోబర్ నాలుగో తేదీన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్న మాటలు

సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ప్రభుత్వమే ఎంబీబీఎస్ సీట్లను అమ్మడం దారుణం. రేపు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఆ సీట్లను అందజేస్తాం. అధికారంలోకి వచ్చాక మొదటి వంద రోజుల్లో జీవోలను రద్దు చేసే బాధ్యత నేను తీసుకుంటాను. ప్రతిభావంతులైన విద్యార్థులకు సీట్లను అందేలా చూస్తాను.

– 2023 ఆగస్టు 16న నారా లోకేశ్ యువతకు ఇచ్చిన హామీ

సాక్షి, అమరావతి: కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామనే హామీతో గద్దెనెక్కిన చంద్రబాబు యువతకు మరోవెన్నుపోటు పొడిచారు. రేవు దాటక తెప్ప తగలేసినట్టు.. యువతకు ఇచ్చిన హామీకి తిలోదకాలు ఇచ్చేశారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాల ల ఏర్పాటులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను వైఎస్ జగన్ సర్కార్ ప్రారంభించింది. ఈ కళాశాలలకు మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, అనస్థీషియా, గైనిక్ విభాగాల్లో 60 పీజీ సీట్లను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) మంజూరు చేసింది. కొత్త కళాశాలలకు ఈ విద్యా సంవత్సరం సీట్లు మంజూరైన క్రమంలో ఫీజులు, సీట్ల భర్తీపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పీజీ సీట్లకు సెల్ఫ్‌ఫైనాన్స్ విధానం వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

అడుగడుగూ అబద్ధమే..!

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కొత్త వైద్య కళాశాలలను నిర్వహించడం, వాటిని స్వయం సమృద్ధిగా మార్చడం అన్న లక్ష్యంతో గత ప్రభుత్వంలో ఎంబీబీఎస్ కోర్సులకు మాత్రమే కొన్ని సీట్లకు సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని నాడు టీడీపీ తీవ్ర స్థాయిలో తప్పుబట్టింది. ఆందోళనలు చేసింది. తాము గద్దెనెక్కగానే సెల్ఫ్‌ఫైనాన్స్ విధానానికి సంబంధించిన 107, 108 జీవోలను రద్దు చేసేస్తామని వైద్య విద్యా ఆశావహులకు నమ్మబలికారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోగా, పీజీ సీట్లకు కూడా అదే విధానాన్ని వర్తింపజేస్తుండటం గమనార్హం.

సీట్ల భర్తీ తీరిది...!

పీజీ అడ్మిషన్‌లలో ప్రభుత్వ కళాశాలల్లోని సగం సీట్లను ఆలిండియా కోటాలో భర్తీ చేస్తారు. మిగిలిన సగం సీట్లు రాష్ట్ర కోటా కింద కన్వీనర్ కోటాలో భర్తీ చేయాల్సి ఉంటుంది. కాగా, రాష్ట్ర కోటాలోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేసి, మిగిలిన 50 శాతంలో 35 శాతం సెల్ఫ్‌ఫైనాన్స్, 15 శాతం ఎన్ఆర్ఐ కోటా కింద భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

విద్యార్థుల తెల్లకోటు కల ఛిద్రం

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కొత్త కళాశాలల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ విధానం ఎత్తేయకపోగా, ఏకంగా 10 కళాశాలలను బాబు సర్కార్ ప్రైవేట్‌కు దారాదత్తం చేసేస్తున్న విషయం తెలిసిందే. కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టడం కోసం మంజూరైన పులివెందుల వైద్య కళాశాల 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరైనా కుట్రపూరితంగా రద్దు చేయించారు. సర్కార్ ప్రణాళిక ప్రకారం 2024–25, 2025–26 విద్యా సంవత్సరాల్లో వైద్య కళాశాలలు ప్రారంభం అవ్వకుండా ఉద్దేశపూర్వకంగా మోకాలడ్డి రెండేళ్లలో 2,450 మంది విద్యార్థుల తెల్లకోటు కలను ఛిద్రం చేశారు. కళాశాలలు ప్రైవేట్‌పరం చేస్తుండటంపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఉద్యమానికి ప్రజా, విద్యార్థి సంఘాలు, మేధావులు, సాధారణ ప్రజలు మద్దతుగా నిలిచారు.

క్లుప్తంగా...

నేడు పులివెందులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

3 రోజులు నియోజకవర్గంలో పర్యటన

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నుంచి 3 రోజుల పాటు వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటించింది.

పర్యటన షెడ్యూల్..

మంగళవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్ జగన్ పులివెందుల చేరుకుని క్యాంప్ ఆఫీస్‌లో రాత్రి 7 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలోనే బస చేస్తారు. బుధవారం ఉదయం 9 గంటలకు పులివెందులలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో జరిగే వివాహ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం బ్రాహ్మణపల్లి చేరుకుని అరటి తోటలను పరిశీలించి.. రైతులతో మాట్లాడుతారు. ఆ తర్వాత పులివెందుల చేరుకుని లింగాల మాజీ సర్పంచ్ మహేశ్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తారు. అక్కడి నుంచి వేల్పులలోని లింగాల రామలింగారెడ్డి నివాసానికి వెళ్తారు. అనంతరం పులివెందుల చేరుకుని క్యాంప్ ఆఫీస్‌లో రాత్రి 7 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలోనే బస చేస్తారు. గురువారం ఉదయం 8 గంటలకు పులివెందుల నుంచి వైఎస్ జగన్ తిరుగు పయనమవుతారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

- కేంద్రంపై 'ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా' ఫైర్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో పత్రికా స్వేచ్ఛకు కేంద్రం సంకెళ్లు వేస్తోందని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం–2023 నిబంధనల నోటిఫికేషన్ విషయంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఏకపక్షంగా వ్యవహరించిందని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పీసీఐ మండిపడింది. దేశవ్యాప్తంగా వేలాది మంది జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 22 మీడియా సంఘాలు కలిసి జూన్ 2025లో ఇచ్చిన ఉమ్మడి వినతిపత్రాన్ని ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని, పత్రికా స్వేచ్ఛను హరించే లోపాలను సరిదిద్దడంలో కేంద్రం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేసింది. డీపీడీపీ చట్టం–2023 ద్వారా కేంద్రం తన చేతిలోకి నిరంకుశ అధికారాలను తీసుకుందని, ప్రస్తుతం ప్రభుత్వం తానే జడ్జి, జ్యూరీ, శిక్ష అమలు చేసే వారిలా మారిందని పీసీఐ తీవ్రస్థాయిలో విమర్శించింది.

లూథ్రాకు మరో రూ.1.15 కోట్ల ఫీజు చెల్లింపు

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు ఫీజుల చెల్లింపుల జాతర కొనసాగుతూనే ఉంది. రాజకీయ కేసులకు ఇప్పటికే లూథ్రాకు ప్రజాధనాన్ని కట్టబెట్టిన చంద్రబాబు ప్రభుత్వం తాజాగా సోమవారం మరో రూ.1.15 కోట్లను ఫీజులుగా చెల్లించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ రెండు జీవోలు జారీ చేశారు. మద్యం అక్రమ కేసులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించినందుకు రూ.65 లక్షలను, మద్యం అక్రమ కేసులో మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డికి ఏసీబీ కోర్టు మంజూరు చేసిన డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ తరఫున వాదనలు వినిపించినందుకు లూథ్రాకు రూ.20 లక్షలను ఫీజులుగా చెల్లించింది. వీటికి 10 శాతం క్లర్కేజీ కలిపి మొత్తం రూ.1.15 కోట్లను చెల్లించింది. గత కొన్ని నెలల్లో లూథ్రాకు రూ.5.11 కోట్లను కేవలం రాజకీయ కేసుల్లో వాదనలు వినిపించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నుంచి ప్రజాధనాన్ని చెల్లించింది. ఇవి కాకుండా గత నెల 17న రెండు జీవోల ద్వారా చెల్లించిన ఫీజులు రూ.2.03 కోట్లతో కలిపితే లూథ్రాకు చెల్లించిన ఫీజుల మొత్తం రూ.7.14 కోట్లకు చేరింది. సోమవారం జారీ చేసిన రెండు జీవోల ద్వారా చెల్లించిన ఫీజులు రూ.1.15 కోట్లతో కలిపితే ఇప్పటివరకు లూథ్రాకు చెల్లించిన ఫీజుల మొత్తం రూ.8.29 కోట్లకు చేరింది.

ఎక్సైజ్ కస్టడీకి 'నకిలీ మద్యం' నిందితులు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీమద్యం తయారీ కేసులో అరెస్టయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న సుదర్శన్, చైతన్యబాబు, కొడాలి శ్రీనివాసరావు, ఆష్రఫ్, బాలాజీలను నాలుగు రోజులు ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి అనుమతిస్తూ తంబళ్లపల్లె కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఐదుగురు నిందితులను ములకలచెరువు ఎక్సైజ్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

బాలీవుడ్ హీ మ్యాన్ ఇకలేరు

తీవ్ర అస్వస్థతకు గురై కన్నుమూసిన దిగ్గజ నటుడు ధర్మేంద్ర



భర్త మరణంతో శోకసంద్రంలో హేమమాలిని

సాక్షి, సినిమా డెస్క్: బాలీవుడ్ హీ మ్యాన్‌గా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన దిగ్గజ సీనియర్ నటుడు, లోక్‌సభ మాజీ ఎంపీ ధర్మేంద్ర (89) ఇకలేరు. కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన్ను గత నెల 31న కుటుంబ సభ్యులు ముంబైలోని ఓ ఆస్పత్రిలో చేరి్పంచగా చికిత్స పొంది, డిశ్చార్జ్ అయ్యారు. ఆదివారం రాత్రి మరోసారి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు మరోసారి ఆస్పత్రికి తరలించగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. సోమవారం ముంబైలోని విల్లే పార్లే శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు ముగిశాయి. సినీ, రాజకీయ ప్రముఖులు ధర్మేంద్ర భౌతికకాయం వద్ద నివాళులర్పించగా పలువురు సంతాపం తెలిపారు. ధర్మేంద్ర గత నెలలో ఆస్పత్రిపాలైనప్పుడు ఆయన మరణించారనే వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే ఈ వార్తలను ధర్మేంద్ర కుమార్తె ఈషా డియోల్ అప్పట్లో ఖండించింది. అయితే అలా ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ధర్మేంద్ర తుదిశ్వాస విడవడంతో ఆయన అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.

స్కూలు రోజుల్లోనే నాటకాలు..

ధర్మేంద్ర అసలు పేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ డియోల్. 1935 డిసెంబర్ 8న పంజాబ్‌లోని ఫాగ్వారాలో జన్మించారు. చదువులో ప్రతిభావంతుడు కానప్పటికీ చిన్నప్పటి నుంచి ధర్మేంద్ర ఎంతో క్రమశిక్షణ కలిగి ఉండేవారు. స్కూలు రోజుల్లోనే ఆయన నాటకాలు వేసేవారు. దీంతో ఆయనకు సినిమాలపై మక్కువ పెరిగింది. అప్పట్లో ఫిల్మ్‌ఫేర్ మ్యాగజైన్ కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఓ కార్యక్రమంలో ధర్మేంద్ర విజేతగా నిలిచి ముంబైలో అడుగుపెట్టారు. తన 19వ ఏట సినిమాల్లోకి రాక ముందే 1954లో ప్రకాశ్ కౌర్‌ని మొదటి వివాహం చేసుకున్నారు. వారికి నలుగురు సంతానం. వారిలో కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, కుమార్తెలు విజిత, అజీత ఉన్నారు.

నట ప్రస్థానం

అర్జున్ హింగోరాని దర్శకత్వం వహించిన 'దిల్ బీ తేరా హమ్ బీ తేరే'(1960) సినిమాతో ధర్మేంద్ర బాలీవుడ్‌లో నటుడిగా అడుగుపెట్టారు. ఈ చిత్రానికిగాను ఆయన తీసుకున్న తొలి పారితోషికం రూ.51. ఆ తర్వాత 'బాయ్ ఫ్రెండ్, బందినీ, అనుపమ, ఆయా సావన్ జూమ్ కే'వంటి సినిమాలతో నటుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'షోలే, ధర్మవీర్, చుప్కే చుప్కే, మేరా గావ్ మేరా దేశ్, డ్రీమ్ గర్ల్'వంటి చిత్రాలతో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్స్ అందుకున్నారు. రొమాంటిక్ హీరోగా, యాక్షన్ హీరోగానూ ఆయన రాణించారు. 'ఆయే మిలన్ కీ బేలా'వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు కూడా పోషించారు. 1966లో వచ్చిన 'ఫూల్ ఔర్ పత్తర్'సినిమా ఆయనకు స్టార్‌డమ్‌ను తెచ్చిపెట్టింది. 1971లో విడుదలైన 'మేరా గావ్ మేరా దేశ్'తో యాక్షన్ హీరోగా స్థిరపడ్డ ధర్మేంద్రకు.. 'ప్యార్ హి ప్యార్, ఆయా సావన్ ఝూమ్ కే, మేరే హమ్‌దమ్ మేరే దోస్త్'వంటి చిత్రాలు రొమాంటిక్ హీరో ఇమేజ్‌ను తెచ్చిపెట్టాయి. 'రాజా జానీ'(1972), 'జుగ్ను'(1973) వంటి చిత్రాలు ఆయన్ను యాక్షన్ హీరోగా మరింత నిలబెట్టాయి. 'షోలే'(1975) చిత్రానికి రూ.1.5 లక్షల పారితోషికం తీసుకున్నారు. ఆ సినిమా నటీనటుల్లో అత్యధిక పారితోషికం అందుకున్నది ఆయనే కావడం విశేషం. అలాగే అందాల తార హేమమాలినితో కలిసి నటించిన 'తుమ్ హసీన్ మై జవాన్, షరాఫత్, సీతా ఔర్ గీతా, రాజా జానీ, జుగ్ను, ప్రతిజ్ఞ, షోలే, చరస్, ఆజాద్, దిల్లగి' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. వెండితెరపై హిట్ పెయిర్‌గా నిలిచిన ధర్మేంద్ర–హేమమాలిని 1980లో వివాహం చేసుకొని రియల్ లైఫ్ జోడీగా మారారు. వారికి ఇషా డియోల్, అహనా డియోల్ సంతానం.

ఎన్నో రికార్డులు...

ఆరు దశాబ్దాలకుపైగా సినీ కెరీర్‌లో ధర్మేంద్ర 300కుపైగా సినిమాల్లో నటించారు. బాలీవుడ్‌లో అత్యధిక హిట్ చిత్రాల్లో నటించిన రికార్డు ఆయన సొంతం. 1973లో ఎనిమిది, 1987లో వరుసగా ఏడు హిట్స్‌తో పాటు అదే ఏడాది తొమ్మిది విజయవంతమైన చిత్రాల్లో నటించారు. బాలీవుడ్ చరిత్రలో ఇప్పటికీ ఇది ఒక రికార్డుగా ఉంది. కండలు తిరిగిన శరీర సౌష్టవంతో సినిమాల్లో కనిపించిన ధర్మేంద్ర.. అమ్మాయిల కలల రాకుమారుడిగా నిలిచారు. శరీర సౌష్టవానికి తోడు యాక్షన్ చిత్రాల్లో పోషించిన పాత్రలు ఆయనకు 'హీ మ్యాన్'ట్యాగ్‌ని తెచ్చిపెట్టాయి. పోరాట సన్నివేశాల్లో డూప్ లేకుండా నటించి యాక్షన్ కింగ్ అనే బిరుదు సొంతం చేసుకున్నారు. 1983లో విజేత ఫిలింస్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి బేతాబ్, ఘాయల్, బర్సాత్ తదితర చిత్రాలను నిర్మించారు. ముఖ్యంగా తన పెద్ద కుమారుడు సన్నీ డియోల్‌తో తీసిన 'ఘాయల్'సూపర్ హిట్‌గా నిలిచింది. తన కుమారులు బాబీ డియోల్, సన్నీ డియోల్‌లతో కలిసి 'అప్నే, యమ్లా పగ్లా దీవానా'వంటి సినిమాల్లో నటించారు. 2011లో ప్రముఖ రియాలిటీ షో 'ఇండియాస్ గాట్ టాలెంట్'మూడవ సిరీస్‌కు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 2023లో ధర్మేంద్ర తొలిసారి 'తాజ్: డివైడెడ్ బై బ్లడ్'అనే టీవీ సీరియల్‌లో నటించారు. ధర్మేంద్ర నటించిన ఆఖరి చిత్రం 'ఇక్కీస్'(2025). శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ కొంతకాలం పనిచేశారు. 2004లో రాజస్తాన్‌లోని బికనీర్ లోక్‌సభ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2009లో తన పదవీకాలం ముగిసిన తర్వాత రాజకీయాల నుంచి తప్పుకున్నారు.

అవార్డులు...

కళామతల్లికి చేసిన సేవలకుగాను 2012లో కేంద్ర ప్రభుత్వం ధర్మేంద్రను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. 1997లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆయన్ను వరించింది. 1991లో వచ్చిన 'ఘాయల్'సినిమాకుగాను ఆయన నిర్మాతగా జాతీయ అవార్డు అందుకున్నారు. 2016లో వరల్డ్ యూనివర్సిటీ ఫోరమ్ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. 1970లో ప్రపంచంలోని అందగాళ్లలో ఒకడిగా ధర్మేంద్ర నిలిచారు. పలు ప్రముఖ సంస్థలు ఆయనకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులతో సత్కరించాయి.

పీపీపీతో వైద్య విద్యలో ప్రమాణాలు దెబ్బతింటాయి

ఏపీ మెడికల్ కాలేజీల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరిట ప్రైవేటీకరణ చేస్తే వైద్య విద్యలో ప్రమాణాలు దెబ్బతింటాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన సోమవారం కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పీపీపీ విధానంలో 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కోసం ఇచ్చిన జీవో నంబర్ 590ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పేద విద్యార్థులకు ఉచిత మెడికల్ సీట్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని కల్లబొల్లి మాటలు చెప్పిన కూటమి నాయకులు... నేడు మొత్తం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు.

క్వార్టర్లు ఖాళీ చేయకుంటే కర్రతో సమాధానం చెబుతాం

కర్నూలు ఏ, బీ, సీ క్వార్టర్లలోని ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు మంత్రి టీజీ వార్నింగ్

కర్నూలు టౌన్: 'కర్నూలులో ఏ, బీ, సీ క్వార్టర్లలో ఉంటున్న వారు ఆ ఇళ్లు ఖాళీ చేయాల్సిందే. లేదంటే కర్రతో సమాధానం చెబుతాం'.. అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఉద్యోగులను, రిటైర్డు ఉద్యోగులను బెదిరించారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద రహదారి విస్తరణ పనుల శిలాఫలకాన్ని మంత్రి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలలోనే కర్నూలు హైకోర్టు బెంచీకి సంబంధించి ఏర్పాట్లు ప్రారంభమవుతాయన్నారు. అందువల్ల ఏ, బీ, సీ క్వార్టర్లలో నివసించే వారు ఖాళీచేయాలని మంత్రి స్పష్టంచేశారు. ప్రతిపక్ష పార్టీని కలిస్తే మీకే వేళ్లు, చేతులు కాలుతాయి అని ఆయన హెచ్చరించారు. రచ్చ చేయాలని చూస్తే కర్రతో సమాధానం చెప్పాల్సి ఉంటుందని భరత్ హెచ్చరించారు.

సదరం స్లాట్ల విషయంలో దళారుల చేతుల్లో మోసపోవద్దు

సాక్షి, అమరావతి: సదరం స్లాట్‌ల బుకింగ్ విషయంలో దళారులను నమ్మొద్దని ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటనలో కోరింది. ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా 31,050 స్లాట్లు విడుదల చేసినట్టు వెల్లడించింది. మొత్తం స్లాట్లు రెండు రోజుల్లో బుక్ అయిపోయినట్టు పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 118 ఆస్పత్రుల్లో సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, కొందరు దళారులు పక్క జిల్లాల్లో స్లాట్ బుక్ చేసి స్థానిక జిల్లాలకు బదిలీ చేస్తామని రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

బాలికల హాస్టల్లో వాచ్ ఉమెన్ దాష్టీకం

- బాత్రూంలో వీడియో తీయించిందంటూ బాలికల ఆరోపణ
- హాస్టల్‌లో బాలికల మధ్య ఘర్షణ

మార్టూరు: స్థానిక ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో బాలికల మధ్య జరిగిన ఘర్షణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. బాధిత బాలికల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి భోజనాల సమయంలో బాలికల మధ్య వివాదం ప్రారంభమైంది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు అక్కచెల్లెళ్లను తోటి బాలికలు కొట్టారు. వారు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పడంతో వారి సూచన మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు బయటకు వెళ్లారు. ఇదంతా హాస్టల్ వాచ్ ఉమెన్ నాగమణి ముందే జరగడం గమనార్హం. బాలికలు, హాస్టల్ పరిసరాల స్థానికుల వివరాల ప్రకారం.. వాచ్ ఉమెన్ నాగమణి హాస్టల్ బాలికలతో రోజూ రాత్రి 10 గంటల వరకు సమీపంలోనే ఉన్న తన ఇంట్లో పనులు చేయించుకుంటోంది. బాధితులైన అక్కాచెల్లెళ్లు ఆమె ఇంటి పని చేసేందుకు ససేమిరా అంటూ వెళ్లేవారు కాదు. ఈ క్రమంలో ఇటీవల అక్కా చెల్లెళ్లలో ఇద్దరిలో చెల్లెలు బాత్రూంలో స్నానం చేస్తుండగా అదే హాస్టల్‌కు చెందిన మరో బాలికతో వాచ్ ఉమెన్ వీడియో తీయించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం వసతి గృహంలోని బాలికల ద్వారా హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ రాజేశ్వరి దృష్టికి వెళ్లడంతో ఆ వీడియోను బాధిత బాలిక అక్క స్వయంగా డిలీట్ చేసినట్లు తెలిపింది. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అక్కా చెల్లెళ్లను హాస్టల్ లోపలకు రాకుండా ఇంటికి వెళ్లాలని వాచ్ ఉమెన్ కోడలు హాస్టల్ బయటే నిలబెట్టడం గమనార్హం. హాస్టల్లో జరుగుతున్న గొడవ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి వార్డెన్ రాజేశ్వరి అద్దంకి నుంచి మార్టూరు బయల్దేరినట్లు సమాచారం.

వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబు

ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డితో మాట్లాడుతున్న వైద్య విద్యార్థి తండ్రి

పులివెందుల: వైద్య విద్యార్థులపై చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఆయన్ని సోమవారం ఆంధ్రప్రదేశ్ నీట్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆ సభ్యుల్లో ఒకరైన పులివెందులకు చెందిన గాజుల జయప్రకాష్ ఎంపీతో మాట్లాడుతూ తన కుమారుడు చరణ్‌సాయికి నీట్‌లో 470 మార్కులు వచ్చాయని తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో 471 మార్కుల కటాఫ్ కారణంగా ఒక్క మార్కు తేడాతో తన కుమారుడు వైద్యసీటు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారితో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ మంజూరు చేసిన 50 సీట్లు వద్దని లేఖ రాశారని చెప్పారు. పాడేరు వైద్య కళాశాలకు రావాల్సిన 50 సీట్లను కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కోల్పోయామన్నారు. ఈ రెండు కళాశాలలకు మంజూరైన సీట్లు వచ్చి ఉంటే చరణ్‌సాయి వంటి విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించేవని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పేదలకు ఉచిత వైద్యం, విద్యార్థులకు వైద్యవిద్య అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.

శెట్టిబలిజలకు మంత్రి సుభాష్ వెన్నుపోటు

- మెమోకు, జీవోకు తేడా తెలియని మంత్రి
- మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజం

సాక్షి, అమరావతి: మెమోకు, జీవోకు తేడా తెలియని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.. శెట్టిబలిజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాల కృష్ణ తేల్చి చెప్పారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీవో నెంబరు 16 తోపాటు శెట్టి బలిజలకు ఎవరేం చేశారన్న దానిపై కుల పెద్దలు, మీడియా సమక్షంలో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరితే.. మంత్రి ఎందుకు తోక ముడిచారని నిలదీశారు. చంద్రబాబు హయాంలో 1997లోనే జీవో నంబరు 16 విడుదల కాగా.. దాన్ని ఏ ప్రభుత్వాలూ అమలు చేయలేదని, తిరిగి కూటమి ప్రభుత్వం హయాంలో 2025 జూలై 30 నుంచి శెట్టిబలిజ సర్టిఫికెట్‌లో గౌడ అని చేర్చి అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. దాన్ని కప్పిపుచ్చిన మంత్రి.. వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ నిర్ణయం తీసుకుంటే తాను క్షమాపణలు చెబుతానన్న చెల్లుబోయిన వేణు.. కూటమి ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తేలితే క్షమాపణలు చెప్తారా అని మంత్రిని నిలదీశారు. వేణు ఇంకా ఏమన్నారంటే..

మంత్రి నాపై చేసిన ఆరోపణలు నిరూపించాలి

''రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇటీవల వనభోజనాల్లో వైఎస్సార్‌సీపీపైనా, నా పైన చేసిన ఆరోపణల మీద చర్చకు నేను సిద్ధమని ప్రకటిస్తే.. ఆయన పత్రికా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారు. నాపై చేసిన ఆరోపణలు నిజమని మంత్రి నిరూపిస్తే శెట్టిబలిజ సామాజిక వర్గానికి క్షమాపణ చెబుతాను. నిరూపించలేకపోతే మంత్రి నాకు, శెట్టిబలిజ జాతికి క్షమాపణ చెప్పాలి. చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకోవడం మంత్రికి అలవాటు.'' అని చెల్లుబోయిన ధ్వజమెత్తారు.

మంత్రి చర్చకు రావాలి

మంత్రి సుభాష్ శెట్టిబలిజల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. ఆయన ఘనకార్యం వల్లే సామాజిక ధ్రువీకరణ పత్రాల్లో బ్రాకెట్లో శెట్టిబలిజకు ముందు గౌడ అని పేర్కొంటున్నారు. దీనిపై నేను చర్చకు సిద్ధం. చర్చకొస్తే ఈ విధానం అమలుకు కారకులెవరో తేలిపోతుంది. కుల పెద్దలు, మీడియాను న్యాయనిర్ణేతలుగా పెట్టి చర్చిద్దాం. శెట్టిబలిజలను మంత్రి తెలుగుదేశం పార్టీకి తాకట్టు పెడుతున్నారు. గతంలో మంత్రి మీద కేసులు ఎత్తివేయించిందే నేను. ఇంతవరకు ఓపిక పట్టాను. ఇక సహించేది లేదు. రామచంద్రాపురం నియోజకవర్గంలో శెట్టిబలిజలకు ఎవరేం మేలు చేశారో బహిరంగంగా చర్చిద్దాం. జీవోకి, మెమోకి తేడా తెలియని మంత్రులను కేబినెట్‌లో పెట్టుకుంటే ఇంతకంటే ఏం ఆశించలేం. ఇంకోసారి నాపై మంత్రి అవాకులుచెవాకులు పేలితే సహించేది లేదు'' అంటూ చెల్లుబోయిన హెచ్చరించారు.

వైభవంగా శ్రీసత్యసాయి జయంతి వేడుకలు

సత్యసాయిబాబా జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సద్గురు శ్రీమధుసూదనసాయి

బెంగళూరు (బనశంకరి): బెంగళూరు సమీపంలో చిక్కబళ్లాపుర వద్దనున్న ముద్దేనహళ్లిలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఒక ప్రపంచం ఒక కుటుంబం సేవా ఉద్యమం పేరుతో సత్యసాయి గ్రామంలో ఆధ్యాత్మిక వేడుకలు నిర్వహించినట్లు సద్గురు మధుసూదనసాయి తెలిపారు. వేడుకలు ఆగస్టు 16న ఆరంభమై నేత్రపర్వంగా సాగాయి. ఈ సుదీర్ఘ ఉత్సవంలో సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీతం, కళలు, నృత్యం, సేవా కార్యక్రమాల్లో 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే, 140 మందికి పైగా కార్పొరేట్ సంస్థల ముఖ్యులు పాల్గొన్నారు. 45 మందికి పైగా ప్రపంచ మేధావులు, మీడియా, న్యాయవాద రంగాల్లోని పలువురిని ఈ సందర్భంగా గౌరవించారు.

600 పడకల ఉచిత ఆస్పత్రి..

సత్యసాయి గ్రామంలో 600 పడకల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధమైంది. ఇందులో అందరికీ ఆరోగ్యసేవలు అందించాలనేదే లక్ష్యమని నిర్వాహకులు మధుసూదనసాయి తెలిపారు. సత్యసాయి నామంతో సాగిన ఆర్కెస్ట్రాలో ప్రపంచంలోని 60 దేశాల నుంచి 450 మంది కళాకారులు, 70 మంది గాయకులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సునీల్ గవాస్కర్, సత్యసాయి ఆరోగ్య శిక్షణ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, అవధూత వినయ్ గురూజీ, అక్షయపాత్ర పండిత దాస, మాజీ క్రికెటర్ అరవింద డిసిల్వా పాల్గొన్నారు.

“ మతం, కులం ఏదైనా, సాటి వారిని మనం మనిషిగా గుర్తించకపోతే భారతదేశమే లేదు.
– జస్టిస్ రంగనాథ్ మిశ్రా

సాక్షి
మంగళవారం, 25 నవంబర్ 2025

జీ20 సరికొత్త మార్గం

దేశాల మధ్య సహకారం పెంపొందించటం ద్వారా అంతర్జాతీయ ఆర్థిక సుస్థిరత సాధించాలన్న సంకల్పంతో పదిహేడేళ్ల క్రితం ఏర్పడిన జీ20 తొలిసారి అమెరికాను ధిక్కరించింది. దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో వరసగా రెండు రోజులు కొనసాగి ఆదివారం ముగిసిన సంస్థ శిఖరాగ్ర సదస్సుకు అమెరికా ముఖం చాటేయగా, దాన్ని బతిమాలటానికీ, నచ్చజెప్పి ఒప్పించటానికీ ఒక్కరంటే ఒక్కరు ప్రయత్నించిన దాఖలా లేదు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తన విపరీత పోకడలతో ఇంటా బయటా వ్యతిరేకత మూటగట్టుకుంటున్నారు. శ్వేతజాతి అమెరికన్లకు ఏదో ఒరగబెడుతున్నట్టు కనబడటం కోసం ప్రమాదకర నిర్ణయాలు తీసుకుంటున్నారు. పర్యావరణ క్షీణత పెద్ద బోగస్ అని వాదించటమేగాక, బొగ్గు, ఇతర శిలాజ ఇంధనాలను వినియోగించే పరిశ్రమలకు రాయితీలిస్తున్నారు. వేరే దేశాలు కూడా తన బాటలోనే నడవాలంటూ ప్రోత్సహిస్తున్నారు. మానవ కార్యకలాపాల పర్యవసానంగా భూగోళం వేడెక్కుతున్నదని, ఇది ధరిత్రి మనుగడకే పెను ముప్పని శాస్త్రవేత్తలంతా ముక్తకంఠంతో చెబుతున్నా మొండిగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయంగానూ అదే బాణీ అందుకున్నారు. జొహాన్నెస్‌బర్గ్ సదస్సు ప్రధాన ధ్యేయమే వాతావరణ మార్పులపై చర్చించి తగు చర్యల కోసం ప్రపంచ దేశాలకు పిలుపునివ్వటం గనుక ట్రంప్ గుర్రుగా ఉన్నారు. సదస్సు ఎజెండాను మార్చమంటూ గత కొన్ని వారాలుగా ఒత్తిడి తెచ్చారు. అది సాధ్యపడకపోవడంతో శ్వేత జాతి మైనారిటీల పట్ల దక్షిణాఫ్రికా ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తున్నదని, అందుకు నిరసనగానే సదస్సుకు గైర్హాజరు కాదల్చుకున్నట్టు ప్రచారం లంకించుకున్నారు. ట్రంప్‌కు వంతపాడే అర్జెంటీనా అధ్యక్షుడు జావియర్ మిలీ కూడా సదస్సుకు రాలేదు.

కావడానికి జీ20 సంపన్న రాజ్యాల సంస్థే అయినా దక్షిణాఫ్రికా వంటి వెనకబడిన దేశంలో సదస్సు జరిగింది. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలపై ఉమ్మడి అవగాహనకు రావాలన్న ధ్యేయంతో ఈ సంస్థ ఏర్పాటైంది. ఇందులో వర్ధమాన దేశాలకు సైతం భాగస్వామ్యం కల్పించారు. ప్రపంచంలో మూడింట రెండొంతుల జనాభా గల దేశాలకూ, ప్రపంచ స్థూల ఉత్పత్తిలో దాదాపు 85 శాతం వాటా ఉన్న ఆర్థిక వ్యవస్థలకూ ఇది ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సదస్సు నుంచి దూరం జరిగితే ప్రపంచంలో ఏకాకిగా మిగులుతామన్న స్పృహ ట్రంప్‌కు లేకపోయింది. 'నేను లేకుండా శిఖరాగ్ర సదస్సు డిక్లరేషన్‌ను విడుదల చేయొద్దని ట్రంప్ తీవ్రంగా ఒత్తిడి తెచ్చినా సదస్సు బేఖాతరు చేసింది. అంతేగాక సంప్రదాయానికి భిన్నంగా తొలి రోజునే డిక్లరేషన్‌ను ఆమోదించింది. తన గైర్హాజర్ అయోమయాన్ని సృష్టించి, డిక్లరేషన్ ఆమోదానికి అధినేతలు తటపటాయిస్తారని ట్రంప్ అనుకున్నారు. కానీ 'అయ్య వచ్చేదాకా అమావాస్య ఆగద'ని జీ20 తేల్చిచెప్పింది. వాస్తవానికి సంస్థ అధ్యక్ష పదవి అమెరికాకు రావాలి. కానీ సదస్సుకు ట్రంప్ గైర్హాజరు కావటం, కనీసం ఉన్నతాధికారులనైనా పంపక, జూనియర్ అధికారితో సరిపుచ్చటానికి నిరసనగా అధ్యక్ష పదవి బదిలీకి దక్షిణాఫ్రికా నిరాకరించింది. అది ఎప్పుడుంటుందో, అసలు జీ20లో అమెరికా కొనసాగుతుందో లేదో చెప్పలేని స్థితి ఏర్పడింది. అమెరికాలోని మియామిలో వచ్చే ఏడాది జరగాల్సిన తదుపరి సదస్సుపైనా అనిశ్చితి అలుముకుంది.

భారత, చైనా, రష్యాలేకాక అమెరికా శిబిరంలో ఉండాల్సిన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, కెనడాలు సైతం ఈ సదస్సులో పాల్గొని వాతావరణ సమస్యలపైనా, ప్రపంచ అసమానతలపైనా దృష్టిపెట్టిన డిక్లరేషన్‌ను ముక్తకంఠంతో ఆమోదించాయి. పునరుత్పాదక ఇంధన వనరులపై, నిరుపేద దేశాల రుణవిమోచనపై కూడా అవగాహన కుదిరింది. భారత్ సూచించిన విధంగా ఉగ్రవాదంపైనా, మాదకద్రవ్యాలపైనా సమష్టిగా తలపడటానికి ఆమోదం తెలిపాయి. వాతావరణ సమస్యలపై శిఖరాగ్ర సదస్సు అంగీకారానికి రావటం ట్రంప్ జీర్ణించుకోలేనిది. సదస్సు ఆమోదించిన అంశాల్లో మెజారిటీ పేద దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించినవే. తనది ఇక గత వైభవమేనని, ఇటువంటి సదస్సులకు దూరంగా ఉంటే అంతిమంగా తన ప్రతిష్ఠ మరింత మసకబారుతుందని అమెరికా గ్రహించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.పంచమి రా.6.56 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.9.07 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.1.16 నుండి 2.56 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.09 వరకు, తదుపరి రా.10.27 నుండి 11.18 వరకు, **అమృత ఘడియలు:** ప.2.13 నుండి 3.54 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

హృదయ శాసనం

నేను భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించను. నా జీవితాన్ని నా హృదయం శాసిస్తుంది. నిజంగా ఒక మంచి కారు కొనటం తప్ప నా జీవితానికి వేరే ఏమీ అక్కర్లేదన్నట్లుగానే నా జీవితం గడిచింది. దేనికీ ఆశ పడను. అలాగని అందరూ నాలా ఉండాలని కాదు.

– రూపా గంగూలీ, నటి – మాజీ ఎంపీ

ప్రధాన శత్రువు

ధైర్యంగా ముందుకు అడుగు వేయకపోతే ఎప్పటికీ సంశయంలోనే ఉండిపోతాం. కెరీర్‌లో మీ ప్రధాన శత్రువు ఎవరంటే... మిమ్మల్ని స్థిరంగా, సౌకర్యవంతంగా ఉంచే మీ ఉద్యోగం, లేదా ఉపాధి. మారేందుకు వచ్చే అవకాశాలకు వదులుకోకండి.

– ప్రశాంత్ ప్రకాశ్, వెంచర్ క్యాపిటలిస్ట్

బోధన బాధ్యత

న్యాయం పట్ల ప్రజల విశ్వాసం బలోపేతం కావాలి. ప్రజా హక్కుల పరిరక్షణలో చురుకుదనం ఉండాలి. ఈ రెండూ జరిగేలా చూడటం పాలకుల బాధ్యత. నేను కనుక మానవ హక్కుల కమిషన్‌లో చేరకపోయి ఉంటే న్యాయశాస్త్రం బోధించటానికి వెళ్లి ఉండేవాడిని.

– జస్టిస్ శ్యామల్ కుమార్ సేన్, మాజీ గవర్నర్

యువతే కీలకం



మానవులు ప్రతిదీ అభివృద్ధి చేయగలరు. కానీ ప్రకృతికి ప్రత్యామ్నాయాన్ని సృష్టించలేరు. కాబట్టి పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ వహించాలి. ఇందుకోసం యవతరాన్ని కలుపుకోవటం అవసరం. మెరుగైన ప్రపంచాన్ని నిర్మించటంలో యువతే ముందుంటుంది.

– భూపేందర్ యాదవ్, పర్యావరణ మంత్రి

ఆశాదీపం



నేను ఆశావాదిని. జీవితం నా పట్ల ఎంత కఠినంగా ఉన్నా, ఏదో ఒక మూల నాలో ఆశాదీపం వెలుగుతూనే ఉంటుంది. మీరు వృద్ధులు అయినందువల్ల ఆటను ఆపరు. ఆటను ఆపేయటం వల్ల వృద్ధులు అవుతారు. మీలోని ఆశను క్షీణించనివ్వకండి!

– పాల్ మెక్‌కార్ట్నీ, మ్యుజీషియన్

మార్చేయాలి

ఒక టెక్నాలజీ సీఈవోగా మీరు అంగీకరించవలసిన విషయం ఏంటంటే, కొత్త టెక్నాలజీని అమలు చేయటం ద్వారా మాత్రమే మీరు మీ కంపెనీని అభివృద్ధి చేయలేరు. 'కోడ్' మారాలి. సాఫ్ట్‌వేర్ డెలివరీ విధానం మారాలి. అవసరం ఉన్న ప్రతిదీ తరచూ మార్చుకుంటూనే ఉండాలి.

– క్రిస్టియన్ క్లెయిన్, 'శాప్' సీఈవో

ఓట్ల పర్యాటకాన్ని ఆపేయాలి!

విశ్లేషణ



ఎస్.వై. ఖురేషి

బిహార్‌లో పేరు నమోదు చేయించుకుని అక్కడ ఓటు వేసేందుకు ఢిల్లీ, హరియాణా లాంటి రాష్ట్రాల నుంచి వేలాది ఓటర్లు తరలివెళ్లినట్లు ఇటీవల ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ఒక ప్రొఫెసర్ ఢిల్లీ జాబితా నుంచి తన పేరు కొట్టేయించుకుని, బిహార్‌లో నమోదు చేసుకున్నారంటూ ఇందుకు ఉదాహరణగా మార్మోగింది. ఇది నిజమైతే, ఇది చట్టవిరుద్ధమైన ఆచారం.

మీ 'సాధారణ నివాస స్థలం' ఏదో అక్కడే ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలి. భారత ఎన్నికల చట్టాలు ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నాయి. మీ ఇల్లు, సొంతూరి మీద మీ ప్రేమ... ఇవేవీ ఓటు హక్కు పొందడానికి అర్హతలు కావు. మీరు వాస్తవంగా నివసిస్తున్న చోటు మాత్రమే మీ సాధారణ నివాసం అవుతుంది.

సాధారణ నివాసమే ప్రాతిపదిక

ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 19 ప్రకారం, ఒక వ్యక్తికి తను 'సాధారణ నివాసి'గా ఉన్న నియోజక వర్గంలో మాత్రమే ఓటరుగా నమోదు చేయించుకోవడానికి అర్హత ఉంటుంది. 17, 18 సెక్షన్లు మరో రెండు నిబంధనలను జత చేశాయి. మీరు ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో నమోదు కాలేరు. ఒకే నియోజకవర్గంలోనూ ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదు అయ్యే వీల్లేదు. ఈ రెండు నిబంధనలూ మార్చడానికి వీల్లేనివి (నాన్–నెగోషియబుల్).

'సాధారణ నివాసి' అంటే ఏమిటో సెక్షన్ 20 వివరిస్తుంది. సొంత ఆస్తి ఉన్నంత మాత్రాన ఒక ప్రదేశంలో సాధారణ నివాసి కాలేరని ఇది స్పష్టం చేస్తోంది. సాధారణ నివాసం అనేది వాస్తవ ఆధారితంగా ఉంటుంది. నిరంతరం అక్కడే ఉంటున్నారా, లేదా అన్నది ప్రధానం అంటే, మీరు స్వతహాగా అక్కడ ఉంటారు, ముమ్ముందు కూడా అక్కడే ఉండాలనుకుంటారు. తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తున్నా నివాస హోదా మారదు. చివరిగా, మార్పులు చేర్పులకు సంబంధించి ఏవి తప్పుడు ప్రకటనలు అవుతాయో సెక్షన్ 31 చెబుతోంది. కొత్త ప్రాంతంలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు వేరే చోట అప్పటికే తన పేరు నమోదై ఉన్నదనే వాస్తవం దాచిపెట్టడం క్రిమినల్ నేరం. దీనికి ఏడాది వరకు జైలు శిక్ష, లేదా జరిమానా, లేదా రెండూ విధించే వీలుంది.

పని నిమిత్తమో, పర్యటనల నిమిత్తమో వేరే ప్రదేశానికి వెళ్లి తాత్కాలికంగా చిరునామాలో లేనంత మాత్రాన అక్కడి ఓటు హక్కు పోదు. అది కొన్ని వారాలు లేనందున పోయేదీ కాదు, పోలింగ్ ముందు అక్కడకు రాగానే వచ్చేదీ కాదు! ఆరు నెలల వ్యవధిని సాధారణ నివాసం కింద భారత ఎన్నికల సంఘం పరిగణిస్తుంది.

◆ ఓటర్లను బస్సుల్లో తరలించి, వలస వెళ్లిన వారంటూ వారి పేర్లను బిహార్ జాబితాల్లో నమోదు చేయడం, తర్వాత వారి 'సాధారణ నివాస స్థలం'లో మళ్లీ ఓటరుగా నమోదు చేయించాలని ప్లాన్ చేయడం ప్రజా ప్రాతినిధ్యాన్ని పక్కదారి పట్టించడమే! ఇది నేరం.

వ్యూహాత్మక తరలింపులను ఆపాలి!

ఓటర్లను బస్సుల్లో తరలించి వలస వెళ్లిన వారంటూ వారి పేర్లను జాబితాల్లో నమోదు చేయడం, తర్వాత ఢిల్లీ లేదా హరియాణాలో మళ్లీ నమోదు చేయించాలని ప్లాన్ చేయడం ప్రజా ప్రాతినిధ్యాన్ని పక్కదారి పట్టించడమే! ఆ ప్రాంతంలోని పాఠశాలలు, ఆసుపత్రులు, నీటి సరఫరా, రోడ్లు, పోలీసు వ్యవస్థలను వినియోగించుకునే సాధారణ నివాసుల అభిమతం నియోజకవర్గ ప్రాతినిధ్యంలో ప్రతిబింబిస్తుందని రాజ్యాంగం తలుస్తోంది. జరుగుతున్న ఈ తరలింపుల ప్రహసనం అందుకు భిన్నం.

వాస్తవంగా వలస వెళ్లిన కార్మికుల, విద్యార్థుల ఓట్ల నమోదును కష్టతరం చేయడం ఈ సమస్యకు పరిష్కారం కాదు. ఇప్పుడు చేయవలసిందల్లా నిజమైన వలసల నుంచి వ్యూహాత్మక తరలింపులను వేరు చేయాలి. ఈ దిశగా అనుసరించదగిన అయిదు మార్గాలు:

(1) నోటీసు ఇచ్చి విచారణ జరిపిన తర్వాత ఒక వ్యక్తి ఆ ప్రదేశంలో సాధారణ నివాసం ఉండటం లేదని తేలితే ఆ వ్యక్తి పేరు జాబితా నుంచి తొలగించడానికి చట్టం ఇప్పటికే వీలు కల్పిస్తోంది. ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇరుగు పొరుగువారి ప్రకటనలను తప్పనిసరిగా రికార్డ్ చేయాలి. ఇంట్లో ఉంటున్నదీ లేనిదీ ధ్రువీకరించాలి. సంతకం చేసి నివేదికలు సమర్పించాలి. ఈఆర్‌ఓలు ప్రతి కేసుపై దృష్టి సారించాలి.

(2) క్రాస్–స్టేట్ డూప్లికేషన్ నివారణ: వేరొక రాష్ట్ర ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకున్న వ్యక్తుల నుంచి వచ్చే ఫారం 6 దరఖాస్తులను ఆటోమేటిక్‌గా గుర్తించేట్లు ఈఆర్‌ఓ–నెట్‌లో తగు ఏర్పాట్లు ఉండాలి. అటువంటి అభ్యర్థనల్ని ఆమోదించే ముందు గట్టి రుజువులు (ఇటీవలి అద్దె ఒప్పందాలు, ఉపాధి/విద్య సర్టిఫికెట్లు, యుటిలిటీ బిల్లులు) తీసుకోవాలి.

(3) నేర నిరోధకత: తెలిసీ తప్పుడు ప్రకటన (''నేను మరెక్కడా నమోదు కాలేదు'') చేస్తూ ఫారమ్ 6ను దాఖలు చేయడం ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం నేరం. వేళ్ల సంఖ్యలో కేసులు ఎంపిక చేసి కఠిన శిక్షలు పడేట్లు చేస్తే, అవే వేలాది హెచ్చరికలుగా పని చేస్తాయి. లక్ష్యం సామూహిక శిక్ష కాదు, ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తెలియజెప్పడం!

(4) ఎన్నికల అనంతరం ఆడిటింగ్: పోలింగ్ అనంతరం మూడు నెలలు గడిచాక, సున్నిత ప్రాంతాలలో 'కొత్త ఓటర్ల' శాంపిల్ తీసుకుని విశ్లేషించాలి. వారిలో చాలా మంది సంబంధిత ప్రాంతంలో ఎప్పుడూ లేరని తేలితే అది చర్య తీసుకోదగిన సాక్ష్యం అవుతుంది.

(5) నిజమైన వలసదారుకు రక్షణ: పేదలు, నిజంగా నివాసాలు మారేవారు, వేరే ప్రాంతాలకు వెళ్లి వస్తూ ఉండేవారు తమకు అందుబాటులో ఉండే పత్రాల ద్వారా తమ ఓటు నమోదు చేయించుకోవడాన్ని సులభతరం చేయాలి. బీఎల్‌ఓ నిర్ధారించిన స్వీయ ధ్రువీకరణ నివాస పత్రం, యజమాని లేదా సంస్థ ఇచ్చే ధ్రువీకరణ పత్రం వంటి వాటిని అంగీకరించాలి.

చివరి మాట

విస్తృత చర్చకు దారితీసిన ప్రొఫెసర్ మాటేమిటి? అతడు నిజంగా ఢిల్లీలో సాధారణ నివాసం ఉండకుండా బిహార్‌కు వెళ్లి అక్కడే వాస్తవంగా నివసిస్తూ ఉంటే, బిహార్‌లో అతడి ఓటు హక్కు నమోదు చట్టబద్ధమైనదే. అయితే, అది ఢిల్లీలో తొలగించబడి ఉండాలి. నివాసం మార్చకుండా, ఢిల్లీ జాబితాలో పేరు కొట్టేయించుకుని, బిహార్‌లో ఓటు వేయడానికి అక్కడ నమోదు చేసుకుని ఉంటే, తర్వాత ఢిల్లీ ఓటరుగా మళ్లీ నమోదు చేయించుకోవాలని ప్లాన్ చేస్తే తీవ్ర చర్యలు తీసుకోవాలి.

రూల్ ఒక చిన్న వాక్యంగా చెప్పగలిగినంత సరళమైనది. మీరు ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే ఓటు వేయండి. మీ తాత ముత్తాతల ఇల్లు తాళం పడిన చోట కాదు! మీ పార్టీ మిమ్మల్ని ఒక వారం పాటు ఉండమని కోరుకున్న చోట కాదు!! పోలింగ్ రోజున సుఖప్రదంగా ఉండే చోట కాదు!! సాధారణ నివాసం అనేది ఆఖరికి విద్యార్థులు, సీజనల్ కార్మికులు, నిరాశ్రయులకు కూడా ఓటరుగా నమోదు చేసుకునే వీలు కల్పిస్తుంది. ఎన్నికల 'పర్యాటకం' ఎప్పటికీ మంచి ప్రజాస్వామ్యం కాదు. ఇలాంటి పర్యాటకానికి ద్వారాలు మూసేయాలి.

వ్యాసకర్త కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్

సోషల్ ఇంజినీరింగ్‌పై దృష్టి పెట్టాలి!

అభిప్రాయం

పి. వేణుగోపాల్ రెడ్డి

ఏ ఉద్యమమైనా, సామాజిక సంస్థ అయినా, రాజకీయ పార్టీ అయినా – సమాజంలోని అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం వహించేలా నాయకత్వాన్ని రూపొందించడానికి 'సోషల్ ఇంజినీరింగ్' ముఖ్య సాధనం. దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం, నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న రోజులవి. తిరుపతిలో జరిగిన ఒక పార్టీ సమావేశంలోని మరచిపోలేని అనుభవం గుర్తుకు వస్తున్నది. సమావేశం మధ్యలో ఒక కార్యకర్త లేచి నిలబడి, వేదిక మీద కేవలం అగ్రకులాలకు చెందిన నాయకులే ఎందుకు ఉన్నారు? అని ప్రశ్నించాడు. నేను కూడా ఆ వేదిక మీదే ఉన్నాను. నిజమే – వేదిక మీద ఉన్నవారంతా అగ్ర కులాలకు చెందినవారే. ఆ కార్యకర్త ప్రశ్న నా హృదయాన్ని తాకింది. అది పరిశీలించదగిన, స్పందించదగిన ప్రశ్నగా అనిపించింది.

2003 వరకు అదే బాధ్యతలో ఉన్నంత కాలం ఈ అంశాన్ని అమలు చేయడానికి చిత్తశుద్ధితో నేను కృషి చేశాను. అనేక వైపుల నుంచి తీవ్ర వ్యతిరేకతలు ఎదుర్కొన్నాను. సమాజాభివృద్ధి కోసం పనిచేసే ప్రతి సంస్థ, ప్రతి ఉద్యమం ఈ సూత్రాన్ని తప్పనిసరిగా అనుసరించాలి కూడా!

ఒక బీసీ వ్యక్తి దేశ ప్రధానమంత్రిగా ఉన్నంత మాత్రాన కుగ్రామంలోని బీసీ యువకుడికి ఆర్థికంగా పెద్దగా ప్రయోజనం కలగకపోవచ్చు. కానీ మనవాడే ప్రధాని అన్న గర్వంతో, సంతృప్తితో అతని కళ్లు మెరిసిపోతాయి. ఈ విషయాన్ని విస్మరించి ముందుకు సాగే సంస్థలు, ఉద్యమాలు ఎప్పటికీ విజయవంతం కాలేవనేది నా గట్టి నమ్మకం.

తెలివితేటలు, చిత్తశుద్ధి, పట్టుదల, త్యాగనిష్ఠ – ఇవి ఏ ఒక్క కులానికో పరిమితం కావు. అన్ని కులాల్లోనూ, అన్ని వర్గాల్లోనూ ఈ లక్షణాలు మూర్తీభవించిన వ్యక్తులు ఉన్నారు; ఉంటారు. వారిని గుర్తించి, ప్రోత్సహించి, వివిధ బాధ్యతల్లోకి తేవడమే నిజమైన నాయకుడి సమర్థత. కానీ ఇది ఎందుకు జరగడం లేదు? తీవ్రవాద ఉద్యమాల్లో అగ్రకులాల ఆధిపత్యం గురించిన చర్చ గట్టిగానే జరిగింది. సోషల్ ఇంజినీరింగ్‌ను అమలు చేయకపోవడమే అందుకు కారణం.

సమాజం సజావుగా, శాంతియుతంగా ముందుకు సాగాలంటే రిజర్వేషన్లు కేవలం విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాలకే పరిమితం కాకూడదు; ప్రైవేటు వ్యాపార సంస్థల్లోనూ ఇవి అమలు కావాలి. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు వస్తే క్వాలిటీ పడిపోతుంది అని వాదిస్తారనడంలో అనుమానం లేదు; కానీ అది వాస్తవం కాదు.

ఇటీవల వార్తల్లో 'ఆపరేషన్ కగార్' ప్రధానాంశంగా నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎక్కువగా వినిపించిన పేరు – హిడ్మా. ఎందరో సీనియర్ నాయకులు ఎన్‌కౌంటర్లలో మరణించినా, లొంగిపోయినా హిడ్మా పేరు మాత్రమే ఇంతటి సంచలనం సృష్టించింది. కేవలం 5వ తరగతి మాత్రమే చదివిన ఒక గిరిజనుడైన హిడ్మాలో అపారమైన మేధ, వ్యూహాత్మక దక్షత, అసాధారణ నాయకత్వ లక్షణాలు ఉన్నాయని అందరూ ఒప్పుకుంటున్నారు. హిడ్మా ఎన్నుకున్న హింసాత్మక మార్గాన్ని నేను వందశాతం ఖండిస్తాను. కానీ ఆ గిరిజన యువకుడిలో ఉన్న అసామాన్య సమర్థతలు, చిత్తశుద్ధి, లక్ష్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని ధైర్యం – వీటిని గుర్తించక తప్పదు కదా! సమాజంలోని అన్ని కులాల్లోనూ, అన్ని వర్గాల్లోనూ ఇలాంటి యోగ్యులు ఉంటారనడంలో సందేహం లేదు. వారిని గుర్తించి, తగు శిక్షణ ఇచ్చి, అవకాశాలు కల్పిస్తే – ప్రైవేటు రంగంతో సహా అన్ని రంగాల్లోనూ సామాజిక న్యాయం సిద్ధిస్తుంది.

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్' ఛైర్మన్
pvg2020@gmail.com

వ్యవస్థ చేస్తున్న హత్యలు

ఇన్ బాక్స్

'నేనేం చెప్పాలి, నా స్కూల్ టీచర్లు ఈ రకంగా ఉన్నారు మరి'– నవంబర్ 18న ఢిల్లీలోని సెయింట్ కొలంబస్ స్కూల్‌లో 10వ తరగతి చదివే 16 సంవత్సరాల విద్యార్థి తన తల్లితండ్రులకు రాసిన సూసైడ్ నోటులో రాసిన మాట ఇది. అంటే తన చావుకు తన టీచర్లే కారణమంటూ మోపిన అభియోగమది. ఈ అబ్బాయి ఒక్కడే కాదు, దేశంలో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వార్తలను మనం నిత్యం వింటూనే ఉన్నాము. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' లెక్కల ప్రకారం మొత్తం దేశంలోని ఆత్మహత్యల్లో 8% విద్యార్థుల ఆత్మహత్యలే ఉండటం ఆందోళనకరం.

ఈ విద్యార్థి ఆ పాఠశాలలో రెండవ తరగతిలో చేరి ఇప్పుడు పదవ తరగతికి వచ్చాడు. ఇతనికి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ అంటే ఇష్టం. పెద్దవాడైన తరువాత సినిమా రంగంలో కృషి చేసి పైకి రావాలనుకున్నాడని స్నేహితులు చెబుతున్నారు. స్కిట్లు రాయటంలో దిట్ట. అయితే అతడికి కొన్ని సబ్జెక్టుల్లో సరిగా మార్కులు రానందుకు నలుగురు టీచర్లు క్లాసులో అందరి ముందూ అవమానకరంగా మాట్లాడేవారు. మార్కులు సరిగా తెచ్చుకోకపోతే ఆ అబ్బాయి తండ్రిని స్కూల్‌కు పిలిపించి మాట్లాడుతామనీ, టీసీ ఇచ్చి పంపిస్తామనీ బెదిరించేవారు. ఇటువంటి పరిస్థితుల్లో అతడి ఆత్మహత్యకు నాలుగు రోజుల ముందు డ్యాన్స్ క్లాస్‌లో కింద పడిపోయాడు. విపరీతమైన కాలు నొప్పి వల్ల లేవలేకపోయాడు. ఇది చూసిన డ్యాన్స్ టీచర్ అతణ్ణి లేవదీసే బదులు... 'నీవు ఓవర్ యాక్షన్ చేస్తున్నావు, నీవు ఎంతసేపు బాధపడ్డా నన్నేమీ కదలించలేవు' అని అందరి ముందూ అవమానకరంగా మాట్లాడారు.

ఆ బాలుడు తన తండ్రితో తనను వేరే పాఠశాలలో అడ్మిట్ చేయమని బతిమాలాడు. కానీ తండ్రి అందుకు ఒప్పుకోలేదు. 'పదిరోజులు స్కూల్‌కు వెళితే... ఆ తర్వాత పరీక్షలే. తరువాతి సంవత్సరం వేరే స్కూల్‌లో చేరవచ్చ'ని సముదాయించాడు. ఇక చావే శరణ్యం అనుకున్న ఆ పిల్లవాడు స్కూల్ నుంచి ఇంటికి వెళుతూ మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫారం నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ చావుకు బాధ్యులు ఎవరు? టీచర్లు, విద్యావ్యవస్థ, తల్లితండ్రులు... ఇలా చెప్పుకుంటూ పోతే కారకులు, కారణాల లిస్ట్ పెరిగిపోతుంది. పిల్లల సమస్యలను టీచర్లు, తల్లితండ్రులు సానుభూతితో అర్థం చేసుకోవాలి. వారికి మానసికంగా తోడ్పాటునివ్వాలి. కొడవటిగంటి 'చదువు' నవల సహా సాహిత్యాధ్యయనం ఇవాళ అందరికీ అవసరం.

– డా॥ కొండి సుధాకర్ రెడ్డి । రిటైర్డ్ సీనియర్ లెక్చరర్

అతి వేగమే అనర్థదాయకం

డేటా పాయింట్

దేశంలో 2023లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో, అత్యధికంగా లక్ష మందికి పైగా ప్రాణాలను బలిగొన్నది అతి వేగమే!

కారణం	మరణాల సంఖ్య	మొత్తం మరణాల్లో శాతం
అతి వేగం, నిరక్ష్య, ప్రమాదకర డ్రైవింగ్	1,01,841	58.6%
ఓవర్ టేకింగ్	41,035	23.6%
మద్యం తాగి నడపడం, రోడ్లపై జంతువులు అడ్డు రావడం లాంటి ఇతర కారణాలు	30,950	17.8%

ఆధారం: జాతీయ నేర గణాంక విభాగం

మంచి మాట

జ్యోతిర్మయం

సుగుణాలు సమర్థతను పెంచుతాయి. దుర్గుణాలు అందుకు విపరీతం. శ్రీరాముడు సుగుణాభిరాముడు. కాబట్టి ఆయన అక్లిష్టకర్ముడయ్యాడు. ఆయనకు క్లిష్టమైన కర్మ అంటూ ఏదీ ఉండదు. ఆయన ఏ పనినీ క్షణికావేశంతో చేయడు. అందుబాటులో ఉన్న మంత్రాంగాన్ని సంప్రతించి, వాళ్ళ అభిప్రాయాలు విని, వివేచన చేసి, సొంత నిర్ణయం తీసుకొంటాడు. విజయం సాధిస్తాడు.

ఒకసారి ఆయనకు 'రాజసూయ యాగం' చేయాలన్న ఆలోచన మనసుకు వచ్చింది. కానీ నిర్ణయం తీసుకొనే ముందు, మొట్టమొదట భరత, లక్ష్మణులను పిలిచి వాళ్ళ సలహా కోరాడు.

అన్నగారి ఆదేశం భరతుడికి ఈశ్వరాజ్ఞ అని అందరికీ తెలుసు. కానీ, 'నీ అభిప్రాయం చెప్పు' అని అన్నగారు అడిగితే, ఏ సంకోచమూ లేకుండా తన మాట తను చెప్తాడు. భరతుడికి రాజసూయ యాగం జరపటం ఇష్టం లేదు. ఎందుకంటే ఆ యాగం చేసే రాజును ఇతర రాజులందరూ మహారాజుగా గుర్తించి, కప్పాలూ, కానుకలూ సమర్పించాలి. లేదంటే, ఈ రాజు వాళ్ళతో యుద్ధం చేసి వాళ్ళను జయించాలి. 'అన్నా! ఈ భూమి మీద రాజులందరూ ఇప్పటికే నిన్ను అపర ప్రజాపతిగా గౌరవిస్తున్నారని అందరికీ తెలుసు. రాజసూయం వల్ల రాజుల మధ్య వైరాలూ, శత్రుత్వాలూ పెరిగి, యుద్ధాలు జరిగి, కొన్ని రాజవంశాలు నాశనమయ్యే అవకాశాలు ఏర్పడతాయి. అలాంటి నాశనానికి నువ్వెందుకు కారణం కావాలి? కనుక, ఈ ఆలోచన మానుకొంటే మంచిది' అని చెప్పేశాడు.

మరొక మహారాజయితే ఇలాంటి మాటలు విని ఎంత కోపించేవాడో! సత్యపరాక్రముడైన రాముడికి మాత్రం తమ్ముడి మాటలు పరమానందం కలిగించాయి. 'తమ్ముడా! ధర్మబద్ధమైన, విలువైన మంచి మాట చెప్పావు. నీ మాట ప్రకారమే, ఇప్పుడే '**.... రాజసూయాత్, క్రతూత్తమాత్,/ నివర్తయామి...**' – ఉత్తమ యజ్ఞంగా చెప్పబడే రాజసూయ యాగ నిర్వహణ ఆలోచనను వదిలేస్తున్నాను. '**బాలానాం తు శుభం వాక్యం/ గ్రాహ్యం లక్ష్మణ పూర్వజ!**'– లక్ష్మణాగ్రజా! శుభకరం అయిన మాట బాలుడు చెప్పినా గ్రహించవలసిందే!' అని యాగం మాని వేశాడు. ఈ ఘట్టం తమ్ముడి సద్బుద్ధిని చాటుతోంది. అన్నగారి ఘనతకూ అద్దం పడుతోంది.

– ఎం. మారుతి శాస్త్రి

రాజకీయ పునర్విభజన



వైఎస్ జగన్ హయాంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల ఏర్పాటు

13 కొత్త జిల్లాలు, 25 రెవెన్యూ డివిజన్లు... విజయవాడ జిల్లాకు ఎన్టీఆర్ పేరు

చంద్రబాబు నియోజకవర్గం కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసిన వైఎస్ జగన్

శాస్త్రీయంగా జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణపై వక్రీకరణలు

ప్రస్తుతం స్వార్థం కోసం కొత్త జిల్లాలతో రాజకీయం

2014-19 మధ్య ఈ అంశాన్ని పట్టించుకోని సీఎం చంద్రబాబు

వాస్తవాలు దాచి రాజకీయ క్రీడ

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిపై అతి వ్యామోహంతో ఇతర ప్రాంతాలను గాలికి వదిలేసిన సీఎం చంద్రబాబు... గత వైఎస్ జగన్ హయాంలో పక్కాగా జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణను చెదరగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పట్లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ సరిగా జరగలేదంటూ వాటిని సొంత రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చేందుకు చూస్తోంది. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి ప్రతిపాదనలు సైతం రూపొందించారు. నిజానికి రాష్ట్ర విభజన తర్వాత పాలనను గాడిలో పెట్టడానికి 2014–19 మధ్యనే జిల్లాలను పునర్వ్యవస్థీకరించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. తెలంగాణలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినా చంద్రబాబు ఆ ఊసే లేకుండా ఐదేళ్లు పాలన సాగించారు. అప్పుడు ఎక్కడికక్కడ డిమాండ్లు రావడంతో వైఎస్ జగన్ తాము అధికారంలోకి వస్తే పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనూ పొందుపరిచారు. గెలిచాక ప్రణాళిక ప్రకారం హామీ నెరవేర్చి రాష్ట్రానికి సమగ్ర స్వరూపం తెచ్చారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా శాస్త్రీయంగా జిల్లాలు ఏర్పాటవగా, పునర్వ్యవస్థీకరణ అస్తవ్యస్తంగా జరిగిందనే అబద్ధాన్ని ప్రచారంలో పెట్టి ఆ ముసుగులో రాజకీయ ప్రయోజనాల కోసం మరికొన్ని కొత్త జిల్లాలపై చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. పలు జిల్లాల్లో సరిహద్దుల మార్పునకు సిద్ధమవుతున్నారు. కొత్తగా మదనపల్లె, మార్కాపురం జిల్లాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంత్రివర్గ ఉపసంఘంతో సమావేశమై.. టీడీపీకి రాజకీయ ప్రయోజనం ఉండేలా మార్పులు ఉండాలని తొలుత ఇచ్చిన నివేదికను తిరస్కరించారు. ఆయన రాజకీయ అజెండాకు తగినట్లుగా కమిటీ కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తాజా పునర్విభజన వల్ల చంద్రబాబుకు ఆయన పార్టీకి తప్ప రాష్ట్రానికి, ప్రజలకు, పరిపాలనకు ఎటువంటి ప్రయోజనం ఉండదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

2022 ఏప్రిల్‌లో 13 జిల్లాలను 26గా విభజించారు. 25 పార్లమెంటు నియోజకవర్గాలకు గాను... అరకు పరిధి ఎక్కువగా ఉండడంతో దాన్ని రెండుగా చేశారు. ఉన్నతాధికారులతో కమిటీలు వేసి విస్తృత అధ్యయనం చేశారు. పూర్తి శాస్త్రీయంగా ఆయా ప్రాంతాల భౌగోళిక, సామాజిక, ఆర్థిక, చారిత్రక, సాంస్కృతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త జిల్లాలకు రూపం ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన 17,500 సూచనలు, సలహాలు, అభ్యంతరాలను పరిశీలించి, 284 అంశాలుగా విభజించి తగినట్లుగా నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త 13, పాత 13 జిల్లాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం సగటున 18 నుంచి 20 లక్షల జనాభా ఉండేలా చూశారు. సాధ్యమైనంత వరకు ఒక అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక జిల్లాలోనే ఉంచారు. ప్రతి జిల్లాలోనూ కనీసం రెండు రెవెన్యూ డివిజన్లు చేశారు. దీంతో రెవెన్యూ డివిజన్లు 51 నుంచి 76కి పెరిగాయి.

- ఈ ప్రక్రియ జరిగినప్పుడే ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని వైఎస్ జగన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీన్ని మన్నించి కుప్పంను రెవెన్యూ డివిజన్ చేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరును విజయవాడ జిల్లాకు పెట్టారు. తమకు తరతమ బేధాలు లేవని నిరూపించారు. చంద్రబాబు ఎక్కువ కాలం అధికారంలో ఉన్నా... ఎన్టీఆర్‌ను, ఆయన పేరును రాజకీయంగా ఉపయోగించుకోవడమే తప్ప గౌరవం దక్కే ఒక్క పని కూడా చేయలేదు. వైఎస్ జగన్ మాత్రం ఎన్టీఆర్‌ను గౌరవించారు.
- కొత్త జిల్లాలకు ఆయా ప్రాంతాల ప్రాశస్త్యం, స్థానిక సంప్రదాయాలు, సంస్కృతుల ఆధారంగా పేర్లు పెట్టారు. అరకుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అమలాపురానికి అంబేడ్కర్ కోనసీమ, నర్సరావుపేటకు పల్నాడు, రాజంపేటకు అన్నమయ్య, విజయవాడకు ఎన్టీఆర్, హిందూపురం పార్లమెంటుకు శ్రీ సత్యసాయి జిల్లాగా నామకరణం చేశారు. ఇవన్నీ అందరికీ ఆమోదయోగ్యంగా చెలామణీ అవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాలు పాడేరు, పార్వతీపురం, నరసరావుపేట, బాపట్ల, రాయచోటి, పుట్టపర్తి అభివృద్ధి కేంద్రాలుగా మారాయి.

ఓఆర్ఆర్‌పై కారులో మంటలు.. వ్యక్తి సజీవదహనం

కారులో మంటలు, ధ్వంసమైన కారు (ఇన్‌సెట్‌లో) దుర్గాప్రసాద్ ఫైల్

శామీర్‌పేట్: ఓఆర్ఆర్ రోడ్డుపై పక్కన ఆగి ఉన్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగగా వ్యక్తి సజీవదహనం అయ్యాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జైగిరి గ్రామానికి చెందిన తల్లపల్లి దుర్గాప్రసాద్ (34) వృత్తి రీత్యా ఓ టీవీ చానెల్ నడుపుతున్నారు. పని నిమిత్తం ఆదివారం రాత్రి టీఎస్ 03 ఎఫ్‌డీ 7688 నంబరు గల ఇకో స్పోర్ట్స్ కారులో నగరానికి వచ్చారు. రాత్రి మియాపూర్‌లోని తన బంధువుల ఇంట్లో ఉండి ఉదయం 4:30 నిమిషాలకు ఓఆర్ఆర్ మీదుగా తన స్వగృహానికి బయల్దేరాడు. ఈ క్రమంలో శామీర్‌పేట పరిధిలోకి రాగానే కారును రోడ్డు పక్కన ఆపగా అకస్మాత్తుగా మంటలు చెలరేగి కారులో పూర్తిగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న దుర్గాప్రసాద్ పూర్తిగా కాలిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీసుశాఖ అధికారులు మంటలను అదుపుచేశారు. కానీ అప్పటికే దుర్గాప్రసాద్ పూర్తిగా కాలిపోయి అస్థిపంజరంలా మారారని, క్లూస్ టీంతో పోలీసులు ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. ఆగి ఉన్నపుడే మంటలు వ్యాపించినట్లు గుర్తించామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ వెల్లడించారు.

క్లుప్తంగా...

'ఐబొమ్మ' రవి పోలీసు కస్టడీ పూర్తి

సాక్షి, హైదరాబాద్: 'ఐబొమ్మ' నిర్వాహకుడు రవి పోలీసు కస్టడీ సోమవారంతో ముగిసింది. ఇతడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గత గురువారం నుంచి తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. పైరసీతో పాటు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌కు సహకరించాడన్నది ఇతడిపై ఉన్న ప్రధాన ఆరోపణ కావడంతో ఆయా కోణాల్లో ప్రశ్నించారు. రవిని దర్యాప్తు అధికారులు సోమవారం ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. రవిపై సైబర్ క్రైమ్ ఠాణాలో మరో నాలుగు కేసులు ఉన్నాయి. వీటిలో ప్రిజనర్స్ ట్రాన్సిట్ వారెంట్ ద్వారా అరెస్టు చేసి, కస్టడీలోకి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభంకానుంది.

కిడ్నీ రాకెట్ కేసులో మరో 8 మందిపై కేసు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ నెల 9వ తేదీన వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ కేసులో మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మొదట ఏడుగురిపై కేసు నమోదు చేయగా, వారిలో ఏ–1గా అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ కంప ఆంజనేయులు ఉన్నారు. కొత్తగా కంప ఆంజనేయులు కుటుంబానికి చెందిన ఒకరితోపాటు కిడ్నీ మార్పిడి చేసిన యూరాలజీ డాక్టర్‌కు సహాయకులుగా పనిచేసిన ఇద్దరు, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో కాకినాడకు చెందిన ఓ మధ్యవర్తి ప్రమేయాన్ని కూడా పోలీసులు గుర్తించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

ఉత్సాహంగా ఎల్పీయూ 'వార్షిక ఇంట్రా యూనివర్సిటీ ఫెస్ట్'

సాక్షి, హైదరాబాద్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ) వార్షిక ఓపెన్ ఇంట్రా–యూనివర్సిటీ పోటీ, మాగ్నిట్యూడ్–2025ను ఘనంగా నిర్వహించింది. ఈ సంవత్సరం 'స్ట్రీట్ స్టైల్ బేస్' థీమ్‌తో పోటీలను నిర్వహించడం ద్వారా పట్టణ సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీయనుంది. ఈ గ్రాండ్ ఈవెంట్ మాగ్నిట్యూడ్–2025ను ప్రఖ్యాత నటి, ఎల్పీయూ పూర్వ విద్యార్థి షెహనాజ్ గిల్ ప్రారంభించారు. తాను విద్యార్థినిగా ఉన్న సమయంలో ఇలాంటి యూత్‌వైబ్ ఈవెంట్లు తన కెరీర్‌కు ఏ విధంగా దోహదపడ్డాయో ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్పీయూ ప్రోచాన్స్‌లర్ కల్నల్ డాక్టర్ రష్మీ మిట్టల్ మాట్లాడుతూ 'కళలు, శాస్త్రాలు, సాంకేతికత లేదా నిర్వహణలో ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఎల్పీయూ ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంది'అని తెలిపారు. చందన్ సింగ్, ఐశ్వర్య మిస్టర్ అండ్ మిస్ మాగ్నిట్యూడ్–2025గా కిరీటాన్ని గెలుచుకున్నారు. ఓవరాల్ ఛాంపియన్ టైటిల్‌ను టీం జెనిత్ కైవసం చేసుకుంది.

జీఆర్టీ జ్యువెల్లర్స్ రూ.53.7 లక్షల విరాళాలు

సాక్షి, హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జీఆర్టీ జ్యువెల్లర్స్ రూ.53.7 లక్షలకు పైగా మొత్తాన్ని విరాళాలుగా అందించింది. చెన్నై, నుంగంబాక్కంలోని ది చైల్డ్స్ ట్రస్ట్ హాస్పిటల్‌కు వైద్య పరికరాల కొనుగోలుకు రూ.12 లక్షలు, సేలంలోని ఆర్యవైశ్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌లో విద్యా స్కాలర్‌షిప్‌లకు రూ.10 లక్షలు, చెన్నై వెస్ట్ మాంబళంలోని పబ్లిక్ హెల్త్ సెంటర్లో నవజాత శిశువులకు ఉచిత టీకా కార్యక్రమాలకు రూ.10 లక్షలు, చెన్నై విల్లివాక్కంలోని అరుత్పెరుంజ్యోతి ఆనందన మిషన్‌లో సామూహిక భోజనానికి వంట గది పరికరాల కోసం రూ.4.5 లక్షలు, తమిళనాడులోని కుంభకోణం స్వామినాథ స్వామి ఆలయం వద్ద మహిళలు, వృద్ధులు, పిల్లలకు సురక్షితంగా దాటడానికి సాయపడే స్టీల్ వంతెన నిర్మాణానికి రూ.17.2 లక్షలు ఇచ్చినట్టు జీఆర్టీ జ్యువెల్లర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

రైతు కోసం మాట్లాడాలి, పోట్లాడాలి

దేశంలో వ్యవసాయ రంగం అధోగతిపాలైంది

- ఎన్నికల కమిషన్‌ను స్వతంత్రంగా వ్యవహరించనీయడంలేదు.
- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ ఆవేదన
- రైతు ఉద్యమ నేత 'వడ్డే' రచించిన 'ఎన్నాళ్లీ అన్యాయం సహించాలి?' పుస్తకావిష్కరణ

'వడ్డే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, అన్నం పెట్టే రైతు కోసం అందరూ మాట్లాడాలి, పోట్లాడాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఐదేళ్ల రైతు ఉద్యమం సందర్భంగా రైతు ఉద్యమ నేత, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'ఎన్నాళ్ళీ అన్యాయం సహించాలి' అనే పుస్తకాన్ని జస్టిస్ బి. చంద్రకుమార్ ఆవిష్కరించారు. విజయవాడ ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందాలవల్ల దేశంలో వ్యవసాయ రంగం అధోగతిపాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో పండే అన్ని పంటల ఎగుమతులపై ఆంక్షలు, షరతులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్వదేశంలో పండే పంటలు కాకుండా, ఇతర పంటలు మాత్రమే దిగుమతి అయ్యే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏటా లక్షలాది మంది రైతులు దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇంత ఘోరం జరుగుతున్నా ప్రభుత్వంలో స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.

ఎన్నికల కమిషన్‌ను ఆధీనంలోకి..

ఎన్నికల్లో గెలవడం కోసం ఎన్నికల కమిషనర్‌ని, ఎన్నికల కమిషన్‌ని స్వతంత్రంగా వ్యవహరించనీయకుండా ప్రధాని, కేంద్ర మంత్రులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వాటిని వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారని.. టెక్నాలజీతో వారికి అనుకూలంగా మలచుకుంటున్నారని జస్టిస్ చంద్రకుమార్ మండిపడ్డారు. ప్రభుత్వం మావోయిస్టులు ఇరువైపులా కాల్పులు, ఆయుధాల విరమణ ప్రకటించి శాంతియుత వాతావరణం నెలకొల్పాలని పిలుపునిచ్చారు. సభకు సీఐటీయు రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, రాయలసీమ ప్రాజెక్టుల సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి, రైతు కూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, లీడర్ పత్రిక సంపాదకులు రమణమూర్తి, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతి ఎడిటర్ బలరాంపై వర్చువల్ విచారణ

నరసరావుపేట టౌన్: స్వాతి వార పత్రిక ఎడిటర్ వేమూరి బలరాంను స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం వర్చువల్‌గా విచారించింది. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన అశ్లీల వ్యతిరేక ప్రతిఘటన వేదిక నాయకుడు ఈదర గోపీచంద్ స్వాతి వారపత్రికలో అశ్లీల రాతలు వస్తున్నాయంటూ మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టులో కేసు దాఖలు చేశారు. ప్రస్తుతం కేసు విచారణకు వచ్చింది. సోమవారం స్వాతి ఎడిటర్ వేమూరి బలరాంను వర్చువల్ విధానంలో న్యాయ అధికారి ఆవుల సలోమి ప్రశ్నించారు. పత్రికలో మహిళలను అశ్లీలంగా, అసభ్యతగా చూపిన నేరానికి పాల్పడ్డారా అని ప్రశ్నించగా వేమూరి బలరాం లేదని బదులిచ్చారు. సమాధానాన్ని న్యాయాధికారి నమోదు చేశారు. తదుపరి విచారణ డిసెంబర్ 3కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పోక్సో కేసులో నిందితుడు ఆత్మహత్య

మార్కాపురం: ప్రకాశం జిల్లా మార్కాపురంలో పోక్సో కేసు నిందితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... మార్కాపురం పట్టణ శివారులో నివాసం ఉంటున్న షేక్ రఫీ (25) 9వ తరగతి చదివే బాలికపై ఆదివారం లైంగిక దాడికి యత్నించినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రఫీపై పోక్సో కేసు నమోదు చేశారు. అయితే సోమవారం రఫీ తన నివాసంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అతని తల్లి మహబూబ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, ఎవరైనా కొట్టి ఉండొచ్చని దీనిపై దర్యాప్తు చేయాలని ఆమె కోరింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు చెప్పారు. మృతునికి తల్లిదండ్రులతో పాటు భార్య, కుమారుడు ఉన్నారు.

నీతో మాట్లాడాలి పోలీస్‌స్టేషన్‌కు రా..

సాక్షి టెక్కలి విలేకరికి సీఐ, ఎస్‌ఐ బెదిరింపులు



శ్రీనివాసరావు

సత్యనారాయణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: సాక్షి పత్రికలో ప్రచురితమైన ఒక వార్తకు సంబంధించి స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పాలంటూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి సాక్షి విలేకరిని సీఐ, ఎస్‌ఐ బెదిరించారు. ఎస్‌ఐ మరో అడుగు ముందుకేసి మరీ దురుసుగా మాట్లాడారు. తొలుత సాక్షి టెక్కలి విలేకరికి ఫోన్ చేసిన కోటబొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యనారాయణ.. ఒకసారి స్టేషన్‌కు రా.. నీతో మాట్లాడాలి అన్నారు. దేనికి సార్ అని విలేకరి అడగగా.. 'తినే ముందు రుచి చూడటమెందుకు.. ఎలాగో తింటావుగా..' అన్నారు. దీంతో విలేకరి టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావుకు ఫోన్ చేయగా.. 'ఈ రోజు యాక్సిడెంట్ ఐటమ్ ఎవరు రాశారు. మామూళ్ల మత్తులో పోలీసులు అనే విధంగా ఐటెమ్ రాశారు. మీకేమైనా ఎవిడెన్స్ ఉన్నాయా. కలెక్టర్ గారు కోటి రూపాయలు తీసుకున్నారని ఆరోపిస్తే మీరు రాసేస్తారా. మీ దగ్గర ఏమైనా ప్రూఫ్స్ ఉన్నాయా. మీరు ఆన్సర్ చేస్తారా. మార్నింగ్ స్టేషన్‌కు రండి..' అంటూ హుకుం జారీచేశారు.

అసలు జరిగిందేమిటి?

కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు గ్రామం సమీపంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు మృతిచెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిలో కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డుపై లారీలు పార్కింగ్ చేయడం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వచ్చినా హైవే పెట్రోలింగ్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అంశంపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపైనే అక్కడ ఎస్‌ఐ, సీఐ ఇలా ఫోన్‌చేసి స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పాలంటూ హుకుం జారీచేశారు. ఇందులో ఎస్‌ఐ సత్యనారాయణ విలేకరితోనే అంత దురుసుగా మాట్లాడుతుంటే ఇక సామాన్యుడి పట్ల ఎలా వ్యవహరిస్తారో అనే సందేహం కలుగుతోంది.

సీపీఎల్‌లో గన్ మిస్‌ఫైర్..

కానిస్టేబుల్‌కు గాయాలు

అంబర్‌పేట: గన్ మిస్ ఫైర్ అయి ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న సీపీఎల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ కథనం మేరకు.. అంబర్‌పేట సీపీఎల్ ఆయుధాగారం వద్ద ఆదివారం ఏపీ కేడర్‌కు చెందిన గోవర్ధన్‌రెడ్డి(39) విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సుమారు 12.30 గంటల ప్రాంతంలో గోవర్ధన్‌రెడ్డి తన వద్ద ఎస్‌ఎల్‌ఆర్ గన్‌ను శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా మిస్‌ఫైర్ అయింది. అతని ఛాతీలో నుంచి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోవడంతో గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం వెంటనే అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదృష్టవశాత్తు బుల్లెట్ గుండెకు కొద్దిగా పక్క నుంచి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. విధుల్లో ఉన్న ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేపాల్ క్రికెట్ బెట్టింగ్ ముఠాలో ప్రకాశం జిల్లా యువకులు

8 మందిని అరెస్ట్ చేసిన ఖాట్మండ్ పోలీసులు

క్రికెట్ బెట్టింగ్‌లో ఖాట్మాండ్‌లో అరెస్టైన పామూరు వాసులు

పామూరు: నేపాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో బెట్టింగ్ ఆరోపణలపై ఎనిమిదిమందిని అక్కడి స్పెషల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ప్రకాశం జిల్లా పామూరు మండలానికి చెందిన ఏడుగురు యువకులు, సీఎస్‌పురం మండలం కోవిలంపాడుకు చెందిన ఒక యువకుడు ఉన్నారు. 19 నుంచి 35 ఏళ్ల మధ్య వయసుగల వీరంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు. చిన్నాచితక పనులు, కూలీ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తం సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. పామూరు ఎస్‌ఐ టి.కిషోర్‌బాబు తెలిపిన మేరకు.. పామూరు మండలానికి చెందిన వై.రాజా, ఆరెతోటి మహేష్‌బాబు, పందిటి శ్రీనివాసులు, షేక్ సోహెబ్, ఎం.నవీన్, టి.సాయికుమార్, షేక్ చాంద్‌బాషా, సీఎస్ పురం మండలానికి చెందిన షేక్ మహ్మద్ రఫి ఖాట్మండ్ వెళ్లి ఒక గది అద్దెకు తీసుకుని ఉన్నారు. ఈ నెల 17న మొదలైన నేపాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు డిసెంబర్ 13 వరకు జరగనున్నాయి. ఈ పోటీలపై బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్న సమాచారంతో నిఘా వేసిన ప్రత్యేక పోలీసులు వారిని స్టేడియం సమీపంలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి భారత కరెన్సీలో రూ.3 లక్షల (నేపాల్ కరెన్సీలో రూ.5 లక్షల) నగదు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ యువకుల్లో ఒకరు పామూరు నుంచి ఈ నెల 18న బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి ఖాట్మండు వెళ్లగా, మిగిలినవారు 16వ తేదీన గుజరాత్ నుంచి వెళ్లారని తెలిసిందని ఎస్‌ఐ చెప్పారు.

బండ్లమూడి దళితులకు అండగా ఉంటాం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్

చీమకుర్తి రూరల్: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడిలో అగ్రకులాల వారి దాడిలో గాయపడిన దళితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ చెప్పారు. ఆయన సోమవారం బండ్లమూడిలోని బాధితుల ఇళ్లకు వెళ్లి.. పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బాధితుల పరిస్థితిని ప్రభుత్వానికి తెలియజేస్తానని చెప్పారు. ఒక్కో కుటుంబానికి ఉద్యోగం, ఎకరా చొప్పున భూమి, నష్టపరిహారం అందించాలన్న ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గాయపడిన ముగ్గురికి నివేశన స్థలాలు మంజూరు చేయాలని ఆర్డీవోకు ఆదేశాలిచ్చారు. వారి పిల్లలకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు.

చంద్రబాబు పాలనలో రైతుల పరిస్థితి దారుణం

వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

పంచ సూత్రాల పేరుతో పబ్లిసిటీ స్టంట్లు చేస్తోంది

రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైంది

వైఎస్సార్‌సీపీ నేతలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శైలజానాథ్, కైలే అనిల్‌కుమార్

గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సాకే శైలజానాథ్, కైలే అనిల్‌కుమార్

సాక్షి, అమరావతి, అనంతపురం, రాయచోటి అర్బన్: ''వ్యవసాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుండడంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. క్వింటా ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొన్న దాఖలాలు లేవు. దాదాపు రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాల్సి ఉన్నా పట్టించుకున్న పాపాన పోలేదు. అన్నదాతల ఆక్రందనలు పట్టించుకోకుండా పంచ సూత్రాల పేరుతో ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్లు చేస్తోంది'' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నేత సాకే శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ కింద బాబు సర్కారు రెండేళ్లలో రూ.40 వేలకు గాను ఇచ్చింది రూ.10 వేలేనని పైగా 7 లక్షల మంది రైతులను ఈ పథకానికి దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''బాబు పాలనలో రెండు ఖరీఫ్ సీజన్లలోనూ సాగు విస్తీర్ణం పడిపోయింది. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మామిడి తదితర పండ్ల తోటల పరిస్థితి మరీ దారుణం. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రతి పంటకూ మద్దతు ధరలు ప్రకటించి రైతులకు తోడుగా నిలిచాం. ఈ ప్రభుత్వంలో పంట కాలం అయిపోయాక మామిడికి అరకొరగా ప్రోత్సాహకం ఇచ్చారు'' అని శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించిందని, ఇప్పుడు రైతులే కట్టాలని ప్రభుత్వం అదనపు భారం మోపిందన్నారు. రాయచోటిలో అక్రమాలు, దౌర్జన్యాలు మితిమీరాయని శ్రీకాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాలు, ఆక్రమించేస్తున్నారని, అధికార యంత్రాంగం కనీస బాధ్యత తీసుకోవడం లేదని ఆరోపించారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొనాల్సిందే

''ఎకరానికి 40 బస్తాలు పండాల్సింది మోంథా తుపాను కారణంగా 25 బస్తాలకే పరిమితమైంది. గిట్టుబాటు ధరలు లేక రైతులు సాగుకు దూరమవుతున్నా చంద్రబాబు ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. పంట నష్టపరిహారం, పంటల కొనుగోలుపై సమీక్షకూ ఆసక్తి చూపడం లేదంటే రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో తెలుస్తోంది'' అని అనిల్‌కుమార్ నిప్పులు చెరిగారు. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.1,790కు ధాన్యం కొనాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ''మోంథా తుపాన్‌తో దిగుబడి తగ్గి వరి రైతు అల్లాడుతుంటే, ఇంకోపక్క కోత ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. దళారులు రూ.1,400కు మించి కొనడం లేదు. తేమ పేరుతో 40 కేజీలకు కేజీ తగ్గిస్తున్నారు'' అని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు గన్నీ బ్యాగుల కోసం మిల్లర్లు, వ్యాపారుల వద్దకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లించి సకాలంలో ధాన్యం కొంటే, నేడు దళారులపై ఆధారపడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలని కోరారు. పామర్రు నియోజకవర్గంలో రైతులు ధాన్యం ఎండబెడుతూ రోజంతా రోడ్డు మీదనే ఉంటున్నారని, టీడీపీ నేతల మెషీన్లతోనే కోయించాలనే డిమాండ్‌తో మరింత ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

వ్యవసాయం దండగనేది బాబు నమ్మే సిద్ధాంతం

వ్యవసాయం దండగన్నదే చంద్రబాబు సిద్ధాంతం అని, దాంతోనే రైతులను నట్టేట ముంచుతున్నారని శైలజానాథ్ విమర్శించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి తోటలను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారని, అరటి కిలో రూపాయికి కూడా కొనే పరిస్థితి లేదన్నారు. అనంతపురం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అరటి, ఉల్లి, మొక్కజొన్న, వరి ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, సీఎం చంద్రబాబు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దివంగత నేత వైఎస్ వ్యవసాయాన్ని పండుగ చేశారని, వైఎస్ జగన్ హయాంలో రైతు భరోసా కేంద్రాలు, ఉచిత విద్యుత్, ధరల స్థిరీకరణ నిధి, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా ద్వారా అన్నదాతలకు దన్నుగా నిలిచారని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇవన్నీ ఏమీ లేవన్నారు. చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టి అంటే అప్పులు చేయడమేనని, రైతులను ఆదుకునే మనసు ఆయనకు లేదని విమర్శించారు. 99 పైసలకే కారు చౌకగా భూములను కార్పొరేట్‌కు కట్టబెడుతున్నారని మండిపడ్డారు.

కలెక్టరేట్‌లో అంధకారం

కడప సెవెన్‌రోడ్స్: సాక్షాత్తు జిల్లా పరిపాలనంతటికీ కేంద్ర స్థానమైన కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి నుంచి సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు ఫేజ్‌లలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో కలెక్టరేట్ అంధకారమైంది. సోమవారం కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోయారు. దీంతో సభా భవనంలో చీకట్లోనే జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాల్సి వచ్చింది. టార్చిలైట్ల వెలుగులో అర్జీలు పరిశీలించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి ఒక ఫేజ్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో కలెక్టర్ శ్రీధర్ అర్జీలు స్వీకరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఎ.పి. పోలీస్ శాఖ
సవరణ
సవరణ టెండరు ప్రకటన నం. EAGLE/IT-PROC/2025-26/003, టెండరు ఐడి నం. 863987, ఎలైట్ యాంటీ–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (EAGLE), ఆం.ప్ర., మంగళగిరికు ఎంటర్‌ప్రైజ్–గ్రేడ్ సర్వర్స్, NAS మరియు Next-Gen ఫైర్‌వాల్ సిస్టమ్ కోసం రీ–టెండరు కోరుతున్నారు. వివరాలు వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in పై 20.11.2025న సా॥ 5.30 గం॥ నుండి 27.11.2025న సా॥ 5.00 గం॥ వరకు లభిస్తాయి. ఫోన్ నం. 8686068888.
సం/– ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, EAGLE, ఆం.ప్ర., మంగళగిరి
DIPR RO No.18145/CL/Advt/1/1/2021-22, Dt: 24.11.2025

చంద్రుని పుట్టుక కోసం..

భూగోళం పుట్టుక కోసం రాలిన సురగోళాలెన్నో అంటూ అత్యంత కవితాత్మకంగా పలవరించాడు దాశరథి. చంద్రుని పుట్టుక కోసం నిజంగానే ఓ భారీ సురగోళం రాలి కనుమరుగైందట! అవున్నిజమే. భూమికి ఏకైక ఉపగ్రహమైన చందమామ ఆవిర్భావానికి సంబంధించిన అత్యంత ఆసక్తికరమైన అంశాన్ని తాజా అధ్యయనం ఒకటి వెలుగులోకి తెచ్చింది. చాలాకాలం క్రితం, అంటే ఏకంగా 450 కోట్ల ఏళ్ల నాడు మన సౌర కుటుంబంలో అటూఇటుగా అంగారకుని సైజుతో కూడిన థెయా అనే భారీ గ్రహం కూడా ఉండేదట. ఆ లెక్కన పరిమాణంలో దాన్ని భూమికి అక్క వంటిదన్నమాట! అది కాస్తా (తొలి)నాటి భూమితో ఢీకొట్టి ముక్కలు చెక్కలైందట. వాటిలో చిన్నాచితకా ముక్కలన్నీ నామరూపాల్లేకుండా పోగా, మిగిలిపోయిన అతి పెద్ద భాగమే మన చందమామగా రూపుదిద్దుకుంది! అంటే చంద్రునికి జన్మనిచ్చే క్రమంలో దాని తల్లి ఏకంగా ప్రాణత్యాగమే చేసిందన్నమాట. అంతేకాదు, థెయా ఢీకొన్న ఫలితంగా భూఅక్షం కూడా భారీ మార్పుచేర్పులకు లోనై ఇప్పుడున్న క్రమంలోకి మారింది. దాంతో జీవకోటి ప్రాదుర్భావానికి, అందుకు అనువైన వాతావరణం అమరేందుకు భూమి మరింత వీలుగా మారిందట. అలా థెయా తాను కనుమరుగైపోతూ కూడా ఇటు భూమికి ఎనలేని సాయం చేయడమే గాక, అటు చంద్రునికి ఏకంగా ఉనికినే ఏర్పరచింది.

గుట్టు విప్పిన ఐసోటోపులు

థెయా ఉనికిని ఖగోళ శాస్త్రవేత్తలు చాలాకాలం క్రితమే దాదాపుగా నిర్ధారించారు. అయితే అది ఎంత పరిమాణంలో ఉండేది, దాని మూలాలేమిటి, కూర్పు ఎలాంటిది వంటి ప్రశ్నలకు ఇంకా జవాబులు లభించాల్సే ఉంది. వీటికి సమాధానాలు కనిపెట్టేందుకు జర్మనీలోని మాక్స్ ప్లాంట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోలార్ రీసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ షికాగో ఒక భారీ ప్రయోగానికి తెరతీశారు. అందులో భాగంగా ఇనుము, రాళ్ల తదితరాలతోపాటు అపోలో అంతరిక్ష యాత్రలో భాగంగా చంద్రుని పై నుంచి, పలు సమీప ఉల్కల నుంచి వ్యోమగాములు తెచ్చిన ఆరు నమూనాల ఐసోటోపులను పరీక్షించారు. ముఖ్యంగా భూమి, చంద్రుడు, ఉల్కల తాలూకు ఐసోటోపుల పరస్పర నిష్పత్తిని రివర్స్ ఇంజనీరింగ్‌గా పేర్కొనే ప్రక్రియ ద్వారా పోల్చి చూశారు. థెయా మన సౌరకుటుంబ లోపలి భాగంలోనే ఏర్పడిందని, అందులోనూ భూమి కంటే సూర్యునికి దగ్గరగా ఉండేదని తేల్చారు. అంతేగాక సౌరమండలంలో భూగ్రహం ఉన్న అకర్బన మండల పరిధిలోనే థెయా కూడా ఉండేదని అధ్యయన సారథి తిమో హాప్ వివరించారు. ''భూమి కంటే కూడా సూర్యునికి థెయా దగ్గరగా ఉండేది గనుక మరింత వేడిగా, వాయుమయంగా ఉండేదన్నది వాస్తవం. భూమితో పోలిస్తే చంద్రుడు చాలా పొడిగా ఉండేందుకు ఇది కూడా ముఖ్య కారణమే'' అని ఆయన వివరించారు. బుధ, శుక్ర గ్రహాల నుంచి కూడా నమూనాలను సేకరించగలిగిన నాడు థెయాకు సంబంధించి మరిన్ని ఆసక్తికరమైన అంశాలు కచ్చితంగా వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ వివరాలను సైన్స్ జర్నల్ తాజా సంచికలో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జస్టిస్ సూర్యకాంత్ అనే నేను..



- 53వ సీజేఐగా ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రధాని మోదీ, అమిత్ షా హాజరు
- కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన ఏడు దేశాల చీఫ్ జస్టిస్‌లు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. జస్టిస్ సూర్యకాంత్ హిందీ భాషలో భగవంతుడి పేరిట ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులు సైతం హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం తర్వాత ఆయన అక్కడే ఉన్న తన సోదరితోపాటు సోదరుడి పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌ని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తోపాటు పలువురు కేంద్రమంత్రులు, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం జస్టిస్ సూర్యకాంత్ ప్రధాని మోదీ వద్దకు వెళ్లి అభివాదం చేశారు. భారతదేశ న్యాయవ్యవస్థ చరిత్రలో తొలిసారిగా ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారోత్సవానికి భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక, బ్రెజిల్ దేశాల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం.

ప్రధాని మోదీ అభినందనలు

జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఫొటోలను ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు. ప్రమాణ స్వీకారం తర్వాత సంప్రదాయం ప్రకారం రాష్ట్రపతి ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బీఆర్ గవాయ్, మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ కలిసి ఫొటో దిగారు.

కొలీజియం చీఫ్‌గా జస్టిస్ సూర్యకాంత్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇకపై సుప్రీంకోర్టు కొలీజియం అధినేతగానూ వ్యవహరించబోతున్నారు. ఇన్నాళ్లూ ఈ పదవిలో ఉన్న జస్టిస్ బీఆర్ గవాయ్ పదవీ కాలం ఆదివారంతో పూర్తయ్యింది. సుప్రీంకోర్టు కొలీజియంలో సీజేఐ సహా మొత్తం ఐదుగురు సభ్యులు ఉంటారు. ప్రస్తుతం కొలీజియంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎంఎం సుందరేశ్ సభ్యులు.

అధికారిక వాహనాన్ని వదిలేసి..

నూతన ఒరవడికి జస్టిస్ గవాయ్ శ్రీకారం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఆయన సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నూతన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారానికి తన అధికారిక మెర్సిడెజ్ బెంజ్ కారులో హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆ కారును జస్టిస్ సూర్యకాంత్ ఉపయోగించుకోవడానికి వీలుగా అక్కడే వదిలిపెట్టి, సొంత వాహనంలో ఇంటికి చేరుకున్నారు. ప్రభుత్వం తనకు సమకూర్చిన అధికారిక మెర్సిడెజ్ బెంజ్ కారులో నూతన సీజేఐ సుప్రీంకోర్టుకు చేరుకోవడానికి జస్టిస్ గవాయ్ వెంటనే అవకాశం కల్పించడం విశేషం. సాధారణంగా సీజేఐగా పదవీ విరమణ చేసిన తర్వాత అధికారిక నివాసాన్ని వీడాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రభుత్వం కల్పించిన ఇతర సౌకర్యాలను వదులుకోవాలి. ఇందుకు కొంత సమయం ఉంటుంది. కానీ, కొత్త సీజేఐ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే జస్టిస్ గవాయ్ తన అధికారిక వాహనాన్ని విడిచిపెట్టి, సొంత కారులో ఇంటికెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

నోటిమాట వినతులు చెల్లవు!

- అర్జెంట్ లిస్టింగ్ కేసులపై లిఖితపూర్వక సమాచారమివ్వాల్సిందే
- అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే మినహాయింపు
- నూతన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- తొలిరోజే 17 కేసుల విచారణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్ సోమవారం తొలిరోజే తనదైన శైలిలో కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. అత్యవసరంగా విచారించాల్సిన కేసుల విషయంలో నూతన నిబంధన విధించారు. అర్జెంట్‌గా విచారణ చేపట్టాల్సిన కేసుల గురించి నోటిమాటగా విజ్ఞప్తి చేయడం ఆపాలని, ఇకపై లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. ఒక కాగితంపై కేసు వివరాలు రాసి ఇస్తే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిశితంగా పరిశీలిస్తుందని, తమ దృష్టికి తీసుకొస్తుందని అన్నారు. మరణ శిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే నోటిమాటగా వచ్చే వినతులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అర్జెంట్ లిస్టింగ్ కేసుల విచారణలో న్యాయవాదులు ఈ నిబంధనకు కట్టుబడి ఉండాలని సూచించారు. సుప్రీంకోర్టులో అత్యవసర కేసుల గురించి న్యాయవాదులు నోటిమాటగానే సంబంధిత ధర్మాసనం దృష్టికి తీసుకురావడం చాలా ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. జస్టిస్ సూర్యకాంత్ సీజేఐ హోదాలో కేవలం రెండు గంటల వ్యవధిలో ఏకంగా 17 కేసులను విచారించారు.

జస్టిస్ సూర్యకాంత్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

ప్రమాణ స్వీకారం తర్వాత సుప్రీంకోర్టుకు చేరుకున్న జస్టిస్ సూర్యకాంత్ తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం ఒకటో నంబర్ కోర్టుగదిలో త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహించి, కేసుల విచారణ ప్రారంభించారు. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థకు మధ్య వివాదంలో తీర్పు వెలువరించారు. తర్వాత సుప్రీంకోర్టు అడ్వొకేట్స్–ఆన్–రికార్డు అసోసియేషన్ అధ్యక్షుడు విపిన్ నాయర్.. జస్టిస్ సూర్యకాంత్‌కు సాదర స్వాగతం పలికారు. సాధారణ కుటుంబంలో జన్మించి, సీజేఐ స్థాయికి చేరుకోవడం స్ఫూర్తిదాయకం అంటూ ఓ న్యాయవాది కొనియాడారు. ఆయనకు జస్టిస్ సూర్యకాంత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

హరియాణా నుంచి తొలి సీజేఐ

న్యూఢిల్లీ: హరియాణా రాష్ట్రంలో సాధారణ కుటుంబంలో జన్మించిన జస్టిస్ సూర్యకాంత్ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా సుదీర్ఘకాలం సేవలందించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. పలు కీలకమైన తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనాల్లో ఆయన సభ్యుడిగా వ్యవహరించారు. రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియజేసే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టులకు లేదని ఇటీవలే సంచలనాత్మక తీర్పునిచ్చారు. ఆర్టికల్ 370 రద్దు, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్), పెగాసస్ స్పైవేర్, పౌరసత్వ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ వంటి అంశాలపై జస్టిస్ సూర్యకాంత్ తీర్పులు వెలువరించారు. బ్రిటిష్ కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని నిలిపివేశారు. సైనిక దళాల్లో 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' పథకాన్ని సమర్థించారు. పలు సందర్భాల్లో అవినీతికి వ్యతిరేకంగా గళం వినిపించారు. సీజేఐగా ఆయన 2027 ఫిబ్రవరి 9వ తేదీ దాకా పదవిలో కొనసాగుతారు. దాదాపు 15 నెలలపాటు అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా పని చేయబోతున్నారు.

- జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్ జిల్లాలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. జస్టిస్ సూర్యకాంత్ తండ్రి మదన్‌గోపాల్ శర్మ సంస్కృత ఉపాధ్యాయుడిగా పని చేశారు.
- 1981లో హిసార్‌లోని ప్రభుత్వ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు.
- 1984లో మహారిషి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్స్ డిగ్రీ అభ్యసించారు.
- 1984లో హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు.
- 1985లో పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టులో లాయర్‌గా చేరారు.
- రాజ్యాంగం, సేవలు, సివిల్ వ్యవహారాల్లో నిష్ణాతుడైన న్యాయవాదిగా పేరు సంపాదించారు.
- పలు యూనివర్సిటీలు, బ్యాంకులు, కార్పొరేట్ సంస్థల తరఫున కోర్టులో వాదించారు. హైకోర్టు తరఫున వాదించిన సందర్భాలూ ఉన్నాయి.
- 2000 జూలై 7న చిన్న వయసులోనే హరియాణా అడ్వొకేట్ జనరల్‌గా నియమితులయ్యారు.
- 2001 మార్చిలో సీనియర్ లాయర్‌గా మారారు.
- 2004 జనవరి 9న పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.
- 2007 ఫిబ్రవరి నుంచి 2011 ఫిబ్రవరి దాకా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడిగా పనిచేశారు.
- 2011 కురుక్షేత్ర యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో దూరవిద్య విధానంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.
- 2018 అక్టోబర్ 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.
- 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2024 నవంబర్ 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. సుప్రీంకోర్టులో 300కుపైగా ధర్మాసనాల్లో సభ్యుడిగా వ్యవహరించారు.
- హరియాణా నుంచి సీజేఐగా ఎదిగిన మొట్టమొదటి వ్యక్తిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డుకెక్కారు.

అరుణాచల్ మహిళకు అవమానంపై

చైనాకు భారత్ తీవ్ర నిరసన

ఇటానగర్/న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ మహిళను షాంఘై ఎయిర్‌పోర్టులో ట్రాన్సిట్ ప్రయాణం సందర్భంగా చైనాలోని అధికారులు అడ్డుకోవడంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ నెల 21వ తేదీన ఘటన చోటుచేసుకోగా అదే రోజు చైనాకు రాతపూర్వకంగా గట్టిగా నిరసన తెలియజేసింది. ఇలాంటి ఘటనలు సాధారణ సంబంధాలకు ప్రతిబంధకాలుగా మారుతాయని అందులో వ్యాఖ్యానించింది. రెండు దేశాల మధ్య సంబంధాలను తిరిగి సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో చోటుచేసుకున్న అనవసరమైన అవరోధంగా పేర్కొంది. ఢిల్లీలో ఉంటున్న బాధితురాలి తల్లి సంగ్ ఛోమ్ థోంగ్‌డాక్ మీడియాకు తెలపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పెమా వాంగ్‌జోమ్ థోంగ్‌డాక్ అరుణాచల్ ప్రదేశ్‌లోని వెస్ట్ కమెంగ్ జిల్లా రుపాలో పుట్టారు. ఢిల్లీలో చదువుకున్నారు. పదేళ్లుగా ఆమె యూకేలో ఉద్యోగరీత్యా ఉంటున్నారు. ఈ నెల 21వ తేదీన ఆమె జపాన్ బయలుదేరారు. చైనాలోని షాంఘై ఎయిర్ పోర్టులో ఆమె మరో విమానం ఎక్కాల్సి ఉంది. అయితే, విమానాశ్రయం అధికారులు ఆమె వద్ద ఉన్న పత్రాలను పరిశీలించే క్రమంలో భారత పాస్‌పోర్టులో పుట్టిన ప్రదేశం అరుణాచల్ ప్రదేశ్ అని ఉండటంపై అభ్యంతరం చెప్పారు. అది చైనా భూభాగమంటూ వాదనకు దిగారు. దాదాపు 18 గంటలపాటు ఆమెను ఎక్కడికీ వెళ్లనివ్వలేదు. దీంతో, ఆమె తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా షాంఘైలోని భారత ఎంబసీ అధికారుల సాయంతో అక్కడి నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఉన్నారని ఆమె తల్లి తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా తమ భూభాగమైన దక్షిణ టిబెట్‌గా పేర్కొంటూ, అక్కడి పలు ప్రాంతాలకు చైనాలో పేర్లు పెడుతూ తరచూ వివాదం రేపుతుండటం తెల్సిందే.

పది వేల ఏళ్ల తర్వాత

బద్దలైన హాయ్‌లీ గుబ్బి

దుబాయ్: ఇథియోపియాలోని హాయ్‌లీ గుబ్బి అగ్ని పర్వతం ఏకంగా దాదాపు 10 వేల ఏళ్ల తర్వాత బద్దలైంది. దాన్నుంచి భారీగా ఎగసి పడుతున్న బూడిద, సల్ఫర్ డయాక్సైడ్ ఆ దేశంలోని అఫార్ ప్రాంతంపై మేఘం మాదిరిగా కమ్మేసింది. సుదీర్ఘ కాలం నిద్రాణంగా ఉన్న ఈ అగ్ని పర్వతం నుంచి ఇప్పుడు 15 కిలోమీటర్ల మేర బూడిద వ్యాపించింది. ఈ మేఘం ఇప్పుడు ఎర్ర సముద్ర తీర దేశాలైన ఒమన్, యెమెన్ దిశగా సాగుతోందని నిపుణులు తెలిపారు. ఈ ధూళి మేఘం మరింత ఎత్తుకు వెళ్లే అవకాశమున్నందున ఆ మార్గంలో విమానాల రాకపోకలపై అప్రమత్తత అవసరమని హెచ్చరిస్తున్నారు. శ్వాస సంబంధ సమస్యలున్న పౌరులు జాగ్రత్తలు తీసుకోవాలని ఒమన్ తమ పౌరులను కోరింది. అంతేకాదు, ఢిల్లీ,, జైపూర్ దిశగా ధూళి మేఘాలు కదులుతుండటం గమనించిన భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. విమానయాన సంస్థలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ముందుజాగ్రత్తగా, ఇండిగో సంస్థ 24వ తేదీన కన్నూర్–అబూదభీ విమానాన్ని అహ్మదాబాద్‌కు దారి మళ్లించింది. కాగా, హాయ్‌లీ గుబ్బి ఇంత సుదీర్ఘకాలం నిద్రాణంగా ఉండి, అకస్మాత్తుగా బద్దలవ్వడం చాలా అరుదైంది, శాస్త్రీయంగానూ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని గ్లోబల్ వొల్కానిజమ్ ప్రోగ్రామ్ తెలిపింది. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీస్మిక్, గ్రౌండ్ సెన్సర్లు సైతం ఈ యాక్టివిటీని పసిగట్టలేకపోయాయని తెలిపింది. హాయ్‌లీ గుబ్బీ లోపల ఏం జరిగేదీ తెలుసుకునేందుకు ఇప్పుడిక మనకున్న ఏకైక మార్గం శాటిలైట్లేనని వ్యాఖ్యానించింది.

ఇథియోపియాలోని అఫార్ ప్రాంతంపై కమ్ముకుంటున్న బూడిద మేఘం

నావికా దళంలోకి 'ఐఎన్‌ఎస్ మాహె'

ముంబై నావల్ డాక్‌యార్డులో జల ప్రవేశం చేసిన మాహె

- విధుల్లో చేరిన అత్యాధునిక యుద్ధనౌక
- హాజరైన ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది
- తీర ప్రాంత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం
- శత్రుదేశాల జలాంతర్గాముల పాలిట 'సైలెంట్ హంటర్'

ముంబై: భారత సముద్ర తీర ప్రాంతాల్లో రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. దాదాపు 80 శాతం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన 'ఐఎన్‌ఎస్ మాహె' నౌక భారత నావికా దళంలో చేరింది. సైలెంట్ హంటర్‌గా పిలిచే ఈ నౌక సముద్ర అంతర్భాగంలో శత్రుదేశాల జలాంతర్గాములను నిశ్శబ్దంగా వేటాడగలదు. తీర ప్రాంతంలో గస్తీతోపాటు సముద్రం లోపల సహాయక చర్యల్లోనూ పాల్గొంటుంది. ఇది మొట్టమొదటి మాహె–క్లాస్ యాంటీ–సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో–వాటర్ క్రాఫ్ట్. కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించిన ఈ అధునాతన నౌకకు మలబార్ తీరంలోని మాహె నగరం పేరుపెట్టారు. సోమవారం ముంబై తీరంలోని నావల్ డాక్‌యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఐఎన్‌ఎస్ మాహెను నావికాదళానికి లాంఛనంగా అప్పగించారు. నావల్ షిప్‌ను నౌకా దళంలో ప్రవేశపెట్టే కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం విశేషం. నౌక డిజైన్, నిర్మాణంలో పాలుపంచుకున్న సిబ్బందిని ఉపేంద్ర ద్వివేది సత్కరించారు. ఐఎన్‌ఎస్ మాహె నౌక ఇకపై వెస్టర్న్ సీ బోర్డు ఆధ్వర్యంలో విధులు నిర్వర్తించనుంది.

- ఐఎన్‌ఎస్ మాహెలో అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు పొందుపర్చారు. సముద్రం ఉపరితలంపై, లోపల ముప్పును అత్యంత కచ్చితత్వంతో గుర్తించి, అంతం చేయగలదు.
- ఇందులో టార్పెడోలు, యాంటీ–సబ్‌మెరైన్ రాకెట్లు ఉన్నాయి. సముద్రం లోపల శత్రుదేశాల జలాంతర్గాములను తుత్తునియలు చేస్తుంది.
- యుద్ధనౌకల డిజైన్, నిర్మాణంలో మన ఆత్మనిర్భరతకు ఐఎన్‌ఎస్ మాహె ఒక ప్రతీక అని భారత నావికాదళం అభివర్ణించింది. నౌక పైభాగంలె 'ఉరుమి' అనే ఖడ్గాన్ని అమర్చారు. ఇది కేరళ ప్రాచీన యుద్ధక్రీడ అయిన కలరిపయట్టులో ఉపయోగించే ఆయుధం.
- నౌక మస్కట్(చిహ్నం) చిరుతపులి. నౌక నుంచి చాలా తక్కువ శబ్దం వెలువడుతుంది. అందుకే శత్రువులు సులువుగా గుర్తించలేరు.
- పొడవు 78 మీటర్లు. గంటకు 25 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. సముద్రంలో సహాయక చర్యల్లో క్రియాశీలకంగా పనిచేస్తుంది.

ట్రంప్, జిన్‌పింగ్ మాటామంతి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ సోమవారం ఉదయం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యంతోపాటు తైవాన్, ఉక్రెయిన్ వ్యవహారాలపై వారిద్దరూ చర్చించుకున్నట్లు అమెరికా, చైనా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దాదాపు నెల రోజుల క్రితం దక్షిణ కొరియాలోని బుసాన్‌లో ట్రంప్, జిన్‌పింగ్ కలుసుకున్నారు. ఇంతలోనే మరో సారి వారు చర్చించుకోవడం గమనార్హం. తైవాన్ విషయంలో చైనా వైఖరిని జిన్‌పింగ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారని సమాచారం. తైవాన్ ఎప్పటికీ చైనాలో అంతర్భాగమేనని ఆయన ట్రంప్‌కు స్పష్టంచేశారు.

ప్రమాద స్థలంలో సహాయక చర్యలు

రెండు బస్సులు ఢీ..8 మంది మృతి

56 మందికి తీవ్రగాయాలు.. ఐదుగురికి విషమం

సాక్షి, చెన్నై: నిర్లక్ష్యం, అతి వేగం ఎనిమిది నిండు ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన తమిళనాడులో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. తెన్కాశి నుంచి శ్రీవిల్లిపుతూరు వైపు వెళ్లే ప్రైవేట్ బస్సు మార్గమధ్యంలో దురైస్వామి పురం వద్ద ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొంది. ప్రమాద తీవ్రతకు రెండు బస్సుల ముందుభాగాలు నుజ్జయ్యాయి. ముందు సీట్లలో కూర్చున్న 8 మంది ప్రయాణికులు అక్కడికక్కడే చనిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలున్నారు. రెండు బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు సహా 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరునల్వేలికి తరలించారు. ప్రమాదానికి ఒక బస్సు అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని అధికారులు తెలిపారు. కేఎస్‌ఆర్ ట్రావెల్స్ బస్సు రాంగ్‌రూట్‌లో ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించగా ఈ ఘోరం జరిగిందని భావిస్తున్నారు. దీంతో ఈ సంస్థ గుర్తింపును రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేలు చొప్పున సీఎం స్టాలిన్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీతోపాటు ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి అసలు కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు.

నేడు అయోధ్యలో

మహా ఘట్టం

- రామాలయ శిఖరంపై కాషాయ ధ్వజారోహణం
- రామ్‌లల్లాను దర్శించుకోనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర క్షేత్రం అయోధ్యలో మరో మహా ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యను సందర్శించనున్నారు. భవ్య రామమందిర నిర్మాణం పరిపూర్తికి గుర్తుగా ఆలయ శిఖరంపై కాషాయం పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. లంబకోణ త్రిభుజ ఆకారంలో ఉండే ఈ జెండా ఎత్తు 10 అడుగులు, వెడల్పు 20 అడుగులు. జెండాపై శ్రీరాముడి శౌర్యం, తేజస్సును సూచించేలా సూర్యుడి గుర్తు, ఓం అనే మంత్రం, దేవకాంచన వృక్షం బొమ్మ ఉంటాయి. ఈ పవిత్ర పతాకం రామరాజ్య ఆదర్శాలను ప్రతిబింబించేలా గౌరవం, ఐక్యత, సాంస్కృతిక వికాస సందేశాన్ని ఇస్తుందని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. అయోధ్యలోని సప్తమందిరాన్ని సైతం మోదీ దర్శించుకుంటారు. శేషావతార ఆలయం, మాత అన్నపూర్ణ అలయాల్లోనూ ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. రామలల్లా గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకుంటారు. అయోధ్యలో ధ్వజారోహణం సందర్భంగా నిర్వహించే సభలో ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

ఢిల్లీలో వాయు కాలుష్యంపై నిరసన

- పోలీసులపై పెప్పర్ స్ప్రేతో దాడి
- లాంగ్ లివ్ హిడ్మా.. అంటూ నినాదాలు
- 22 మంది ఆందోళనకారుల అరెస్ట్



న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రమాదస్థాయిలను మించిన వాయు కాలుష్యంపై చేపట్టిన ఆందోళన తీవ్ర గందరగోళానికి, ఉద్రిక్తతలకు దారి తీసింది. ఇండియా గేట్ వద్ద సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఆందోళకారులు అడ్డుకోబోయిన పోలీసులపై పెప్పర్ స్ప్రేతో దాడి చేశారు. ఇందుకు సంబంధించిన ఘటనలపై పోలీసులు 22 మంది అరెస్ట్ చేశారు. పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా అక్కడా పోలీసు అధికారులపై దాడికి దిగారు. దీంతో, విధులకు ఆటంకం కలిగించడంతోపాటు మహిళల పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించారంటూ వీరిపై సన్సద్ మార్గ్ పోలీస్ స్టేషన్‌తోపాటు, కర్తవ్య పథ్ పోలీస్ స్టేషన్లలో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిరసనకారులు పోలీసులపై పెప్పర్ స్ప్రేతో దాడికి దిగడం తామెన్నడూ చూడలేదని ఓ అధికారి తెలిపారు. 'ఇండియా గేట్ వద్ద నిరసనలకు అనుమతి లేదు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరాము. జంతర్‌మంతర్ వద్ద ముందుగా అనుమతి తీసుకుని ఎవరైనా ఆందోళనకు దిగొచ్చని చెప్పాం. వినకుండా, బారికేడ్లపై నుంచి దూకి వెళ్లి రోడ్డుపై బైటాయించి, ట్రాఫిక్‌కు అవరోధం కలిగించారు. వాహనదారులు కోరినా అక్కడి నుంచి వారు కదల్లేదు' అని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'పైపెచ్చు, దురుసుగా ప్రవర్తించారు. మాపై దాడికి దిగారు. పెప్పర్ స్ప్రేను వాడారు. నిరసనకారుల దాడిలో గాయపడిన పోలీసులకు చికిత్స చేయించాం. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, చర్యలు తీసుకుంటాం'అని ఆయన వివరించారు. ఇటీవల ఏపీలో ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు నేత హిడ్మాను, అమర్ రహే హిడ్మా, లాంగ్ లివ్ హిడ్మా అంటూ పోస్టర్లతో కొందరు నినాదాలు చేయడం పైనా దృష్టి సారించామన్నారు. కాగా, ఇండియా గేట్ వద్ద పోలీసులపై దాడికి దిగిన 22 మందికి సోమవారం ఢిల్లీ కోర్టు మూడు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మరో వ్యక్తిని, అతడి వయస్సు నిర్ధారణ అయ్యేంత వరకు అబ్జర్వేషన్ హోంకు తరలించాలని ఆదేశించింది. కాగా, గాలి కాలుష్యంపై నిరసన చేపట్టిన ఢిల్లీ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ క్లీన్ ఎయిర్ అనంతరం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజారోగ్యానికి కాలుష్యం అత్యంత ప్రమాదకరంగా మారిందని, ప్రభుత్వం మాత్రం నీళ్లు చల్లడం, క్లౌడ్ సీడింగ్ అంటూ కంటితుడుపు చర్యలు చేపడుతోందని ఆరోపించింది.

సాక్షి గుంటూరు

మంగళవారం । 25 । నవంబర్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్‌:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 583.20 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 15,634 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4417 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 43.1097 టీఎంసీలు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు సోమవారం 3,711 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది.

న్యూస్‌రీల్

ఐఎంఏ గుంటూరు శాఖకు అవార్డులు

గుంటూరు మెడికల్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖకు వివిధ రంగాల్లో అందించిన సేవలకు లభించిన అవార్డులను ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలి నుంచి గుంటూరు ఐఎంఏ శాఖ కార్యనిర్వాహకవర్గం అందుకుంది. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన ఐఎంఏ రాష్ట్ర సదస్సులో ఈ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులను ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, డాక్టర్ వి.మహేష్ డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, డాక్టర్ ఎన్.కిషోర్, డాక్టర్ ఎం.పర్నికుమార్ తదితరులు డాక్టర్ బన్సాలి నుంచి అందుకున్నారు. గుంటూరు శాఖకు ఐదు అవార్డులు దక్కటం పట్ల పలువురు వైద్య ప్రముఖులు అభినందనలు తెలిపారు .

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

బొల్లాపల్లి : వెల్లటూరులోని సోమేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసినట్లు దేవదాయ శాఖ అధికారి సీహెచ్ శివనాగిరెడ్డి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన బేతపూడి వెంకటేశ్వర్లు, అడక లింగరాజులు రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఇప్పటికీ వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.33.18 లక్షలు, సోమేశ్వరస్వామి ఆలయానికి రూ.78.39 లక్షలు దాతల నుంచి విరాళాలు అందాయన్నారు.

స్వర్ణ కుటీరం నిర్మాణానికి భూమి పూజ

వినుకొండ : స్థానిక కొండమెట్ల వద్ద ఉన్న అతి పురాతన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం విశ్వమాత గో సంరక్షణ ఆశ్రమం నందు స్వర్ణ కుటీర నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. మాజీ ఏజీపీ పోట్లూరి సైదారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ కుటీర కాశీ వజ్ర వారాహి అమ్మవారి మందిర నిర్మాణ కార్యక్రమంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఐదుగురు దాతలు ఒక్కొక్కరు రూ.1.08 లక్షల చొప్పున మొత్తం రూ.5.40 లక్షలు మందిరం నిర్మాణానికి విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో మేలిశెట్టి ఉషారాణి, ఏటుకూరి కృష్ణవేణి, వి.రమ, పత్తి భ్రమరాంబ, బుర్ర సుజాత పాల్గొన్నారు.

పునీత శౌరి మహోత్సవాలకు జెండా ప్రతిష్ట

ప్రత్తిపాడు: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో పునీత శౌరి మహోత్సవాలకు జెండా ప్రతిష్టా కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ నెల 24వ తేదీ నుంచి డిసెంబరు మూడవ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో తొలి రోజు మేత్రాసన ప్రొక్యురేటర్, ఛాన్సలర్ గురుశ్రీ దాసరి కిరణ్, ఫాదర్లు దిలీప్‌కుమార్, బాలశౌరి, కన్నీ థామస్‌లతో కలిసి జెండాను ప్రతిష్టించారు. ఏసును స్తుతిస్తూ ఆరాధించారు. డిసెంబర్ 3న గురువులతో సమిష్టి పండుగ దివ్యబలి జరుగుతుందని ఫాదర్ దిలీప్ కుమార్ చెప్పారు.

రేపు ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. 98663 66187, 95817 94605 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భూములు ఇస్తే మోసం చేస్తారా!

- డిపాజిట్ సొమ్ము స్వాహా చేసిన వ్యక్తిని కాపాడేందుకు యత్నం
- ఆగ్రహించిన రైతులు
- బ్యాంకు పరిపాలన కార్యాలయం ఎదుట నిరసన
- ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని డిమాండ్

జీడీసీసీ బ్యాంకు మంగళగిరి బ్రాంచి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రాజధాని రైతులు

తాడేపల్లి రూరల్: వ్యవసాయాన్ని వదిలివేసి మా భూములను రాజధానికి ఇచ్చాం... వచ్చిన నగదును డిపాజిట్ చేస్తే ఆ డబ్బులను స్వాహా చేశారు..అవినీతి పరులను కాపాడేందుకు కొంతమంది రాజకీయ నాయకులు, పోలీసులు, అధికారులు ప్రయత్నం చేస్తున్నారు..మా గోడు ఎవరితో చెప్పుకోవాలంటూ రాజధాని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ పరిపాలనా కార్యాలయం మంగళగిరి బ్రాంచ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపు మేరకు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయం చేసుకునే భూములను ఇచ్చామని, వాటి ద్వారా వచ్చిన కౌలు, ఇతర ప్లాట్ల ద్వారా వచ్చిన నగదు కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో డిపాజిట్ చేసుకున్నాం, మాకు నకిలీ బాండ్లు అందజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం అధికారులకు తెలిసినా రైతులకు సమాచారం తెలియదని, రమేష్‌ను సస్పెండ్ చేశారు. అయినా డిపాజిట్ చేసుకునేటప్పుడు నకిలీ బాండ్లను మాకు ఇచ్చారు. బాండ్లు విత్‌డ్రా చేసుకుంటామంటే పన్ను పడుతుందంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పారని పేర్కొన్నారు. విషయం తెలిసి గ్రామానికి చెందిన కొంతమంది పోలీస్‌స్టేషన్‌కు వెళితే రమేష్ వద్ద డబ్బులు లేవు, కేసు నమోదు చేస్తే ఏమిటి లాభం, ఇచ్చిన డబ్బులు తీసుకోమని పోలీసులు అంటున్నారని పేర్కొన్నారు. విచారణకు వచ్చిన అధికారులు మాత్రం రమేష్ అలాంటివాడు కాదు, తొందర పడవద్దని రమేష్‌కు వత్తాసు పలకడం బాధగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆడిట్ అధికారుల తనిఖీలు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిలెడ్ పరిపాలనా కార్యాలయం మంగళగిరి బ్రాంచ్‌లో జరిగిన ఘటనపై గుంటూరు ఆడిట్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. సుమారు 114 మంది రైతులకు ఇచ్చిన డిపాజిట్ బాండ్లను పరిశీలించారు. 114 బాండ్లు నకిలీవని, సుమారు రూ.8 కోట్లకు పైగా నగదు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలింది. దీనిపై ఇంకా పరిశీలించాల్సి ఉందని, రైతులు ఇంకా వస్తున్నారని ఆడిట్ బృందం తెలిపింది.

ఆడిట్ అధికారిని వేడుకొంటున్న బాధితమహిళ

మోకాళ్ల ఆపరేషన్‌కు డబ్బుల కోసం బతిమిలాడాను

మోకాళ్ల ఆపరేషన్ చేయించుకోవడానికి నేను డిపాజిట్ చేసిన రూ.23 లక్షల్లో రూ.4 లక్షలు ఇవ్వమని సీఈఓ రమేష్‌ను బతిమిలాడాను. ఇదిగో అదిగో ఇస్తానని చివరకు అసలు డబ్బులు కూడా జమ కాలేదని చెబుతున్నారు. వడ్డీలో నాలుగు వేల నుంచి 8 వేల రూపాయల వరకు మందులు, ఇతర అవసరాల నిమిత్తం వాడుకుంటున్నాను. నిన్న బ్యాంకు వద్ద కళ్లు తిరిగి పడిపోయాను. అక్కడ ఉన్న అధికారులు ఎవరూ స్పందించలేదు. –కడియాల శివపార్వతి

ఆత్మహత్యే శరణ్యం

నేను భర్తతో విభేదాలు వచ్చి విడిపోయా. అప్పటి నుంచి కూలినాలి చేసుకుంటూ కురగల్లు సొసైటీలో విడతల వారీగా రూ.8 లక్షలు డిపాజిట్ చేశాను. ఆ డబ్బులే ఆధారం. ఆ డబ్బులు రావని అందరూ అంటున్నారు. నేను ఎలా జీవించాలి? ఇప్పుడు గ్రామాల్లో పనిచేయడానికి పొలాలు కూడా లేవు. ఇప్పుడు నాకు ఆత్మహత్యే శరణ్యం. మంత్రి నారా లోకేష్‌కు మా గోడు విన్నవించుకుంటాం. స్వర్ణాల శ్రీలక్ష్మి

పుట్టింటి వాళ్లు ఇచ్చిన డబ్బులు డిపాజిట్ చేశా

మా పుట్టింటి వాళ్లు ఇచ్చిన రూ.5 లక్షలు కురగల్లు సొసైటీ బ్యాంకులో డిపాజిట్ చేశాను. దాని నుంచి వచ్చే వడ్డీతోనే బతుకుతున్నాను. పెళ్లి వయస్సు వచ్చిన పిల్లలు ఉన్నారు. ఇప్పుడు ఆ డబ్బులు రాకపోతే ఏం చేయాలో అర్థం కావడం లేదు. నకిలీ బాండ్లు ఇచ్చారని మాకు తెలియదు. పేపర్‌లో వచ్చిన తర్వాతే తెలిసింది. అధికారులకు జిరాక్స్ కాపీలు ఇచ్చాం. ఇప్పటి వరకు బ్యాంకు అధికారులు ఎవరూ ఏమీ చెప్పడం లేదు. తోట శివమ్మ

చక్ర దిగ్బంధం

గుంటూరులో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- డొంక రోడ్డు మొదలు.. భగత్‌సింగ్ బొమ్మ సెంటర్ వరకు అడుగడుగూ నరకమే
- భారీగా నిలిచిపోతున్న వాహనాలు
- కనీసం కనవడని ట్రాఫిక్ సిబ్బంది
- శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చివేత నేపథ్యంలో అధికారుల అనాలోచిత నిర్ణయాలతో మరింత ఇబ్బందులు

గుంటూరు కొత్తపేటలోని రంగా బొమ్మ సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

గుంటూరులో కొత్తపేట భగత్‌సింగ్ బొమ్మ వరకు ట్రాఫిక్ రద్దీ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో ఎప్పటికీ పరిష్కారం కాని సమస్య ట్రాఫిక్. శంకర్ విలాస ఓవర్ బ్రిడ్జి కూల్చివేత అనంతరం ట్రాఫిక్ సమస్య మరింత తలపోటు తెచ్చి పెడుతోంది. వాహనదారులు ఈస్ట్ నుంచి వెస్ట్‌కు వెళ్లాలన్నా.. వెస్ట్ నుంచి ఈస్ట్ రావాలన్నా.. కంకరగుంట ఫైఓవర్, లేకుంటే అండర్ పాస్, డొంక రోడ్డు మూడు వంతెనల మీదుగానే ప్రయాణం చేయాలి. ఆటోలు, సిటీ బస్సులు ఇష్టానుసారం తిప్పటం, దీనికితోడు అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. గుంటూరులో సుమారు 27 వేలకు పైగా ఆటోలు, నాలుగు లక్షల వరకు బైక్‌లు, సుమారు 50వేలకు పైగానే కార్లు, జీపులు ఉన్నాయని అధికారుల గణాకాలు వెల్లడిస్తున్నాయి. అరండల్‌పేట నాలుగవ లైను దగ్గర నుంచి మొదలు పెడితే.. సిటిజన్ ఆసుపత్రి వరకు ఎక్కడా సైడ్ వే ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్ (రంగా విగ్రహం ఉన్న ప్రాంతం) నాలుగు రోడ్లు కూడలి అక్కడ కూడా వదలి పెట్టలేదు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకైనా.. చోటు కల్పిస్తే.. కొద్దిమేరలో అయినా.. వాహనాలు పక్కకు వెళ్లిపోతాయి. ఆఖరికి మంగళబావి సందు వద్ద కూడా సిమెంట్ దిమ్మెలు అడ్డుగా పెట్టేశారు. దీంతో అటు పక్కకు వెళ్లే అవకాశం లేదు. సంజీవయ్య నగర్, కాకాని రోడ్డు, నెహ్రూనగర్ మీదుగా వచ్చే వాహనాలు కూడా అధికం కావడం, ఈ ప్రాంతాల్లో రైల్వే గేటులు ఉండటం వల్ల రైళ్ళు వచ్చే సమయాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. అదే సమయంలో కేవలం ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డు మాత్రమే అక్కడ విధుల్లో ఉంటున్నారు. వారు కూడా ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నారు.

ఇదెందుకు మూసేశారు..సారూ..?

గణేష్ మహల్ రోడ్డు నుంచి మార్కెట్, పలు వస్త్ర దుకాణాలకు వెళ్లే రాధాకృష్ణ థియేటర్ సెంటర్ (ఆర్కేటీ) వద్ద దారి మూసివేశారు. నాలుగు రోడ్ల కూడలి కావటం, సిగ్నల్ పాయింట్ ఉండటం వలనే ట్రాఫిక్ కొద్దిమేర ఉపశమనం కలిగించే ప్రాంతం . ఇక్కడ ట్రాఫిక్ ఆపేసి.. కింగ్స్ హోటల్ సెంటర్ వద్ద ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆర్కేటీ సెంట ర్ నుంచి కింగ్స్ హోటల్ వైపు రాంగ్ రూట్‌లో వా హనాలు వెళ్లటం, స్టేడియం వైపు నుంచి వచ్చే వా హనాలు అక్కడ నిలిచిపోవటం, మాయాబజారు, చిన్నబజారు డౌన్ ప్రాంతాల నుంచి వాహనాలు అ ధికంగా రావటం వల్ల అక్కడ ట్రాఫిక్‌కు అంతరా యం కలుగుతోంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద పరిస్థితి చెప్పాల్సిన పనేలేదు. ఇక్కడ ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యమే. కానిస్టేబుళ్లు మైక్‌ల్లో అనౌన్స్‌మెంట్ చేయటంతప్ప, ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న పరిస్థితులులేవు.

రైతు స్థాయిలో విత్తనోత్పత్తి

- స్వయంగా తయారు చేస్తే లాభదాయకం
- జాగ్రత్తలు పాటించాలంటున్న ఏడీఏ ఎన్.మోహనరావు

కొరిటెపాడు(గుంటూరు): వానా కాలం(ఖరీఫ్) సాగు ముగిసింది. వరి కోతలు ప్రారంభం కానున్నాయి. రైతులు దిగుబడిని ధాన్యంగా కాకుండా విత్తనాలుగా తయారు చేసుకుంటే లాభదాయకమని గుంటూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) ఎన్.మోహనరావు తెలిపారు. మొదటగా వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి కానీ, ఇతర గుర్తింపు పొందిన సంస్థల నుంచి కానీ విత్తనాన్ని సేకరించుకోవాలి. పొలంలో వేసి తదుపరి సంతతి విత్తనాన్ని పొందవచ్చు. వచ్చిన దిగుబడిని విత్తనంగా పరిగణించి వాడుకోవడమే కాకుండా గ్రామంలోని తోటి రైతులకు సరళమైన ధరలకు అందించవచ్చు. తదుపరి ఆ విత్తనం ద్వారా మూడు నుంచి నాలుగు సంవత్సరాలు వరకు విత్తనోత్పత్తి చేసుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విత్తనోత్పత్తికి ఎంపిక చేసుకునే పొలంలో గతంలో అదే రకం వరి సాగు చేయని విత్తనాలను ఎంచుకుంటే కల్తీ మొక్కలు, కేళీలు వచ్చే అవకాశాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చు.
- ఎంపిక చేసిన నారు మడికి ఇతర రకాల నారు మడులు సుమారు 3 నుంచి 5 మీటర్లు దూరం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. లేదా పక్క పొలంలోని పంట కాల వ్యవధిలో 15 నుంచి 30 రోజుల తేడా ఉండేలా చూసుకోవాలి. లేదంటే విత్తుకునే సమయంలో 20 నుంచి 30 రోజుల కాలవ్యవధి పాటించినట్‌లెతై వేరు రకంతో చాలా వరకు సంపర్కాన్ని నిరోధించవచ్చు.
- పిలకల దశలో వరి ఆకుల రంగు, ఎత్తును బట్టి కేళీలు గుర్తించి వేరు చేయాలి. పూత దశలో కేళీలను గుర్తించి తొలగించడం సులభం. జాగ్రత్తగా వ్యవహరిస్తే కల్తీ లేని విత్తనాన్ని పొందవచ్చు.

పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో వరి పంట

- గింజకట్టే దశలో, పలచదనం, చిక్కదనం, గొలుసులోని గింజల్లో గమనించి కేళీలను ఏరి వేయాలి.
- వరి కోత అనంతరం శుభ్రమైన గచ్చుపైన విత్తనాన్ని 4 నుంచి 5 రోజుల పాటు ఆరబెట్టాలి. తేమ శాతం 12 శాతం కంటే తక్కువ వచ్చే వరకు ఆరబెట్టాలి. రాత్రి పూట టార్పాలిన్ పట్టలు కప్పి ఉంచినట్‌లెతై మరింత తేమ శాతం రాకుండా నివారించుకోవచ్చు.
- ఈ విత్తనాన్ని గాలికి తూర్పార పట్టాలి. తద్వారా తాలు గింజలు, ఇతర కలుపు గింజలు, రంగుమారిన గింజలు వేరు అవుతాయి.
- అంతిమంగా లభించిన నాణ్యమైన విత్తనాన్ని కొత్త గోనె సంచుల్లోకి ఎత్తి తదుపరి పంట కోసం నిల్వ చేసుకోవాలి.
- రైతులు స్వయంగా విత్తనోత్పత్తి చేసుకోవడం ద్వారా విత్తనాలు కొనడానికి అధిక పెట్టుబడి పెట్టడం తప్పుతోంది. కల్తీ విత్తనాలు కొని నష్టపోవడాన్ని నివారించుకోవచ్చు.
- విత్తనోత్పత్తి ద్వారా తయారు చేసిన విత్తనాన్ని విత్తుకునే 10 రోజుల ముందు విత్తన మొలక శాతం లెక్క కట్టుకోవాలి.
- 100 గింజలను ఒక రోజు నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు తడిగుడ్డలో కట్టి రెండు రోజుల తర్వాత మొలకెత్తిన విత్తనాలను లెక్కించి 80 కంటే ఎక్కువ మొలకలు ఉంటే నాణ్యమైన విత్తనంగా పరిగణించి వాడుకోవాలి.

శత వసంతాల శ్రీబసవ మందిరం

- రూ.2 కోట్ల విలువైన ఆలయ భూమి లీజుకు
- జంగమ సామాజిక వర్గీయులకు సమాచారం లేకుండానే పావులు కదిపిన దేవదాయశాఖ
- టీడీపీ నేత ప్రోద్బలంతోనేనని సంఘీయుల ఆరోపణ

పట్టణ నందులపేటలోని శ్రీబసవ మందిరం

బుర్రిపాలెం రోడ్డులోని ఆలయ భూమి

తెనాలి: దాతలు సత్సంకల్పంతో నిర్మించిన శతవసంతాల చరిత్ర కలిగిన ఆలయం అభివృద్ధికి దేవదాయ, ధర్మదాయశాఖ చేసిందేమీ లేకపోగా, ఆలయానికి చెందిన విలువైన ఆస్తిని ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థకు లీజు పేరుతో కట్టబెట్టటంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రాజకీయ జోక్యంతోనే దేవదాయ శాఖ ఇందుకు పాల్పడిందనీ, లీజు వ్యవహారాన్ని రద్దు చేయకపోతే ఆందోళన తప్పదని ఆలయానికి సంబంధించిన వారు అధికారులను కలిసి స్పష్టం చేశారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి పట్టణం నందులపేటలోని వినాయకుడి గుడి రోడ్డులో ఆధ్యాత్మికవేత్త సోమ బసవయ్య మరణానంతరం, ఆయన సతీమణి సోమ రాజమ్మ 1924లో అక్కడే శ్రీబసవ మందిరం నిర్మించారు. ఆలయ నిర్వహణకు పట్టణ సరిహద్దుల్లో 6.06 ఎకరాల మాగాణి భూమిని, ఫల పుష్పాల కోసం 40.5 సెంట్ల వినాయక తోటను ఆర్థిక వనరులుగా ఏర్పరిచారు. వాటిపై వచ్చే ఆదాయంతో జంగమ కులస్తులకు కార్తికమాసంలో బసవ మందిరంలో శివపూజలు, దాతల పేరిట అన్నదానం చేస్తున్నారు. ఒక సెటిల్‌మెంట్ డీడ్‌ను నియమ నిబంధనలతో రాసి, జంగమ కులస్తులను మాత్రమే ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించారు. పట్టణంలో 350 జంగమ కుటుంబాలు ఉన్నాయి. శ్రీబసవ మందిరంలో పూజాదికాలు, కార్తికమాసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సోము బసవయ్య (ఫైల్)

దాదాపు అయిదు దశాబ్దాల క్రితం శ్రీబసవ మందిరం దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో జంగమ కులస్తుల ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో కార్యకలాపాలు నడుస్తున్నాయి. పట్టణ బుర్రిపాలెం రోడ్డులో బీసీ కాలనీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 5.07 ఎకరాలను సేకరించింది. గతంలో బీసీ కాలనీ నిమిత్తం 5 ఎకరాల ఏడు సెంట్లను ప్రభుత్వం భూసేకరణ చేసింది. అందుకుగాను రెమ్యునరేషనుగా రూ.3.70 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే స్వల్ప వడ్డీతో ఆలయ కార్యక్రమాల ను నిర్వహిస్తున్నారు. బుర్రిపాలెం రోడ్డులో పట్టణ సరిహద్దులో నూతనంగా నిర్మించిన ఓంకారేశ్వర ఆలయం సమీపాన గల ఎకరా భూమిని దేవదా యశాఖ మరో ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థకు లీజుకిచ్చింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా జంగమ సంఘీయులకు సమాచారం లేకపోవటం గమనించాల్సిన అంశం. రహస్యంగా ఫైళ్లు నడిచాయి. సంతకాలతో లీజు వ్యవహారం పూర్తిచేశారని జంగమ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం లీజుకిచ్చిన ఎకరం భూమి విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ఇంత విలువైన భూమిని ఆధ్యాత్మిక సంస్థకు లీజుకు ఇవ్వటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గుంటూరుకు చెందిన టీడీపీ నేత ప్రోద్బలంతోనే దేవదాయ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆధ్యాత్మిక సంస్థకు లీజుకిచ్చిన భూమిలో ఆలయాన్ని నిర్మిస్తే, ఇక శాశ్వతంగా వారిదే ఆస్తి కాగలదని పేర్కొంటున్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి...

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన జంగమ సంఘ నేతలు

శ్రీబసవ మందిరం లీజు రద్దు కోరుతూ రాష్ట్ర నవ్యాంధ్ర జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులు యూఎంవీ నాగలింగం, తెనాలి డివిజన్ అధ్యక్షులు కేవీఎస్ నాగలింగం, కార్యదర్శి కె.చంద్రశేఖర లింగం, వి.సుబ్రహ్మణ్యం, రాజేష్, సామీథాల విజయలక్ష్మి, కోటేశ్వర, ఓంకారం, కోటి, పలువురు సంఘ సభ్యులు సోమవారం తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహను కలిసి వినతిపత్రం అందజేశారు.

అవకాశమున్న ప్రతి అర్జీ పరిష్కరించాల్సిందే..

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పీజీఆర్‌ఎస్‌లో 290 అర్జీలు స్వీకరణ
- ఏర్పాట్లు పరిశీలన

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు

గుంటూరు వెస్ట్: పీజీఆర్‌ఎస్‌లో అందిన ప్రతి అర్జీ నమోదు కావాల్సిందేనని, అవకాశమున్న ప్రతి అర్జీ పరిష్కరించాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది ప్రవర్తనలో చాలా మార్పులు వస్తున్నాయని, మరింతగా ప్రజలకు చేరువ కావాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కు అన్నారు. వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంటుందని తెలిపారు. పరిష్కారానికి అవకాశం లేని అర్జీలు వారికే వివరించి చెప్పాలని, పదే పదే తిప్పుకోవద్దని హితవు పలికారు. కలెక్టర్ ఉదయం 9 గంటలకే పీజీఆర్‌ఎస్ ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్ సిబ్బంది ఏర్పాట్లు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. అప్పటి వరకు అధికారులు ఎవ్వరూ హాజరు కాలేదు. కలెక్టర్ జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులతో కలసి 290 అర్జీలను స్వీకరించారు.

పూర్తిస్థాయి పెన్షన్ ఇప్పించండి

నాకు 90 శాతం అంగవైకల్యం ఉంది. ఇటీవల ప్రభుత్వ నిర్వహించిన రీ సర్వేలో నాకు 60 శాతం మాత్రమే ఉన్నట్లు నిర్ధారించారు. నేను పూర్తిగా మంచానికే పరిమితమై ఉన్నాను. ఏ పని చేసుకోలేకపోతున్నాను. దయచేసి నాకు పూర్తిస్థాయి పెన్షన్ రూ.15 వేలు ఇప్పించాలి.

–పఠాన్ జాన్ సైదా, దావులూరు, కొల్లిపర మండలం,

బీసీ కులగణన జరపాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా బీసీ కులగణన తప్పనిసరిగా నిర్వహించాలి. రాష్ట్రంలో కనీసం 5, 6 శాతం కూడా లేని వారు రాజ్యాధికారాన్ని అనుభవిస్తుంటే బీసీలు మాత్రం పల్లకీ మోసే బోయలుగా మిగిలిపోతున్నారు. స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలంటే ముందుగా కులగణన చేపట్టాలి. ఈ ప్రభుత్వం బీసీల సమస్యలను పక్కదోవ పట్టిస్తుంది. పరిష్కార దిశగా చూడడంలేదు.

–బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి క్రాంతికుమార్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1000 గరిష్టం : రూ. 1400

మోడల్ ధర రూ. 1200

పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు :385

కొమ్ములు : 323 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,850	12,500	11,125

కాయలు : 62 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,850	12,000	11,400

మొత్తం అమ్మకాలు : 288.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	37,422
అమ్మకాలు	35,077
నిల్వ	8,679

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-18,200
నంబరు-5	11,500-16,000
341	10,000-17,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-17,800
నంబరు-5	11,500-16,500
341	11,500-18,000
4884	11,000-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 16,000
బాడిగ-355	11,000 - 18,300
దేవనూరు డీలక్స్	11,000 - 17,500
ఆర్మూర్	11,500 - 14,300
తాలుకాయలు	5,500 - 9,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000-15,600
బాడిగ - 355	11,000-18,200
దేవనూరు డీలక్స్	10,500-17,200
తాలు	5,300 - 8,300

-కొరిటెపాడు (గుంటూరు)

తక్కువ ధరకే బంగారమంటూ మోసం

- పీజీఆర్‌ఎస్‌లో బాధితుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ రమణమూర్తి

బంగారం పేరుతో మోసగించారని వాపోతున్న టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు గుల్జార్, బాధితులు

నగరంపాలెం: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని మోసగించారంటూ ఓ టీడీపీ ఎంపీటీసీతో సహా పలువురు బాధితులు జిల్లా ఏఎస్పీ వద్ద వాపోయారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలను ఆలకించిన పోలీసు ఉన్నతాధికారులు సంబంధిత స్టేషన్ ఆఫీసర్లతో మాట్లాడారు. చట్ట పరిధిలో బాధితుల సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. డీఎస్పీలు బెల్లం శ్రీనివాసరావు (ట్రాఫిక్), శ్రీనివాస రెడ్డి (మహిళా పీఎస్), మధుసూదనరావు (సీసీఎస్)లు అర్జీలు స్వీకరించారు.

రూ.1.20 కోట్లు మోసపోయాం..

పెదకాకాని టీడీపీ ఎంపీటీసీగా ఎన్నికయ్యాను. నా భర్త క్యాటరింగ్ చేస్తారు. స్థానిక మహిళ ద్వారా నంబూరు గ్రామంలో ఉంటున్న భార్యాభర్తలు పరిచయమయ్యారు. పరిచయమైన మహిళ విజయవాడ భవానీపురంలోని ఓ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఆక్షన్ వేళల్లో బంగారు వస్తువులు తక్కువ ధరకే వస్తాయని నమ్మబలికింది. ఈ ఏడాది జనవరిలో రూ.5 లక్షలు ఖరీదు చేసే పది కాసుల బంగారం రూ.3 లక్షలకే ఇచ్చింది. ఎవరైనా ఉంటే చెప్పాలని చెప్పింది. ఈ క్రమంలో నా సొంతిల్లు, బంగారు సొత్తు తనఖా పెట్టి, సదరు మహిళకు రూ.40 లక్షలు చెల్లించా. మరో ఇరవై మంది రూ.80 లక్షలు వరకు చెల్లించారు. అయితే చెల్లింపులకు సంబంధించి ఎలాంటి రశీదుల్లేవు. ఇటీవల నంబూరు గ్రామం నుంచి విజయవాడ ఇబ్రహీంపట్నంకు మకాం మార్చారు. అక్కడకెళ్లి డబ్బులు అడిగితే మాపై రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడుతున్నారు. అంతేగాక ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. లక్షలు పోగొట్టడంతో నా భర్త ఇంటికి రావద్దంటున్నాడు. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం. నిందితులైన భార్యభర్తతో పాటు విజయవాడ ఇబ్రహీంపట్నంలో విద్యుత్ శాఖలో పనిచేసే ఓ వ్యక్తిగా కీలకంగా పనిచేస్తున్నాడు.

– షేక్ గుల్జార్, టీడీపీ ఎంపీటీసీ పెదకాకాని మండలం

నాకు తెలీకుండా నాపేరుతో రుణం..

గత నెలలో మా కింద అంతస్తులో ఉండే ఓ వ్యక్తి నా మొబైల్ నంబర్ నుంచి ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో రూ.1.42 లక్షల రుణం తీసుకున్నాడు. అందులో రూ.60 వేలు మాత్రమే చెల్లించాడు. సదరు వ్యక్తి నా పేరుపై రుణం తీసుకున్నట్లు నాకు తెలియదు. కొద్ది రోజులుగా ఓ ప్రైవేటు బ్యాంక్ నుంచి మెసేజీలు వస్తున్నాయి. నెలలో రుణాన్ని చెల్లించాలని బ్యాంక్ సిబ్బంది ఆదేశించారు. దీనిపై అతన్ని అడగ్గా, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. అతనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. మోసం చేసిన వ్యక్తిని పిలవకుండా తాత్సారం చేస్తున్నారు. అదేమని పోలీసులను అడిగితే నాతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

– జి.సునీత, రాజీవ్ గృహకల్ప సముదాయం, అడవి తక్కెళ్ళపాడు.

ఫీజు ఇవ్వకపోగా తప్పుడు కేసు ..

నా భర్త, నేను న్యాయవాదులం. ఓ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే మహిళా పోలీస్ పరిచయమైంది. ఆమె మా ఇంటికి వస్తూ పోయేది. ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందని, హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేస్తే రూ.50 వేలు ఫీజు ఇస్తానని ఆ మహిళా పోలీస్ చెప్పింది. దీంతో నా భర్త హైకోర్టులో ఫైల్ చేశారు. అనంతరం మహిళా పోలీస్ ఫీజు చెల్లించకపోగా బెదిరింపులకు పాల్పడుతోంది. నా భర్తపై ఓ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయించింది. ఇటీవల జిల్లా కోర్టులో కనిపించిన మహిళా పోలీస్, ఆమె బంధువులు అసభ్యపదజాలంతో దూషించారు. వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నా

– సీహెచ్ రత్నకుమారి, వీఐపీ రోడ్, కృష్ణబాబుకాలనీ

అందరికీ ఆధార్ కార్డులు

- ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జనన ధ్రువీకరణ పత్రం లేని కారణంగా చాలా మంది ఆధార్ కార్డులు పొందలేకపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అటువంటి వారిని గుర్తించి, రెవెన్యూ శాఖాధికారులు వారికి ఆధార్ కార్డులు అందేట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి రెవెన్యూ అంశాలు రీ సర్వే, గృహనిర్మాణం, గ్రామ వార్డు సచివాలయ సేవలు, ఉపాధి హామీ పథకం అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేలో మ్యూటేషన్లు దరఖాస్తులపై ఆర్డీఓలు పత్యేక శ్రద్ధ తీసుకొని పరిశీలించాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారాన్ని మరింతగా మెరుగుపర్చాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్‌లో డిమాండ్ సర్వేలో నమోదు చేయాలన్నారు. ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకం ఎన్‌పీసీ, ఆటో డ్రైవర్ల సేవలో కేవైసీ పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా ఎంపీడీఓలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఉపాధిహామీ పథకం శ్రామికుల ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. పల్లెపండుగలో మంజూరు చేసిన పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో షేక్ ఖాజావలి, జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడీ శంకర్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు వెస్ట్: జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో షేఖ్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, శ్రీనివాస్, పీడీ డీఆర్‌డీఏ టీవీ విజయ లక్ష్మి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి దుర్గాబాయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి మంగళగిరిలోని వీటీజెమ్, ఐవీటీఆర్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈమేళాకు సుమారు 10కి పైగా కంపెనీలు రానున్నాయన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి బీటెక్ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరు హాజరుకావచ్చన్నారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10,000 – 30,000 వరకు ఉండవచ్చని తెలిపారు. 18–25 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగులు బయోడేటా/రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు.

కారుణ్య మరణం కోరిన శేషగిరమ్మ ఇంటికి వైద్యుల బృందం

తాడికొండ: రాజధానిలో కారుణ్య మరణం కోరిన నెల్లూరి శేషగిరమ్మ ఇంటికి సోమవారం 10 మంది వైద్యుల బృందం వెళ్లి ఆమెను పరిశీలించారు. శేషగిరమ్మ మనవరాలు చెరుకూరి శ్యామల శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతుండటంతో ఆమెకు గత నెల 90 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ క్రమంలోనే ఆమెకు రూ.6 వేల పింఛన్ అందజేశారు. దీనిపై వైద్యుడిని నేరుగా తమ ఎదుట హాజరుకావాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే జీజీహెచ్ వైద్య బృందం సోమవారం వృద్ధురాలి గృహాన్ని సందర్శించారు.

కమిషన్‌తో సమగ్ర కులగణన చేపట్టాలి

నరసరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణన జరిపించాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేసి, పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలన్నా, ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్రంగా బీసీ కులాల జనగణన జరిపించాలని ఆయన కోరారు. 139 బీసీ కులాల్లో ఎవరెంతో తెలియకుండా రిజర్వేషన్లు అమలు జరుపుతారని ఆయన ప్రశ్నించారు. బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు జరిపి సామాజిక న్యాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సరికొండ తిమ్మరాజు, తన్నీరు వెంకట్, ముదిరాజ్, జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావు, శీలం వెంకట్రావు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ముందు ప్రదర్శన చేస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

ఉత్సాహంగా అస్మిత అథ్లెటిక్స్

- ఏఎన్‌యూలో ముగిసిన ఒక్కరోజు క్రీడా పోటీలు

లాంగ్ జంప్

60 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు

పెదకాకాని: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరచడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం అండర్ 14, 16 బాలికలకు అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ కూడిన జీవితాన్ని ఇస్తాయన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్ మాట్లాడుతూ అథెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో జిల్లాలో అథ్లెటిక్స్ లీగ్ నిర్వహించటం ఆనందదాయకమన్నారు. క్రీడల్లో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొనేవిధంగా ప్రభుత్వం ఈ లీగ్‌లు నిర్వహించి బాలికలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాలికలు ముందంజలో ఉండాలని కోరారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, అంతర్జాతీయ క్రీడాకారుడు కె.కృష్ణమోహన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ జి.శేషయ్య, కోచ్‌లు ఎస్ శివారెడ్డి, వెంకటేశ్వర్లు కె.రవి, కె.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హై జంప్ చేస్తున్న బాలిక

తెనాలి గంగానమ్మపేటలో ఉద్రిక్తత

- బంగారం రికవరీకి వచ్చిన వేమూరు పోలీసులు
- మార్వాడీ వ్యాపారి భార్యను బలవంతంగా జీపు ఎక్కించారని వ్యాపారుల ఆరోపణ
- టూ టౌన్ స్టేషన్‌కు చేరుకున్న పంచాయితీ

తెనాలి రూరల్: తెనాలి గంగానమ్మపేటలో సోమవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. బంగారం రికవరీకి వచ్చిన పోలీసులు, వ్యాపారుల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. తెనాలికి చెందిన ఉదయ వెంకటేశ్వరరావు ఎనిమిదేళ్ల క్రితం బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామంలో మణికంఠ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ఆరు నెలల క్రితం ఐపీ పెట్టాడు. బాధితులు కొందరు ఈ బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. అందులో కొందరు తమ ఆభరణాలను తిరిగి ఇప్పించమని వేమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీ పెట్టిన వెంకటేశ్వర్లు బంగారాన్ని తెనాలి గంగానమ్మపేటలో మార్వాడీలు నిర్వహించే ఫైనాన్సు దుకాణాల్లో తాకట్టు పెట్టాడని తెలుసుకున్న వేమూరు సీఐ రామాంజనేయులు తమ సిబ్బందితో సోమవారం ఇక్కడకు వచ్చారు. ఓ దుకాణానికి వెళ్లి బంగారం రికవరీ చేసేందుకు ప్రయత్నించారు. తమ వద్ద బంగారం తాకట్టు పెట్టలేదని దుకాణ నిర్వాహకులు చెప్పగా సీసీ కెమెరాల పుటేజ్ ఉన్న డిజిటల్ వీడియో రికార్డర్(డీవీఆర్) ఇవ్వాలని, బంగారం తిరిగి ఇవ్వాలని పోలీసులు అడగడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. డీవీఆర్ ఇచ్చే సందర్భంలో పోలీసులకు దుకాణ నిర్వాహకుల మధ్య తోపులాట జరిగింది. దుకాణంలోనే ఉన్న దుకాణ యజమాని భార్యతోనూ దురుసుగా ప్రవర్తించి వారిని పోలీసులు వాహనంలోకి ఎక్కించారు. మార్వాడీ మహిళపై పోలీసులు దౌర్జన్యం చేశారంటూ పట్టణంలోని మార్వాడీ వ్యాపారులందరూ గంగానమ్మపేటకు చేరుకున్నారు. వ్యాపారిని, అతని భార్యను టూ టౌన్ స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలియడంతో అందరూ అక్కడికి చేరుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత ఏర్పడడంతో సీఐ రాములనాయక్ స్టేషన్‌కు వచ్చి మార్వాడీ పెద్దలతో మాట్లాడారు. డీవీఆర్‌ను సీజ్ చేసే క్రమంలో తోపులాట జరిగిందని, దుకాణ యజమానిని స్టేషన్‌కు తీసుకువస్తున్న క్రమంలో మహిళ కూడా వచ్చి వాహనం ఎక్కారని ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించ లేదని వేమూరు సీఐ ఆంజనేయులు తెలిపారు.

28న ప్రభుత్వ వైద్యుల సంఘ కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీ జీడీఏ) కేంద్ర కార్యాలయాన్ని ఈనెల 28న గుంటూరు కన్నావారితోట 4వ లైనులో ప్రారంభిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.జయధీర్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.రమేష్‌కుమార్‌లు తెలిపారు. కేంద్ర కార్యాలయాన్ని కర్నూలు మెడికల్ కాలేజ్ రిటైర్డ్ ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్ర, అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభిస్తారన్నారు.

కత్తిపోట్లకు గురైన మహిళ మృతి

తెనాలిరూరల్: సహజీవనం చేస్తున్న వ్యక్తి చేతిలో కత్తి పోట్లకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. తెనాలి రామలింగేశ్వరపేట రైస్ కాలనీలో ఈ నెల 21వ తేదీన కూరగాయల వ్యాపారం చేసే కందుకూరి ఉషపై ఆమెతో సహజీవనం చేస్తున్న విజయ్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఉష గుంటూరు సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వైద్యశాల నుంచి సోమవారం వచ్చిన సమాచారం మేరకు హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నట్టు తెనాలి పోలీసులు తెలిపారు.

10న సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం ముట్టడి

పోరాటదీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలని ఏపీ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రకాష్, కోశాధికారి ఎం.గంగరాజు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం గుంటూరు జిల్లా సమగ్రశిక్ష జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ఎదుట పోరాట దీక్ష పేరుతో ధర్నా నిర్వహించారు. ఎస్.ప్రకాష్, ఎం.గంగరాజు, ఉపాధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 10న సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అన్ని కేటగిరీల్లో ఉద్యోగులకు వేతన పెంపుతోపాటు ఎంటీఎస్, హెచ్‌ఆర్ పాలసీ అమలు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒడిశా, పంజాబ్, కేరళ ప్రభుత్వాల మాదిరిగా మన రాష్ట్రంలోనూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. గతంలో జోవో 3 ప్రకారం పీఆర్సీ ఆఖరి స్కేల్ వేతనాలు చెల్లించిన విధంగా ప్రస్తుత పీఆర్సీ ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా పథకానికి కేటాయించాల్సిన 40 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైమ్‌గా మార్చి, ఇతర జిల్లాల్లో సీఆర్పీలను వందల కిలోమీటర్ల దూర ప్రాంతాలకు బదిలీ చేయడాన్ని నిలిపివేయాలని, లేని పక్షంలో పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. జాబ్ చార్ట్ ప్రకారం సాయంత్రం 5.00 గంటల తరువాత వెబినార్ల పేరుతో వేధింపులు మానుకోవాలన్నారు. అనంతరం గ్రీవెన్స్‌లో వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగుల ధర్నాకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్ మద్దతు తెలిపారు. ధర్నాలో జిల్లా నాయకులు సంధ్య, అరుణ్, మాబు సుభానీ, మాధురి, మణి, పార్వతి, వినోద్, సుజిత్, చలపతి, చంద్ర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TOLET

■ గుంటూరు సిద్ధార్థ నగర్ 2వలైన్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK Fully Furniture, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె నెలకు రూ.80,000/- సంప్ర॥ 9849719999

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును.బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో మార్చూరు ఏరియాలలో 12గం॥ పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. ఫ్రీ రూమ్, సబ్సిడీ మీల్స్. 8897169133, 9515524430

■ ఓల్డ్ గుంటూరులోని నెట్ సెంటర్లో పని చేయుటకు కంప్యూటర్ వచ్చిన ఇద్దరు Female's కావలెను. సంప్ర॥ 7286842671

■ గుంటూరులోని మా కంపెనీ గోలి సోడా మార్కెటింగ్ చేయుటకు అనుభవం కలిగిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆7013786366

■ సివిల్ కాంట్రాక్ట్ కంపెనీ నందు పని చేయుటకు సివిల్ ఇంజనీర్ మరియు సైట్ లో పనిచేయుటకు ఐటిఐ ఇంజనీర్ కావలెను. 9951052345

■ ప్రముఖ మార్కెటింగ్ సంస్థ వెంకటేశ్వర ఎస్టేట్ నందు నరసరావుపేటలో మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. మంచి జీతం+ ఇన్సెంటివ్స్.8978057827, 8106264847

■ చీరాల పట్టణములో నూతనంగా ప్రారంభం కానున్న వజ్రపూర్ణ ఆర్గానిక్ స్టోర్ నందు పనిచేయుటకు మహిళలు కావలెను ఆసక్తి కల మహిళలు సంప్రదించండి. Ph:98668 99390

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబి కేర్, ఇంటి/వంట పని కి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

Bank of Baroda
లక్ష్మీపురం బ్రాంచి,
డోర్ నెం.5-87-6, లక్ష్మీపురం మెయిన్ రోడ్, గుంటూరు -522007. ఫోన్ : 0863-2272003, Mail: lakshm@bankofbaroda.com

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయడమైనది.

[illegible]

ఆస్తి వివరములు : [illegible] ఉత్తరం: ఎన్.ఎస్.పి. కాలువ మరియు టి. రాంబాబు యొక్క ఆస్తి 45-1/2 అ॥లు. దక్షిణం: సర్కారు డొంక 33-1/2 అ॥లు.

ఇది సదరు చట్టము/ లేదా అమలులో ఉన్న ఏదైనా ఇతర చట్టం క్రింద బ్యాంకుకు లభించే ఇతర హక్కులకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఉంటుంది.

స్థలం : గుంటూరు, తేది : 19-11-2025 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,బ్యాంక్ ఆఫ్ బరోడా.

క్లుప్తంగా

ఖాళీ స్థలంలో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

ఫిరంగిపురం: మండల కేంద్రంలో చెత్త ఎక్కువగా పేరుకుపోతోందని.. దీనిపై 'చెత్తకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు' శీర్షికన ఆదివారం సాక్షిలో సమస్య ప్రచురితమైంది. సమస్యపై పంచాయతీ అధికారులు స్పందించారు. లక్ష్మీపురంలో చెత్తతో నిండి ఉన్న ఖాళీ స్థలంలోని పనికిరాని వస్తువులు, చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులు సోమవారం తొలగించారు.

ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలి

మంగళగిరి టౌన్: పేదల భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. నూతక్కిలో సోమవారం లంక భూముల రైతుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లంక భూములపై కార్పొరేట్ల కన్ను పడిందని అన్నారు. రైతులకు పాస్‌బుక్‌లు జారీ చేసి బ్యాంకు రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం లంక భూముల పోరాట సాధన కమిటీని ఏర్పాటు చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, వల్లూరు భారతి, నూతక్కి లంక భూముల రైతులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి ఉపసంహరణ హర్షం

దుగ్గిరాల: బోధనేతర పనుల ఉపసంహరణ వల్ల ఉపాధ్యాయులకు మానసిక ఒత్తిడి తగ్గుతుందని.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు వీలు కలుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షురాలు కామాక్షి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పలు జిల్లాల్లో కింది స్థాయిలో అధికారులు బోధనేతర పనులు చేయలేదని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారని.. వాటిని కూడా ఉపసంహరించాలని అన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కళాదర్, దౌలా, చలపతిరావు, గోపినాథ్, శోభాదేవి, కరీముల్లా, అజయ్ బాబు, ఆర్.వి ప్రసాద్, హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళా సీహెచ్‌వోలకు రక్షణ కల్పించాలి

మంగళగిరి టౌన్: వైద్య, ఆరోగ్యశాఖల్లో విలేజ్ క్లినిక్‌లలో పనిచేస్తున్న మహిళా సీహెచ్‌వో(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు)లకు రక్షణ, భద్రత కల్పించాలని ఏపీఎంసీఏ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామలకు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ముఖ గుర్తింపు (ఎఫ్‌ఆర్‌ఎస్) వేస్తేనే ఇన్‌సెంటివ్ ఇస్తామనడం అన్యాయమని పలువురు నాయకులు అన్నారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ సందీప్, జిల్లా జనరల్ సెక్రటరీ లింగరాజు, చిత్తూరు కోఆర్డినేటర్ రషీద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సీఐటీయూ మహాసభలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నిర్వహిస్తున్న సీఐటీయూ గుంటూరు జిల్లా 11వ మహాసభలు సోమవారంతో ముగిశాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ ముగింపు సమావేశంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వేముల దుర్గారావు తీర్మానం ప్రవేశ పెట్టారని తెలిపారు. అనంతరం గుంటూరు జిల్లా అధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, కార్యదర్శిగా దండ లక్ష్మీనారాయణను.. 16 మంది ఆఫీస్ బేరర్స్‌ను, 76 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

మళ్లీ రాజుకున్న వినాయక విగ్రహ వివాదం

తాడికొండ: తుళ్లూరులో చెరువు కట్టపై ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వివాదం సోమవారం మళ్లీ రాజుకుంది. ఇక్కడ వినాయక మండపం ఏర్పాటు చేయడంపై దామినేని శ్రీనివాసరావు, నెలకుదిటి చందు వర్గాలు బాహాబాహీకి దిగి కోర్టుకెక్కడంతో కోర్టు ఆదేశాల మేరకు గతంలో అధికారులు వినాయక మండపం తొలగించి ఆ సామాగ్రిని అక్కడే వదిలేశారు. అవి తొలగించాలని పలుమార్లు సూచించినా తొలగించక పోవడంతో టీడీపీ నాయకుడు దామినేని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పంచాయతీ అధికారులు వాటిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. అయితే చందు వర్గం దీనిని వ్యతిరేకించడంతో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాగా ఇరు వర్గాలూ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.

ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం!

వేమారెడ్డికి సంతకాల సేకరణ పత్రాలను అందజేస్తున్న రామచంద్రాపురం నాయకులు

చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి

- పీపీపీ విధానాన్ని చంద్రబాబు వెనక్కి తీసుకోవాలి
- సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేదలు విద్య, వైద్యం కోల్పోతారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా సేకరించిన పత్రాలను మంగళగిరి పట్టణ, మండల నాయకులు వేమారెడ్డికి అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 28వ వార్డులో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారంతో పూర్తయిన సందర్భంగా ఆ ప్రతులను డీవీఆర్‌కు అందజేశారు. మండల పరిధిలోని రామచంద్రాపురంలో పూర్తయిన సంతకాల పత్రాలను ఆ గ్రామ నాయకులు వేమారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని ఆపే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రభుత్వ చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దానికి సాక్ష్యమే సంతకాల సేకరణ పత్రాలని పేర్కొన్నారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి..

చంద్రబాబు సర్కార్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వేమారెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, 28వ వార్డు అధ్యక్షులు కురగంటి ఆదాం, ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగి బాబు, నాయకులు ప్రశాంత్, రాజేష్, భాస్కర్, విజయకుమారి, సతీష్, ఆషా, పాతిమా, నాగమల్లేశ్వరి, రామచంద్రాపురం గ్రామ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, నాయకులు మహేష్ రెడ్డి, రామిరెడ్డి, భీమిరెడ్డి నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, శివారెడ్డి, సీతారామిరెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జున రెడ్డి, సాంబిరెడ్డి, నారాయణ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలులో ప్రభుత్వం విఫలం..

తాడేపల్లి రూరల్/మంగళగిరి టౌన్: 2014 విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. తాడేపల్లి జాతీయ రహదారి వెంబడి గల ఆయన కార్యాలయంలో సోమవారం రెవల్యూషనరి స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబరు 20న ఢిల్లీలో జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు సర్కార్ రాష్ట్రంలో ప్రజల హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించాల్సిన పార్లమెంట్, రాజ్యసభ సభ్యులు మౌనంగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. జాతీయ అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. 2014 విభజన హామీల అమలు కోసం చంద్రబాబు సర్కార్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు రఘురామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సహాయ కార్యదర్శి నరేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చరణ్, సాయి, శ్రీకాంత్, అవినాష్, సూర్య, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన రైతన్న మీకోసం

రైతులతో మాట్లాడుతున్న విజయ సునీత

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, నుదురుపాడు గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్‌శాఖ విజయ సునీత మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లలో రైతులను రాజులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకూ వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల సిబ్బంది గ్రామాల్లోని ప్రతి రైతును ప్రత్యక్ష్యంగా కలిసి అవగాహన కల్పిస్తారని వివరించారు. నీటి భద్రత, డిజిటల్ వ్యవసాయం, ఆధునిక సాంకేతికత, సమగ్రమార్కెటింగ్, పంటల లాభదాయకతపై రైతులకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.సత్యనారాయణ చౌదరి, ఏవో వాసంతి, రైతులు పాల్గొన్నారు.

12 శాతం మజూరి పెంపుదలకు ఒప్పందం

ఒప్పంద పత్రాలను అందజేస్తున్న మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ సభ్యులు

మంగళగిరి టౌన్: చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్, మంగళగిరి వస్త్ర ఉత్పత్తి విక్రయదారుల సంఘం ప్రతినిధులతో సోమవారం మంగళగిరి షరాఫ్ బజార్‌లోని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ హాల్‌లో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ పిల్లలమర్రి బాలకృష్ణ, మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నాదుల వరప్రసాద్‌లు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, చేనేత పరిశ్రమ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించి 2025 డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకూ రెండేళ్ల కాలానికి చేనేత కార్మికులకు 12 శాతం మజూరి పెంపుదల ఒప్పందం ఏకాభిప్రాయంతో కుదిరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుత్తికొండ ధనుంజయరావు, పొట్లాబత్తుని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలం మంజూరు చేయాలి

మంగళగిరి టౌన్: ఇళ్లు లేని పేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలం మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి అప్పారావు డిమాండ్ చేశారు. చినకాకానిలో ఇళ్ల స్థలాల కోసం ఎంటీఎంసీ కమిషనర్‌కు అర్జీలు ఇచ్చిన పేదలకు సోమవారం రసీదులు అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతోంది కానీ ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు ఇచ్చే దిశగా ప్రణాళికలు చేయాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ప్రజలందరినీ ఐక్యం చేసి స్థలాలు సాధించే వరకూ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గండికోట బాబూ వరప్రసాద్, గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ కాలేజీలో ఏఐపై ప్రత్యేక శిక్షణ

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మేడికొండూరు: నేటి సాంకేతిక యుగంలో విద్యా బోధనలోనూ మార్పులు అవసరమని గుర్తిస్తూ స్థానిక యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల మరో అడుగు ముందుకు వేసింది. కళాశాల ఐక్యూఏసీ, ఆర్‌డీ విభాగం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక ఎన్.ఐ.టి.టి.టి.ఆర్ కోల్‌కతా సహకారంతో వారం రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. బోధన, పరిశోధనలో కృత్రిమ మేధ ఆధారిత విధానాలు అనే అంశంపై నవంబరు 24 నుంచి 29వ తేదీ వరకూ ఈ శిక్షణ తరగతులు జరగనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా విచ్చేసిన ఎన్.ఐ.టి.టి.టి.ఆర్ కోల్‌కతా ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటరావు మాట్లాడుతూ.. సాంకేతిక విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. అధ్యాపకులు ఈ నూతన విధానాలను అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగ్గా బోధించవచ్చని సూచించారు. ప్రారంభోత్సవంలో కళాశాల సెక్రటరీ–కరెస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ రెవ.పి.బాలస్వామి, డిప్లొమా ప్రిన్సిపాల్, డీన్ ఆఫ్ అకడమిక్స్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని రైతుసాధికారత సంస్థ సహకారంతో ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ కేంద్ర యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ.. పురుగు మందులు లేని సహజ సిద్ధ పంటల ద్వారా పండించిన కూరగాయలను తినడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పంటలు పండించే విధంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

10 లక్షల సురక్షిత పని గంటల నమోదు

తాడికొండ: ఏపీ సీఆర్డీయే రాజధానిలో నిర్మిస్తున్న ఎన్‌జీవో టవర్‌ల నిర్మాణ పనులలో 10 లక్షల సురక్షిత పని గంటలను నమోదు చేసినట్లు సీఆర్డీయే అధికారులు తెలిపారు. సోమవారం సీఆర్డీయే ఈఎస్ఎం విభాగం డైరెక్టర్ నితిన్ శర్మ, పలువురు అధికారులు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నితిన్ శర్మ మాట్లాడుతూ.. ఎన్‌జీవో టవర్ల నిర్మాణ పనుల్లో సాధించిన ఈ ఘనత రాజధాని అమరావతి నిర్మాణంలో కార్మికుల భద్రతకు సీఆర్డీయే తీసుకుంటున్న ప్రణాళికలను స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో పాల్గొన్న ప్రతి ఉద్యోగి, కాంట్రాక్టర్, ఇతర భాగస్వాములకు ఏపీ సీఆర్డీయే అభినందనలు తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఆర్డీయే చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, హార్టికల్చర్ డైరెక్టర్ ఎం.హరిప్రసాద్, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పీబీఎన్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి.అనితావాణి, సీనియర్ ఓహెచ్ఎస్ స్పెషలిస్ట్ జి.గోపికృష్ణ , పీజీఎంసీ సీనియర్ లేబర్ ఓహెచ్ఎస్ స్పెషలిస్ట్ బి.శ్రీధర్ రెడ్డి, ఎల్అండ్‌టీ ఓహెచ్ఎస్ మేనేజర్ హెచ్.నీలాంచల్, ఎల్అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ వి.మణికందన్ తదితరులు పాల్గొని సంబంధిత సిబ్బందికి అభినందనలు తెలిపారు.

అక్రమాలపై తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు ఫిర్యాదు

తాడికొండ: గుంటూరు గ్రీవెన్స్ కార్యాలయం వేదికపై సోమవారం తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. అక్రమ మైనింగ్, పంచాయతీలో జరుగుతున్న, భూ కబ్జాలు, అవినీతి వంటి పలు అంశాలపై ఫిర్యాదుల పరంపర వెల్లువెత్తింది. అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నామనే అక్కసుతో అక్రమ మైనింగ్ గ్యాంగ్ తనను, తన కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారని లచ్చన్న గుడిపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కుర్రా శ్రీధర్ మోతడక గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త, గ్రామపార్టీ అధ్యక్షుడు యడ్లపల్లి సాంబశివరావు, ఆయన అన్న శ్రీనివాసరావులపై సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

అవినీతిపై విచారణ చేయాలి.

లాం గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో జరిగిన రూ.కోట్ల రూపాయల అవినీతిపై విచారణ చేయాలని 13వ వార్డు నంబర్ షేక్ నసీబ్‌మియా గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులలో పనులు చేయకుండా చేసినట్లు, ఒకే పనికి రెండు బిల్లులు విత్‌డ్రా చేయడంతో పాటు వివిధ ఉపకరణాల కొనుగోలులో జరిగిన రూ.1.25 కోట్ల అవినీతిపై విచారణ చేయాలని ఆయన కోరారు. సర్పంచ్.. ఫిర్యాదు చేసిన వారు ఇద్దరూ టీడీపీకి చెందిన వారే కావడం గమనార్హం.

లాం చెరువులో అక్రమాలపై..

లాం చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై షేక్ ముజీబా, షేక్ నాగుల్ మీరాలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. చెరువు పూడికతీత మట్టిని 100 ట్రక్కులు శ్మశాన వాటిక, సచివాలయానికి తరలించి రూ.30 లక్షల బిల్లులు విత్ డ్రా చేసి దండుకున్నారని ఆరోపించారు.

ఉండవల్లి కళాకారులకు సాంస్కృతిక పురస్కార అవార్డులు

కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నాగభూషణం

తాడేపల్లి రూరల్: ఉండవల్లి గ్రామానికి చెందిన కళాకారులకు ప్రభుత్వం మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నేతృత్వంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో అవార్డులు అందించింది. దీంతో కళాకారులను సోమవారం ఉండవల్లి ప్రజలు అభినందించారు. ఉండవల్లికి చెందిన ప్రజానాట్యమండలి కళాకారులు జొన్న రామలింగేశ్వరరావు కళాకారులుగా విశేషమైన సేవలు అందించినందుకు.. అలానే ఆయన రచించిన రచనలు, జాతీయ స్థాయి చిన్న సినిమాలలో ఉత్తమ నటుడిగా ఈ సాంస్కృతిక అవార్డును అందజేశారు. ఉండవల్లికి చెందిన మరో కళాకారుడు రంగస్థలం, రేడియో, టీవీ, సినీ నటుడు, దర్శకుడు, రచయిత గాదె నాగభూషణంకు సాంస్కృతిక అవార్డు లభించింది. ఉండవల్లిలో నివసించే వీరికి అవార్డులు రావడంతో స్థానికులు అభినందించారు.

కేఎల్‌యూలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ శిక్షణ

సదస్సులో మాట్లాడుతున్న వెంకట్‌రామ్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యూ ఎన్ ఎక్స్‌తో కలిసి అధ్యాపకులు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్ మాట్లాడుతూ.. అధ్యాపకులు, విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడానికి ఇటువంటి ఎఫ్‌డీపీలు, కేంద్రాల ప్రాముఖ్య, ఆవశ్యకతను నొక్కి చెప్పారు. క్యూ ఎన్ ఎక్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ 1980లో కెనడియన్ కంపెనీ క్వాంటం సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ స్థాపించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 19 కళాశాలలు, విశ్వవిద్యాయాల్లో కలిసి మొత్తం 58 మంది అధ్యాపకుల సహాయాన్ని ఎంపిక చేయగా వారిలో 7 మంది అధ్యాపకులు కేఎల్‌యూకు చెందిన వారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా అధ్యాపకులకు ఒక వారం పాటు ఆటోమోటివ్, ఏరో స్పేస్ అప్లికేషన్ల కోసం రియల్ టైమ్ ఎంబెడెడ్ సిస్టమ్‌లకు సంబంధించిన క్యూ ఎన్ ఎక్స్ సాఫ్ట్‌వేర్‌పై పట్టు సాధిస్తారని వివరించారు. కేఎల్‌యూలో నైపుణ్య అభివృద్ధి డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి కేఎల్‌యూను ఎంచుకున్నందుకు క్యూ ఎన్ ఎక్స్, పీఐ స్క్వేర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి ప్రాణం తీసిన రోడ్డు మార్జిన్

మృతి చెందిన బాలి సుధాకర్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొషన్ పరిధిలోని సీతానగరం రేవేంద్రపాడు రోడ్డులో కుంచనపల్లి వద్ద కొత్తగా నిర్మించిన రోడ్డు మార్జిన్ కారణంగా ఓ యువకుడు ద్విచక్రవాహనం అదుపు తప్పి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో నివసించే బాలి సుధాకర్(33) తెల్లవారుజామున తాను పనిచేసే యజమాని దగ్గరకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. కుంచనపల్లి బ్రిడ్జి వద్ద నుంచి మూడు స్తంభాల వరకూ సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. ఆ రోడ్డు ఎక్కేందుకు గ్రావెల్ మట్టి పోయగా అది అణిగిపోయింది. ఈ క్రమంలో సీసీ రోడ్డు ఎక్కే సమయంలో బండి అదుపుతప్పి పడిపోవడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. జరిగిన సంఘటనపై సుధాకర్ సోదరి శ్రీవిజయ తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుధాకర్‌కు భార్య రోజాతో పాటు 5 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. జరిగిన సంఘటనపై ట్రైనింగ్ ఎస్ఐ సీహెచ్ అపర్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశదల అభివద్ధికి విద్యార్థుల బాట

ప్లాస్టిక్ నివారణ, పారిశుద్ధ్యం కార్యక్రమంలో విద్యార్థులు

మేడికొండూరు: ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవలో ముందున్నారు. గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలంలోని విశదల గ్రామాన్ని దత్తత తీసుకుని వారం రోజుల పాటు నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక సేవా శిబిరాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన స్టెప్ స్వశక్తి యువజన శాఖ సెక్రెటరీ రాధిక మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవడం దేశ ప్రగతికి ఎంతో అవసరమని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.రోజా మాట్లాడుతూ.. విద్యార్థులు తమ గ్రామాన్ని దత్తత తీసుకోవడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు అంకిత భావంతో గ్రామానికి సేవ చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ కోరారు. శిబిరంలో మొదటి రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'స్వచ్ఛత' నినాదంతో గ్రామ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవికుమార్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. విద్యార్థుల చొరవను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, ఏవో సీతారామయ్య ప్రత్యేకంగా అభినందించారు.

లేబర్ కోడ్ కాపీల దహనం

తాడేపల్లి రూరల్: కార్మికవర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ కాపీలను సీఐటీయూ నాయకులు తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్‌లో సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రజా సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, ఉమా మహేశ్వరరావు, బి.లక్ష్మణరావు, దండి లక్ష్మీ నారాయణ, వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం కూల్చివేత

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా న్యాయస్థానం తీర్పు

తొలగించిన నిర్మాణంలో ఉన్న ఆలయ పిల్లర్లు

ఆలయాన్ని కూల్చివేసేందుకు వచ్చిన అధికారులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధి ఇందిరానగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సోమవారం ఎంటీఎంసీ అధికారులు కూల్చివేశారు. గత ప్రభుత్వంలో ఇందిరానగర్‌లోని 22 సెంట్ల భూమిని యాదవుల కమ్యూనిటీ హాల్ కింద కట్టడానికి అప్పటి అధికారులు అనుమతించారు. ఈ స్థలానికి అనుబంధంగా ఉన్న 2 సెంట్ల పోరంబోకు స్థలంలో శ్రీకృష్ణుని మందిరం నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్లు ప్రముఖ న్యాయవాది తోట శివప్రసాద్ పేర్కొన్నారు. కాగా.. ఈ భూమిలో కట్టడాలు జరిపితే భారీ వర్షాల కారణంగా స్థానిక నివాసాలు నీటమునిగిపోతాయని ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. ఈ వాదనపై గౌరవ కోర్టు ఆ ఆలయ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై స్పందించిన స్థానికులు ఆలయ నిర్మాణాన్ని తొలగించడం సరికాదని, గత ప్రభుత్వంలో కమ్యూనిటీ హాల్ కేటాయించినప్పటికీ త్వరితగతిన అనుమతులు మంజూరు చేయలేదన్నారు. అప్పటి అధికారులు స్పందించకపోవడంతో పాటు వర్గ బేధాలతో కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు.

ఎవరూ పట్టించుకోవడంలేదు..

ఆలయ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేసిన వ్యక్తి అనేక పార్టీలు మారుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 30 వేలకు పైగా ఉన్న యాదవ సామాజిక వర్గ ప్రయోజనాలను ఏ పార్టీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది తోట శివరామ్‌ప్రసాద్, కృష్ణ యాదవ్, నాగయ్య, సురేష్ యాదవ్, వెంకటరావు, యలమందయ్య, గుండు వెంకటేశ్వరరావులు ఉన్నారు. ఘటనపై ఎంటీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా.. కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీస్ బందోబస్తు మధ్య నిర్మాణంలోని పిల్లర్స్‌ను సిబ్బందితో తొలగించామని తెలిపారు. కృష్ణుడి విగ్రహాన్ని అలానే ఉంచామని చెప్పారు. విగ్రహం తరలించేందుకు వేరే స్థలాన్ని చూసే వరకూ విగ్రహాన్ని ఇక్కడే ఉంచుతామని ఆయన అన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే లైసెన్స్ రద్దు

మంగళగిరి టౌన్: మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారి లైసెన్సులను రద్దు చేసి ఉన్నతాధికారుల వారి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు హెచ్చరించారు. సోమవారం పట్టణంలో వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు సరిగా లేని పలు వాహన యజమానులకు జరిమానాలు విధించారు. డ్రైవింగ్ చేస్తున్న పలువురు మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటోనగర్‌లో బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతన్న మీకోసం ప్రారంభం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలంలో సోమవారం రైతన్న–మీకోసం కార్యక్రమం ప్రారంభమైంది. మండల వ్యవసాయ అధికారిణి శైలజారాణి, రైతు భరోసా సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు కలిసి పెదవడ్లపూడి గ్రామ రైతులకు పంచసూత్రాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారిణి దీపిక, మార్కెట్ యార్డ్ సెక్రటరీ ప్రభారాణి, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

సంజీవని పేరుతో వైద్యసేవలు ప్రైవేటుపరం

- కార్మిక సంఘాల దేశవ్యాప్త ఆందోళనకు మద్దతు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ప్రకటించిన సంజీవని అమలు చేయడమంటే వైద్యసేవలను ప్రైవేటుపరం చేయడమేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు మండిపడ్డారు. విజయవాడలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.19 వేల కోట్లు పూర్తిగా ఖర్చుచేస్తే ఆరోగ్యరంగం పెద్దఎత్తున అభివృద్ధి చెందేదన్నారు. ఆరోగ్య రంగాన్ని పూర్తిగా ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించేందుకే సంజీవని పెట్టారని, దీనివల్ల కార్పొరేట్లకు లబ్ధి తప్ప పేదలకు ఒరిగేదేమీ ఉండదని చెప్పారు. కార్పొరేట్ల లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడొద్దని హెచ్చరించారు. గూగుల్ డేటా సెంటర్ వివరాలను వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్‌ల అమలు కోసం కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వడం శ్రామికవర్గంపై దాడి అని, దీన్ని రాష్ట్రాలు కూడా అమలు చేయాలని ఒత్తిడి చేయడం అప్రజాస్వామికమని చెప్పారు. కార్మిక వర్గానికి తీవ్రనష్టం కలిగించే ఈ లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా బుధవారం కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనకు సీపీఎం పూర్తిగా మద్దతిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.6,400 కోట్ల బకాయిలు విడుదల చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ

సాక్షి, అమరావతి: పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య కోరారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను ఆయన సోమవారం మీడియాకు విడుదల చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు పేద, బడుగు బలహీనవర్గాల విద్యార్థులపై ఫీజుల కోసం తీవ్ర ఒత్తిళ్లు చేయడంతో వారి చదువులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఆరు సెమిస్టర్ల ఫీజు బకాయిలు రూ.4,200 కోట్లతోపాటు స్కాలర్‌షిప్‌లు రూ.2,200 కోట్లు.. మొత్తం రూ.6,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అన్యాయం చేయడమేనని ఆయన పేర్కొన్నారు.

లొంగిపోయిన నా కొడుకు ఎక్కడ?

పోలీసులే చెప్పాలని ఓ తల్లి అభ్యర్థన

సునీల్ తల్లి సులోచన

వరంగల్: మావోయిస్టుల్లో చేరిన తన కొడుకు లొంగిపోయాడని ఈనెల 4వ తేదీన పోలీసులు చెప్పి 20 రోజులు దాటినా ఆచూకీ లేదని వరంగల్ నగరం లేబర్ కాలనీకి చెందిన పోలేపాక సులోచన తెలిపింది. ఆమె సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తనకు ఐదుగురు సంతానమని, అందులో నాలుగో కొడుకు పోలేపాక సునీల్ 27 ఏళ్ల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడని పేర్కొంది. కొన్ని నెలల తర్వాత పోలీసులు వచ్చి తన కొడుకు అడవి బాట పట్టి మావోయిస్టుల్లో చేరాడని చెప్పడంతో భయపడిపోయామని చెప్పింది. తరచూ తమ ఇంటికి పోలీసులు వచ్చిపోతూ బిడ్డ వస్తున్నాడా...లేదా అంటూ విచారించేవారని పేర్కొంది. భర్త చనిపోయినప్పుడు కూడా కొడుకు రాలేదని, ఈనెల 4న వరంగల్ నుంచి ఒకరు, హైదరాబాద్ నుంచి మరొకరు వచ్చి.. సునీల్ లొంగిపోయాడని సమాచారం అందించినట్లు తెలిపింది. లొంగిపోయాడని చెప్పడంతో ఎంతో సంతోషించానని, వృద్ధాప్యంలో ఉన్న తనకు కొడుకు ఆసరాగా ఉంటాడని ఆశపడ్డానని పేర్కొంది. కానీ, 20 రోజులు దాటినా ఇంటికి రాకపోవడంతో ఆందోళనగా ఉందని తెలిపింది. తన కొడుకు విషయమై ఎవరిని సంప్రదించాలో తెలియదని, ఎక్కడున్నాడో పోలీసులు చెప్పాలని ఆమె కన్నీటిపర్యంతమైంది.

15 మంది మావోయిస్టుల లొంగుబాటు



దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పోలీసుల ఎదుట 15 మంది మావోయిస్టులు సోమవారం లొంగిపోయారు. వీరిలో రూ.48 లక్షల రివార్డు గల ఐదుగురు మహిళలు కూడా ఉన్నారని సుక్మా ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు. లొంగిపోయిన వారిలో పీపీసీఎం సభ్యులు నలుగురు, ఏసీఎం ఇద్దరు, దళ సభ్యులు ముగ్గురితో పాటు ఎనిమిది మంది సానుభూతిపరులు ఉన్నారని వెల్లడించారు.

హద్దూ'పొద్దూ' లేకుండా ఇసుక అక్రమ రవాణా

కొవ్వూరు నుంచి అనధికారికంగా..

పల్నాడు జిల్లా పరిధిలోని పొందుగల అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు

క్రోసూరు మండలం బయ్యారం నుంచి తెలంగాణ వెళ్తున్న ఇసుక లారీ

చెక్‌పోస్టులు దాటిస్తున్న అధికారపార్టీ నేతలు

సాక్షి, నరసరావుపేట/సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కృష్ణానది పరీవాహక ప్రజాప్రతినిధులు ఇసుక అక్రమ రవాణాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకొని రూ.కోట్లు సంపాదిస్తున్నారు. నిత్యం ఇసుక లారీలను పల్నాడు జిల్లా సరిహద్దుల మీదుగా చెక్‌పోస్టులను దాటించి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నారు. రూ.కోట్లు దండుకుంటున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నా.. జిల్లాలోని మైనింగ్, విజిలెన్స్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారపార్టీ నేతలు ఇస్తున్న మామూళ్లకు అలవాటు పడి మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఏపీ చెక్‌పోస్టులలో రైట్.. రైట్

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని తుళ్లూరు, అమరావతి మండలాల పరిధిలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను లారీల్లోకి లోడ్‌చేస్తున్నారు. సాధారణంగా లారీకి 18–22 టన్నుల ఇసుకను రవాణా చేస్తారు. అయితే హైదరాబాద్, నల్లగొండ, తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు అక్రమంగా వెళ్తున్న లారీలలో ఏకంగా 40 టన్నుల వరకు ఇసుక లోడ్‌చేస్తున్నారు. ఇసుక రీచ్ ఉన్న స్థానిక అధికారపార్టీ నేతలకు లారీకి రూ.10 వేల దాకా ముట్టజెబుతున్నారు. లారీలు అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల మీదుగా రాత్రి పూట పల్నాడు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులైన పొందుగల, తంగెడల నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ చెక్‌పోస్టుల మీదుగా ఇసుక లారీలు వెళ్తున్నా పట్టుకుంటున్న దాఖలాలు లేవు. ఒక్కో లారీ సరిహద్దు దాటేందుకు స్థానిక పోలీసులు, చెక్‌పోస్టుకు రూ.7 వేల వరకు ఇస్తున్నట్టు సమాచారం.

తెలంగాణ చెక్‌పోస్టులలో చెక్

ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టుల నుంచి తెలంగాణ వైపు వెళ్తున్న ఇసుక లారీలను తెలంగాణ చెక్‌పోస్టుల వద్ద లారీలను పట్టుకుంటున్నా.. టీడీపీ నేతలు బేరసారాలు సాగిస్తున్నారు. దాచేపల్లి మండలం పొందుగల చెక్‌పోస్టు నుంచి దర్జాగా వెళ్లిన అక్రమ ఇసుక లారీలను వందల మీటర్ల దూరంలో కృష్ణానది అవతల ఉన్న తెలంగాణ పరిధిలోని వాడపల్లి చెక్‌పోస్టులో అక్కడి అధికారులు పట్టుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీల మధ్య ఏకంగా ఏడు లారీలను వాడపల్లి చెక్‌పోస్టులో పట్టుకొని కేసులు నమోదు చేశామని వాడపల్లి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మీడియాకు సమాచారం ఇచ్చారు. అయితే టీడీపీ నేతలు రంగంలోకి దిగి బేరసారాలు ఆడుతున్నట్టు సమాచారం.

చెక్‌పోస్టు దాటించేందుకు ఏజెంట్లు

ఇసుక రీచ్ మొదలు నల్లగొండ వరకు వయా పల్నాడు జిల్లాలో ప్రయాణిస్తున్న లారీలను ఏ చెక్‌పోస్టులోనూ అడ్డుకోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా తెలుగుదేశం పార్టీ ఏజెంట్లు పనిచేస్తున్నారు. వీరి పని ఇసుక లారీలను అంతరాష్ట్ర సరిహద్దు దాటించేవరకు వీరు రూట్ ఆఫీసర్లుగా పనిచేస్తారు. పోలీసులతో సన్నిహితంగా ఉంటూ వారికి నెల వారీ మామూళ్లు అప్పగించి లారీలను ఆపకుండా చూడటం ఈ ఏజెంట్ పని. స్థానిక టీడీపీ నేతలు ఏజెంట్లుగా పనిచేసి నెలకు రూ.లక్షలు సంపాదిస్తున్నారు.

గోదావరి పరీవాహకం నుంచీ..

గోదావరి పరీవాహకం నుంచి కూడా ఇసుక తెలంగాణకు యథేచ్ఛగా తరలిపోతోంది. తెలంగాణలో తరచూ కేసులు నమోదు చేస్తున్నా దందా ఆగడం లేదు. ఉమ్మడి పశ్చిమగోదావరిలోని ఏజెన్సీకి ఓ కూటమి ప్రజాప్రతినిధి అనుచరులే ఈ దందా నిర్వహిస్తున్నారు. వీరు మూడు జిల్లాలు, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు దాటించి మరీ ఇసుక లారీలను తెలంగాణకు తరలిస్తున్నారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, అంతకు ముందు సత్తుపల్లి పోలీసులు లారీలను ఆపి కేసులు నమోదు చేయడం గమనార్హం.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇసుక ర్యాంపులు పూర్తిగా మూతపడ్డాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ప్రాంతం నుంచి ఇసుకను అనధికారికంగా తీసుకువచ్చి కూటమి నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీకి చెందిన ఓ కూటమి ప్రజాప్రతినిధి అనుచరులు మరో అడుగు ముందుకేసి సొంత టిప్పర్లతో ఇసుకను సులువుగా సరిహద్దులు దాటిస్తున్నారు. నిత్యం 30 నుంచి 50 లారీల్లో ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలిస్తున్నారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలోని చింతలపూడి మండలం మేడిశెట్టివారిపాలెం నుంచి సరిహద్దు చెక్‌పోస్టు దాటుకుని తెలంగాణ జిల్లాలోని సత్తుపల్లికి, జీలుగుమిల్లి మండలం నుంచి సరిహద్దు చెక్‌పోస్టు దాటి అశ్వారావుపేట మండలానికి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం 16 టన్నులు లోడింగ్ చేసుకుని ఆ మేరకు బిల్లుతో కేవలం జిల్లా పరిధిలోనే సరఫరా చేయాలి. టీడీపీ ఇసుక మాఫియా మాత్రం లారీకి సగటున 35 నుంచి 40 టన్నుల లోడ్ చేసుకుని ఎటువంటి వేబిల్లూ లేకుండా తెలంగాణకు తరలించి సగటున రూ.60 వేల నుంచి రూ.80 వేలకు విక్రయిస్తున్నారు.

తెలంగాణలో ఇసుక సీజ్

కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రక్కిలంకలో ఉన్న ఇసుక ర్యాంపు నుంచి తెలంగాణకు 200కు పైగా లారీల్లో ఇసుకను అక్రమార్కులు తరలించారు. మూడు రోజుల క్రితం ప్రక్కిలంక ర్యాంపు నుంచి గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మీదుగా తెలంగాణలోని అశ్వారావుపేటలోకి ప్రవేశించిన మూడు లారీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అడ్డుకని 105 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. చింతలపూడి మీదుగా సత్తుపల్లికి తరలించి అక్కడి నుంచి ఖమ్మం, మహబూబ్‌నగర్, గద్వాల్ జిల్లాలో విక్రయిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 23న దమ్మపేట మండలం నాగుపల్లిలో ఇదే తరహాలో వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేశారు. ఏపీ 39డబ్ల్యూహెచ్7666, ఏపీ 13డబ్ల్యూజీ 9666 నంబర్లు గల రెండు టిప్పర్లు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కూటమి ప్రజాప్రతినిధి అనుచరులవే. ఈ రెండు టిప్పర్లలో తరచూ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ రెండు వాహనాలు తరచూ పట్టుబడుతున్నా.. రోజుల వ్యవధిలో మళ్లీ అవే వాహనాల్లో దందా సాగించడం కొసమెరుపు.

పవన్‌కళ్యాణ్ పర్యటనలో 'పచ్చ' రచ్చ

మధురపూడి విమానాశ్రయంలో టీడీపీ శ్రేణుల కొట్లాట

- పవన్ తీరుపై తాగునీటి పథకం కార్మికుల ఆగ్రహం
- ఏలూరు జిల్లాలో రోడ్ల దుస్థితిపై నిరసనల సెగ
- ఇచ్చిన పత్రాలనే మళ్లీ ఇచ్చిన పవన్

పవన్ కాన్వాయ్ వెళ్తుండగా ప్లకార్డులతో సత్యసాయి గోదావరి మంచినీటి పథకం కార్మికుల నిరసన

కోరుకొండ/కొయ్యలగూడెం/ద్వారకాతిరుమల: తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో సోమవారం పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు, కార్మికుల నుంచి నిరసనల సెగ తగిలింది. కూటమి నేతల కొట్లాటలు, శ్రేణుల నుంచి నిరసనలు సైతం తప్పలేదు. పవన్ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం విమానాశ్రయానికి రాగా.. టీడీపీ శ్రేణులు రచ్చరచ్చ చేశాయి. పవన్‌ను కలిసేందుకు రుడా చైర్మన్, టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణచౌదరి, సీఎం చంద్రబాబు పర్యటనల కో–ఆర్డినేటర్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ కుమారుడు అభిరామ్ వర్గీయులు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు అభిరామ్‌ను మాత్రమే అనుమతించి, బొడ్డు వర్గీయులకు అనుమతి నిరాకరించారు. దీంతో పోలీసులను బొడ్డు వర్గీయులు నిలదీశారు. పెందుర్తి అభిరామ్‌పై బూతు పురాణం అందుకున్నారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, కొద్దిపాటి కొట్లాట చోటుచేసుకున్నాయి. చివరకు పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఇరువర్గాలకు చెందిన నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

కార్మికుల నిరసన

సమస్యలు చెప్పుకుందామని వచ్చిన తమ పట్ల డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వ్యవహరించిన తీరుపై శ్రీ సత్యసాయి గోదావరి తాగునీటి పథకం కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న 52 మంది కార్మికులకు ప్రభుత్వం 20 నెలలుగా జీతాలు, 34 నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదు. మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో వారంతా పవన్‌కళ్యాణ్‌కు గోడు వెళ్లబోసుకునేందుకు విమానాశ్రయానికి వచ్చారు. కానీ, పవన్‌ను కలిసేందుకు కార్మికులకు అనుమతి ఇవ్వలేదు. దీనిపై మండిపడిన కార్మికులు పవన్‌కళ్యాణ్ కాన్వాయ్ వెళ్లే మార్గంలో మధురపూడి సాయిబాబా ఆలయ సమీపాన ప్లకార్డులతో నిరసన తెలిపారు.

గ్రామాల్లో నిరసన సెగ

ఏలూరు జిల్లాలో పర్యటించిన పవన్ నిరసన సెగ ఎదుర్కోవాల్సి వచ్చింది. ద్వారకా తిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలోని పుణ్యక్షేత్రమైన శ్రీ కనకవల్లీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్తుండగా.. కొయ్యలగూడెం మండం గంగన్నగూడెం, తిమ్మనకుంట గ్రామాల ప్రజలు రోడ్ల దుస్థితిపై నిరసన తెలిపారు. తమ గ్రామాల్లోని రోడ్లను పట్టించుకోవాలని కోరుతూ ప్రజలు ప్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నిలబడ్డారు. ఇవేవీ పట్టించుకోకుండానే పవన్ వెళ్లిపోయారు. అధ్వానంగా ఉన్న రాజవరం ప్రధాన రహదారిపై భారీఎత్తున ఎగసిపడిన దుమ్ము, ధూళి మధ్య కలెక్టర్ వెట్రిసెల్వితో కలసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. పవన్ తమ గోడును వినిపించుకోకుండా వెళ్లిపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ప్రజలు తమ గ్రామానికి చెందిన కూటమి నాయకులను నిలదీశారు. దీంతో కూటమి నాయకులు సైతం ప్లకార్డులను ప్రదర్శిస్తూ మూడు పుంతల రోడ్డు వద్ద గంగవరం గ్రామస్తులతో కలసి రోడ్డు సమస్యపై ఆందోళన చేపట్టారు. డిప్యూటీ సీఎం తిరుగు ప్రయాణంలో అక్కడకు రాగా ఆందోళనకారులు కాన్వాయ్‌ను అడ్డుకుని చుట్టుముట్టారు. దీంతో కారులో నుంచే పవన్‌కళ్యాణ్ ఆందోళన కారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

ఇచ్చిన పత్రాలనే మళ్లీ ఇచ్చిన పవన్

ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలోని శ్రీ కనకవల్లీ సహిత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని ఇటీవల సందర్శించిన పవన్‌కళ్యాణ్ ఆ ఆలయ అభివృద్ధికి సుమారు 50 ఎకరాల భూమిని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. స్థల పరిశీలన జరిపిన అధికారులు 30 ఎకరాలను కేటాయించారు. ఈ భూమికి సంబంధించిన హక్కు పత్రాలను ఈ ఏడాది మే 16న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దాకారపు నరసింహమూర్తి, మరికొందరితో కలసి శ్రీవారి దేవస్థానం ఈవో ఎన్‌వీఎస్ఎన్‌మూర్తికి అందజేశారు. తాజాగా సోమవారం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న పవన్ ఆ 30 ఎకరాల భూమికి సంబంధించిన హక్కు పత్రాలను మళ్లీ దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌కు అందించారు. ఒకే భూమికి సంబంధించిన పత్రాలు ఎన్నిసార్లు ఇస్తారని స్థానికులు గుసగుసలాడారు.

జూన్‌కల్లా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు

- రూ.1.4 కోట్ల కుటుంబాలకు క్యూఆర్ కోడ్‌తో జారీ
- ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంను అమలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై (ఎఫ్‌బీఎంఎస్) సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పౌర సేవల్ని, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి జూన్‌కల్లా స్మార్ట్ ఫ్యామిలీ కార్డును జారీ చేయాలన్నారు. ఆర్టీజీఎస్ నిర్వహిస్తున్న డేటా లేక్ ద్వారా ఈ సమాచార సేకరణ జరగాలని చెప్పారు. ఈ సమీక్షకు సీఎస్ కె.విజయానంద్, ఆర్థిక, వైద్యారోగ్య, గ్రామ, వార్డు సచివాలయ, పురపాలక, ప్లానింగ్ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మరింత మెరుగ్గా పౌర సేవలు

పౌరసేవలు మరింత మెరుగ్గా అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో సోమవారం వివిధ అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ప్రజామోదం మేరకే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనులు చేపట్టేలా చూడాలని.. గ్రామీణ ప్రాంతాల్లోనూ గ్రామసభల అనుమతి లేకుండా పనులు చేపట్టవద్దన్నారు. ఉపాధి హామీ పనులకూ ఇదే నిబంధన వర్తించేలా చూడాలన్నారు. పథకాల అమలు, పౌరసేవల్లో జవాబుదారీతనం పెరగాలని సీఎం చెప్పారు. మొక్కజొన్న, పత్తి, అరటి పంటలకు మంచి ధర దక్కేలా చేస్తున్నామన్నారు. వాతావరణ హెచ్చరికలు సహా 42 అంశాల్లో నిరంతర సమాచారం కోసం అవేర్ యాప్‌ను విడుదల చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలూ డేటా లేక్‌కు సమాచారాన్ని అనుసంధానించాలని.. మారుమూల ప్రాంతాల్లో బ్యాండ్ విడ్త్ కనెక్టివిటీని పెంచాలని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలోని తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై పర్యవేక్షణ జరగాలన్నారు. తిరుమలలో టీటీడీ భక్తులకు అందించే సేవలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ లాంటి అంశాలను అధ్యయనం చేసి ఇతర ఆలయాల్లో అమలు చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలితో కలిసి ఎయిర్ క్వాలిటీ సెన్సార్లు ఏర్పాటుచేసి ఆ వివరాలూ ప్రజలకు అందించాలన్నారు.

ఉపాధి కూలీల కడుపు కొట్టడం దుర్మార్గం

- ఆరు నెలల్లో 18.63 లక్షల కార్డులు తొలగించారు
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలి
- మాజీమంత్రి మేరుగు నాగార్జున ఫైర్

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కూడా రాజకీయ కక్ష సాధింపుల కోసం వాడుకుంటూ పేద కుటుంబాల కడుపుకొడుతోందని బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీమంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒకపక్క వ్యవసాయ రంగాన్ని, ఇంకోపక్క ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు టీడీపీ కూటమి ప్రభుత్వం తెరతీసిందని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వారి స్థానంలో నచ్చిన వారిని నియమించుకున్నారని, వారి ద్వారా జాబ్ కార్డుల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నాగార్జున ఇంకా ఏమన్నారంటే..

40 రోజుల్లో 16 లక్షల కార్డులు తొలగింపు

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులెవరైనా ఉంటే వారి కార్డులను తొలగించడమే పనిగా పెట్టుకున్నారు. మొన్న ఏప్రిల్ నుంచి 18.63 లక్షల కార్డులు తొలగించారు. దేశవ్యాప్తంగా 22 లక్షల కార్డులు తొలగిస్తే ఒక్క ఏపీలోనే 18.63 లక్షల కార్డులు తొలగించారంటే ఈ ప్రభుత్వం పేదలను ఏవిధంగా వేధిస్తోందో తెలుస్తోంది. మొన్న అక్టోబరు 8 నుంచి ఇప్పటివరకు 40 రోజుల్లోనే 16 లక్షల కార్డులు తొలగించి పేదల కడుపు కొట్టడం దుర్మార్గమైన చర్య. ఈ జాబ్ కార్డుల తొలగింపుపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలి.

ఎస్సీ, ఎస్టీల కడుపుకొడుతున్నారు

రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య ఉపాధి హామీ పనుల కల్పన తగ్గడం వల్ల రూ.435.40 కోట్ల మేర నష్టపోయినట్లు లిబిటెక్ లాంటి స్వచ్ఛంద సంస్థలు నిర్ధారించాయి. గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఉపాధి హామీ ద్వారా 17.95 కోట్ల పని దినాలు కల్పించగా ఈ ఏడాది అదే సమయంలో 15.51 కోట్ల పనిదినాల కల్పన మాత్రమే జరిగింది. ఎస్సీ లబ్ధిదారులు గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 4 కోట్ల పనిదినాలు పొందగా ఈ ఏడాది 3.23 కోట్ల పనిదినాలు మాత్రమే పొందారు. పని దినాలు తగ్గిపోవడంతో మొత్తంగా ఎస్సీలు 18.7 శాతం, ఎస్టీలు 17.6 శాతం, ఇతరులు 11.3 శాతం మేర ఉపాధిని కోల్పోయారు.

నిబంధనలు ఉల్లంఘించి కార్డుల తొలగింపు

ఒకసారి జాబ్‌కార్డు మంజూరయ్యాక తొలగించాలంటే గ్రామసభ నిర్వహించి బహిరంగ చర్చ అనంతరమే తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఆధార్, బ్యాంకు ఖాతాలతో లింక్ చేసుకోలేదనే కారణాలతో జాబ్‌కార్డులు రద్దుచేసే నిబంధన కూడా ఏదీలేదు. శాశ్వతంగా వలస వెళ్లడం, నకిలీ అని నిరూపణ అయిన సందర్భాల్లో మాత్రమే తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలి. అంతేగానీ.. పనులకు డిమాండ్ లేకపోవడం లాంటి కారణంతో కార్డులు రద్దుచేయకూడదు. అయినా, ఈ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడంలేదు.

లొంగిపోతాం.. సమయం ఇవ్వండి

మూడు రాష్ట్రాల సీఎంలకు ఎంఎంసీ ప్రతినిధి అనంత్ లేఖ!

- ఫిబ్రవరి 15 వరకు కాల్పుల విరమణ పాటించాలని వినతి
- త్వరలోనే ఆయుధాల వదిలే తేదీ కూడా ప్రకటిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్/చర్ల: 'మేం ఆయుధాలు వీడి లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసి ప్రభుత్వం కల్పించే పునరావాస పథకం ద్వారా జీవించాలనుకుంటున్నాం. ఇందుకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు కొంత సమయం ఇవ్వాలి. పార్టీ ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు కట్టుబడి ఉన్నందున మేం సమిష్టిగా ఈ నిర్ణయానికి రావడానికి కొంత సమయం పడుతుంది. మా సహచరులను సంప్రదించి మా పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాన్ని తెలియజేయడానికి మాకు కొంత సమయం కావాలి' అని మావోయిస్టు పార్టీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ (పార్టీ ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట విడుదలైన ఒక లేఖ కోరింది. ఆ రాష్ట్రాల సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, మోహన్ యాదవ్, విష్ణుదేవ్ సాయిని ఉద్దేశించి ఆ లేఖ ఉంది. ఈ నెల 22వ తేదీతో హిందీలో రాసి ఉన్న ఈ లేఖ సోమవారం వెలుగులోకి వచ్చింది. అందులోని వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రభుత్వ పథకానికి అంగీకారం

'నేను ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధిగా మూడు రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక విజ్ఞాపన పత్రం రాస్తున్నా. ఇటీవల మా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు సోను దాదా మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ ఆయుధాలు వీడి సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయానికి మేం మద్దతు ఇస్తున్నాం. మరో కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న కూడా ఇదే నిర్ణయానికి మద్దతు ఇచ్చారు. దీంతో మా కమిటీ కూడా ప్రభుత్వ పునరావాసం–పునరుద్ధరణ పథకాన్ని అంగీకరించాలనుకుంటోంది. ఇందుకోసం 2026 ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని కోరుతున్నాం. ఇంత సమయం అడగడం వెనుక మాకు వేరే రహస్య ఉద్దేశం ఏమీ లేదు. నన్ను నమ్మండి' అని అందులో పేర్కొన్నారు.

ఆపరేషన్లు నిలిపివేయండి

'మేం ఒకరితో ఒకరు తెలియజేసుకోవడానికి సులభమైన మార్గాలు లేనందున ఇంత సమయం అవసరం. ఈ సమయం ఎక్కువేనని తెలుసు. కానీ ప్రభుత్వం మావోయిజం నిర్మూలనకు నిర్ణయించిన గడువు (2026 మార్చి 31) లోపలే ఈ తేదీ ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్లను నిలిపివేయాలని కోరుతున్నాం. అడవుల్లో ఇన్‌ఫార్మర్ల కార్యకలాపాలను కూడా ఆపాలని, ఇన్‌పుట్లు లేదా సమాచారం ఆధారంగా బలగాలను అడవుల్లో మోహరించవద్దని అభ్యర్థిస్తున్నాం. మేం కూడా ఎలాంటి విధ్వంసకర ఘటనలకు పాల్పడబోమని నిర్దిష్టమైన హామీ ఇస్తున్నాం' అని ఆ లేఖలో అనంత్ వివరించారు.

మా అభ్యర్థన రేడియోలో ప్రసారం చేయండి

'ఈ సందేశం మా సహచరులకు వీలైనంత త్వరగా చేరేలా రాబోయే కొన్ని రోజులు ఈ అభ్యర్థనను రేడియోలో ప్రసారం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రోజువారీ తాజా వార్తలు తెలుసుకునేందుకు మా సహచరులకు అందుబాటులో ఉన్న ఏకైక మెరుగైన మాధ్యమం ఇదే. మేం పత్రికా ప్రకటనను విడుదల చేసి, మా ఆయుధ విసర్జన తేదీని ప్రకటిస్తాం. ప్రజాస్ఫూర్తిగల ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు, యూట్యూబర్లు మాకు, ప్రభుత్వానికి మధ్యవర్తిత్వం వహించాలని అభ్యర్థిస్తున్నాం' అని లేఖలో పేర్కొన్నారు.

ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టులు

సామగ్రిని స్వాధీనం చేసుకున్న బలగాలు



ఘటనా ప్రాంతంలో మావోయిస్టుల సామగ్రి

చర్ల: మహారాష్ట్రలోని డోంగర్‌ఘడ్ జిల్లాలో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర పోలీసులకు –మావోయిస్టులకు మధ్య సోమవారం ఎదురుకాల్పులు జరగగా.. పలువురు మావోయిస్టులు తప్పించుకున్నారు. అనంతరం ఘటనా ప్రాంతం నుంచి పోలీసు బలగాలు పెద్దఎత్తున మావోయిస్టుల సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్, రాజ్‌నంద్‌గావ్‌కు చెందిన డీఆర్‌జీ, మోహ్లా–మన్‌పూర్‌కు చెందిన డీఆర్‌జీ జవాన్లు 300 మంది ఈనెల 19 నుంచి కూంబింగ్ చేస్తున్నారు. సోమవారం ఎదురుకాల్పులు జరగగా మావోయిస్టులు తప్పించుకుని పారిపోయారు. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో మావోయిస్టుల కిట్ బ్యాగులు, యూనిఫాం, సోలార్ ప్యానెళ్లు, చార్జింగ్ సెట్‌లు, వాకీటాకీలు, వంట సామగ్రి, టెంట్లు, టార్పాలిన్లతో పాటు మందుగుండు సామగ్రి లభ్యమయ్యాయి.

● నివాళి

'ధరమ్ జీ'
'ధరమ్ పాజీ'
'వీరూ'
'ధరమ్ వీర్'...
అంటూ ఇండస్ట్రీ, ప్రేక్షకులూ
యాభై ఏళ్లుగా ప్రేమగా పిలుచుకున్న
బాలీవుడ్ హీమేన్ ధర్మేంద్ర
కన్నుమూశారు.
రొమాంటిక్ సినిమాలతో మొదలు
యాక్షన్ సినిమాల వరకు అన్నీ చేసి
'సకల నటనా వల్లభుడు' అనిపించుకున్న
ధర్మేంద్ర మృతితో
ఒక శకం ముగిసింది.

ధర్మేంద్ర (1935-2025)

బాలీవుడ్ హీ మేన్

● ఖదీర్

'ధర్మేంద్ర గారూ... దేశానికి అమితాబ్ మంచి హెయిర్ స్టయిల్ ఇచ్చాడు. రాజేష్ ఖన్నా ఫ్యాషనబుల్ కుర్తా ఇచ్చాడు. మిథున్ డిస్కో డాన్స్ ఇచ్చాడు. మీరేం ఇచ్చారు?'

ధర్మేంద్ర ఒక నిమిషం పాటు మౌనంగా ఉండి సమాధానం ఇచ్చారు.

'ఆరోగ్యం ఇచ్చాను. నన్ను చూసి దేశంలో ఎందరో యువకులు జిమ్ వైపు నడిచారు. నేను దేశానికి కండ ఇచ్చాను. అంతకు మించింది ఏముంది?'

●●●

13 ఏళ్ల పిల్లవాడుగా ధర్మేంద్ర ఉన్నప్పుడు లూథియానా మినర్వా థియేటర్‌లో 'షహీద్' అనే సినిమా చూశాడు. అందులో ఒకతను 'వతన్ కే రాహ్ మే వతన్ కే నౌజవాన్ షహీద్ హో'... అని చేతిలో జెండా పట్టుకుని పాడుతున్నాడు. అతణ్ణి హీరో అంటారని, అతని పేరు దిలీప్ కుమార్ అని ధర్మేంద్రకు తెలియదు. కాని థియేటర్ నుంచి బయటకు వచ్చే సమయానికి ఒకటే నిశ్చయించుకున్నాడు– 'నేను అతనిలాగే మా ఊరి థియేటర్‌లో తెర మీద కనిపిస్తా'.

అది ఏ సమయమో. ఆ మాటను ఏ నక్షత్రాలు విన్నాయో.

●●●

ధర్మేంద్ర తండ్రి స్కూల్ టీచర్. పెద్ద కొడుకు ధర్మేంద్ర తన మార్గంలో నడిచి ప్రొఫెసర్ కావాలని ఆయనకు ఉండేది. ధర్మేంద్రకు చదువు వంటబట్టలేదు. పైగా సినిమా

'చుప్కే చుప్కే' (1975)లో షర్మిలా టాగోర్‌తో...

పురుగు కుట్టింది. దాంతో క్లాసులో ఏమీ వినలేక, చెప్పలేక తండ్రి చేతిలో రోజూ తిట్లే. ఇంటికి వచ్చి తల్లితో 'నన్ను స్కూల్‌కు పంపకు. నాన్న నన్ను మిగిలిన పిల్లల కంటే ఎక్కువ తిడుతున్నాడు' అని ఫిర్యాదు చేసేవాడు.

మొత్తానికి మెట్రిక్‌తో చదువు ఆగి, రైల్వే శాఖలో క్లర్క్ ఉద్యోగం దొరికి, 19 ఏళ్లకు పెళ్లి కూడా అయిపోయింది. కాని అతణ్ణి వెండితెర పిలుస్తూ ఉంది. రోజూ అతడి బాధ చూసిన తల్లి 'నీకు అంతగా నటించాలని ఉంటే ఒక అర్జీ పడేయొచ్చు కదరా' అంది అమాయకంగా. ఉద్యోగానికి అర్జీగానీ హీరో కావడానికి అర్జీ ఉంటుందా? ఏమో... అర్జీ పెట్టాలేమో అనుకుంటున్న ధర్మేంద్రకు అప్పుడే 'ఫిల్మ్‌ఫేర్ టాలెంట్ హంట్' ప్రకటన పేపర్‌లో కనిపించింది. బిమల్ రాయ్, గురుదత్‌ల పర్యవేక్షణలో కొత్త నటీనటుల అన్వేషణ. అమ్మ చెప్పిన మాట గుర్తుకొచ్చి అప్పటికప్పుడు 'మలేర్‌కోట్లా' అనే టౌన్‌కు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాడు. కారణం ఫొటో స్టూడియో అక్కడే ఉంది. అక్కడ జాన్ మహమ్మద్ అనే ఫొటోగ్రాఫర్‌తో 'నన్ను దిలీప్‌కుమార్‌లా ఫొటో తియ్యి' అనంటే అతను అంతకన్నా అందంగా ఫొటో తీశాడు. వెంటనే బొంబాయి నుంచి పిలుపు వచ్చింది. మహా దర్శకులైన బిమల్‌రాయ్, గురుదత్ స్క్రీన్ టెస్ట్ చేశారు. గురుదత్ ఏ సినిమా ఆఫర్ చేయలేదుగానీ బిమల్‌రాయ్ 'నీకు వేషం ఇస్తున్నా' అన్నాడు. సినిమా పేరు 'బందినీ'.

●●●


'బందినీ'లో నూతన్‌తో

సినిమా రంగంలో ఇదిగో అంటే ఆర్నెల్లు. 'బందినీ' నిర్మాణం లేటయ్యింది. ఈలోపు ధర్మేంద్రకు పస్తులు మొదలయ్యాయి. బిమల్‌రాయ్ బుక్ చేసిన నటుడు కాబట్టి 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' (1960) అనే సినిమాలో హీరోగా 51 రూపాయల అడ్వాన్సుతో పని దొరికింది. మొదటి సినిమాగా అదే రిలీజైంది. కాని ఫ్లాప్. ఆ కష్టకాలంలో తనలాగే వేషాల కోసం ప్రయత్నిస్తున్న మనోజ్ కుమార్ ఫ్రెండ్ అయ్యాడు. రోజుల తరబడి స్టూడియోల చుట్టూ తిరగడం, భార్యనూ... ఉద్యోగాన్నీ వదిలేసి బొంబాయిలో ఏం చేస్తున్నావ్ అని తండ్రి అక్షింతలతో ఉత్తరాలు. దాదాపు ఒకటిన్నర సంవత్సరం వేల వేదనలు అనుభవించాడు. అప్పుడు 'బందినీ' (1963) విడుదలైంది. కొద్దిగా గుర్తింపు. 'ఆయి మిలన్ కీ బేలా' (1963) నెగెటివ్ రోల్. రాజేంద్ర కుమార్ హీరో. కాస్త హిట్ అయ్యింది. ఈ సమయంలోనే అతను మన మహానటి సావిత్రి పక్కన హీరోగా 'గంగాకీ లహరే' (1964)లో నటించాడు. ఆ సంగతి సావిత్రికి, ధర్మేంద్రకు తప్ప ప్రేక్షకులకు తెలియదు. అంత ఫ్లాప్ ఆ సినిమా. ధర్మేంద్ర స్ట్రగుల్ కొనసాగింది.

●●●

సినిమా పరిశ్రమలో 'గాడ్‌ఫాదర్' ఉండాలని అంటూ ఉంటారు. ధర్మేంద్రకు 'గాడ్‌మదర్' దొరికింది. ఆమె పేరు మీనా కుమారి. మన 'నాదీ ఆడజన్మే' సినిమాను హిందీలో 'మై భీ లడకీ హూ' (1964)గా రీమేక్ చేస్తుంటే మొదటిసారి మీనాకుమారితో నటించాడు ధర్మేంద్ర. మీనా


'షోలే'లో అమితాబ్‌తో...

కుమారి అప్పటికే తన వివాహ బంధం నుంచి బయటపడింది. ఆమె మనసు ఒక మంచి మిత్రుడి కోసం చూస్తోంది. ఆ సమయంలో సిగ్గరిగా, స్నేహంగా ఉన్న ధర్మేంద్ర ఆమెకు ఆప్తుడుగా అనిపించాడు. మీనాకుమారి పేరు మీద ఇంకా సినిమాలు ఆడుతున్న రోజులు అవి. అందువల్ల మీనాకుమారి ధర్మేంద్రను చాలా ప్రమోట్ చేసింది. వారిద్దరూ కలిసి చాలా సినిమాల్లో నటించారు. పూర్ణిమ (1965), కాజల్ (1965), ఫూల్ ఔర్ పత్థర్ (1966), చందన్ కా పల్నా (1967), 'బహారోంకి మంజిల్' (1968).... వీటిలో ఫూల్ ఔర్ పత్థర్ సూపర్‌హిట్. ఆ తర్వాత ధర్మేంద్ర ఆగలేదు. అతణ్ణి పెద్ద హీరో చేసిన మీనాకుమారి అతని జ్ఞాపకాల్లో మిగిలిపోయింది.


'ఫూల్ ఔర్ పత్థర్' (1966)లో ...

●●●

ఆశాఫరేఖ్, ధర్మేంద్ర జోడి ప్రేక్షకులకు నచ్చింది. 'ఆయా సావన్ ఝూమ్ కే'... పాట రేడియోలో పెద్ద హిట్. సినిమా కూడా సూపర్‌హిట్. 'ఆయా సావన్ ఝూమ్ కే' సినిమాతో ధర్మేంద్ర కెరీర్ పూర్తిగా సెటిల్ అయ్యింది. ఇతను యాక్షన్, సెంటిమెంట్, రొమాంటిక్ సినిమాలు చేయగలడు అని ఇండస్ట్రీకి తెలిసిపోయింది. హీరోయిన్లు మాలాసిన్హా, సైరాబాను, వహీదా రెహమాన్, షర్మిలా టాగోర్ అందరూ ధర్మేంద్ర పక్కన నటించడానికి పోటీలు పడ్డారు. అయితే అతను నటించడానికి పోటీ పడిన హీరోయిన్ ఆ తర్వాతి రోజుల్లో వచ్చింది. హేమమాలిని!

●●●

ధర్మేంద్రలో ఒక మంచి, సెన్సిబుల్ నటుడు ఉన్నాడు. ఆ సంగతిని హృషికేష్ ముఖర్జీ పసిగట్టాడు. 'అనుపమ' (1966), 'సత్యకామ్' (1968), 'చుప్కే చుప్కే' (1975)... ఇవన్నీ ధర్మేంద్రతో తీశాడు. ధర్మేంద్ర మొత్తం కెరీర్‌లో అత్యుత్తమ నటన ప్రదర్శించిన సినిమాగా 'సత్యకామ్'ను విమర్శకులు గుర్తిస్తారు. అయితే ఆ సినిమా ఫ్లాప్ అయ్యి ఆ తర్వాత కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. 'చుప్కే చుప్కే'లో ధర్మేంద్ర వేసిన 'ప్యారేమోహన్' అనే పాత్రకు కోట్ల మంది అభిమానులు ఉన్నారు. ధర్మేంద్ర కామెడీని ప్రేక్షకులు ఈ సినిమాలో ఎంతో ఎంజాయ్ చేశారు. విశేషం ఏమంటే ఇందులో ధర్మేంద్ర బోటనీ ప్రొఫెసర్. సినిమా రిలీజయ్యాక తండ్రికి చూపించి 'నువ్వు కోరినట్టుగా నేను బోటనీ ప్రొఫెసర్ అయ్యాను చూడు' అనంటే ఆయన ఎప్పటిలానే 'ఏడ్చావులే బడుద్దాయి' అని అని అక్షింతలు వేశాడు.

●●●

ధర్మేంద్ర హీరో. అతను హీరోగా ఉంటే పక్క పాత్ర ఉంటుంది తప్ప వేరెవరో హీరోగా ఉంటే అతను పక్కపాత్ర కాదు. 'షోలే'లో హీరో ధర్మేంద్ర. సినిమాలో ప్రాణాలతో మిగిలేది కూడా అతడే. కాని అమితాబ్ కూడా అసాధ్యుడిగా నటించాడు. ధర్మేంద్రకు రాజకీయాలు చేయడం తెలియదు.


'సత్యకామ్' (1969)లో...

కొత్త తరం వస్తే అసూయ లేదు. ఒడ్డూ పొడవూ ఉన్న అమితాబ్ తనను దాటేస్తాడనే భయం లేకుండా 'జయ్' పాత్రకు అమితాబ్‌ను తీసుకోండని తనే ఒక మాట వేశాడు దర్శకుడికి. 'షోలే' (1975) విడుదలయ్యి మరి కొన్ని రోజుల్లో 4కెలో రీరిలీజ్ అవనుంది. యాభై ఏళ్లుగా షోలే ఖ్యాతి ధర్మేంద్రను భారత ప్రేక్షకులకు చేరువ చేస్తూనే ఉంది. ప్రతి కొత్త తరం ఈ సినిమా చూసి ధర్మేంద్రకు ఫ్యాన్స్ అయ్యారు. 'కుత్తే మై తేరా ఖూన్ పీజావూంగా' డైలాగ్ ధర్మేంద్ర ఒక్కసారి చెప్తే ఆ తర్వాతి తరాలు వందసార్లు చెప్తూనే ఉన్నాయి.

●●●

1980ల తర్వాత ధర్మేంద్ర మల్టీస్టారర్ సినిమాల్లో హీరోగా క్షణం తీరిక లేకుండా గడిపాడు. అదే సమయంలో తన కుమారుడు సన్ని డియోల్‌ను 'బేతాబ్' (1983)లో లాంచ్ చేసి హీరోగా నిలబెట్టాడు. కొడుకుతో ధర్మేంద్ర తీసిన 'ఘాయల్' కూడా సూపర్‌డూపర్ హిట్ అయ్యింది. ఈ కాలంలో హీరోగా ధర్మేంద్ర కొన్ని సినిమాలు చేస్తుంటే హీరోగా సన్నిడియోల్ సినిమాలు చేస్తూ వచ్చాడు. డింపుల్ కపాడియా వంటి హీరోయిన్లు ఇద్దరి సరసనా నటించారు. ఆ తర్వాత చిన్న కొడుకు బాబీ డియోల్‌ను 'బర్సాత్'తో లాంచ్ చేశాడు ధర్మేంద్ర.

●●●

ధర్మేంద్ర ఎప్పుడూ తన పని గురించి తప్ప ఎత్తులు పైఎత్తులు వేస్తూ కూచోలేదు. పంచాయతీలకు దిగలేదు. అనవసరంగా మీడియా ముందుకు రాలేదు. ఇన్నేళ్లలో ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలు కూడా తక్కువ. అవార్డు ఫంక్షన్లకు హాజరవడం, పార్టీలు ఇవన్నీ చాలా పరిమితంగా చేసేవాడు. ధర్మేంద్రకు రైతుగా ఉండడటం ఇష్టం. అందుకే కుమారులిద్దరూ కలిసి లోనావాలా దగ్గర 100 ఎకరాల ఫామ్‌హౌస్ ఏర్పాటు చేశాడు. సినిమాలను పూర్తిగా తగ్గించుకున్నా ఆ ఫామ్‌హౌస్‌లోనే ఎక్కువగా గడిపాడు ధర్మేంద్ర,

'మీ వయసు ఎంత?' అని ధర్మేంద్రను అడిగితే 'అది కెమెరా చెప్తుంది' అనేవాడు.

కెమెరా తన కంటితో ఆయనను ఎప్పుడూ యంగ్‌గా, ఆరోగ్యవంతుడిగా, ధీరుడిగా, హీమాన్‌గానే చూపిస్తూ వచ్చింది.

ప్రేక్షకుల గుండెల్లో ఎప్పటికీ ఆయన ఆ రూపంతోనే మిగిలిపోతాడు. ధర్మేంద్ర నటించిన 'గాడీ బులా రహీహై' పాటలో 'గాడీ' అంటే మృత్యువుకు సంకేతం.

ఇన్నాళ్లకు మబ్బుల సెట్టింగ్, మెరుపుల ఆర్క్ లైట్లు ఉన్న చోటుకు తీసుకెళ్లే గాడీ ఎక్కి తరలిపోయాడు ధర్మేంద్ర.

గాడీ బులా రహీహై... సీటీ బజా రహీహై.

హేమమాలినితో ప్రేమకథ

హిందీ సినిమాల్లో హేమమాలిని రాకను బాంబేలో పెద్ద దుమారంగా మార్చిన వ్యక్తి రాజ్‌కపూర్. హేమమాలిని హిందీలో హీరోయిన్‌గా నటించిన మొదటి సినిమా 'సప్నోంకా సౌదాగర్' (1968)లో రాజ్‌కపూర్ హీరో. ఆ సినిమా పబ్లిసిటీ కోసం 'డ్రీమ్ గర్ల్ హేమమాలిని' అంటూ బాంబే అంతా హోర్డింగ్స్ పెట్టించాడు. అలా ఆమె బాలీవుడ్ హీరోల దృష్టిలో పడింది. ఆ వెంటనే ధర్మేంద్రతో 'తుమ్ హసీ మై జవాన్' (1969)లో నటించింది. ధర్మేంద్ర అప్పటికే వివాహితుడైనా, నలుగురు పిల్లల తండ్రయినా హేమమాలిని ఆకర్షణలో పడ్డాడు.

సౌత్ హీరోయిన్లు హిందీలో ఎప్పుడూ టాప్‌స్టార్స్‌గానే ఉన్నారు. వహీదా రెహమాన్, వైజయంతీమాల, రేఖ... ఇప్పుడు హేమమాలిని. ఆమె స్నేహం కోసం అందరూ ఎదురు చూసిన వారే. వీరిలో మనోజ్ కుమార్, జితేంద్ర, సంజీవ్ కుమార్, ధర్మేంద్ర ఉన్నారు. 'షోలే' (1975) చేసే సమయానికి ధర్మేంద్ర ఆమెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. అందుకే ఆమెకు దగ్గరవడానికి ఆమెతో నటించే సీన్లలో రీటేక్‌ల కోసం లైట్‌బాయ్స్‌ను ఏదో ఒక తప్పు చేయమని తప్పుకు వంద రూపాయలు ఇచ్చేవాడు– ఆ రోజుల్లో. దాంతో హేమమాలినికి ధర్మేంద్ర అవస్థ తెలిసి వచ్చింది.

అయినప్పటికీ ఇంట్లో అనంగీకారం, ధర్మేంద్ర మొదటి పెళ్లి కారణంగా హేమ మనసు ద్వైదీభావంతో ఉండేది. ఆ సమయంలోనే జితేంద్రతో దాదాపుగా ఆమె వివాహం వరకూ వెళ్లడం, మద్రాసుకు అందుకై వాళ్లు చేరుకోగా ధర్మేంద్ర మరో ఫ్లయిట్‌లో అక్కడకు వెళ్లి ఆమెను ఒప్పించి పెళ్లి కేన్సిల్ చేయడం ఆ రోజుల్లో వార్తగా వచ్చింది. చివరకు ధర్మేంద్ర, హేమమాలిని 1980లో వివాహం చేసుకున్నారు. ఇది పెద్ద వార్త. అయితే ధర్మేంద్ర తన కుటుంబాన్ని హేమమాలిని జీవితంలో జోక్యం చేసుకోకుండా, హేమమాలిని తాను అతని కుటుంబంలో జోక్యానికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకున్నారు. అలాగే ధర్మేంద్ర మొదటి భార్య ప్రకాష్ కౌర్ ఎప్పుడూ ఈ విషయమై ఒక్క మాట బయటకు వచ్చి మాట్లాడలేదు. వారి ఇద్దరు కుమార్తెల్లో ఇషా డియోల్ సినిమాల్లో రావడం ధర్మేంద్రకు అంగీకారంగా లేకపోయినా తర్వాత ఆమెతో పాటు కలిసి నటించాడు కూడా. 'నేను నా కుమార్తెను నటించ వద్దు అన్నాను నిజమే. నన్ను నా తండ్రి నటించ వద్దు అన్నాడు కదా. సినిమా రంగంలో కెరీర్ ఎంపిక పై తల్లిదండ్రుల అభిప్రాయం ఉండటం తప్పు కాదు' అంటాడు ధర్మేంద్ర. అయితే ధర్మేంద్ర కుమారులు సన్ని డియోల్, బాబీ డియోల్ తమ సవతి తల్లి కుమార్తెలతో అంత మంచి అనుబంధంలో ఉన్నట్టుగా ఎప్పుడూ కనిపించలేదు. వారు నలుగురూ కలిసిన సందర్భాలు దాదాపుగా లేనట్టే.

నేను వెళ్లే గుడి పేరు 'జిమ్'

ధర్మేంద్ర మద్య పాన ప్రియుడు అనేది జగద్విదితం. సాయంత్రం ఏడు తర్వాత హరిహరాదులు ఏకమైనా ఆయన పెగ్ చేతిలోకి తీసుకోకుండా ఉండడు. రాత్రిళ్లు ఎంతసేపు ఎన్ని పెగ్గులు పుచ్చుకున్నా ఉదయం ఐదు గంటలకంతా జిమ్‌లో ఉండటం ఆయనకు అలవాటు. తుఫాను వచ్చినా కూడా ఈ అలవాటు చివరి వరకూ మానలేదు. 'నేను, నా ఇద్దరు కుమారులు, ఇంటి స్త్రీలు కూడా జిమ్‌కు రోజూ వెళతారు. మా ఇంట్లో ఉండే జిమ్ మాకు గుడితో సమానం' అంటారు ధర్మేంద్ర. ఆయనకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ జాస్తి. లోనావాలాలో ఫామ్‌హౌస్ పెట్టాక అక్కడి నుంచి రోజూ 15 లీటర్ల పాలు రైల్లో ముంబైకి చేరేది ధర్మేంద్ర పరివారం అవసరాలకు. ముంబైలో దొరికే పాలు కల్తీ అవుతాయనే కారణాన.

'గంగాకీ లహరే' (1964)లో సావిత్రితో...

'మై భీ లడకీ హూ' (1964)లో మీనాకుమారితో...

'అప్నే' (2007)లో కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్‌లతో ధర్మేంద్ర

'బహారోంకి మంజిల్' (1968)లో మీనాకుమారితో...

ధర్మేంద్ర టాప్ 10 పాటలు

1. యా దిల్ కి సునో దునియా వాలో
   - అనుపమ
2. ఆప్ కే హసీన్ రుఖ్‌మె ఆజ్ నయా నూర్ హై
   - బహారె ఫిర్ భి ఆయేగీ
3. బహారోంనె మేరా చమన్ లూట్ కర్
   - దేవర్
4. సాథియా నహీ జానా కె జీనా లగే
   - ఆయా సావన్ ఝూమ్ కే

5. ఆజ్ మౌసమ్ బడా బే ఇమాన్ హై
   - లోఫర్
6. పల్ పల్ పల్ దిల్ కే పాస్
   - బ్లాక్ మెయిల్
7. కోయి హసీనా జబ్ రూఠ్ జాతీ హై తో
   - షోలే
8. ఓ మెరి మెహబూబా
   - ధరమ్ వీర్
9. హమ్ బేవఫా హర్‌గిజ్ న థే
   - షాలిమార్
10. జిల్‌మిల్ సితారోంకా ఆంగన్ హోగా
   - జీవన్ మృత్యు

మాఫియాకి ధర్మేంద్ర హడల్

1980లలో ప్రతి చిన్నా చితకా హీరోలకు మాఫియా నుంచి కాల్స్ వచ్చేవి. 'భాయ్ మాట్లాడతాడట' అనంటే అందరూ ఒణికిపోయేవారు. డబ్బులు కొందరు ఇచ్చేవారు. ఇలాగే ఒకసారి ధర్మేంద్రకు కూడా ఫోన్ వచ్చింది. ధర్మేంద్ర ఫోన్ అందుకుని 'మీరు ఎంత మంది ఉంటారు. ఒక పది మంది ఉంటారా? మీకు నేనొక్కణ్ణే చాలు. కాదు కూడదన్నారో ఒక ఫోన్ కొడితే మా పంజాబ్ నుంచి లారీలకు లారీలు కత్తులతో దిగుతారు. రండి చూసుకుందాం' అన్నాడు.

అంతే! మళ్లీ మాఫియా నుంచి ధర్మేంద్రకు ఫోన్ లేదు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
నవంబర్ 24న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,25,310	బంగారం (24 క్యారెట్లు)	1,,26,809	బంగారం (24 క్యారెట్లు)	1,25,130	బంగారం (24 క్యారెట్లు)	1,26,800	బంగారం (24 క్యారెట్లు)	1,24,400	బంగారం (24 క్యారెట్లు)	1,25,670
బంగారం (22 క్యారెట్లు)	1,13,210	బంగారం (22 క్యారెట్లు)	1,14,450	బంగారం (22 క్యారెట్లు)	1,14,700	బంగారం (22 క్యారెట్లు)	1,17,880	బంగారం (22 క్యారెట్లు)	1,14,450	బంగారం (22 క్యారెట్లు)	1,15,200
వెండి	1,58,500	వెండి	1,58,000	వెండి	1,71,000	వెండి	1,58,000	వెండి	1,57,700	వెండి	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కబడ్డీ మహిళల ప్రపంచకప్ విజేత భారత్

ఫైనల్లో చైనీస్ తైపీపై విజయం • రెండోసారి ట్రోఫీ హస్తగతం

ఢాకా: ప్రపంచకప్ మహిళల కబడ్డీ టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ వేదికగా జరిగిన మెగా టోర్నీలో రీతూ నేగి సారథ్యంలోని భారత జట్టు అజేయంగా ట్రోఫీ చేజిక్కించుకొని మట్టి ఆటలో మన ఆధిక్యాన్ని చాటింది. సోమవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు 35–28 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీని చిత్తు చేసింది. మొత్తం 11 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ సెమీఫైనల్లో పటిష్ట ఇరాన్ జట్టును మట్టికరిపించిన మన అమ్మాయిలు... ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించారు. మ్యాచ్ ఆరంభం నుంచే ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిన భారత జట్టు... అటు రైడింగ్, ఇటు ట్యాక్లింగ్‌లో ఆకట్టుకుంది. 2012లో భారత్ వేదికగా జరిగిన తొలి ప్రపంచకప్‌లో ఇరాన్‌పై గెలిచి చాంపియన్‌గా నిలిచిన టీమిండియా... ఇప్పుడు రెండో సారి ట్రోఫీ హస్తగతం చేసుకుంది. టోర్నీ ఆసాంతం రాణించిన భారత జట్టు... ఫైనల్లో చైనీస్ తైపీపై సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. చక్కటి డిఫెన్స్‌తో పాటు... కీలక సమయాల్లో పాయింట్లు సాధిస్తూ పైచేయి కొనసాగించింది. కెప్టెన్ రీతూ నేగి అన్నీ తానై జట్టును నడిపించగా... వైస్ కెప్టెన్ పుష్ప తన రైడింగ్‌తో కట్టిపడేసింది. జట్టుకు అవసరమైనప్పుడల్లా పాయింట్లు సాధించి ట్రోఫీ కైవసం చేసుకోవడంలో ప్రధాన పాత్ర పోషించింది. హెడ్ కోచ్ తేజస్వి ఆధ్వర్యంలో బరిలోకి దిగిన టీమిండియా... చక్కటి సమన్వయం, సమష్టి తత్వంతో కట్టిపడేసింది. తుది పోరు ఆరంభంలో చైనీస్ తైపీ గట్టి ప్రతిఘటన కనబర్చే ప్రయత్నం చేసింది. అయితే పట్టువదలని టీమిండియా మ్యాచ్ 13వ నిమిషంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 18–15తో ముందంజ వేసింది. ఈ దశలో భారత కెప్టెన్ రీతూ నేగి గాయపడటంతో ఉత్కంఠ పెరిగినా... ఎక్కడా ఒత్తిడికి గురికాని టీమిండియా ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ మ్యాచ్‌పై పట్టు సాధించి జగజ్జేతగా నిలిచింది.రీతూ, పుష్పతో పాటు చంపా ఠాకూర్, భావన ఠాకూర్, సాక్షి శర్మ భారత విజయాల్లో కీలకంగా వ్యవహరించారు. వరుసగా రెండోసారి ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత మహిళల జట్టుకు అన్నివైపుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా రాజకీయ, క్రీడా, సినీ రంగ ప్రముఖులు భారత మహిళల విజయాన్ని శ్లాఘించారు.

భారత్, బెల్జియం మ్యాచ్ నేటికి వాయిదా

ఐపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు ఆడాల్సిన రెండో మ్యాచ్ వాయిదా పడింది. తొలి పోరులో దక్షిణ కొరియాపై గెలిచిన టీమిండియా సోమవారం బెల్జియంతో తలపడాల్సి ఉండగా... భారీ వర్షం కారణంగా మ్యాచ్‌ను మంగళవారానికి మార్చారు. మ్యాచ్ ఆరంభమైన మూడో నిమిషంలో భారీ వర్షం ముంచెత్తింది. ఆ తర్వాత ఎంతసేపు వేచి చూసినా వరుణుడు శాంతించకపోవడంతో మ్యాచ్‌ను వాయిదా వేశారు. ఆరేళ్ల తర్వాత ఈ టోర్నీ బరిలోకి దిగిన టీమిండియా... ఆరంభ మ్యాచ్‌లో 1–0 గోల్స్ తేడాతో కొరియాపై నెగ్గింది. మొత్తం ఆరు జట్లు తలపడుతున్న ఈ టోర్నమెంట్‌లో రౌండ్ రాబిన్ పద్ధతిలో ఒక్కో జట్టు మిగిలిన ఐదు టీమ్‌లతో మ్యాచ్‌లు ఆడనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'కోల్‌కతాతో పోలిస్తే ఇక్కడి పిచ్ రోడ్డులా, బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా ఉంది... కాబట్టి మా బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు'... ఆదివారం దక్షిణాఫ్రికాను కట్టడి చేయడంలో విఫలమైన తర్వాత భారత బౌలర్ కుల్దీప్ యాదవ్ చేసిన వ్యాఖ్య ఇది. అదే పిచ్ సోమవారానికి వచ్చే సరికి బౌలింగ్‌కు అనుకూలించింది. ఫలితంగా భారత బ్యాటర్లంతా చేతులెత్తేశారు. రెండో రోజు బ్యాటింగ్‌తో దెబ్బ కొట్టిన మార్కో యాన్సెన్ మూడో రోజు తన బౌలింగ్ పదునుతో ఏకంగా ఆరు వికెట్లు తీసి టీమిండియాను కుప్పకూల్చాడు. అతని 'షార్ట్' బంతులను ఆడలేక బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు చేరడంతో భారత్ భారీ ఆధిక్యం కోల్పోయింది. ఇప్పటికే సఫారీలు పట్టు బిగించగా...ఓటమి వెంటాడుతుండగా ఏడాది వ్యవధిలో స్వదేశంలో రెండో సిరీస్ కోల్పోయే ప్రమాదంలో మన జట్టు నిలిచింది.

పంతును అవుట్ చేసిన యాన్సెన్‌కు సహచరుల అభినందన

యాన్సెన్ జోరు... భారత్ బేజారు

తొలి ఇన్నింగ్స్‌లో 201 ఆలౌట్

- మార్కో యాన్సెన్‌కు 6 వికెట్లు
- దక్షిణాఫ్రికాకు 288 పరుగుల భారీ ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో 26/0
- టీమిండియా చేజారుతున్న రెండో టెస్టు, సిరీస్

గువహటి: దక్షిణాఫ్రికా చేతిలో రెండో టెస్టులోనూ భారత్ ఓటమికి చేరువవుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 288 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా భారత్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి జట్టు 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 26 పరుగులు చేసింది. రికెల్టన్ (13 బ్యాటింగ్), మార్క్‌రమ్ (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇప్పటికే 314 పరుగులు ముందంజలో ఉన్న జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మరిన్ని పరుగులు జోడించి భారత్‌కు సవాల్ విసిరేందుకు సిద్ధమైంది. ఓవర్‌నైట్ స్కోరు 9/0తో సోమవారం ఆట కొనసాగించిన భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 83.5 ఓవర్లలో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (97 బంతుల్లో 58; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, వాషింగ్టన్ సుందర్ (92 బంతుల్లో 48; 2 ఫోర్లు, 1

జైస్వాల్

సిక్స్) రాణించాడు. మార్కో యాన్సెన్ (6/48) చెలరేగిపోగా, హార్మర్‌కు 3 వికెట్లు దక్కాయి.

టపటపా...

ఓపెనర్లు జైస్వాల్, కేఎల్ రాహుల్ (22) తొలి గంటలో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ పరుగులు రాబట్టారు. అయితే మహరాజ్ చక్కటి బంతితో రాహుల్‌ను వెనక్కి పంపడంతో జట్టు తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత 85 బంతుల్లో జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. ఒక దశలో భారత్ 95/1తో మెరుగైన స్థితిలో కనిపించింది. సఫారీల చక్కటి బౌలింగ్‌తో పాటు మన బ్యాటర్ల చెత్త షాట్లు జట్టు పరిస్థితిని ఇబ్బందికరంగా మార్చాయి. 27 పరుగుల వ్యవధిలో టీమ్ 6 వికెట్లు చేజార్చుకుంది. అయితే చక్కటి షాట్లతో దూసుకుపోతున్న జైస్వాల్ ఆటకు యాన్సెన్ క్యాచ్‌తో తెరపడగా, సాయి సుదర్శన్ (15) విఫలమయ్యాడు. ఇలాంటి స్థితిలో యాన్సెన్ బౌలింగ్ జోరు మొదలైంది. వరుసగా జురేల్ (0), పంత్ (7), నితీశ్ రెడ్డి (10), జడేజా (6)లను అతను వెనక్కి పంపించాడు. వీటిలో పంత్ మినహా మిగతా ముగ్గురు బౌన్సర్లకే వెనుదిరిగారు! పంత్ మాత్రం ముందుకు దూసుకొచ్చి భారీ షాట్ ఆడబోయి కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు.

కీలక భాగస్వామ్యం...

122/7 వద్ద భారత ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సేపు పట్టదనిపించింది. అయితే గత మ్యాచ్ తరహాలోనే సుందర్ మరో చక్కటి ఇన్నింగ్స్ ఆడగా, అనూహ్యంగా కుల్దీప్ యాదవ్ (19) కూడా పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి సహకరించాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమని ముందు రోజు చెప్పిన కుల్దీప్ నిజంగానే క్రీజ్‌లో ఎలా నిలబడాలో ఆడి చూపిస్తూ ఇన్నింగ్స్‌లో అందరికంటే ఎక్కువగా 134 బంతులు ఎదుర్కోవడం విశేషం! ఈ జోడీ ఏకంగా 34.4 ఓవర్లు ఆడి ప్రధాన బ్యాటర్లకు పాఠం నేర్పింది. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 72 పరుగులు జత చేయడంతో కాస్త పరువు నిలిచింది. సుందర్‌ను అవుట్ చేసి హార్మర్ ఈ జంటను విడదీయగా... తర్వాతి రెండు వికెట్లు యాన్సెన్ ఖాతాలోనే చేరాయి. 6.82 అడుగుల ఎత్తు ఉన్న యాన్సెన్ షార్ట్ బంతులను సమర్థంగా వాడుకోగా, మన బ్యాటర్లు ఆ వలలో పడ్డారు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 58; రాహుల్ (సి) మార్క్‌రమ్ (బి) మహరాజ్ 22; సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) హార్మర్ 15; జురేల్ (సి) మహరాజ్ (బి) యాన్సెన్ 0; పంత్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 7; జడేజా (సి) మార్క్‌రమ్ (బి) యాన్సెన్ 6; నితీశ్ రెడ్డి (సి) మార్క్‌రమ్ (బి) యాన్సెన్ 10; సుందర్ (సి) మార్క్‌రమ్ (బి) హార్మర్ 48; కుల్దీప్ (సి) మార్క్‌రమ్ (బి) యాన్సెన్ 19; బుమ్రా (సి) వెరీన్ (బి) యాన్సెన్ 5; సిరాజ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (83.5 ఓవర్లలో ఆలౌట్) 201. **వికెట్ల పతనం** : 1–65, 2–95, 3–96, 4–102, 5–105, 6–119, 7–122, 8–194, 9–194, 10–201. **బౌలింగ్:** యాన్సెన్ 19.5–5–48–6, ముల్డర్ 10–5–14–0, మహరాజ్ 15–1–39–1, హార్మర్ 27–6–64–3, మార్క్‌రమ్ 10–1–26–0, ముత్తుసామి 2–0–2–0.

5 తొలి ఇన్నింగ్స్‌లో ఫీల్డర్‌గా ఎయిడెన్ మార్క్‌రమ్ పట్టిన క్యాచ్‌ల సంఖ్య. గతంలో ఈ ఫీట్ నమోదు చేసిన 15 మంది సరసన అతను చేరగా... దక్షిణాఫ్రికా తరఫున గ్రేమ్ స్మిత్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు.

సాక్షి సినిమా

శివరాత్రికి స్వయంభు

నిఖిల్

మహాశివరాత్రికి 'స్వయంభు' థియేటర్స్‌కి రానుంది. నిఖిల్ హీరోగా నటించిన హిస్టారికల్ మూవీ 'స్వయంభు'. ఇందులో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటించారు. 'ఠాగూర్' మధు సమర్పణలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో భువన్, శ్రీకర్ ఈ సినిమాను నిర్మించారు. 170 రోజుల పాటు చిత్రీకరణ జరిపి, షూటింగ్‌ను పూర్తి చేసినట్లుగా పేర్కొని, 'రైజ్ ఆఫ్ స్వయంభు' పేరిట ఓ వీడియో ద్వారా ఈ చిత్రాన్ని శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ''మన భారతదేశ చరిత్రకి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అవి రాజుల కథలో, యుద్ధ గాథలో కాదు. మన సంస్కృతికి పునాదులు. ఆ చరిత్రలో చెప్పని ఒక గొప్ప వీరుడి కథే ఈ 'స్వయంభు'' అంటూ నిఖిల్ పలికిన డైలాగ్స్ వీడియోలో ఉన్నాయి. ''ఈ సినిమా కోసం నిఖిల్ ఫిజికల్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అవ్వడంతో పాటు ట్రైనింగ్ తీసుకున్నారు. హిందీ వెర్షన్‌కూ ఆయన డబ్బింగ్ చెప్పారు'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో పాటు పలు భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఇక నువ్వు సినిమానే ప్రేమించాలన్నారు!

- దర్శకుడు పి. మహేశ్‌బాబు

''ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కథని నవీన్, రవిశంకర్‌గార్లకు చెప్పినప్పుడు ఎగ్జయిట్ అయ్యారు. ఈ కథని రామ్‌గారికి వినిపించమన్నారు. రామ్‌గారికి ఫోన్ చేస్తే... 20 నిమిషాల్లో కథ చెప్పగలవా? అన్నారు. మరుసటి రోజు వెళ్లి ఆయనకు కథ చెప్పడం ప్రారంభించిన పది నిమిషాలకే... సమయం ఎంత అయినా పర్లేదు పూర్తిగా చెప్పమన్నారు. దాదాపు నాలుగు గంటలు కథ వినిపించి, తిరిగొచ్చేశాను. ఆ తర్వాత నిర్మాతలు ఫోన్ చేసి, 'రామ్ మొదటి సిట్టింగ్‌లో ఓకే చేసిన కథ 'ఆంధ్ర కింగ్ తాలూకా' అని చెప్పారు'' అన్నారు దర్శకుడు పి. మహేశ్‌బాబు. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా పి. మహేశ్ బాబు మాట్లాడుతూ– ''మా సినిమా 2002 సమయంలో జరుగుతుంది. అందుకే ముందు 'ఆంధ్ర కింగ్' అనే టైటిల్ పెట్టాను. అయితే ఆ తర్వాత 'ఆంధ్ర కింగ్ తాలూకా' అని మార్చాం. ఈ కథలో ఒక ఫ్యాన్ ఎలా బిహేవ్ చేస్తాడో, ఎంత మాస్‌గా ఉంటాడో అలాంటి పెర్ఫార్మర్ కావాలి. అందుకే ఈ పాత్రకి రామ్‌గారు పర్ఫెక్ట్. ఆంధ్ర కింగ్ సూర్య పాత్రలో ఉపేంద్రగారు అద్భుతంగా నటించారు. మా గురువు కృష్ణవంశీగారికి ఫ్యాన్‌ని. 'నీకు నేనంటే కాదు సినిమా అంటే ఇష్టం. సినిమా పట్ల ఇష్టంతో ఇక్కడికి వచ్చావు. నేను టూల్‌లా ఉపయోగపడ్డా. ఇకపై నువ్వు సినిమానే ప్రేమించాలి.. నన్ను కాదన్నప్పుడు కదిలిపోయాను'' అని చెప్పారు.

పూరీసేతుపతి పూర్తి

• విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్

'పూరీసేతుపతి' సినిమా షూటింగ్ పూర్తయింది. విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పూరీసేతుపతి' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో సంయుక్త, టబు, విజయ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా నిర్మించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. ''త్వరలోనే టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

ఐ బొమ్మ క్లోజ్ కావడం మాకు కలిసొచ్చింది

- నిర్మాతలు-పంపిణీదారులు 'బన్నీ' వాసు, వంశీ నందిపాటి

అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈటీవీ విన్ ప్రొడక్షన్స్‌పై సాయిలు కంపాటి దర్శకత్వంలో డా. నాగేశ్వర రావు పూజారి సమర్పణలో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలైంది. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను విడుదల చేశారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''రాజు వెడ్స్ రాంబాయి' పెద్ద విజయాన్ని సాధిస్తోంది. ఇప్పటిదాకా రూ. 7.28 కోట్ల రూపాయల వసూళ్లు రాగా, కేవలం నైజాం నుంచే రూ. 5 కోట్ల 2లక్షలు వసూలయ్యాయి. ఏపీలో మొదటి రెండు రోజులు వసూళ్లు కాస్త తక్కువగా ఉన్నప్పటికీ మూడో రోజు నుంచి పుంజుకున్నాయి. ఐ–బొమ్మ క్లోజ్ కావడం వల్ల మా సినిమా కలెక్షన్స్ పెరిగాయి. అలాగే టికెట్ ధర రూ. 99 పెట్టడం మాకు ప్లస్ అయ్యింది. ఈ రేటుకు మొదట్లో కొంతమంది ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ ఒప్పుకోలేదు. కానీ ఇప్పుడు 70 శాతం మంది ఈ రేటుకు అంగీకారానికి వచ్చారు'' అని చెప్పారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ– ''రాజు వెడ్స్ రాంబాయి' చూస్తూ అమ్మాయిలు ఎమోషనల్ అవుతున్నారు. మా పెట్టుబడికి నాలుగు రెట్ల లాభాన్నిస్తుందని ఆశిస్తున్నాం. ఐ–బొమ్మలో పైరసీ మూవీస్‌ని ఎక్కువగా బీ, సీ సెంటర్స్ వాళ్లే చూస్తారు. ఇప్పుడా సైట్ క్లోజ్ కావడం వల్ల వాళ్లు థియేటర్స్‌కు రావడం పెరిగింది. టికెట్ రేట్ రూ.99 గా ఫిక్స్ చేసుకోకుంటే సింగిల్ స్క్రీన్స్ క్లోజ్ చేసుకోవాల్సిందే.. పరిస్థితులు అలా మారాయి'' అన్నారు.

సవాల్‌గా తీసుకున్నాం

- ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్

''అఖండ' సినిమాకి మించిన స్పాన్, కాన్వాస్ 'అఖండ 2: తాండవం'లో ఉన్నాయి. ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో తీయాలని బోయపాటిగారు ప్రతి చిన్న విషయంలో వంద శాతం ఎఫర్ట్ పెట్టారు. ప్రేక్షకులకి ఒక గొప్ప చిత్రం ఇవ్వాలనే ఉద్దేశంతో యూనిట్ అంతా సవాల్‌గా తీసుకొని 'అఖండ 2' చేశాం. ప్రేక్షకులు, అభిమానులు ఈ చిత్రంపై వంద శాతం అంచనాలు పెట్టుకుంటే వెయ్యి శాతం ఆ అంచనాలను అందుకునేలా ఉంటుంది'' అని ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ చెప్పారు. బాలకృష్ణ, సంయుక్తా మీనన్ జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి యాక్షన్ సీక్వెన్స్ అందించిన రామ్–లక్ష్మణ్ మాట్లాడుతూ– ''మామూలుగా గన్‌కి ఒక పవర్ ఉంటుంది. ఆ గన్‌కి ఒక త్రిశూలం పవర్, శివుని శక్తి తోడైతే ఎలా ఉంటుందో అనే పాయింట్‌తో యాక్షన్ సీక్వెన్స్ కంపోజ్ చేశాం. ఈ యాక్షన్ సీన్స్ చూస్తున్నప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి. ఈ సినిమా కోసం విబూదిని కొన్ని టన్నులు వాడాం. మా అబ్బాయి పేరు రాహుల్. త్వరలోనే యాక్షన్ డైరెక్టర్‌గా తనని పరిచయం చేస్తున్నాం'' అని పేర్కొన్నారు.

బాలీవుడ్ హీ మ్యాన్ ధర్మేంద్ర మృతికి ప్రముఖుల సంతాపం

బాలీవుడ్ హీ మ్యాన్, మంచి మనసున్న వ్యక్తి ధర్మేంద్ర మృతి చిత్రసీమకు తీరని లోటు అని పలువురు సినీ ప్రముఖులు పేర్కొన్నారు. ధర్మేంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని.... అదే విధంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా తమ సంతాపం వ్యక్తం చేశారు.



- మిత్రమా వీడ్కోలు. నీ సహృదయాన్ని, మన మధ్య జరిగిన సంభాషణలను ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాను. **- రజనీకాంత్**
- నా స్నేహితుడు, లెజెండరీ యాక్టర్ ధర్మేంద్రగారి మృతి నన్నెంతగానో బాధించింది. భారతీయ సినిమా ఒక దయార్ద్ర హృదయుడిని కోల్పోయింది. **- కమల్‌హాసన్**
- ధర్మేంద్రగారు దిగ్గజ నటులు మాత్రమే కాదు... మంచి మనసున్న మానవతావాది. ఆయన్ను కలిసిన ప్రతిసారీ ఆప్యాయంగా పలకరించేవారు. మా మధ్య జరిగిన సంభాషణలను, ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేను. **- చిరంజీవి**
- భారతీయ సినిమా పరిశ్రమలోని అత్యుత్తమ సీనియర్ నటుల్లో ధర్మేంద్రగారు ఒకరు. ఆయన నటన, దయాగుణం స్ఫూర్తిదాయకం. **- మోహన్‌బాబు**
- భారతీయ సినిమా చరిత్రలో ఒక గొప్ప వ్యక్తి, టైమ్‌లెస్ ఐకాన్ అయిన ధర్మేంద్రగారి మరణం నన్ను బాధించింది. ఆయన చరిష్మా, స్క్రీన్ ప్రెజెన్స్ తరాలుగా నటులను, ప్రేక్షకులను ప్రభావితం చేసింది. ఆయన బాలీవుడ్ హీ–మ్యాన్ మాత్రమే కాదు... బంగారు మనసున్న మంచి వ్యక్తి కూడా. **- బాలకృష్ణ**
- ధర్మేంద్రగారు ఒక ఐకాన్ కంటే ఎక్కువ. భారతీయ సినిమాకు కొత్త నిర్వచనం ఇచ్చారు. కోట్లాది మంది హృదయాలను తాకారు. ఆయన సినిమాలు, నటన మనందరి హృదయాల్లో నిలిచే ఉంటాయి. **- వెంకటేశ్**
- హిందీ చిత్ర పరిశ్రమలో తొలి తరం యాక్షన్ హీరోగా ధర్మేంద్రగారు సినీ ప్రియులను ఆకట్టుకున్నారు. అందుకే ఆయన్ని యాక్షన్ కింగ్, హీమ్యాన్ అని పిలుచుకునేవారు. 'షోలే, చుప్కే చుప్కే, ధర్మ్ వీర్, సీతా ఔర్ గీత, యాదోం కి బారాత్' లాంటి చిత్రాల్లో తనదైన శైలి నటనను చూపించారు. **- పవన్ కల్యాణ్**
- సినిమా తనకున్న బలమైన స్వరాల్లో ఒక స్వరాన్ని నేడు కోల్పోయింది. సినిమాల్లో నిజాయితీగా మీరు (ధర్మేంద్ర) పోషించిన పాత్రలు తరాలుగా మాకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. **- మహేశ్‌బాబు**
- సినిమాల్లో ధర్మేంద్రగారు నిర్వచించిన శకాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేము. అలాగే భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవ ఎప్పటికీ మనతోనే ఉంటుంది. **- ఎన్టీఆర్**
- కోట్లాది హృదయాలను తాకిన లెజెండ్ ధర్మేంద్రగారు. **- అల్లు అర్జున్**
- పీపుల్స్ హీరో ధర్మేంద్రగారు ఇక లేరని తెలిసి నా హృదయం ముక్కలైంది. నిజం చెప్పాలంటే ఆయన భారతరత్న. ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. సినిమాకు అందించిన సేవలతో, ఆయన గుర్తుండిపోతారు. **- శత్రుఘ్న సిన్హా**
- ధర్మేంద్రగారు హీరో, ఫాదర్, పంజాబీ ఓజీ. ఎంతటి భావోద్వేగంతో ఉంటారో, అంతే చిలిపితనంగా ఉంటారు. మంచి మనసున్నవారు. **- అనిల్ కపూర్**
- ధర్మేంద్రగారు అత్యంత దయగల వ్యక్తి. ఒక వ్యక్తి నటన కంటే, అతని స్వభావం గురించి ఎక్కువగా మాట్లాడుకున్నప్పుడు, ఆయన ఓ జానపద కథలా మిగిలిపోతాడు. **- అనుపమ్ ఖేర్**
- ప్రతి యువకుడు తాను ఎదిగే క్రమంలో ధర్మేంద్రలా హీరో కావాలనే అనుకుంటాడు. ధర్మేంద్రగారు ఇండస్ట్రీ ఒరిజినల్ హీ–మ్యాన్. తరాలకు స్ఫూర్తినిచ్చారు. **- అక్షయ్ కుమార్**

స్టాక్ మార్కెట్లు (రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
331	109
84,901	25,960

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,777	▲	507
డోజోన్స్	46,497	▲	252
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,551	▲	12
డాక్స్	23,240	▲	148
షాంఘై	3,836	▲	2
నికాయ్	48,625	▽	1198

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	88.75	89.77
£	బ్రిటన్ పౌండ్	115.50	118.40
€	యూరో	101.40	104.21
¥	జపాన్ యెన్ (100)	56.31	57.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.21	58.16
S$	సింగపూర్ డాలర్	66.08	68.87
SAR	సౌదీ రియాల్	22.91	23.84
UAE D	యూఏఈ దిర్హామ్	23.40	24.39
¥	చైనా యువాన్	11.68	12.91

రూ. 700 నష్టపోయిన బంగారం

రూ.1,000 తగ్గిన వెండి

న్యూఢిల్లీ: రూపాయి కొంత బలపడడం, బలహీన అంతర్జాతీయ ధోరణుల మధ్య దేశీ మార్కెట్లో బంగారం ధరలు స్వల్ప నష్టాన్ని చూసింది. ఢిల్లీ మార్కెట్లో సోమవారం 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.700 నష్టపోయి రూ.1,25,400కు దిగొచ్చింది. వెండి కిలో రూ.1,000 నష్టపోయి రూ.1,55,000కు పరిమితమైంది. డాలర్‌తో రూపాయి 50 పైసలు బలపడడం బులియన్ మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. రూపాయిలో ఆటుపోట్లతో అంతర్జాతీయ బెంచ్‌మార్క్‌ల కంటే బంగారం కొంత అధిక అస్థిరతను చూసినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. విదేశీ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 4,060 డాలర్లకు దిగొచ్చినట్టు కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అనలిస్ట్ కేనత్ చైన్‌వాలా పేర్కొన్నారు. ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై అంచనాలే తదుపరి పసిడి, వెండి ధరలను పైకి నడిపించగలవని అభిప్రాయపడ్డారు.

రూపాయి 50 పైసలు అప్

89.16 వద్ద ముగింపు

ముంబై: డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ బౌన్స్‌బ్యాక్ సాధించింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 50 పైసలు బలపడి 89.16 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు తగ్గడం, ఆర్‌బీఐసహా దిగుమతిదారులు, బ్యాంకులు డాలర్లను విక్రయించడం ఇందుకు సహకరించింది. సోమవారం ట్రేడింగ్‌లో రూపాయి తొలుత 89.46 వద్ద హుషారుగా ప్రారంభమైంది. తదుపరి 89.05–89.50 మధ్య ఊగిసలాడింది. చివరికి 50 పైసలు పుంజుకుని 89.16 వద్ద నిలిచింది. తాజాగా ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 100.62 వద్దకు చేరింది. కాగా.. వారాంతాన రూపాయి గత మూడేళ్లలోలేని విధంగా 98 పైసలు పతనమైన సంగతి తెలిసిందే. వెరసి చరిత్రాత్మక కనిష్టం 89.66 వద్ద నిలిచింది.

85,000–26,000 దిగువకు

సెన్సెక్స్ 331 పాయింట్లు డౌన్

- నిఫ్టీ 109 పాయింట్ల క్షీణత
- చివర్లో వెల్లువెత్తిన అమ్మకాలు
- ఐటీ మినహా అన్ని రంగాలూ డీలా

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లు చివర్లో ఉన్నట్టుండి ఊపందుకున్న అమ్మకాలతో మరోసారి డీలా పడ్డాయి. దీంతో ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 85,000, 26,000 పాయింట్ల దిగువన ముగిశాయి. సెన్సెక్స్ 331 పాయింట్లు క్షీణించి 84,901 వద్ద నిలిచింది. నిఫ్టీ 109 పాయింట్లు కోల్పోయి 25,960 వద్ద స్థిరపడింది. అయితే తొలుత ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో హుషారుగా ప్రారంభమైన మార్కెట్లు మిడ్‌సెషన్ వరకూ సానుకూలంగా కదిలాయి. తొలి సెషన్‌లో సెన్సెక్స్ 377 పాయింట్లు ఎగసి 85,609 పాయింట్లను అధిగమించింది. చివరి గంటలో కొనుగోళ్ల స్థానే అమ్మకాలు పెరగడంతో 522 పాయింట్లవరకూ పతనమైంది. 84,710 వద్ద కనిష్టాన్ని చవిచూసింది. నిఫ్టీ సైతం తొలుత 75 పాయింట్లు పుంజుకుని 26,143కు చేరింది. తదుపరి చివర్లో 25,912వరకూ క్షీణించింది. గత వారాంతాన సైతం భారీ అమ్మకాలతో దేశీ మార్కెట్లు డీలా పడిన సంగతి తెలిసిందే. యూఎస్‌తో వాణిజ్య చర్చలపై అనిశ్చితి, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమైనట్లు నిపుణులు పేర్కొన్నారు.

ఐటీ ఓకే

ఎన్‌ఎస్‌ఈలో ఐటీ 0.4 శాతం బలపడింది. మిగిలిన అన్ని రంగాలూ డీలా పడ్డాయి. రియల్టీ, మెటల్, కన్జూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్ 2–1 శాతం మధ్య నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలో బీఈఎల్, జేఎస్‌డబ్ల్యూ, మ్యాక్స్ హెల్త్, గ్రాసిమ్, ఎంఅండ్‌ఎం, డాక్టర్ రెడ్డీస్, టాటా స్టీల్, అల్ట్రాటెక్, సీఐఎల్, టీఎంపీవీ, జియో 3–1 శాతం మధ్య నష్టపోగా.. ఎస్‌బీఐ లైఫ్, టెక్‌ఎం, ఐషర్, బజాజ్ ఆటో, విప్రో 2.6–1.2 శాతం మధ్య లాభపడ్డాయి. ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా ఉన్నప్పటికీ దేశీ అంశాలు సెంటిమెంటును దెబ్బ తీస్తున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

ఎఫ్‌పీఐల అమ్మకాలు

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు 0.3–0.8 శాతం చొప్పున క్షీణించాయి. ట్రేడైన షేర్లలో 3,035 నష్టపోగా.. 1,208 మాత్రమే లాభపడ్డాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా రూ. 4,172 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా.. దేశీ ఫండ్స్ రూ. 4,513 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి. వారాంతాన ఎఫ్‌పీఐలు రూ. 1,766 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 3,162 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

ఇతర విశేషాలు

→ గత వారాంతాన దుబాయ్ ఎయిర్ షోలో తేజాస్ విమానం క్రాష్ కావడంతో హిందుస్తాన్ ఏరోనాటిక్స్(హెచ్‌ఏఎల్) కౌంటర్లో అమ్మకాలు తలెత్తాయి. తొలుత బీఎస్‌ఈలో 8.5 శాతం పతనమై కనిష్టంగా రూ. 4,205ను తాకింది. అయితే తదుపరి అమ్మకాలు తగ్గడంతో భారీ నష్టాల నుంచి కోలుకుంది. చివరికి 3.3 శాతం నష్టంతో రూ. 4,443 వద్ద ముగిసింది.

→ గిగ్ వర్కర్లకు లబ్ధి చేకూర్చే కొత్త కార్మిక చట్టాల నేపథ్యంలో ఫుడ్, గ్రోసరీస్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ కౌంటర్ జోరందుకుంది. చివర్లో కొనుగోళ్లు పెరగడంతో బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసింది. రూ. 405 వద్ద స్థిరపడింది. అయితే ఇంట్రాడేలో రూ. 410–378 మధ్య ఊగిసలాడింది. అయితే ఎటర్నల్(జొమాటో) 0.4 శాతం క్షీణించి రూ. 301 వద్ద ముగిసింది.

జీడీపీ వృద్ధి 6.5 శాతం

- 2025–26పై ఎస్అండ్‌పీ అంచనా
- బలమైన వినియోగం వృద్ధికి ఊతం

న్యూఢిల్లీ: భారత్ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) 6.5 శాతం వృద్ధిని సాధిస్తుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2026–27) వృద్ధి రేటు 6.7 శాతం పుంజుకుంటుందని తెలిపింది. ఆదాయపన్ను తగ్గింపులు, వడ్డీ రేట్ల తగ్గింపుతో వినియోగానికి ఊతమిస్తుందని, దీంతో వృద్ధి రేటు బలపడుతుందని వివరించింది. అమెరికా టారిఫ్‌ల ప్రభావం నెలకొన్నప్పటికీ.. బలమైన వినియోగంతో దేశీ వృద్ధి పటిష్టంగా ఉన్నట్టు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి 6.8 శాతంగా ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. సెప్టెంబర్ త్రైమాసికం జీడీపీ గణాంకాలు ఈ నెల 28న విడుదల కానున్నాయి.

అమెరికాతో ఒప్పందం

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం చేసుకుంటే అది అనిశ్చితులు తగ్గేందుకు, విశ్వాసం పెరుగుదలకు దారితీస్తుందని ఎస్అండ్‌పీ తెలిపింది. ఇది కార్మికుల ఆధారిత రంగాలకు ప్రయోజనం కలిగిస్తుందని తెలిపింది. ''జీఎస్‌టీ రేట్లు తగ్గించడం మధ్యతరగతి వినియోగానికి మద్దతునిస్తుంది. దీనికి ఆదాయపన్ను తగ్గింపు, వడ్డీ రేట్ల తగ్గింపు కూడా తోడవుతుంది. ఈ మార్పులతో పెట్టుబడుల కంటే వినియోగం వృద్ధిని బలంగా నడిపిస్తుంది''అని పేర్కొంది. గత బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు (కొత్త పన్ను విధానం కింద) కల్పించడం తెలిసిందే. ఇక ఆర్‌బీఐ వరుస వడ్డీ రేట్ల తగ్గింపుతో రెపో రేటు మూడేళ్ల కనిష్ట స్థాయి 5.5 శాతానికి దిగిరావడం గమనార్హం. అలాగే, సెప్టెంబర్ 22 నుంచి 375 వస్తువులపై జీఎస్‌టీ తగ్గడం తెలిసిందే. భారత ఎగుమతుల విస్తరణపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఉందంటూ.. అంతిమంగా భారత ఉత్పత్తులపై టారిఫ్‌లను అమెరికా తగ్గించే అవకాశాలున్నట్టు అభిప్రాయపడింది.

గేమింగ్ సంస్థల డిపాజిట్లు ఫ్రీజ్

రూ. 523 కోట్ల మొత్తాన్ని స్తంభింపచేసిన ఈడీ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు చెందిన రూ. 523 కోట్లను ఫ్రీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వెల్లడించింది. ఇటీవల రియల్ మనీ గేమింగ్‌ని నిషేధించిన తర్వాత ఆ మొత్తాన్ని ప్లేయర్లకు రిఫండ్ చేయాల్సి ఉన్నప్పటికీ ఆయా కంపెనీలు తమ దగ్గరే అట్టే పెట్టుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. విన్‌జో, గేమ్స్‌క్రాఫ్ట్ తదితర గేమింగ్ కంపెనీల డిపాజిట్లు వీటిలో ఉన్నాయి. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా నవంబర్ 18–22 మధ్య ఢిల్లీ, బెంగళూరు, గురుగ్రామ్‌లోని నిర్దేశ నెట్‌వర్క్స్ (ఎన్‌ఎన్‌పీఎల్), గేమ్స్‌క్రాఫ్ట్ టెక్నాలజీస్ (జీటీపీఎల్), విన్‌జో గేమ్స్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. రియల్ మనీ గేమ్స్‌లో (ఆర్‌ఎంజీ) మనుషులతో కాకుండా సాఫ్ట్‌వేర్‌తో ఆడుతున్న విషయాన్ని కస్టమర్లకు తెలియనివ్వకుండా విన్‌జో అనైతిక వ్యాపార విధానాలు అమలు చేసిందని, క్రిమినల్ కార్యకలాపాలు నిర్వహించిందని ఈడీ ఆరోపించింది. గేమర్లకు రిఫండ్ చేయాల్సిన మొత్తాన్ని తమ ఖాతాల్లో అట్టే పెట్టుకుందని పేర్కొంది. గేమ్స్‌క్రాఫ్ట్‌పై కూడా ఇదే తరహా ఆరోపణలున్నట్లు వివరించింది.

నంబర్ బ్లాక్ చేస్తే సరిపోదు

- డీఎన్‌డీ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తేనే ఫలితం
- స్పామ్ కాల్స్, మెసేజీలపై ట్రాయ్ సూచన

న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్‌ని ఆపేందుకు ఫోన్ నంబర్లను బ్లాక్ చేయడంతో సరిపెట్టొద్దని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ డీఎన్‌డీ (డు నాట్ డిస్టర్బ్) యాప్ ద్వారా ఆ నంబర్ల గురించి ఫిర్యాదు చేయాలని సూచించింది. డీఎన్‌డీ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా స్పామ్, మోసపూరిత మెసేజీలతో సంబంధమున్న సుమారు లక్ష ఎంటిటీలను (సంస్థలు, వ్యక్తులు), 21 లక్షలకు పైగా మొబైల్ నంబర్లను డిస్కనెక్ట్, బ్లాక్‌లిస్ట్ చేశామని పేర్కొంది. యూజర్లు ఏదైనా స్పామ్ కాల్ లేదా ఎస్‌ఎంఎస్ గురించి యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వాటిని ట్రేస్ చేసేందుకు, నిర్ధారించుకునేందుకు, శాశ్వతంగా మొబైల్ నంబర్లను డిస్కనెక్ట్ చేసేందుకు ట్రాయ్ అలాగే టెలికం సర్వీస్ ప్రొవైడర్లకి వీలవుతుందని తెలిపింది. అలా కాకుండా వ్యక్తిగతంగా బ్లాక్ చేయడమనేది ఆ డివైజ్‌కి మాత్రమే పరిమితమవుతుందని, స్కామర్లు ఇతరులను కాంటాక్ట్ చేసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో యూజర్లంతా కలిసికట్టుగా ఫిర్యాదులు చేస్తే, దేశవ్యాప్తంగా టెలికం సేవల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని వివరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

లిస్టింగ్‌కు 3 కంపెనీలు రెడీ తాజాగా సెబీ ఆమోదముద్ర	ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎంలో 18% వృద్ధి

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 362 పోస్టులు

ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 362.
» **బ్యూరోల వారీగా ఖాళీలు:** హైదరాబాద్–06, విజయవాడ–03, అగర్తలా–06, అహ్మదాబాద్–04, ఐజ్వాల్–11, అమృత్‌సర్–07, బెంగళూరు–04, భోపాల్–11, భువనేశ్వర్–07, చండీఘర్–07, చెన్నై–10, డెహ్రాడూన్–08, ఢిల్లీ–108, గ్యాంగ్‌టక్–08, గువాహటి–10, ఈటానగర్–25, జమ్మూ–07, కాళింపంగ్–03, కోహిమా–06, కోల్‌కతా–01, లేహ్–01, లక్నో–12, మీరట్–02, ముంబై–22, నాగ్‌పూర్–02, పనాజి–02, పాట్నా–06, రాయ్‌పూర్–04, రాంచీ–02, షిల్లాంగ్–07, సిమ్లా–05, సిలిగురి–06, శ్రీనగర్–14, త్రివేండ్రం–13, వారణాసి–03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 14.12.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.18,000 నుంచి 56,900.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్స్(టైర్–1, 2) పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.11.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.12.2025
» **వెబ్‌సైట్:** https://www.mha.gov.in

ఐఎండీ, న్యూఢిల్లీలో 134 పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా మెటియోరాలజికల్ డిపార్ట్‌మెంట్ మిషన్ మౌసమ్ పథకం కింద ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్, సైంటిఫిక్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 134.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్‌ఈ–01, ప్రాజెక్ట్ సైంటిస్ట్3–13, ప్రాజెక్ట్ సైంటిస్ట్2–29, ప్రాజెక్ట్ సైంటిస్ట్1–64, సైంటిఫిక్ అసిస్టెంట్–25, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఎంఎస్సీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. పీహెచ్‌డీ/ఎంటెక్/ఎంఈ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
» **వయసు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్–ఈకు 50 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్–3కు 45 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్–2కు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్–1కు 35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్ /అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల స్క్రీనింగ్, విద్యార్హతలు, పని అనుభవం, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.11.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.12.2025
» **వెబ్‌సైట్:** https://internal.imd.gov.in

కేబినెట్ సెక్రటేరియట్‌లో 250 డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని కేబినెట్ సెక్రటేరియట్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గ్రూప్–బి(నాన్ గెజిటెడ్) డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్(టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250.
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–124, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–10, ఎలక్ట్రానిక్స్ అండ్/ లేదా కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్–95, సివిల్ ఇంజనీరింగ్–02, మెకానికల్ ఇంజనీరింగ్–02, ఫిజిక్స్–06, కెమిస్ట్రీ–04, మ్యాథ్‌మేటిక్స్–02, స్టాటిస్టిక్స్–02, జియాలజీ–03.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా ఏదైనా సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. గేట్ 2023, 2024 లేదా 2025 వ్యాలిడ్ గేట్ స్కోర్ తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.99,000.
» **ఎంపిక విధానం:** గేట్ స్కోర్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును లోధి రోడ్, హెడ్ పోస్ట్ ఆఫీస్, న్యూఢిల్లీ–110003 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.12.2025.
» **వెబ్‌సైట్:** https://cabsec.gov.in

వ్యక్తిత్వ పరీక్ష.. విజేతగా నిలిచేలా

- » సివిల్స్–2025 మెయిన్స్ ఫలితాలు వెల్లడి
- » 2026 జనవరిలో పర్సనాలిటీ టెస్ట్!
- » మొత్తం 979 పోస్ట్‌లకు 2,736 మంది ఇంటర్వ్యూకు ఎంపిక
- » భావ వ్యక్తీకరణ, విశ్లేషణ నైపుణ్యాలపై పట్టుతో విజయం

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2025.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి 23 కేంద్ర సర్వీసులకు చేపట్టే ఎంపిక ప్రక్రియ. మూడంచెల నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన రెండో దశ మెయిన్స్ పరీక్షల ఫలితాలు ఇటీవల వెల్లడయ్యాయి. మొత్తం 979 పోస్ట్‌లకు గాను 2,736 మందిని మెయిన్స్ నుంచి ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. దీంతో.. వీరంతా చివరి దశ పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)లో సత్తాచాటి.. తమ కలల కొలువు సొంతం చేసుకునే దిశగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. సివిల్స్–2025 మెయిన్స్‌లో రాణించిన అభ్యర్థులు.. చివరి దశ పర్సనాలిటీ టెస్ట్‌లో ప్రతిభ చూపేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2025కు సంబంధించి చివరి దశ పర్సనాలిటీ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపికైన వారు తెలుగు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నుంచి 100 నుంచి 120 మంది వరకు ఉంటారని అంచనా. 2026 జనవరి/ఫిబ్రవరి నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశముంది.

ఇంటర్వ్యూ మార్కులు కీలకం

మొత్తం 2025 మార్కులకు నిర్వహించే మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 275. ఈ మార్కులే తుది జాబితాలో నిలిపేందుకు కీలకంగా మారుతున్నాయి. ఇంటర్వ్యూ.. తాజా పరిణామాలపై అభ్యర్థి అవగాహనను, వ్యక్తిత్వ లక్షణాలను పరిశీలించే విధంగా జరుగుతుంది. కాబట్టి ఏ మాత్రం తడబాటుకు గురైనా.. కొద్ది మార్కుల తేడాతో విజయం చేజారే ఆస్కారం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే ఇంటర్వ్యూలో విజయానికి కృషి చేయాలి.

వ్యక్తిగత నేపథ్యం

ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు వ్యక్తిగత అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. తమ అకడమిక్ నేపథ్యం, ఉద్యోగం చేస్తున్నట్లయితే ప్రొఫెషన్, కుటుంబం తదితర అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. మెయిన్స్ ఎగ్జామ్ ముందు అందించిన డీఏఎఫ్–1, ఇంటర్వ్యూకు ముందు ఇవ్వాల్సిన డీఏఎఫ్–2లలో పొందుపరిచిన వివరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

మీ గురించి

సివిల్స్ ఇంటర్వ్యూలో సాధారణంగా.. 'మీ గురించి చెప్పండి' అనే ప్రశ్నతో ప్రారంభిస్తారు. ఆ తర్వాత క్రమంగా డీఏఎఫ్‌లో పేర్కొన్న అంశాలు, సర్వీస్ ప్రాథమ్యతలు, సమకాలీన అంశాల వైపు ఇంటర్వ్యూ కొనసాగుతుంది. మీరు సివిల్ సర్వీసెస్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణం? ఐఏఎస్సే ఎందుకు? వంటి ప్రశ్నలు ఎదురయ్యే అవకాశముంది. వీటికి ఎక్కువ మంది సామాజిక సేవ లక్ష్యం అనే సమాధానం చెబుతారు. కాని ఈ సమాధానం చెప్పే విధానం మెప్పించేలా, ఒప్పించేలా ఉండాలి. ముఖ్యంగా టెక్నికల్ గ్రాడ్యుయేట్స్, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్స్ 'సోషల్ సర్వీస్ లక్ష్యంగా సివిల్స్ ఎంపిక' అనే సమాధానం చెప్పే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఇంటర్వ్యూ రోజు వరకు

ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు తమ ఇంటర్వ్యూ తేదీ వరకు జరిగిన సమకాలీన అంశాలపై పట్టు సాధించాలి. తొలుత వ్యక్తిగత నేపథ్యం, ఆసక్తులకు సంబంధించి మొదలయ్యే ఇంటర్వ్యూ క్రమేణా.. సమకాలీన అంశాలవైపు మళ్లుతుంది. ఉదాహరణకు 'ఈ రోజు పేపర్‌లోని ముఖ్య వార్తలు ఏంటి? మిమ్మల్ని బాగా ఆకట్టుకున్న వార్త ఏంటి? అందుకు కారణం.. ఆ వార్త ప్రాధాన్యం తదితర ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు ఇంటర్వ్యూ రోజున కూడా కనీసం రెండు ప్రామాణిక దినపత్రికలు చదవాలి. వాటిలో ముఖ్యమైన అంశాలకు సంబంధించిన వివరాలు గ్రహించాలి.

కరెంట్ అఫైర్స్

సివిల్స్ ఇంటర్వ్యూకు సన్నద్ధతలో సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, గాజా సంక్షోభం, సుడాన్ సమస్య, ఉక్రెయిన్–రష్యా యుద్ధం పరోక్షంగా ఆర్థిక మాంద్యానికి కారణమవుతోందా.. మన దేశ విదేశాంగ విధానం? పొరుగు దేశాలతో సంబంధాలపై స్పష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారుతున్న ఏఐ, డిజిటల్ ఎకానమీ, సైబర్ నేరాలు–డిజిటల్ అరెస్టులు, ఉగ్రవాదం–ఢిల్లీ పేలుడు, మావోయిస్టు ఎన్‌కౌంటర్లు, ఎస్ఐఆర్, రష్యా చమురు, తగ్గుతున్న రూపాయి విలువ, పెరుగుతున్న బంగారం ధరలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

భౌగోళిక నేపథ్యం

సివిల్స్ ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తమ భౌగోళిక నేపథ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అంటే తమ సొంత రాష్ట్రం, జిల్లా, ప్రాంతానికి చెందిన సామాజిక, చారిత్రక నేపథ్యంపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్న సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలతో సిద్ధంగా ఉండాలి.

హాబీస్ అప్రమత్తంగా

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు.. తాము అప్లికేషన్‌లో పేర్కొన్న హాబీల గురించి ఇప్పటి నుంచే ప్రత్యేక కసరత్తు ప్రారంభించాలి. చాలామంది బుక్ రీడింగ్, వాచింగ్ టీవీ, సింగింగ్, ప్లేయింగ్, మూవీస్ వంటి వాటిని పేర్కొంటారు. ఇంటర్వ్యూ సమయంలో వీటిపైనా ప్రశ్నలు అడుగుతారనే విషయాన్ని గమనించాలి. బుక్ రీడింగ్ హాబీకి సంబంధించి నిర్దిష్టంగా ఒక రచయిత పేరును పేర్కొన్న అభ్యర్థులు మరింత శ్రద్ధగా వ్యవహరించాలి. సదరు రచయిత ప్రచురణల్లో ముఖ్యమైనవి, వాటిలో పేర్కొన్న ముఖ్యమైన కొటేషన్లు, వాటి అర్థాలు, సదరు రచన సారాంశం లేదా ఉద్దేశం వంటి వాటిని తెలుసుకోవాలి. కారణం.. బోర్డ్ సభ్యులు.. సదరు రచయిత రాసిన ఫలానా పుస్తకం చదివారా? అందులో మీకు బాగా నచ్చిన అంశం ఏంటి? లేదా అందులో వివాదాస్పదమైన అంశం ఏంటి? వంటి ప్రశ్నలు అడిగే అవకాశముంది.

బలాలు, బలహీనతలు

సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వ్యక్తిగత బలాలు, బలహీనతల విషయంలోనూ జాగ్రత్తగా అడుగులు వేయాలి. సివిల్ సర్వీస్ ఆఫీసర్ ఒక విభాగానికి, లేదా ఒక ప్రాంతానికి పూర్తి స్థాయి అధికార పర్యవేక్షణ చేయాల్సిన హోదా. ఈ నేపథ్యంలో వ్యక్తిగత లక్షణాలు కూడా కీలకంగా నిలుస్తాయి. అందుకే అభ్యర్థుల వ్యక్తిగత బలాలు, బలహీనతలకు సంబంధించిన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అభ్యర్థులు తమ బలహీనతల గురించి చెప్పేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. 'అగ్రెసివ్‌నెస్', 'సహనం తక్కువ' వంటి సమాధానాలు చెప్పడానికి దూరంగా ఉండాలి.

సూటిగా, స్పష్టంగా

ఇంటర్వ్యూలో అభ్యర్థులు తమ అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా, సంక్షిప్తంగా చెప్పగలిగే సామర్థ్యం అలవర్చుకోవాలి. సమాధానాలు సహజంగా ఉండాలి. అంతేకాని నేర్చుకొని వచ్చి వల్లేవేస్తున్నట్లు ఉండకూడదు. సానుకూల లేదా ప్రతికూల అభిప్రాయం ఏదైనా సరే తమ అభిప్రాయాన్ని ఎదుటి వారిని మెప్పించే రీతిలో చెప్పాలి. సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్ కొన్నిసార్లు చర్చ రూపం కూడా సంతరించుకోవచ్చు. పర్సనల్ ఇంటర్వ్యూ అంటే కేవలం ప్రశ్న, సమాధానం అనే కోణంలోనే కాకుండా.. ఒక చర్చా వేదికగానూ భావించి ముందడుగు వేయాలి. 20 నుంచి 25 నిమిషాల వ్యవధిలో నిర్వహించే ఇంటర్వ్యూ చిన్నపాటి చర్చ మాదిరిగా కొనసాగుతోంది. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల గురించి కూలంకషంగా తెలుసుకోవడం ఎంతో అవసరం.

ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ పెంచుకోవడానికి కృషి చేయాలి. గత కొన్నేళ్లుగా ఇంటర్వ్యూల శైలిని పరిగణనలోకి తీసుకుంటే బోర్డ్ సభ్యులు.. అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్, స్పాంటేనిటీ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు.. 'మీరు ఒక ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ఆ ప్రాంతంలో ఒక సమస్య ఎదురైంది? దీనికి తక్షణ పరిష్కారంగా మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?' వంటివి. ఇలాంటి వాటికి సమాధానం చెప్పాలంటే.. సమయస్ఫూర్తి, సమస్య పరిష్కార నైపుణ్యం ఎంతో అవసరం. ప్రభుత్వ విధానాలను గౌరవిస్తూనే వాటికి అనుగుణంగా పరిష్కార చర్యలు చేపడతామనే విధంగా సమాధానాలు చెప్పాలి.

బాడీ లాంగ్వేజ్

ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో అభ్యర్థులు వ్యక్తిగత ఆహార్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. హుందాగా ఉండేలా వ్యవహరించాలి. పురుష అభ్యర్థులు లైట్ కలర్ షర్ట్స్ ధరించడం హుందాగా ఉంటుంది. అదే విధంగా మహిళా అభ్యర్థులు శారీ, లేదా సల్వార్ కమీజ్‌లను ధరించి ఇంటర్వ్యూకు హాజరవడం సదభిప్రాయం కలిగేలా చేస్తుంది. ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలిచ్చేటప్పుడు బాడీలాంగ్వేజ్ కూడా ఎంతో ముఖ్యం. హావ భావాలను నియంత్రించుకోవాలి. ఇవి తటస్థంగా ఉండాలి. మాట ప్రశాంతంగా ఉండాలి. భావోద్వేగాలు లేకుండా చూసుకోవాలి. వాదనలో గెలుపొందాలనే తపన సరికాదు. ఇతరుల వాదనను గౌరవించడం ముఖ్యం. రాజ్యాంగానికి అనుగుణంగా మాట్లాడాలి. నాయకత్వ లక్షణాలు ప్రదర్శించేలా తల నిటారుగా ఉండాలి. కాళ్లు, చేతుల కదలికలు కనీస స్థాయిలో ఉండేలా చూసుకోవాలి. బోర్డు సభ్యులందరి వైపు చూస్తూ మాట్లాడాలి.

ప్రాక్టికల్ అప్రోచ్

సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్‌లో ప్రధానంగా అభ్యర్థుల్లోని ప్రాక్టికల్ అప్రోచ్‌ను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా పరిపాలన దక్షతను కూడా పరీక్షిస్తారు. నిర్దిష్టంగా ఒక సమస్య పట్ల స్పందించే తీరు, నిర్ణయాలు తీసుకునే విధానం వంటి వాటిని పరిశీలిస్తారు. కాబట్టి ఈ నైపుణ్యాలు పెంచుకోవాలి. ఏ అంశానికైనా సమాధానం ఇచ్చేటప్పుడు వాస్తవిక దృక్పథంతో మాట్లాడాలి. లాజిక్ ఉండాలి. అతి ఆదర్శవాదం సరికాదు. వ్యవస్థ పట్ల కోపం ప్రదర్శించకుండా చూసుకోవాలి. దీంతో పాటు సమాధానాల్లో సహానుభూతి ఉండాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: సోషియాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

ఓపెన్ టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు షెడ్యూల్ విడుదలైంది. డిసెంబర్ 1 నుంచి 10 వరకు ఆలస్య రుసుం లేకుండా ఫీజులు చెల్లించవచ్చని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. రూ.25 ఆలస్య రుసుంతో 12వ తేదీ వరకు, రూ.50 ఆలస్య రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పదో తరగతికి సంబంధించి సబ్జెక్టుకు రూ.100 చొప్పున, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.150 చొప్పున, ప్రాక్టికల్స్ కోసం సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in లేదా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

కడప బీసీ సంక్షేమ అధికారులపై చర్య తీసుకోవాలి

డైరెక్టరేట్ వద్ద ఆర్ఎస్‌యూ ధర్నా

సాక్షి, అమరావతి: బీసీ సంక్షేమ శాఖలో అవినీతి పెచ్చుమీరిందని, అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని రివల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ విషయమై విజయవాడలోని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ కడప జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారుల అవినీతిపై ఇప్పటికైనా డైరెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

30 నుంచి మూడు రోజుల పాటు వర్షాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 30 నుంచి మూడు రోజులపాటు పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశంతో పాటు ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సంచాలకులు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రొవిజినల్ అసైన్‌మెంట్‌పైనా

పూర్తి హక్కులు

- ఎక్స్ సర్వీస్‌మెన్ భూముల విషయంలో హైకోర్టు తీర్పు
- భూమిని సాగు చేస్తుంటే డీఫాం పట్టా లాంఛనమే అవుతుంది
- ఆ భూమిని అమ్ముకునేందుకు సైతం హక్కులు ఉంటాయి

సాక్షి, అమరావతి: ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద సైనికోద్యోగులకు ప్రొవిజినల్ (తాత్కాలికం) అసైన్‌మెంట్ ద్వారా కేటాయించిన భూమిపై వారికి సర్వ హక్కులు ఉంటాయని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రొవిజినల్ అసైన్‌మెంట్ కింద పొందిన భూమిని సాగు చేస్తుంటే డీఫాం పట్టా జారీ అన్నది కేవలం లాంఛనం మాత్రమేనని స్పష్టం చేసింది. డీఫాం పట్టా ఆలస్యంగా జారీ అయిందన్న కారణంతో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద సైనికోద్యోగులకు దక్కాల్సిన ప్రయోజనాలను దక్కకుండా చేయలేరని పేర్కొంది. గత 40 ఏళ్లుగా అప్పిలెట్ తనకు కేటాయించిన భూమిని సాగు చేసుకుంటున్న నేపథ్యంలో, ఆ భూమిని అమ్ముకునేందుకు అతనికి హక్కులు ఉన్నాయని తెలిపింది. అలాగే ఇసుక దిబ్బల పోరంబోకు భూమిని అసైన్‌మెంట్ కింద ఇవ్వడానికి వీల్లేదన్న ప్రభుత్వ వాదనను సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఇదే సర్వే నంబర్‌లోని ఇసుక దిబ్బల పోరంబోకు భూమిని ప్రభుత్వం ఇతరులకు సైతం అసైన్‌మెంట్ కింద ఇచ్చిందని, వారు ఆ భూమిని వీఎంఆర్‌డీఏకి అప్పగించి, అందుకు ప్రతిగా ప్లాట్లు పొందారని హైకోర్టు గుర్తు చేసింది. అలాంటప్పుడు అప్పిలేట్‌కి కేటాయించిన ఇసుక దిబ్బ భూమిపై ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెబుతుందో అర్థం కావడం లేదని పేర్కొంది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద అసైన్‌మెంట్ భూమి పొందేందుకు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, సర్వీసులో ఉన్న సైనికోద్యోగులు కూడా అర్హులేనని తేల్చి చెప్పింది. ప్రస్తుత కేసులో మాజీ సైనికోద్యోగి అప్పారావు భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆరు వారాల్లో నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

కలెక్టర్ ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్

విశాఖపట్నానికి చెందిన వీసీ అప్పారావు నౌకాదళంలో పనిచేసి 1989లో పదవీ విరమణ చేశారు. సర్వీసులో ఉండగానే ఆయనకు ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ప్రభుత్వం 1978లో భీమునిపట్నం మండలం కొత్తవలస గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 75–2లో 5.10 ఎకరాల భూమిని అసైన్‌మెంట్ కింద ఇచ్చింది. అప్పటి నుంచి ఆయన ఈ భూమిని సాగు చేసుకుంటున్నారు. కొంతకాలం తర్వాత ప్రభుత్వం ఈ భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చింది. ఈ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను కోరగా తిరస్కరించారు. దీంతో అప్పారావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపారు. కలెక్టర్ అభ్యంతరాలపై వివరణ ఇస్తూ తిరిగి ఆయనకు వినతిపత్రం ఇవ్వాలని అప్పారావును ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పారావు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. అప్పారావు తరఫు న్యాయవాది జీఎల్ నరసింహా రెడ్డి వాదనలు వినిపించారు. సర్వీసులో ఉండగా ఇచ్చిన అసైన్‌మెంట్‌ను ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చినట్లుగానే భావించాల్సి ఉంటుందని, దానిని 10 ఏళ్ల తర్వాత అమ్ముకునేందుకు హక్కు ఉంటుందని వివరించారు. కలెక్టర్ ఏకపక్షంగా అప్పారావు భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, అప్పారావు భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ తీర్పునిచ్చింది.

ఎల్ఎఫ్ఎల్‌గా పీఎస్ హెచ్ఎంలు !

- స్థాయి తగ్గించి బలవంతపు మార్పుపై ఎస్ఏల ఆగ్రహం
- విద్యాశాఖ వింత వైఖరిపై నిరసన
- 9,620 ఎంపీఎస్‌ల్లో 4800 స్కూళ్లకు హెచ్ఎంలుగా ఎస్ఏలే..

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలపై చంద్రబాబు సర్కారు చేపట్టిన చిత్రవిచిత్ర ప్రయోగాల పరంపర కొనసాగుతోంది. ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ (పీఎస్ హెచ్ఎం)లను ఎల్ఎఫ్ఎల్ (లో ఫిమేల్ లిటరసీ) హెచ్ఎంగా మార్చాలని ఆదేశాలు జారీ చేయడంతో స్కూల్ అసిస్టెంట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. మూడో తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ బోధనను రద్దు చేసిన సర్కారు ఆ స్కూల్ అసిస్టెంట్లను సర్‌ప్లస్ చేసింది. మిగులు ఎస్ఏలు ఆందోళన చేయడంతో కొత్తగా 9,620 మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసి వాటిల్లో 4,800 పాఠశాలల్లో మిగులు స్కూల్ అసిస్టెంట్లను పీఎస్ హెచ్ఎంలుగా బలవంతంగా నియమించింది. వారికి పీఎస్ హెచ్ఎం/ఎస్ఏ డిజిగ్నేషన్ ఇచ్చింది. మిగిలిన 4,820 స్కూళ్లలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలను నియమించింది. అయితే ఇప్పుడు పీఎస్ హెచ్ఎం/ఎస్ఏ కేడర్‌ను మరీ తగ్గించి ఎల్ఎఫ్ఎల్‌గా మార్చేందుకు సర్కారు పూనుకుంది. ఎలాంటి జీవోలు లేకుండా కేవలం నోటి మాటతో మొత్తం ప్రక్రియను మార్పు చేయడంపై పీఎస్ హెచ్ఎం/ఎస్ఏల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి స్కూల్ అసిస్టెంట్లు ప్రైమరీ స్కూళ్లలో హెచ్ఎంలుగా పనిచేసేందుకు నిబంధనలు లేకపోవడంతో వారి డిజిగ్నేషన్ పీఎస్ హెచ్ఎం/ఎస్ఏగానే ఉంటుందని సర్కారు తొలుత ప్రకటించింది. అదేవిధంగా జూన్ నెలలో చేపట్టిన బదిలీ ఉత్తర్వుల్లోనూ పేర్కొంది. జూన్ నుంచి యూడైస్‌లోనూ వీరు పీఎస్ హెచ్ఎం/ఎస్ఏగానే కొనసాగుతున్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి వారి డిజిగ్నేషన్‌ను పీఎస్ హెచ్ఎం/ఎస్ఏ నుంచి తగ్గించి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా యూడైస్‌లో మార్చేందుకు సర్కారు సిద్ధపడింది. అన్ని జిల్లాల్లోనూ పీఎస్ హెచ్ఎంలు అంతా వెంటనే యూడైస్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా తమ డిజిగ్నేషన్లను మార్చుకోవాలని ఎంఈఓ కార్యాలయాలు, ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తోంది. కొన్నిచోట్ల ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండానే యూడైస్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా డిజిగ్నేషన్ మార్పు చేసినట్టు ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల తాము బదిలీల్లో తిరిగి స్కూల్ అసిస్టెంట్లుగా వెళ్లే అవకాశం ఉండదని, యూడైస్ వివరాలనే లీప్ యాప్, టీఐఎస్‌లో ప్రామాణికంగా తీసుకుంటారని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. గ్రామీణ బాలికల్లో అక్షరాస్యతను పెంచేందుకు 1998 ఆగస్టులో తీసుకొచ్చిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విధానాన్ని ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్లకు ఆపాదించడం విమర్శలకు దారితీస్తోంది.

సునీత పిటిషన్‌లన్నీ రాజకీయ ప్రేరేపితమే..

- గత ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వివేకా హత్య
- నిరాధార ఆరోపణలు మోపి రాజకీయ లబ్ధి కోసం యత్నం
- వచ్చే ఎన్నికల వరకు కేసు విచారణ పూర్తి కాకుండా కుయుక్తులు
- సీబీఐ కోర్టులో ప్రతివాదుల వాదనలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత పిటిషన్లన్నీ రాజకీయ ప్రేరేపితమని ప్రతివాదులు సీబీఐ కోర్టుకు విన్నవించారు. వివేకా హత్యను కూడా గత ఎన్నికల సమయంలో ప్రచారాస్త్రంగా ప్రత్యర్థులు వినియోగించుకునే యత్నం చేశారని, సాక్ష్యాలు, ఆధారాలు లేకున్నా ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఓడించడమే ధ్యేయంగా పనిచేశారని కోర్టుకు తెలియజేశారు. ఆమె వెనుక ఉన్న కొన్ని రాజకీయ శక్తుల వల్ల ఇష్టారాజ్యంగా పిటిషన్లు వేస్తూ.. అసలు దోషులు బయట తిరిగేందుకు తోడ్పడుతున్నారని వివరించారు. ఇప్పుడు అదే శక్తులు వచ్చే ఎన్నికల వరకు కేసు విచారణ పూర్తి కాకూడదని కుయుక్తులు పన్నుతున్నారని కోర్టు దృష్టికి తీసుకుని వచ్చారు. ఇందులో భాగంగానే సునీత తాజా పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. వైఎస్ వివేకా హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో సునీత పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురామ్ సోమవారం ప్రతివాదుల వాదనలు విన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. అంతకుముందు శివశంకర్ రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది సాయి ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనల్లో ముఖ్యాంశాలు.. 'అన్ని అంశాలు పరిశీలించాం, వందల మందిని విచారించాం, కాల్ రికార్డులు, వీడియోలు.. ఇలా అన్నింటిపై దర్యాప్తు పూర్తి చేశామని సీబీఐ చెబుతోంది. అయినా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగించాలని కోరడం సరికాదు. ఇది కేసు విచారణను ఆలస్యం చేయడమే. దాదాపు నాలుగేళ్ల పాటు దర్యాప్తు కొనసాగించినంత కాలం సీబీఐ విచారణపై సునీత నోరు మెదపలేదు. నిరాధారంగా కొందరిని నిందితులుగా చేర్చడాన్ని ఆమె 'ఎంజాయ్'చేశారు. చార్జ్‌షీట్, అదనపు చార్జ్‌షీట్ దాఖలు చేసినప్పుడూ తను అనుకున్నట్లే దర్యాప్తు సాగుతోందని మౌనంగా ఉన్నారు. ఇప్పుడు మరికొందరిని చేర్చాలన్న ఉద్దేశంతో పిటిషన్ వేశారు. కళ్లారా చూసిన ప్రత్యక్ష సాక్షి హత్య చేసింది ఎవరో చెప్పిన తర్వాతా నిందితులకు తోడ్పడేలా ఆమె పిటిషన్లు వేశారు. షేక్ దస్తగిరి (ఏ–4) తానే గొడ్డలితో నరికానని నేరుగా సీబీఐ కార్యాలయానికి వెళ్లి చెప్పినా అరెస్టు చేయలేదు. క్రిమినల్ కేసుల దర్యాప్తు చరిత్రలో ఓ కరుడుగట్టిన హంతకుడు నేరం ఒప్పుకున్నా అరెస్టు చేయకపోవడం ఇదే తొలిసారి. అతన్ని సమర్థిస్తూ సునీత పలు పిటిషన్లు వేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దస్తగిరి యథేచ్ఛగా బయట తిరుగుతున్నా బెయిల్ రద్దు కోరుతూ పిటిషన్ వేయని సునీత ఎలాంటి ఆధారాలు లేకుండా నిందితులుగా చేర్చిన వారి బెయిల్ రద్దుకు పిటిషన్లు వేయడం విస్తుగొలిపే విషయం. సునీత పిటిషన్ సమర్థనీయం కాదు. కొట్టివేయండి' అని న్యాయవాదులు వాదనలు వినిపించారు.

చంద్రబాబును రక్షించేందుకు భక్తుల మనోభావాలు దెబ్బతీస్తారా?

- పవన్‌కళ్యాణ్‌పై మాజీమంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబును రక్షించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మరోసారి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారని మాజీమంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పంటల ధరలు పూర్తిగా పడిపోవడంతో కూలీ ఖర్చులు కూడా రాక రైతులు పంటలను రోడ్లపై పడేస్తుంటే.. కనీస మద్దతు ధర కల్పించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు పోరాడాల్సిందిపోయి ప్రజల దృష్టిని మళ్లించాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబును రక్షించడానికి తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయ నాటకంలోకి లాగుతున్నారని, తప్పుడు ప్రచారాన్ని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించడంలో చంద్రబాబును, గోబెల్స్‌ను పవన్ దాటిపోయారంటూ ఎద్దేవా చేశారు. బాబు సర్కారు వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. 'డైవర్షన్ రాజకీయాలకు తిరుమల వేదిక కాదు.. భక్తుల విశ్వాసం పవిత్రమైనది.. చంద్రబాబుకు రాజకీయం కవచం కాదు..' అంటూ పవన్‌కళ్యాణ్‌కు హితవు పలుకుతూ ఆయన సోమవారం 'ఎక్స్'లోని తన ఖాతాలో పోస్టు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీనెయ్యి ఉపయోగించారంటూ పవన్‌కళ్యాణ్ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు అంబటి కౌంటర్ ఇచ్చారు. ఆ పోస్టులో పవన్‌ను ఉద్దేశించి అంబటి ఏమన్నారంటే.. 'కల్తీ జరిగిందని చెబుతున్న నెయ్యి ట్యాంకర్లు వచ్చింది బాబు ప్రభుత్వంలోనైతే వైఎస్సార్‌సీపీని ఎందుకు నిందిస్తున్నారు? విశాఖలో టీడీపీ నేత కోల్డ్ స్టోరేజ్‌లో గోమాంసం పట్టుబడితే ఎందుకు మౌనంగా ఉన్నారు? అని అంబటి ప్రశ్నించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

హై రిస్క్ ప్రెగ్నెన్సీ... ఇవీ జాగ్రత్తలు

ఒక్కమాటలో చెప్పాలంటే కాబోయే ప్రతి మాతృమూర్తి తాలూకు గర్భధారణా అలాగే ప్రసవంలో ఎంతోకొంత రిస్క్ ఉండనే ఉండవచ్చు. అయితే కొందరి గర్భధారణలు (ప్రెగ్నెన్సీలు) చాలా రిస్క్‌తో కూడుకున్నవే అవుతాయి. ఉదాహరణ ఒక మహిళకు హైబీపీ, డయాబెటిస్ లేదా గుండెజబ్బులు ఉండటం... ఒకవేళ ఆమె 35 ఏళ్లు దాటాక లేట్‌గా గర్భవతి కావడం... ఇలాంటి సందర్భాల్లో ఆమె గర్భధారణ అన్నది ప్రసవం వరకూ చాలా జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన సందర్భం అవుతుంది. ఇటీవల దాదాపు ప్రతి ప్రసవమూ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతుండటంతో (ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీస్ అవుతుండటంతో) రిస్క్ అనేది చాలావరకు తగ్గినప్పటికీ... కొన్ని గర్భధారణల్లో ఏ సందర్భంలో ఎటుపోయి ఎటువస్తుందో చెప్పలేని పరిస్థితీ, ఎలాంటి ఆకస్మిక పరిణామాలు ఎదురవుతాయో తెలియని అనిశ్చితి ఉండనే ఉంటుంది. ఇలాంటివాటినే హై రిస్క్ ప్రెగ్నెన్సీలుగా చెప్పవచ్చు. ఏయే సందర్భాలను 'హై రిస్క్ ప్రెగ్నెన్సీలు'గా పరిగణిస్తారో, ఆ సందర్భాల్లో చేయించాల్సిన వైద్యపరీక్షలు, స్కాన్‌లతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల వంటి అనేక అంశాలను తెలిపే కథనమిది.

డాక్టర్ శ్రుతి రెడ్డి పొద్దుటూరు
కన్సల్టెంట్ ఆబ్‌స్టెట్రీషియన్, గైనకాలజిస్ట్ & లాపరోస్కోపిక్ సర్జన్

ఇటీవల వైద్యవిజ్ఞానశాస్త్రాల్లో చాలా అభివృద్ధి చోటుచేసుకుంది. ఇంత పురోభివృద్ధి తర్వాత కూడా కొన్ని సందర్భాల్లో మాత్రం గర్భం ఎంత మేర నిలుస్తుందో చెప్పలేని సందర్భాలు ఎప్పుడూ ఉంటాయి. అది తల్లీ బిడ్డా ఇద్దరికీ కాస్తంత ప్రమాదకరంగా మారే అవకాశాలూ పొంచి ఉంటాయి. అలా తల్లికి గానీ లేదా కడుపులోని బిడ్డకుగానీ... ఒక్కోసారి ఈ ఇద్దరికీ సురక్షిత మని చెప్పలేని పరిస్థితి ఉంటుంది. ఎన్నో రకాల కాంప్లికేషన్లు ఎదురయ్యే పరిస్థితి ఉంటుంది. అలాంటి గర్భధారణను 'హైరిస్క్ ప్రెగ్నెన్సీ'గా చెప్పవచ్చు.

ఎవరెవరిలో హైరిస్క్ ముప్పు ఉంటుందంటే...

ప్రధానంగా ఈ కింద పేర్కొన్న మహిళలు 'హై–రిస్క్ ప్రెగ్నెన్సీ' కిందికి వస్తారని చెప్పవచ్చు.

- దాదాపు 35 ఏళ్లు దాటాక (35 – 40 ఏళ్ల మధ్య వయసులో) గర్భవతులైనవారు.
- ఇప్పుడు గర్భవతిగా ఉన్న ఆ మహిళకు గతంలో వరసగా అబార్షన్లు కావడం లేదా పుట్టిన వెంటనే బిడ్డ చనిపోవడం వంటి వైద్యచరిత్ర (మెడికల్ హిస్టరీ) ఉండటం.
- మహిళలకు తాము గర్భం దాల్చక ముందే అధిక రక్తపోటు(హైబీపీ), మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, థైరాయిడ్ సమస్య, ఆటోఇమ్యూన్ డిజార్డర్స్, మూర్ఛ (ఎపిలెప్సీ) వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు.
- ముందుగా డయాబెటిస్ లేనప్పటికీ గర్భధారణ తర్వాత మధుమేహం (జెస్టేషనల్ డయాబెటిస్), హైబీపీ కనిపించిన మహిళలు.
- గర్భధారణకు సంబంధించిన సమస్యలు... అంటే... గర్భంలో కవలలు లేదా ట్రిప్లెట్స్ ఉండటం, స్కాన్ చేసినప్పుడు బిడ్డకు ఆరోగ్యపరమైన సమస్యలుగానీ లేదా లోపాలుగానీ ఉన్నట్లు తెలిసిన సందర్భాల్లో, కడుపులో బిడ్డకు ఎదుగుదల సమస్యలు ఉండటం, బిడ్డలో జన్యుపరమైన లోపాలుండటం... వంటి సందర్భాల్లో.
సాధారణ మహిళలతో పోలిస్తే... ఈ తరహా వైద్య చరిత్ర (మెడికల్ హిస్టరీలు) ఉన్న వాళ్లను 'హైరిస్క్ ప్రెగ్నెన్సీ' కేటగిరీలోకి వస్తారని చెప్పవచ్చు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీ... తెలుసుకోవడం ఇలా...

ఒక మహిళ హైరిస్క్ గ్రూప్ కిందికి వచ్చే వస్తుందా అన్న విషయం నిర్ధారణ చేసుకోడానికి ఈ కింద పేర్కొన్న అంశాలు సహా యపడతాయి. వీటి సహాయంతో ఒక మహిళ తాను హైరిస్క్ ప్రెగ్నెన్సీ జాబితాలోకి వస్తుందా రాదా అన్నది తనకు తానే తెలుసుకోవచ్చు.

- గర్భధారణ నాటికి 35 ఏళ్ల వయసు మించి ఉండటం. దీనివల్ల సాధారణ మహిళలతో పోలిస్తే... ఇలా లేట్‌గా గర్భధారణ జరగడంతో పుట్టే పిల్లల్లో క్రోమోజోమ్స్‌కు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి.
- కేవలం బాగా ఆలస్యంగా జరిగిన గర్భధారణలోనే కాకుండా... ఒకవేళ ఓ అమ్మాయి 18 ఏళ్ల లోపు చిన్నవయసు బాలిక కావడం, చిన్న వయసులోనే ఆమెకు గర్భధారణ జరిగినప్పుడు కూడా పుట్టబోయే పిల్లల్లో ఎదుగుదల లోపాలు కనిపించే అవకాశాలుండటంతో దీన్నీ హైరిస్క్‌గానే పరిగణించాలి.
- ఒకవేళ గర్భంలో ఒకరికంటే మించి (అంటే... కవలలు లేదా ట్రిప్లెట్స్) ఉండటం వల్ల హైబీపీ రావడం లేదా నెలలు నిండక ముందే ప్రసవం లాంటి సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి.
- గర్భంలోని బిడ్డకు ఎదుగుదల లోపాలు ఉన్నప్పుడు.
- గర్భధారణ జరిగిన మహిళలకు హైబీపీ, చక్కెర వ్యాధి (డయాబెటిస్), గుండెజబ్బులు, థైరాయిడ్ సమస్య, ఆటోఇమ్యూన్ సమస్యలు, మూర్ఛ వంటి ఆరోగ్య సమస్యలున్నప్పుడు.
- ఇప్పటికే ఓసారి ఒక మహిళకు జన్యుపరమైన సమస్యలున్న బిడ్డ ఉండటం లేదా... ఆ బిడ్డకు గుండెజబ్బుగానీ, లోపంతో కూడిన ఎముకల కారణంగా బిడ్డకు వైకల్యం రావడం వంటి ఆరోగ్య చరిత్ర (మెడికల్ హిస్టరీ) ఉండటం.
- మహిళకు గర్భధారణ వ్యవస్థలో పెద్ద గడ్డలు (ఫైబ్రాయిడ్స్) వంటివి వచ్చిన వైద్య చరిత్ర (మెడికల్ హిస్టరీ) ఉండటం.
- గతంలో తరచూ అబార్షన్లు కావడం, మునుపు పిండం గర్భసంచిలో కాక... బయట ట్యూబుల్లోనే పెరగడం, గతంలో నెలలు పూర్తిగా నిండకముందే ప్రసవం జరగడం (ప్రీవియస్ హిస్టరీ ఆఫ్ ప్రిమెచ్యూర్ బర్త్), గతంలో బిడ్డ లోపలే చనిపోవడం వంటి మెడికల్ హిస్టరీ ఉంటే...
- హెచ్‌ఐవీ వంటి ఇన్ఫెక్షన్లు ఉండటం వల్ల అవి బిడ్డకు సోకే అవకాశాలున్నప్పుడు.
- పిల్లలు కలగడానికి చాలా కాలం చికిత్స తీసుకున్న తర్వాత గర్భం రావడం...

ఇక్కడ పేర్కొన్న సందర్భాల్లో ఒక మహిళ గర్భందాల్చితే దాన్ని 'హైరిస్క్ ప్రెగ్నెన్సీ'గా చెప్పవచ్చు. ఇలాంటి మహిళలకు గర్భధారణ సమయంలోనూ లేదా ప్రసవం సమయంలోనూ అనేక రకాల కాంప్లికేషన్లు కనిపించే అవకాశాలు ఎక్కువ. ఈ కాంప్లికేషన్లను రెండు రకాలుగా నివారించవచ్చు. మొదటిది మహిళ తానంతట తానే కొన్ని జాగ్రత్తలూ, సూచనలు పాటించి కాంప్లికేషన్లను నివారించుకోవడం, రెండోది వైద్యనిపుణుల సహాయంతో కాంప్లికేషన్లు నివారించుకోవడం.

మహిళలు తమకు తాముగా ప్రెగ్నెన్సీ రిస్క్‌ల తాలూకు కాంప్లికేషన్ల నివారించుకోవడమిలా...

- హైరిస్క్ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ముందుగానే ఒకసారి 'ప్రీ- కన్సెప్షనల్ కౌన్సెలింగ్' కోసం డాక్టర్‌ను సంప్రదించాలి.
- ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవాలనుకున్నప్పుడు... దాదాపు మూడు నెలల ముందు నుంచే కనీసం రోజుకు 400 మైక్రోగ్రాముల ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం... (ఈ ఫోలిక్ యాసిడ్ మాత్రను గర్భం దాల్చాక కూడా పూర్తి గర్భధారణ టైమ్ మొత్తం వాడాలి.
- గర్భం ధరించిన సమయంలో వీలైనంత వరకు ఎలాంటి మందులూ తీసుకోకూడదు. ఒకవేళ తీసుకోవాల్సి వస్తే... ప్రతి మందునూ తప్పనిసరిగా డాక్టర్ సలహా మేరకు వాళ్లకు తెలిసి మాత్రమే తీసుకోవాలి.
- కొందరు మహిళలకు మూర్ఛ (ఎపిలెప్సీ), హైబీపీ, డయాబెటిస్ వంటి ఆరోగ్య సమస్యలు ఉంటే... గర్భం వచ్చినట్లు తెలియగానే కొందరు మహిళలు తాము వాడే మందుల్ని తమంతట తామే ఆపేస్తారు. అది తల్లీ, బిడ్డా ఇద్దరికీ ప్రమాదకరం. కాబట్టి తామే వైనా మందులు వాడాలన్నా లేదా అంతకుముందునుంచి వాడుతున్న మందులు ఆపేయాలన్నీ డాక్టర్‌ను సంప్రదించాకే ఆ పని చేయాలి. ఎందుకంటే హైబీపీ, మూర్ఛ (ఎపిలెప్సీ) వంటి వ్యాధులున్న మహిళలకు డాక్టర్లు వారి గర్భధారణ తసమయంలో వాడుతున్న మందులను గానీ లేదా వాటి మోతాదులనుగానీ మారుస్తారు.
- గర్భం దాల్చినట్లు నిర్ధారణ అయినప్పటి నుంచి క్రమం తప్పకుండా డాక్టర్‌తో నిత్యం డాక్టర్లు సూచించిన పరీక్షలు చేయిస్తూ ఉండాలి. కనీసం నెలలో ఒకసారైనా లేదా పరిస్థితి తీవ్రతను బట్టి డాక్టర్లు సూచించిన వ్యవధిలో డాక్టర్‌ను కలిసి అవసరమైన పరీక్షలు చేయిస్తుండాలి. ఏడో నెల దాటాక ఈ పరీక్షలు మరింత తరచుగా చేయించాల్సి రావచ్చు.
- సరైన టైములో సరైన టీకాలు (ప్రాపర్ ఇమ్యూనైజేషన్) తీసుకోవాలి.
- మహిళలు తమ ఎత్తుకు తగినట్లుగా తమ ఆరోగ్య నిర్వహణకు తగిన బరువు ఉండేలా చూసుకోవడం, ఇందుకు సరైన ఆహార నియమాలు పాటించడం, అవసరమైన శారీరక వ్యాయామాలను చేయడం అవసరం. ఈ వ్యాయామాలు మరింత శ్రమ కలిగించేలా ఉండకూడదు.
- కొన్నిరకాల హైరిస్క్ ప్రెగ్నెన్సీల్లో డాక్టర్ బెడ్‌రెస్ట్ తీసుకోమని అంటే... దాన్ని తప్పనిసరిగా పాటించాలి. అయితే బెడ్‌రెస్ట్ అంటే పూర్తిగా మంచానికే పరిమితం కావడం కాదు. డాక్టర్ సలహా మేరకు కాబోయే తల్లి ఏమేరకు శారీరక శ్రమ చేయాలో... అలాగే ఏ మేరకు విశ్రాంతి తీసుకోవాలో చెబుతారు. దాన్ని అక్షరాలా పాటించాలి.

వైద్యనిపుణులూ, సిబ్బంది సహాయంతో కాంప్లికేషన్ల నివారణ ఇలా...

హై రిస్క్ ప్రెగ్నెన్సీ వల్ల ప్రసవ సమయంలో కలిగే దుష్పరిణామాలు, ప్రమాదకర పరిస్థితుల (కాంప్లికేషన్స్)ను నివారించడమన్నది ఈ రోజుల్లో చాలావరకు సాధ్యమే. ఇలాంటి రిస్కులు ఉన్న మహిళలు... ఫిజీషియన్, ఎండోక్రినాలజిస్ట్, గుండెజబ్బుల నిపుణుడు, రుమటాలజిస్ట్, నరాల నిపుణుడు అందుబాటులో ఉండే హయ్యర్ మెడికల్ సెంటర్లలో తమ ప్రసవం జరిగేలా చూసుకోవడం మంచిది. ఫలితంగా ఆ మహిళకు అవసరం ఉన్న వైద్య చికిత్సలను బట్టి ఆ ప్రసవాన్నీ ఎలా ప్లాన్ చేయాలో అన్నది వైద్యనిపుణులు చర్చించుకుని ఆ మేరకు సురక్షిత ప్రసవం జరగడానికి అవసరమైన నిర్ణయాలు తీసుకోడానికి, వాటిని అమలు చేయడానికి వీలవుతుంది.

పరీక్షలతో తల్లీబిడ్డా ఆరోగ్యం పదిలం... క్షేమం!

గర్భిణుల్లో రొటీన్ రక్తపరీక్షలకు తోడుగా... ఆమెకు తన రెండో నెలలోనే రక్తంలో చక్కెర మోతాదులను నిర్ధారణ చేసే పరీక్ష, థైరాయిడ్ పరీక్ష వంటివి నిర్వహిస్తే... పుట్టబోయే బిడ్డ, కాబోయే తల్లి తాలూకు ఆరోగ్య పరిస్థితిని ముందునుంచే తెలుసుకుంటూ ముందస్తు చికిత్స చేయడం... తద్వారా తర్వాతి కాంప్లికేషన్లను నిరోధించడమన్నది చాలావరకు సాధ్యమవుతుంది.

ఇక మూత్రపిండాల (కిడ్నీ) సమస్య ఉన్న మహిళలు, హైబీపీ ఉన్నవాళ్లు, థైరాయిడ్ సమస్యతో బాధపడేవారు, తరచూ అబార్షన్లు అయినవారు గర్భధారణకు ముందే కొన్ని రక్త పరీక్షలు చేయించడం అవసరం, ప్రెగ్నెన్సీ సమయంలో 7–8 వారాలప్పుడే కొన్ని ఇంజెక్షన్లు వాడటం ద్వారా మున్ముందు చోటుచేసుకోబోయే చాలా రకాల ప్రమాదాలను (కాంప్లికేషన్లను) నివారించవచ్చు.

స్కాన్‌ల సహాయంతో...

అల్ట్రాసౌండ్ స్కాన్ సహాయంతో ముందుగానే గర్భంలోపల ఉన్న పరిస్థితిని తెలుసుకుని తగిన చికిత్స చేయడంతో పాటు... లోపాలు సరిదిద్దడానికీ ఆ స్కాన్‌లు ఉపయోగపడతాయి. బిడ్డలోని వైకల్యాలను, అసాధారణ పరిస్థితులనూ, లోపాలను తెలుసుకునేందుకు స్కాన్స్ ఎంతగానో ఉపయోగపడతాయి.



✓ అల్ట్రాసౌండ్ స్కాన్‌తో 11-14 వారాల సమయంతో గర్భధారణ నిర్దిష్టంగా ఎప్పుడు జరిగింది, గర్భంలోపల ఉన్న బిడ్డ ఒకరా, కవలలా, ఒకవేళ కవలలైతే ఒక వాళ్లు ఒకే అండం నుంచా లేక రెండు వేర్వేరు అండాల నుంచా అన్నది తెలుస్తుంది.

✓ న్యూకల్ ట్రాన్స్యులెన్సీ స్కాన్ వల్ల చిన్నారిలో క్రోమోజోమ్‌కు సంబంధించిన లోపాలు ఏవైనా ఉంటే అవి పిండ దశలోనే తెలిసిపోతాయి. బిడ్డ స్వరూపం (స్ట్రక్చర్) ఎలా ఉందో కూడా కొంతవరకు తెలుస్తుంది. ఇది ఒక రకమైన స్క్రీనింగ్ పరీక్ష.



✓ ఇక 20-22 వారాలప్పుడు చేసే రొటీన్ స్కాన్ వల్ల చిన్నారి పూర్తి స్వరూపం (స్ట్రక్చర్) తెలుస్తుంది. అన్ని అవయవాలూ సక్రమంగా రూపొందాయో లేదో కూడా తెలిసిపోతుంది.



✓ క్రమం తప్పకుండా చేయించే స్కాన్‌ల వల్ల బిడ్డ మెదడు వంటి అత్యంత ప్రధాన అవయవాల్లో రక్తప్రసరణ వంటి కీలక అంశాలు తెలుస్తాయి. ఫలితంగా పిండదశలోనే ఏవైనా లోపాలు ఉంటే వాటిని చక్కదిద్దే అవకాశాలుంటాయి.



✓ ఇలాంటి పలు రకాల స్కాన్‌ల కాంబినేషన్‌లతో ఒక ప్రెగ్నెన్సీలో రిస్క్ మోతాదు ఎంత అన్నది నిర్ధారణ చేస్తారు. దాన్ని బట్టి ఆ ప్రెగ్నెన్సీది హైరిస్కా, తక్కువ రిస్కా, లేదా రిస్కేమీ లేదా అన్నది దాదాపు 90 శాతం వరకు చెప్పగలుగుతారు.

ఇప్పుడు అడ్వాన్స్‌డ్ చికిత్సలూ అందుబాటులో... గర్భధారణ సమయంలో ఎదురయ్యే రిస్కులకు ఇప్పుడు చాలా రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలి కాలంలో నియోనేటల్ చికిత్స ప్రక్రియలు చాలా అడ్వాన్స్ అవ్వడం వల్ల ఇలాంటి బేబీస్‌కు ఇప్పుడు అన్ని రకాల చికిత్సలు అందిస్తూ వాళ్లు మామూలుగానే మనుగడ సాధించేలా చేయవచ్చు. గతంలో వాళ్లకు న్యూరలాజికల్ సమస్యలు వస్తాయనే భావన ఉండేది. ఇప్పుడున్న వైద్యపరిజ్ఞానంతో అలాంటి సమస్యలనూ చాలావరకు అధిగమించవచ్చు. అలాంటి పిల్లల్లో కొన్ని అవయవాలు అంటే ఉదాహరణకు ఊపిరితిత్తులు అభివృద్ధి కావు. అప్పుడు కొన్ని ఇంజెక్షన్లను ఇవ్వడం ద్వారా ఊపిరితిత్తులను పూర్తిగా అభివృద్ధి చెందేలా చేయవచ్చు. అయితే ఇలాంటి చికిత్సలు– అన్ని అధునాతన సదుపాయాలు ఉన్న చికిత్స కేంద్రాల్లో ఉంచి తగిన పరిచర్యలు చేయడం ద్వారా బిడ్డనూ, తల్లినీ సంరక్షించవచ్చు. అలాగే బిడ్డ మానసిక ఎదుగుదలకు, తెలివితేటలకూ థైరాయిడ్ హార్మోన్లు అవసరం. అలాంటప్పుడు తల్లిలో థైరాయిడ్ లోపాలుంటే వాటిని సరైన సమయంలో పసిగట్టి చికిత్స అందించడం ద్వారా మంచి మానసిక ఆరోగ్యం, తెలివితేటలు ఉండే బిడ్డను కనేలా చేయవచ్చు. కాబోయే తల్లికి బీపీ, షుగర్ వంటివి ఉన్నట్లయితే వాటిని సమర్థంగా నియంత్రణలో పెట్టి తల్లినీ, బిడ్డనూ సంరక్షించవచ్చు. అందుకే... హైరిస్క్ ప్రెగ్నెన్సీలలో తల్లినీ, బిడ్డనూ సురక్షితంగా ఉంచాలంటే... ముందునుంచే మంచి వైద్యపర్యవేక్షణతో పాటు... కాబోయే తల్లికీ కొంత ప్రాథమిక పరిజ్ఞానం, కొన్ని అంశాలపై అవగాహన, పరిజ్ఞానం ఉండటం అవసరం. అలాంటివి వైద్య నిపుణులు తమ కౌన్సెలింగ్ సమయంలో చెబుతూ ఆమెకూ పలు అంశాలపై అవగాహన కల్పిస్తారు.

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

ప్లాస్టో నుంచి అన్‌బ్రేకబుల్ టేబుల్స్

నాగ్‌పూర్: అత్యంత నాణ్యమైన ప్లాస్టిక్ ట్యాంకులు, పైపులు మొదలైనవి ఉత్పత్తి చేసే ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ కొత్తగా అన్‌బ్రేకబుల్ టేబుల్స్‌ను ప్రవేశపెట్టింది. ఇవి గృహ, వ్యాపార అవసరాలకు అనువుగా ఉంటాయని సంస్థ తెలిపింది. దృఢమైన, మన్నికైన ప్లాస్టిక్, యాంటీఆక్సిడెంట్ టెక్నాలజీ, యూవీ ప్రొటెక్షన్‌తో వీటిని తయారు చేసినట్లు వివరించింది. విరిగిపోకుండా, దెబ్బ తినకుండా, ఏళ్ల తరబడి మన్నేలా ఇవి ఉంటాయని కంపెనీ తెలిపింది. పదేళ్ల గ్యారంటీతో ప్లాస్టో టేబుల్స్ లభిస్తాయని పేర్కొంది.

యాక్సిస్ ఎనర్జీ పెట్టుబడులు రూ. 29,500 కోట్లు



న్యూఢిల్లీ: పునరుత్పాదక విద్యుత్ రంగానికి చెందిన యాక్సిస్ ఎనర్జీ తాజాగా మధ్యప్రదేశ్‌లో రూ. 29,500 కోట్ల పెట్టుబడులను ప్రతిపాదించింది. హైదరాబాద్‌లో జరిగిన 'మధ్యప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలు' సదస్సులో వీటిని సమర్పించినట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా మొత్తం రూ. 36,000 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు రాగా అందులో తమదే అత్యధిక మొత్తం అని సంస్థ వివరించింది. పర్యావరణహితమైన విద్యుదుత్పత్తి మౌలిక సదుపాయాలను భారీగా విస్తరించాలనేది తమ లక్ష్యమని పేర్కొంది.

కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లకు కొత్త ఈడీలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా మినీ టీఎం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆమె బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్‌గా (ఢిల్లీ జోన్) వ్యవహరించారు. బ్యాంకింగ్ రంగంలో ఆమెకు 31 సంవత్సరాల పైగా అనుభవం ఉంది. 1994లో ఫెడరల్ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసరుగా కెరియర్ ప్రారంభించిన మినీ ఆ తర్వాత 2007లో విజయా బ్యాంక్‌లో ఫైనాన్షియల్ అనలిస్టుగా చేరారు. మరోవైపు, కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా సునీల్ కుమార్ చుగ్ నియమితులయ్యారు. ఆయన నియామకం నవంబర్ 24 నుంచి మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఇప్పటివరకు చుగ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజరుగా వ్యవహరించారు. డిజిటల్, రిటైల్, కార్పొరేట్ బ్యాంకింగ్ తదితర విభాగాల్లో ఆయనకు అపార అనుభవం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-11-2025

విశాఖ	635-00
చిత్తూరు	673-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	645-00
విజయవాడ	660-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	650-00
వరంగల్	652-00
రిటైల్ ధర	7.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	2,075.00	2.6
TECHM	1,496.80	2.42
EICHERMOT	7,250.00	1.62
BAJAJ&AUTO	9,015.00	1.38
WIPRO	247.44	1.21

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	402.90	-3.23
JSWSTEEL	1,113.30	-2.37
MAXHEALTH	1,153.10	-2.37
GRASIM	2,680.00	-2.00
M& M	3,687.00	-1.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,806
ఎన్ఎస్ఈ	1,54,230
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,49,563
ఎఫ్ఐఐ	- 4,171
డీఐఐ	+ 4,512

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	58.47 (రాత్రి 11.30కు)	$ 57.81 (క్రితం ముగింపు)
బ్రెంట్	62.19 (రాత్రి 11.30కు)	$ 61.94 (క్రితం ముగింపు)

లిస్టింగ్‌కు 3 కంపెనీలు రెడీ

తాజాగా సెబీ ఆమోదముద్ర
- జాబితాలో అమాగీ మీడియా ల్యాబ్స్
- ఫ్రాక్టల్ అనలిటిక్స్, సహజానంద్ మెడికల్



న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లు చవిచూస్తున్నప్పటికీ ఈ క్యాలండర్ ఏడాది(2025)లో ప్రైమరీ మార్కెట్లు సరికొత్త రికార్డులవైపు దూసుకెళుతున్నాయి. నిజానికి 2024లో 76 కంపెనీలు ఐపీవోలు చేపట్టడం ద్వారా ఉమ్మడిగా రూ. 1.53 లక్షల కోట్లు సమీకరించాయి. అయితే ఈ ఏడాది ఇప్పటికే మెయిన్‌బోర్డులో 93 కంపెనీలు రూ. 1.54 లక్షల కోట్లు సమకూర్చుకోవడం ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాయి. ఈ బాటలో మరో మూడు కంపెనీలకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.

దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మూడు కంపెనీల పబ్లిక్ ఇష్యూలను తాజాగా అనుమతించింది. జాబితాలో ఫ్రాక్టల్ అనలిటిక్స్, అమాగీ మీడియా ల్యాబ్స్, సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ చేరాయి. ఈ కంపెనీలు 2025 జులై- ఆగస్ట్‌లలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం..

ఏఐ సొల్యూషన్స్

ఎండ్‌టు ఎండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సొల్యూషన్స్ అందించే ఫ్రాక్టల్ అనలిటిక్స్ ఐపీవోకు రానుంది. దీనిలో భాగంగా రూ. 1,279 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 3,621 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 4,900 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఐపీవోలో క్వినాగ్ బిడ్కో రూ. 1,463 కోట్లు, టీపీజీ హోల్డింగ్స్ రూ. 2,000 కోట్లు, జీఎల్ఎమ్ కుటుంబ ట్రస్ట్ రూ. 129 కోట్లు విలువైన షేర్లను ఆఫర్ ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, అనుబంధ కంపెనీ ఫ్రాక్టల్ యూఎస్ఏలో పెట్టుబడులు, కొత్త కార్యాలయాల ఏర్పాటు, ఆర్అండ్‌డీ, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వెచ్చించనుంది.

సాస్ కంపెనీ

సాస్ సర్వీసులందించే అమాగీ మీడియా ల్యాబ్స్ ఐపీవోలో భాగంగా రూ. 1,020 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు ప్రస్తుత వాటాదారులు 3.41 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 667 కోట్లు టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

కార్డియాక్ స్టెంట్స్

2001లో ఏర్పాటైన మెడికల్ పరికరాల తయారీ కంపెనీ సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ ఐపీవోకు రానుంది. ఇందుకు అనుగుణంగా కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు 2.76 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. షేర్లు ఆఫర్ చేయనున్న సంస్థలలో శ్రీ హరి ట్రస్ట్, సమారా క్యాపిటల్ మార్కెట్స్ హోల్డింగ్, కొటక్ ప్రీఐపీవో అపార్చునిటీస్ ఫండ్ తదితరాలున్నాయి. కంపెనీ ప్రధానంగా కార్డియాక్ స్టెంట్స్‌ను తయారు చేస్తోంది. కంపెనీ భారత్, థాయ్‌లాండ్‌లలో రెండు ఆర్అండ్‌డీ కేంద్రాలను నిర్వహిస్తోంది.

పెట్టుబడుల ఆధారిత వృద్ధికి మార్గం

- ద్రవ్య, పరపతి చర్యలు అనుకూలిస్తాయ్
- బలంగా ఆర్థిక కార్యకలాపాలు
- ఆర్‌బీఐ బులెటిన్ వెల్లడి

ముంబై: ఈ ఏడాది ఇప్పటి వరకు తీసుకున్న ద్రవ్య, పరపతి పరమైన విధాన చర్యలు అధిక ప్రైవేటు పెట్టుబడులకు, ఉత్పాదకతకు, నిలకడైన వృద్ధికి మార్గం సుగమం చేస్తాయని ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది. అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితులు, వెలుపలి ఒత్తిడులు కొనసాగుతున్నా, భారత్ ఆర్థిక వ్యవస్థ దృఢంగా నిలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి ఇంకా అధిక స్థాయిలోనే ఉన్నట్టు నవంబర్ నెల ఆర్‌బీఐ బులెటిన్ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అధిక ఉత్సాహం స్థిరత్వానికి ప్రమాదం కలిగించే అవకాశముందన్న ఆందోళన వ్యక్తం చేసింది. ''అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులున్నా, భారత ఆర్థిక కార్యకలాపాలు మరింత వేగాన్ని సూచిస్తున్నాయి. అక్టోబర్‌లో తయారీ, సేవల రంగాలు బలంగా విస్తరించాయి. పండుగల డిమాండ్, జీఎస్టీ సంస్కరణల సానుకూల ప్రభావం ఇందుకు తోడ్పడ్డాయి''అని ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది.

కనిష్ట స్థాయిలో ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం చరిత్రలో అత్యంత తక్కువ స్థాయిలో, ఆర్‌బీఐ లక్ష్యానికి దిగువనే ఉన్నట్టు ఆర్‌బీఐ బులెటిన్ గుర్తు చేసింది. ప్రపంచవ్యాప్తంగా విధానపరమైన అనిశ్చితులు, ఎగుమతులకు సంబంధించి అడ్డంకులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలంగా ఉన్నట్టు తెలిపింది. ''వెలుపలి షాక్‌లను ఎదుర్కొగల సామర్థ్యం పెరుగుతోంది. బలమైన సేవల ఎగుమతులు, ప్రవాస భారతీయుల నుంచి అధిక రెమిటెన్స్‌లు, చమురు ధరలు తగ్గడం, పునరుత్పాదక ఇంధన వనరుల వాటా పెరగడం ఇందుకు మద్దతు నిస్తున్నాయి''అని వివరించింది. 2025–26 క్యూ1లో కరెంట్ ఖాతా లోటు జీడీపీలో మోస్తరు స్థాయికి పరిమితమైనట్టు పేర్కొంది.

అధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే అధికంగా ఉన్నట్టు ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది. సింగపూర్, మారిషస్, యుఏఈ, లక్సెంబర్గ్, ఖతార్ దేశాల నుంచి వచ్చిన ఎఫ్‌డీఐ మొత్తం ఎఫ్‌డీఐ రాకలో 78 శాతంగా ఉన్నట్టు పేర్కొంది. ముఖ్యంగా తయారీ, రిటైల్-హోల్‌సేల్ వాణిజ్యం, కమ్యూనికేషన్, ఫైనాన్షియల్ సర్వీసులు, కంప్యూటర్ సేవల్లోకి ఎక్కువ ఎఫ్‌డీఐ వచ్చినట్టు తెలిపింది. సెప్టెంబర్‌లో ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ 7.91 బిలియన్ల డాలర్లను విక్రయించినట్టు పేర్కొంది.

ఏఐతో ఎంతో సమయం ఆదా

- ఇది హైప్ కాదు
- షిప్‌రాకెట్ సీఈవో సాహిల్ గోయెల్

న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ) అంటే ఏదో హైప్ కాదని, దీని వల్ల ఎంతో సమయం అవుతోందని లాజిస్టిక్స్ టెక్ సంస్థ షిప్‌రాకెట్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో సాహిల్ గోయల్ తెలిపారు. దాన్ని చెడుగా భావించకుండా, సద్వినియోగం చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలో కీలక మార్పులు తెచ్చే సత్తా ఏఐకి ఉందనే విషయం గుర్తెరగాలని ఆయన చెప్పారు. ఏఐ కంపెనీల వేల్యుయేషన్లపై విమర్శలు, ఇది ఎప్పుడైనా పేలిపోయే బుడగలాంటిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో గోయల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏఐ వేల్యుయేషన్స్ అనేవి మార్కెట్‌కి సంబంధించినవని, దీన్ని విస్తృత ఉపయోగాల గురించి వేరుగా చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. దీర్ఘకాలంలో ఏఐ సాధనాలు మనకు అనుకూలంగా పని చేస్తాయన్నారు. కృత్రిమ మేథతో రోబోటిక్స్‌లో కూడా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని గోయల్ తెలిపారు. దీని గురించి ప్రజలు తెలుసుకుని, నేర్చుకుని, ఉపయోగించడం మొదలుపెట్టాలని గోయల్ పేర్కొన్నారు.

వచ్చే ఏడాది 26 కొత్త విమానాలు

ఎయిరిండియా సీఈవో విల్సన్ వెల్లడి

గురుగ్రాం: వచ్చే ఏడాది (2026) ఆఖరు నాటికి కొత్తగా 26 విమానాలను సమకూర్చుకునే అవకాశం ఉందని ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. అలాగే అప్‌గ్రేడ్ చేసిన విమానాలతో 81 శాతం ఇంటర్నేషనల్ సర్వీసులను నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అయితే, మొత్తం మీద విమాన ప్రయాణికుల సంఖ్యలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని వివరించారు. 'ఏఐ 171 క్రాష్ కావచ్చు లేదా ఇతరత్రా పరిస్థితులు కావచ్చు గత కొద్ది నెలలుగా ఎదురైన ప్రతికూలతలు ఎలా ఉన్నా, 2026లో ఎయిరిండియాలో సుస్పష్టమైన మార్పులు కనిపిస్తాయి. మేము పెట్టుబడుల ప్రణాళికలను కొనసాగిస్తున్నాం' అని విల్సన్ చెప్పారు. 'కొత్త విమానాలను వస్తున్నా, కొన్ని విమానాలను లీజుదార్లకు తిరిగి ఇచ్చేయనుండటం, చాలా మటుకు విమానాలకు రెట్రోఫిట్ చేస్తుండటం వల్ల వచ్చే ఏడాది ప్రయాణికుల సంఖ్యాపరంగా పెద్దగా మార్పు ఉండకపోవచ్చు' అని ఆయన పేర్కొన్నారు. ఎయిరిండియా గ్రూప్‌లో ప్రస్తుతం 300 విమానాలు (ఎయిరిండియాకి 187, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కి 110 విమానాలు) ఉన్నాయి. ఎయిరిండియా వద్ద సుదీర్ఘ దూరాలకు ప్రయాణించగలిగే బోయింగ్ 777 విమానాలు 22, అలాగే బోయింగ్ 787 రకం విమానాలు 32 ఉన్నాయి. వచ్చే ఏడాది ఎయిరిండియాకు 20 చిన్న విమానాలు, 6 పెద్ద ఎయిర్‌క్రాఫ్ట్ అందుబాటులోకి వస్తాయని విల్సన్ చెప్పారు. 2026 ఆఖరు నాటికి బోయింగ్ 787 విమానాల్లో మూడింట రెండొంతుల ఎయిర్‌క్రాఫ్ట్‌లు అప్‌గ్రేడ్ అవుతాయని వివరించారు.

మూడేళ్లలో సానుకూల రాబడులు

- ఏఐపై 93 శాతం దేశీ సంస్థల ధీమా
- ఈ ఏడాది 31 మిలియన్ డాలర్ల పెట్టుబడులు
- శాప్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ)తో చేకూరే ప్రయోజనాలు, విలువ, అవకాశాలపై వ్యాపార వర్గాలు చాలా ఆశావహంగా ఉన్నాయి. ఏఐపై పెట్టిన పెట్టుబడులపై మూడేళ్ల వ్యవధిలోపే సానుకూల రాబడులు వస్తాయనే అంచనాలతో ఉన్నాయి. ఏఐ వినియోగంపై ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం శాప్ నిర్వహించిన సర్వేలో 93 శాతం భారతీయ సంస్థలు ఈ విధంగా సానుకూల అభిప్రాయాలను వ్యక్తపర్చాయి. కంపెనీ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం టెక్‌ఎడ్ 2025లో ఆవిష్కరించిన నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా వ్యాపార సంస్థలు, అంతర్జాతీయ సగటు కన్నా అధికంగా, ఈ ఏడాది ఏఐపై సుమారు 31 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. ప్రధానంగా సాఫ్ట్‌వేర్, మౌలిక సదుపాయాలు, నిపుణులు, కన్సల్టింగ్‌పై ఎక్కువగా వెచ్చించనున్నాయి. అంతర్జాతీయంగా ఇది సగటున 26.7 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇక మిగతా దేశాలన్నింటితో పోలిస్తే భారత్‌లో అత్యధికంగా 93 శాతం సంస్థలు ఏఐపై చేస్తున్న పెట్టుబడులపై వచ్చే మూడేళ్ల లోపే సానుకూల రాబడులు వస్తాయనే ధీమా వ్యక్తం చేశాయి.

'ఏఐతో కంపెనీలు ఇప్పటికే చెప్పుకోతగిన స్థాయిలో ప్రయోజనం పొందుతున్నాయి. 2025లో ఏఐ కార్యక్రమాలపై చేసిన పెట్టుబడుల మీద సగటున 15 శాతం రాబడి (ఆర్‌వోఐ) అందుకుంటున్నట్లు తెలిపాయి. వచ్చే రెండేళ్లలో ఇది 31 శాతానికి చేరొచ్చనే అంచనాలు ఉన్నాయి' అని నివేదిక తెలిపింది. ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్‌తో కలిసి నిర్వహించిన సర్వేలో ఎనిమిది దేశాల నుంచి 1,600 మంది సీనియర్ బిజినెస్ లీడర్లు పాల్గొన్నారు. వీరిలో భారత్ నుంచి 200 మంది ఉన్నారు.

రిపోర్ట్‌లో మరిన్ని విశేషాలు..

- మెజారిటీ కంపెనీలు 2030 నాటికల్లా వ్యాపార ప్రక్రియలు, నిర్ణయాలు, కస్టమర్లకు అందించే సేవల్లో ఏఐ కీలకంగా ఉంటుందని విశ్వసిస్తున్నాయి. కేవలం మూడు శాతమే దీనికి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేశాయి.
- చాలా మటుకు కంపెనీలు ఏఐ ఆటోమేషన్‌ను పెంచుకుంటున్నాయి. జనరేటివ్ ఏఐతో ప్రయోగాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నేడు 23 శాతం వ్యాపార ప్రక్రియలకు కృత్రిమ మేథ కీలకంగా మారింది. వచ్చే రెండేళ్లలో ఇది 41 శాతానికి పెరగనుంది.
- భారత్‌లో సవాళ్ల విషయానికొస్తే.. ఏఐ వినియోగం అక్కడక్కడే ఉంటోంది. 48 శాతం కంపెనీలు కొద్ది కొద్దిగా సందర్భాన్ని బట్టి ఇన్వెస్ట్ చేస్తుండగా, 27 శాతం సంస్థలు విభాగాలవ్యాప్తంగా ఏఐ కార్యక్రమాలు చేపడుతున్నాయి. భారీగా వినియోగించుకోవాలంటే, ఏఐ నైపుణ్యాల లేమి ప్రధాన అవరోధంగా ఉంటోంది.
- 67 శాతం సంస్థల్లో 'షాడో ఏఐ' గురించి ఆందోళన నెలకొంది. తప్పుడు ఫలితాలు (63 శాతం), డేటా లీకేజీ (53 శాతం), సెక్యూరిటీపరంగా బలహీనత (42 శాతం), నిబంధనల ఉల్లంఘన (34 శాతం) తదితర అంశాలపరమైన రిస్కులను కంపెనీలు పరిశీలిస్తున్నాయి. ఐటీ విభాగం క్లియరెన్స్ లేదా పర్యవేక్షణ లేకుండా సిబ్బంది లేదా ఎండ్ యూజర్లు అనధికారికంగా ఏఐ సాధనాలను వినియోగించడాన్ని 'షాడో ఏఐ'గా వ్యవహరిస్తారు.

ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎంలో 18% వృద్ధి

- 2027 మార్చి నాటికి రూ.50 లక్షల కోట్లు
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా

ముంబై: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) తమ నిర్వహణ ఆస్తుల్లో 18 శాతం వృద్ధిని కొనసాగిస్తాయని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. కొన్ని విభాగాల్లో రుణపరమైన ఒత్తిళ్లు నెలకొన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈమేరకు వృద్ధి సాధ్యమేనని పేర్కొంది. మొత్తం మీద ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) 2027 మార్చి నాటికి రూ.50 లక్షల కోట్లకు చేరుకుంటాయని అంచనా వేసింది. కస్టమర్ లెవరేజ్ అధికమైన నేపథ్యంలో (సామర్థ్యానికి మించి రుణ భారం) ముఖ్యంగా ఎంఎస్ఎంఈ, అన్‌సెక్యూర్డ్ రుణ విభాగాల్లో ఎన్‌బీఎఫ్‌సీలు రిస్కును సమతుల్యం చేస్తూ వృద్ధిని సాధించడంపై దృష్టి సారిస్తాయని క్రిసిల్ రేటింగ్స్ చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కృష్ణన్ సీతారామన్ తెలిపారు.

వ్యక్తిగత రుణాల్లో 25 శాతం వృద్ధి..

- వ్యక్తిగత రుణాలలో (ఎన్‌బీఎఫ్‌సీ ఏయూఎంలో 11 శాతం) వృద్ధి గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న 18 శాతం నుంచి 22–25 శాతానికి పెరుగుతుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. 2023–24లో నమోదైన 37 శాతం వృద్ధి కంటే తక్కువేనని పేర్కొంది.
- జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణ, ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయిల్లో ఉండడం రిటైల్ రుణాల డిమాండ్‌ను పెంచుతుందని తెలిపింది.
- ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎంలో అన్‌సెక్యూర్డ్ ఎంఎస్ఎంఈ రుణాలు 6 శాతంగా ఉంటాయంటూ, ఇందులో సకాలంలో చెల్లింపులు చేయని రుణాలు పెరుగుతున్నట్టు పేర్కొంది. దీని ఫలితంగా ఏయూఎంలో వృద్ధి గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఉన్న 31 శాతం నుంచి 13–14 శాతానికి తగ్గనున్నట్టు వెల్లడించింది.
- ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎంలో 15 శాతం వాటా కలిగిన లోన్ ఎగైనెస్ట్ ప్రాపర్టీ (ప్రాపర్టీ తనఖాపై రుణం) రుణాల్లో 26–27 శాతం వృద్ధి ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో నమోదు అవుతుందని అంచనా వేసింది. - బంగారం రుణ విభాగం (ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎంలో 6 శాతం) ఇక ముందూ బలమైన వృద్ధిని కొనసాగిస్తుందని తెలిపింది. బంగారం రుణ మార్కెట్ అసంఘటిత రంగం నుంచి సంఘటితం వైపు మళ్లుతుండడం, ఈ విభాగం విస్తరణకు మద్దతునిస్తుందని పేర్కొంది.

గృహ రుణాల్లో ప్రభుత్వరంగ బ్యాంకుల ఆధిపత్యం

సెప్టెంబర్ త్రైమాసికంలో 50 శాతం వాటా

ముంబై: గృహ రుణ మార్కెట్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో జారీ అయిన మొత్తం గృహ రుణాల విలువలో 50 శాతం ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచే ఉన్నట్టు క్రిఫ్ హైమార్క్ సంస్థ వెల్లడించింది. ప్రైవేటు రంగ బ్యాంక్‌లను ఈ విభాగంలో ప్రభుత్వరంగ బ్యాంకులు అధిగమించినట్టు తెలిపింది. ఇక మొత్తం రుణాల్లో 40 శాతం రూ.75 లక్షలకు మించిన గృహ రుణాలే ఉన్నాయి. మొత్తం యాక్టివ్ రుణాలు (చెల్లింపులు కొనసాగుతున్నవి) 3.3 శాతం పెరిగి 2.29 కోట్లకు చేరాయి. రిటైల్ రుణాల్లో అతిపెద్ద విభాగమైన గృహ రుణాల మార్కెట్ సెప్టెంబర్ త్రైమాసికంలో 11.1 శాతం పెరిగి రూ.42.1 లక్షల కోట్లకు చేరింది. కన్జ్యూమర్ డ్యూరబుల్ రుణాల విభాగంలో డిమాండ్ స్తబ్దుగా ఉందంటూ.. 10.2 శాతం వృద్ధి కనిపించినట్టు క్రిఫ్ హైమార్క్ నివేదిక తెలిపింది. 31 నుంచి 180 రోజుల వరకు చెల్లింపుల్లేని వినియోగ రుణాలు జూన్ చివరికి 3.1 శాతంగా ఉంటే, సెప్టెంబర్ చివరికి 3 శాతానికి తగ్గాయి.

ఎస్‌బీఐ వెంచర్ ఫండ్ నిధుల సమీకరణ

- మూడో పర్యావరణహిత ఫండ్‌కు రెడీ
- రూ. 2,000 కోట్ల పెట్టుబడులపై దృష్టి

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ)కు చెందిన ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజర్ ఎస్‌బీఐ వెంచర్స్ మూడో పర్యావరణహిత ఫండ్‌ను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. తద్వారా రూ. 2,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ నిధులను సంబంధిత స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉంది. దీంతో పర్యావరణ పరిరక్షిత వృద్ధికి మద్దతివ్వనున్నట్లు ఎస్‌బీఐ వెంచర్స్ ఎండీ, సీఈవో ప్రేమ్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఐవీసీఏ గ్రీన్ రిటర్న్స్ రెండో సదస్సు సందర్భంగా ఇది కొత్త ఫైనాన్షియల్ అవకాశమని తెలియజేశారు. దీనిలో దేశ, విదేశీ ఇన్వెస్టర్లను భాగస్వాములను చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా పెట్టుబడులను ఆకట్టుకునేందుకు వచ్చే ఏడాది మొదట్లో రోడ్‌షోలకు తెరతీయనున్నట్లు తెలియజేశారు.

మార్చికల్లా

కొత్త కేలండర్ ఏడాది(2026) తొలి త్రైమాసికం(జనవరి–మార్చి)లో క్లయిమేట్ ఫండ్‌ను ఆవిష్కరించడం ద్వారా రూ. 2,000 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభాకర్ వెల్లడించారు. నిధులను ప్రధానంగా తొలి దశ, వృద్ధిస్థాయిలో ఉన్న క్లయిమేట్ ఫోకస్‌డ్ స్టార్టప్‌లలో పెట్టుబడులకు వినియోగించనున్నట్లు వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణమైన సాంకేతికతలు, ఏఐ ఆధారిత క్లయిమేట్ ఆవిష్కరణలకు తెరతీసే స్టార్టప్‌లకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

విజయోత్సవ వేడుక

అంధుల టి20 ప్రపంచ కప్ గెలుచుకున్న భారత మహిళల జట్టు విజయోత్సవ సంబరాలు చేసుకుంది. కొలంబో నుంచి బెంగళూరు చేరుకున్న అనంతరం సోమవారం హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జట్టు సభ్యులు కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కొలంబోలో ఆదివారం జరిగిన ఫైనల్లో నేపాల్‌ను ఓడించిన భారత బృందం వరల్డ్ కప్ సాధించింది.

మన షట్లర్లకు మరింత ఫిట్‌నెస్ అవసరం

సైనా నెహ్వాల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత షట్లర్లు బాగానే రాణిస్తున్నారని, అయితే అంతర్జాతీయ బ్యాడ్మింటన్ స్థాయికి తగ్గ శారీరక ఫిట్‌నెస్‌ను ఇంకాస్త మెరుగుపరుచుకోవాలని భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ సూచించింది. ప్రత్యర్థుల్ని ఓడించే సత్తా మన ఆటగాళ్లకు ఉందని కావాల్సిందల్లా శారీరక దృఢత్వమేనని చెప్పింది. సింగిల్స్‌లో భారత ఆశాకిరణం లక్ష్యసేన్ అని చెప్పింది. ఆమె మాట్లాడుతూ తరచూ గాయాలపాలవడం, అమ్మాయిల్లో దూకుడు లోపించడం, ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో మరింత సుకుమారంగా మారడంపై తన అభిప్రాయాల్ని వ్యక్తపరిచింది. 'మునుపటిలా రాణించాలంటే మనం మరింత నిలకడ సాధించాలి. సాత్విక్–చిరాగ్ జోడీ, లక్ష్యసేన్, సింధు లేదంటే తర్వాతి తరం ఆటగాళ్లెవరైనా సరే ఫిట్‌నెస్‌కు మరింత ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే ఆటలో స్థిరమైన ఫలితాలు సాధించగలం. దీనికోసం మన షట్లర్లు ముందుగా నిష్ణాతులైన కోచ్‌లు, సుశిక్షితులైన ఫిజియోల్ని ఎంచుకోవాలి. అనువైన, అవసరమైన కోచ్‌లు దొరికేవరకూ అన్వేషిస్తూనే ఉండాలి. కచ్చితంగా పాతవారిని మార్చాలి. అప్పుడే వరుసగా టోర్నీలు ఆడేందుకు, టైటిల్స్ గెలిచేందుకు ఫిట్‌నెస్ స్థాయిల్ని అమాంతం పెరిగేందుకు దోహదపడతాయి' అని పేర్కొంది. అంతర్జాతీయ చాంపియన్లు విక్టర్ అక్సెల్సన్, కరోలినా మారిన్‌లు అదే చేశారని, మేటి కోచ్‌లు, ఫిజియోల కోసం పదే పదే ఫిట్‌నెస్, మెంటల్ కండీషనింగ్ కోచ్‌లను మార్చారని సైనా గుర్తు చేశారు.

ఇటలీదే డేవిస్ కప్

ఫైనల్లో స్పెయిన్‌పై ఘన విజయం

బొలోగ్నా (ఇటలీ): పురుషుల టెన్నిస్ ప్రపంచ కప్ టోర్నమెంట్ 'డేవిస్ కప్'లో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ జట్టు విజేతగా నిలిచింది. స్టార్ ప్లేయర్ జానిక్ సినెర్ బరిలోకి దిగకుండగానే ఇటలీ జట్టు వరుసగా మూడో సారి డేవిస్ కప్ కైవసం చేసుకుంది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో ఇటలీ 2–0 తేడాతో స్పెయిన్‌ను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో మాటియో బెర్‌టిని, ఫ్లావియో కొబొలి విజయాలు సాధించడంతో డబుల్స్ మ్యాచ్ ఆడాల్సిన అవసరం లేకుండానే ఇటలీ విజయం సాధించింది. ఇటలీ జట్టు డేవిస్ కప్ కైవసం చేసుకోవడం ఓవరాల్‌గా ఇది నాలుగోసారి కాగా... వరుసగా మూడోసారి. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ టోర్నమెంట్‌లో చివరగా అమెరికా జట్టు 1968 నుంచి 1972 వరకు వరుసగా ఐదు సార్లు చాంపియన్‌గా నిలవగా... ఆ తర్వాత మరే జట్టు 'హ్యాట్రిక్' నమోదు చేయలేదు. గత రెండు సంవత్సరాలు ఇటలీ జట్టు డేవిస్ కప్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన ప్రపంచ రెండో ర్యాంకర్ సినెర్ ఈ సారి బరిలోకి దిగకపోయినా... బెర్‌టిని, కొబొలి చక్కటి ప్రదర్శనతో ఆ జట్టు విజయం సాధించింది. తొలి సింగిల్స్ మ్యాచ్‌లో బెర్‌టిని 6–3, 6–4తో పాబ్లో కరెనో బుస్టా (స్పెయిన్)పై విజయం సాధించగా... రెండో సింగిల్స్ పోరులో కొబొలి 1–6, 7–6 (7/5), 7–5తో జామె మునార్ (స్పెయిన్)పై గెలిచాడు. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై 2–0తో విజయం సాధించిన ఇటలీ... సెమీఫైనల్లో బెల్జియంపై కూడా 2–0తో గెలుపొందింది. మరోవైపు ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్కరాజ్ లేకుండానే స్పెయిన్ బరిలోకి దిగింది. 2019 తర్వాత తొలిసారి ఫైనల్ ఆడిన ఆరుసార్లు చాంపియన్ స్పెయిన్ జట్టు రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.

విలియమ్సన్ పునరాగమనం

వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ఎంపిక

వెల్లింగ్టన్: సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ న్యూజిలాండ్ టెస్టు జట్టులో పునరాగమనం చేశాడు. విదేశీ లీగ్‌ల్లో ఆడేందుకు జాతీయ కాంట్రాక్టుకు దూరమైన విలియమ్సన్... పరిమిత మ్యాచ్‌ల్లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ సీజన్‌లో చాలా మ్యాచ్‌లకు దూరమైన కేన్... వచ్చే నెల 2 నుంచి వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఆడనున్నాడు. దీని కోసం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సోమవారం 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఇప్పటికే వెస్టిండీస్‌పై టి20, వన్డే సిరీస్‌లు నెగ్గిన న్యూజిలాండ్... సొంతగడ్డపై సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ బలమైన జట్టుతో బరిలోకి దిగనుంది. టామ్ లాథమ్ జట్టుకు సారథ్యం వహించనుండగా... కాన్వే, విలియమ్సన్, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, టామ్ బ్లండెల్ బ్యాటింగ్ భారం మోయనున్నారు. విలియమ్సన్ వంటి అనుభవం గల ఆటగాడు జట్టులో ఉండటం ఇతర ఆటగాళ్లకు ఎంతగానో ఉపకరిస్తుందని న్యూజిలాండ్ హెడ్‌కోచ్ రాబ్ వాల్టర్ అన్నాడు. పేస్ బౌలర్లు జాక్ ఫౌల్క్స్, జాకబ్ డఫీ, బ్లెయిర్ టిక్నెర్ జట్టులో చోటు దక్కించుకోగా... గాయం నుంచి పూర్తిగా కోలుకోని కైల్ జెమీసన్‌ను ఈ సిరీస్‌కు పరిగణించలేదు.

అంధుల మహిళల క్రికెట్ జట్టుకు ప్రధాని అభినందన

న్యూఢిల్లీ: తొలిసారి నిర్వహించిన అంధుల మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం సమష్టితత్వం, అంకితభావానికి నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన అంధుల మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో ఆదివారం టీమిండియా 7 వికెట్ల తేడాతో నేపాల్‌పై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. 'మొదటిసారి జరిగిన అంధుల మహిళల టి20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టుకు అభినందనలు. ఓటమి ఎరగకుండా ట్రోఫీ నెగ్గడం మరింత గొప్పవిషయం. ఇది నిజంగా చారిత్రాత్మక విజయం. జట్టు సమష్టి కృషి, పట్టుదలకు ఇది నిదర్శనం. ప్రతీ క్రీడాకారిణీ ఒక చాంపియన్. ఈ ఘనత రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది' అని ప్రధాని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై విజయం సాధించిన భారత్ అంతకుముందు లీగ్ దశలో శ్రీలంక, ఆస్ట్రేలియా, నేపాల్, అమెరికా, పాకిస్తాన్‌పై నెగ్గింది.

ఫైనల్ ప్రారంభానికి ముందు సంప్రదాయ రీతిలో తొలి ఎత్తు వేస్తున్న భారత తొలి ఒలింపిక్ వ్యక్తిగత స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా

ప్రపంచ కప్ చెస్ ఫైనల్ తొలి గేమ్ 'డ్రా'

పనాజీ (గోవా): 'ఫిడే' ప్రపంచ కప్ చెస్ టోర్నీ ఫైనల్ పోరులో తొలి గేమ్ 'డ్రా'గా ముగిసింది. చైనా గ్రాండ్‌మాస్టర్ వె యి, ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ జవోఖిర్ సిండరోవ్ మధ్య ఈ సమరం జరుగుతోంది. నల్ల పావులతో ఆడిన వె యి ప్రత్యర్థిని నిలువరించడంలో సఫలమయ్యాడు. పెట్రోవ్ డిఫెన్స్‌తో మొదలు పెట్టి వె యి...దూకుడుగా ఆడే విధంగా సిండరోవ్‌కు సవాల్ విసిరాడు. ఆట మధ్యలోకి వచ్చే సరికి చైనా జీఎంలో ఆధిక్యం కనిపించింది. అయితే ఒత్తిడికి లోను కాకుండా జాగ్రత్తగా పావులు సిండరోవ్ పావులు కదిపాడు. ఫలితంగా 50 ఎత్తుల తర్వాత 'డ్రా'కు ఇద్దరూ అంగీకరించారు. నేడు ఇద్దరి మధ్య రెండో గేమ్ జరుగుతుంది. తుది ఫలితం తేలకపోతే ఆ తర్వాత 'టైబ్రేక్' నిర్వహిస్తారు. మరో వైపు మూడో స్థానంలో జరుగుతున్న పోరులో ఆంద్రీ ఎసిపెంకో (రష్యా) ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. మొదటి గేమ్‌లో అతను నోదిర్బెక్ యాకుబోవ్ (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించాడు. ఎసిపెంకో దూకుడుగా మొదలు పెట్టగా, సిసిలియన్ డిఫెన్స్‌తో ఆడిన యాకుబోవ్ కోలుకోలేకపోయాడు. ముఖ్యంగా చివర్లో అతనికి తగినంత సమయం లేక వెనుకబడిపోయాడు. చివరకు 38 ఎత్తుల తర్వాత ఎసిపెంకో గెలుపు ఖాయమైంది. నేడు జరిగే రెండో గేమ్‌ను నల్ల పావులతో 'డ్రా' చేసుకున్నా సరే...ఎసిపెంకోకు మూడో స్థానం ఖాయమవుతుంది.

ప్రాంజలి పసిడి గురి

టోక్యో: బధిరుల ఒలింపిక్స్ క్రీడల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. ఈ మెగా టోర్నీలో ఇప్పటికే 15 పతకాలు సాధించిన భారత్ ఖాతాలో తాజాగా మరో పతకం చేరింది. సోమవారం పోటీల్లో ప్రాంజలి ప్రశాంత్ ధుమాల్ పసిడి పతకంతో మెరిసింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ప్రాంజలి స్వర్ణం ఖాతాలో వేసుకుంది. ఇప్పటికే ఈ పోటీల్లో రెండు పతకాలు సాధించిన ప్రాంజలికి ఇది మూడో పతకం కావడం విశేషం. తుదిపోరులో ప్రాంజలి 34 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా... మోసినా హలీనా (32 పాయింట్లు; ఉక్రెయిన్), జియోన్ జివాన్ (30 పాయింట్లు; దక్షిణ కొరియా) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ప్రాంజలి 600 పాయింట్లకుగానూ 573 పాయింట్లు సాధించి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి ఫైనల్‌కు చేరింది. భారత్‌కే చెందిన అనూయా ప్రసాద్ నాలుగో స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన అనూయా... ఫైనల్ షూటౌట్‌లో వెనుకబడింది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటి వరకు 16 పతకాలు సాధించింది. అందులో 7 స్వర్ణాలు, 6 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి. మంగళవారంతో షూటింగ్ పోటీలు ముగియనుండగా... చివరి రోజు పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ పోటీలు జరగనున్నాయి.

మళ్లీ మైదానంలోకి ధావన్, హర్భజన్

లెజెండ్స్ ప్రొ టి20 లీగ్ ఆడనున్న మాజీ ఆటగాళ్లు

- వచ్చే ఏడాది జనవరి 26 నుంచి టోర్నీ ప్రారంభం

LEGENDS PRO T20 LEAGUE

న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్ సహా పలువురు దిగ్గజ ఆటగాళ్లు లెజెండ్స్ ప్రొ టి20 లీగ్ బరిలోకి దిగనున్నారు. గోవా వేదికగా వచ్చే ఏడాది జనవరి 26 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఈ లీగ్ జరగనుంది. భారత మాజీ ఆటగాళ్లతో పాటు పలువురు అంతర్జాతీయ దిగ్గజాలు సైతం ఈ లీగ్‌లో భాగస్వాములు కానున్నారు. దక్షిణాఫ్రికా పేస్ గన్ డేల్ స్టెయిన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ ఈ జాబితాలో ఉన్నారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ లీగ్ కమిషనర్‌గా వ్యవహరించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీ గ్రూప్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ లీగ్‌లో మొత్తం 6 ఫ్రాంచైజీలు పోటీపడుతున్నాయి. అన్నీ జట్లలో కలిపి 90 మంది లెజండరీ ప్లేయర్లు పాల్గొననున్నారు. 'క్రికెట్‌కు అతిపెద్ద నిలయంగా ఉన్న భారతదేశం నాకు ప్రత్యేక స్థానాన్ని ఇచ్చింది. ఈ లీగ్‌లో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నా. ఇక్కడి అభిమానులకు ఆటపై అభిరుచి ఎక్కువ. ఈ లీగ్ ద్వారా పలువురు పాత మిత్రులతో పాటు, గతంలో హోరాహోరీగా తలపడిన ప్రత్యర్థులను తిరిగి కలిసే అవకాశం లభించనుంది. లెజెండ్స్ ప్రొ టి20 లీగ్‌లో కొత్త పాత్రలో భాగం కావడం సంతోషంగా ఉంది' అని క్లార్క్ పేర్కొన్నాడు.

సత్తా చాటేందుకు శ్రీకాంత్, ప్రణయ్ సిద్ధం

నేటి నుంచి సయ్యద్ మోడి టోర్నీ

లక్నో: పదునెక్కిన యువ షట్లర్లతో పోటీ పడేందుకు సీనియర్ స్టార్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్. ప్రణయ్ సై అంటున్నారు. నేటి నుంచి జరిగే సయ్యద్ మోడి ఇంటర్నేషనల్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. తద్వారా ఈ సీజన్‌ను టైటిల్‌తో ముగించాలని సీనియర్ బ్యాడ్మింటన్ స్టార్లు ఆశిస్తున్నారు. అయితే యూఎస్ ఓపెన్ చాంపియన్ ఆయుశ్ షెట్టి చివరి నిమిషంలో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. పక్కటెముకల గాయంతో గతనెల యూరోపియన్ అంచె పోటీలకు దూరంగా ఉన్న ప్రణయ్ ఈ టోర్నీతో లయ అందుకోవాలనుకుంటున్నాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన ప్రణయ్ జపాన్ మాస్టర్స్, ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగినప్పటికీ ఈ రెండు ఈవెంట్లలోనూ రెండో రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. అయితే ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్‌గా దిగుతున్న ప్రణయ్ తొలి రౌండ్‌లో కెవిన్ తంగమ్‌తో పోటీపడనున్నాడు. ఐదో సీడ్ శ్రీకాంత్... మిరాబ లువాంగ్ మైస్నమ్‌తో ఆట ప్రారంభించనున్నాడు. మిగతా వారిలో తరుణ్ మన్నేపల్లిపై ఆసక్తి నెలకొంది. ఆరో సీడ్ తరుణ్... సతీశ్ కుమార్ కరుణాకరన్‌తో, శంకర్ ముత్తుస్వామి... మన్‌రాజ్ సింగ్‌తో తలపడనున్నారు. మిథున్ మంజునాథ్ కజకిస్తాన్‌కు చెందిన డిమిత్రి పనరిన్‌తో, రాహుల్ భరద్వాజ్... తరుణ్ రెడ్డితో, కిరణ్ జార్జ్ ఇజ్రాయెల్ ప్లేయర్ డానిల్ డుబొవెంకోతో ఆలాప్ మిశ్రా థాయ్‌లాండ్ షట్లర్ కంతపాన్ వాంగ్చరాన్‌తో పోటీపడతారు. రిత్విక్ సంజీవికి తొలి రౌండ్లోనే క్లిష్టమైన డ్రా ఎదురైంది. అతను సింగపూర్‌కు చెందిన టాప్‌సీడ్ జియా హెంగ్ జేసన్‌ను ఎదుర్కోనున్నాడు. మహిళల సింగిల్స్‌లో అంతర్జాతీయ స్టార్, మాజీ ప్రపంచ చాంపియన్ నజోమి ఒకుహర (జపాన్) బరిలో నిలవడం విశేషం. భారత్ తరపున ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, మాజీ ప్రపంచ జూనియర్ నంబర్‌వన్ తస్నిమ్ మీర్‌లు కూడా పోటీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ జూనియర్ రజత పతక విజేత తన్వీ శర్మ... అష్మిత చాలిహాతో, ఎనిమిదో సీడ్ అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్, ఇషారాణి, మాన్సి సింగ్, శ్రీయాన్షి వాలిషెట్టి, దేవిక సిహాగ్, రక్షితశ్రీ, సంతోష, శ్రేయ లేలేలు సింగిల్స్ ఈవెంట్‌లో పోటీపడనున్నారు. మహిళల డబుల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుల్లెల గాయత్రీ–ట్రెసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్–రుత్విక శివాని జోడీలు సైతం బరిలో దిగుతున్నాయి.

మెస్సీ @ 1300

అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. కెరీర్‌లో 1300 గోల్స్‌లో భాగస్వామి అయిన ప్లేయర్‌గా మెస్సీ నిలిచాడు. ఇందులో మెస్సీ నేరుగా 896 గోల్స్ చేయడంతో పాటు... మరో 404 గోల్స్‌కు సహకరించాడు. ఈ జాబితాలో పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో 1213 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు.

సుప్రీంకోర్టు సీజేగా ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో జస్టిస్ సూర్యకాంత్ కరచాలనం

మాజీ సీజేఐ గవాయ్‌తో జస్టిస్ సూర్యకాంత్

ప్రమాణ స్వీకారం అనంతరం సోదరి దీవెనలు అందుకుంటూ..

శని వలయాలు 'కనిపించుట' లేదు!

శని. అందమైన వలయాలతో సౌరకుటుంబం మొత్తంలోనూ అత్యంత ప్రత్యేకంగా కన్పించే గ్రహం. అది కాస్తా తాజాగా భారీ మార్పుచేర్పులకు లోనవుతోంది. అంటే మరేమీ లేదు. శని గ్రహం చుట్టూ అందంగా చుట్టుకుని కన్పించే వలయాలు దాదాపుగా 'మటుమాయం'అయిపోతున్నాయి! ఆదివారం రాత్రి వినువీధిలోకి విహంగవీక్షణం చేసిన ఔత్సాహికులందరికీ ప్రపంచవ్యాప్తంగా ఈ పరిణామం కొట్టొచ్చినట్టుగా కన్పించి ఆశ్చర్యపరిచింది. అయితే అంతమాత్రాన శని గ్రహానికి నిజంగానే ఏదో 'శని'దాపురించిందని మనమెవరమూ ఆందోళన పడాల్సిన పనేమీ లేదట! ఎందుకంటే దాని వలయాలు నిజానికి ఎటూ మాయం కాలేదని ఖగోళ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ''అది కేవలం మన దృక్ భ్రాంతి మాత్రమే. ఎందుకంటే ప్రస్తుతం శని భూమికి ఏటవాలు కోణంలో ఉంది. దాంతో దాని తాలూకు వలయాలు భూమి నుంచి కన్పించడం తాత్కాలికంగా దాదాపు అసాధ్యంగా మారింది. మరీ ముఖ్యంగా ఔత్సాహికులు ఉపయోగించే చిన్నాచితకా టెలిస్కోపుల సాయంతో వాటిని చూడటం కనాకష్టం''అని వారు వివరించారు.

'రింగ్'క్రాసింగ్!

ప్రస్తుతం భూమి నుంచి చూస్తే శని వలయాలు మాయమైనట్టు కన్పించేందుకు రింగ్ ప్లేన్ క్రాసింగ్‌గా పేర్కొనే అరుదైన దృగ్విషయమే కారణమట. ఈ సమయంలో భూమి సరిగ్గా శని గ్రహం తాలూకు వలయాల తలానికి సమాంతరంగా పయనిస్తుందని సైంటిస్టులు చెప్పుకొచ్చారు. దాంతో ఈ సమయంలో భూమి నుంచి చూస్తే ఆ వలయాలు పైనుంచో, కిందినుంచో కాకుండా సరిగ్గా ఒక పక్కనుంచి మాత్రమే కన్పిస్తాయి. దాంతో అవక్కడ లేవనే అనిపిస్తుంది.

అదీ సంగతి!

ఎంత రింగ్ క్రాసింగ్ ప్రభావమైనా సరే, అంత పెద్ద శని గ్రహాన్ని పాముల మాదిరిగా

చుట్ట చుట్టుకుని ఉండే అందాల వలయాలు కన్పించకుండా పోవడం ఏమిటని అనిపించడం సహజమే. కాకపోతే అందుకు సహేతుకమైన కారణం కూడా లేకపోలేదని సైంటిస్టులు చెబుతున్నారు. ''శని వలయాలు ఏకంగా 2.8 లక్షల కిలోమీటర్ల వ్యాసంతో కూడుకుని ఉంటాయి. కానీ అంతా చేస్తే వాటి మందం మాత్రం కేవలం కొన్ని పదుల మీటర్లే! పైగా ఈ దశలో వాటినుంచి భూమికేసి వెలువడే సూర్యరశ్మి కూడా అత్యంత స్వల్పం. వెరసి సుదూరంలో ఉన్న మన భూ గ్రహం నుంచి వాటిని సమాంతరంగా, అంటే ఒక పక్కగా చూసినప్పుడు దాదాపుగా కన్పించవు. దాంతో అవసలు లేవనే అన్పిస్తుంది''అని వివరించారు.

సమాన వంపు కోణం!

శని అక్షం కూడా భూ అక్షం మాదిరిగానే సరిగ్గా 26.7 డిగ్రీల కోణంలో వంపు తిరిగి ఉంటుంది. దీనికి తోడు సూర్యుని చుట్టూ పరిభ్రమించేందుకు శనికి ఏకంగా 29.4 ఏళ్లు పడుతుంది. దాంతో రెండు గ్రహాల పరిభ్రమణ క్రమంలో భూమి నుంచి మనం శని వలయాలను చూసే కోణం విపరీతంగా మారుతూ ఉంటుంది. ఆ క్రమంలో కొన్నేళ్లపాటు అవి సాధారణ టెలిస్కోపుల నుంచి కూడా మనకు కొట్టొచ్చినట్టుగా కనువిందు చేస్తాయి. కాకపోతే ప్రతి 13 నుంచి 15 ఏళ్లకోసారి మాత్రం కొంతకాలం పాటు ఇలా అసలు కన్పించకుండా పోతాయి. అసలున్నాయా, లేవా అనిపిస్తాయి. ఈ ఏడాది మార్చి 23న తొలిసారి రింగ్‌ప్లేన్ క్రాసింగ్ జరిగింది. కానీ అది ఉదయం పూట కావడంతో భూమి నుంచి దాదాపుగా కన్పించకుండా పోయింది. తాజాగా ఆదివారం మాత్రం ఈ పరిణామం సాయం సమయంలో జరగడంతో అందరికీ కనువిందు చేసిందన్నమాట. మరో ఐదేళ్లకల్లా, అంటే 2030 నాటికి శని వలయాలు భూమి నుంచి ఎప్పట్లా మళ్లీ పూర్తిస్థాయిలో కనువిందు చేయనున్నాయి.

కొసమెరుపు:

శని తాలూకు వలయాలు చిక్కిపోవడం నిజానికి నిజమేనట. అవి కొన్ని లక్షల ఏళ్లుగా నెమ్మదిగా క్రమక్షయానికి గురవుతూ వస్తున్నాయట. దీన్ని సైంటిస్టులు ముద్దుగా వలయ వర్షం (రింగ్ రెయిన్)గా పిలుచుకుంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఈసీ తీరుపై మమతా బెనర్జీ ఆగ్రహం

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు లేఖ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర ఎన్నికల పనితీరులో తక్షణం జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. పోల్ డేటా ఎంట్రీ కోసం కాంట్రాక్ట్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బంగ్లా సహాయత కేంద్ర సిబ్బందిని నియమించవద్దంటూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఇటీవల జారీ చేసిన ఆదేశాలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాదు.. ప్రైవేట్ గృహ సముదాయాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఆమె వ్యతిరేకించారు. ఈ చర్యలన్నీ ఒక రాజకీయ పార్టీ స్వార్థ ప్రయోజనాల కోసం, ఆ పార్టీ ఆదేశం మేరకు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఇప్పటికే జిల్లా కార్యాలయాల్లోని సమర్థులైన నిపుణులు ఈ విధులు నిర్వహిస్తుండగా ఇతర సంస్థలకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వడం ఎందుకని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రాల్లోని ఫీల్డ్ ఆఫీసులు తమ అవసరానికి అనుగుణంగా సొంతంగా కాంట్రాక్టు డేటా ఎంట్రీ సిబ్బందిని నియమించుకుంటాయని, ఆ నియామకాలను చేపట్టే అధికారం జిల్లా ఎన్నికల అధికారులకుందని ఆమె తెలిపారు. కొత్త ఆదేశాలు మాత్రం చట్టబద్ధమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అంతేకాదు. ప్రైవేట్ నివాస సముదాయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయవచ్చనే విధానంపైనా ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాలెప్పుడూ ప్రభుత్వ లేదా పాక్షిక ప్రభుత్వ సంస్థల కార్యాలయాల్లోనే ఏర్పాటు చేస్తారని, ఈ కొత్త ప్రతిపాదన సమస్యాత్మకంగా ఉందన్నారు. ప్రైవేట్ నివాస సముదాయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల అవి నిబంధనలు ఉల్లంఘించే అవకాశం ఉందని, ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని మమతా బెనర్జీ హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ గౌరవానికి భంగం వాటిల్లకుండా ఈ అంశాలను అత్యంత నిస్పక్షపాతంగా, పారదర్శకంగా పరిశీలించాలని ఆమె కోరారు.

కోచింగ్ సెంటర్ల విస్తరణపై పార్లమెంట్ కమిటీ

- సమీక్షించి, తగు సూచనలు చేయనున్న కమిటీ
- విద్యార్థుల బలన్మరణాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల శిక్షణకు దేశవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కోచింగ్ సెంటర్లపై పార్లమెంటరీ కమిటీ దృష్టి సారించనుంది. కోచింగ్ సెంటర్లలో ఒత్తిడి కారణంగా పెరుగుతున్న విద్యార్థుల బలవన్మరణాల ఘటనలు, వాటితో తలెత్తుతున్న సామాజిక సమస్యలను ఈ కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయనుంది. విద్య, మహిళలు, చిన్నారులు, యువత, క్రీడలకు సంబంధించిన ఈ స్టాండింగ్ కమిటీ విద్య, విద్యార్థిపై కృత్రిమ మేధ(ఏఐ) వంటి అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికత ప్రభావాన్ని కూడా పరిశీలించనుంది. 2025–26లో పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకంపై కమిటీ సమీక్ష చేపడుతుందని ఇటీవల లోక్‌సభ జారీ చేసిన ఒక బులెటిన్‌లో తెలిపింది. పోటీ పరీక్షల కోసం కోచింగ్ కేంద్రాల్లో విద్యార్థులు సన్నద్ధులు కావడం, అందుకు సంబంధిత సామాజిక అంశాలు, ప్రస్తుతమున్న చట్టాలను కూడా ఈ కమిటీ పరిశీలించనుంది. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ప్రభుత్వం తరఫున జరుగుతున్న ప్రయత్నాలపైనా సమీక్ష జరపనుంది. దేశ కోచింగ్ రాజధానిగా పేరున్న రాజస్తాన్‌లోని కోటా సహా వివిధ ప్రాంతాల్లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఇటీవల 9 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. కోచింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలతోపాటు ప్రవేశ పరీక్షల నిష్పాక్షికత, ప్రభావశీలతను పరిశీలించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించింది. ఈ కమిటీ పాఠశాల విద్యా వ్యవస్థపై కోచింగ్ కేంద్రాల పెరుగుదల ప్రభావాన్ని కూడా అధ్యయనం చేయనుంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) పనితీరు, సామర్థ్యాలను కూడా కమిటీ సమీక్షించనుందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. ప్రత్యేకంగా హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(హెచ్ఈసీఐ) ఏర్పాటుకు చేపట్టిన ప్రయత్నాల గురించి విద్యాశాఖ నుంచి వివరాలు తెలుసుకుంటుంది. యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల స్థానంలో హెచ్ఈసీఐను తెచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును డిసెంబర్ ఒకటి నుంచి మొదలయ్యే పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్రం ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుండటం తెల్సిందే.

వాంగ్‌చుక్ నిర్బంధంపై విచారణ 8కి వాయిదా

న్యూఢిల్లీ: ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సవాల్ చేస్తూ ఆయన భార్య వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు డిసెంబర్ 8వ తేదీకి వాయిదా వేసింది. సెప్టెంబర్ 24వ తేదీన లేహ్‌లో జరిగిన హింసాత్మక ఘటనలకు వాంగ్‌చుక్ చర్యలతో గానీ ప్రసంగాలతో గానీ ఎటువంటి సంబంధం లేదని గీతాంజలి జె.అంగ్మో పేర్కొన్నారు. వాంగ్‌చుక్ అరెస్ట్ అక్రమం, ఏకపక్షం, ప్రాథమిక హక్కులకు భంగకరమని ఆమె పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. అయితే, దీనిపై స్పందించేందుకు తమకు మరింత గడువు కావాలంటూ కేంద్రం, కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరగా ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. డిసెంబర్ 8వ తేదీన తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. డాక్టర్ గీతాంజలి పిటిషన్‌పై సమాధానమివ్వాలంటూ అక్టోబర్ 29వ తేదీన కేంద్రం, లద్దాఖ్ యంత్రాంగాన్ని సుప్రీంకోర్టు ఆదేశించడం తెల్సిందే. సెప్టెంబర్‌లో రెండు రోజులపాటు చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో నలుగురు చనిపోగా 90 మంది వరకు గాయపడ్డారు. దీంతో, సెప్టెంబర్ 26న వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ చట్టం కింద గరిష్టంగా 12 నెలల వరకు నిర్బంధించేందుకు వీలుంటుంది.

పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో విషాదం

- కారు చెరువులోపడి ముగ్గురు విద్యార్థులు మృతి

హౌరా: పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో సోమవారం విషాదం చోటు చేసుకుంది. హౌరాలో పూల్ కారు ఒకటి చెరువులో పడటంతో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థులు పాఠశాలనుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఉలుబేరియాలోని బహిరా సమీపంలో మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమని, అతడిని అదుపులోకి తీసుకుని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

బురఖా ధరించి పార్లమెంట్‌లోకి వస్తున్న హన్సన్

అనంతరం తన సీటు వద్ద..

ఆగ్రహా'వేషం'!

బురఖాతో ఆస్ట్రేలియా పార్లమెంటులోకి

సిడ్నీ: అది ఆస్ట్రేలియా పార్లమెంటు.. గంభీరంగా సాగుతున్న సభలోకి హఠాత్తుగా.. ఒక వ్యక్తి బురఖా ధరించి ప్రవేశించడంతో అంతా అవాక్కయ్యారు. అదెవరో కాదు.. ఆస్ట్రేలియాకు చెందిన ఫార్–రైట్ సెనేటర్ పాలిన్ హన్సన్. బహిరంగ ప్రదేశాల్లో ముస్లింల బురఖా ధారణపై నిషేధం విధించాలన్న డిమాండ్‌ను వినిపించడానికి.. ఆమె ఏకంగా బురఖానే ఒక రాజకీయ ప్రచార అస్త్రంగా వాడుకోవడం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. సోమవారం జరిగిన ఈ సంఘటన ఆస్ట్రేలియా రాజకీయాల్లో పెను దుమారాన్నే రేపింది.

ముమ్మాటికీ జాత్యహంకారమే..

హన్సన్ చర్యపై సభలోని ఇతర సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. న్యూ సౌత్‌వేల్స్‌కు చెందిన గ్రీన్స్ సెనేటర్, ముస్లిం మహిళ మెహ్రీన్ ఫరూకీ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. 'ఇది పచ్చి జాత్యహంకారం. ఒక సెనేటర్ స్థాయి వ్యక్తి ఇలా ప్రవర్తించడం దారుణం'.. అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వెస్ట్రన్ ఆస్ట్రేలియాకు చెందిన స్వతంత్ర సెనేటర్ ఫాతిమా పేమాన్ కూడా హన్సన్ తీరును అవమానకర చర్యగా అభివర్ణించారు.

ముక్తకంఠంతో ఖండన

హన్సన్ చర్యను అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం ముక్తకంఠంతో ఖండించాయి. సెనేట్‌లో లేబర్ ప్రభుత్వ నాయకురాలు పెన్నీ వాంగ్ స్పందిస్తూ.. 'ఇది ఆస్ట్రేలియా సెనేట్ సభ్యురాలికి తగని పని'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బురఖా తీయడానికి నిరాకరించిన హన్సన్‌ను సస్పెండ్ చేయాలని ఆమె తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష కూటమి డిప్యూటీ లీడర్ అన్నే రస్టన్ కూడా హన్సన్ చర్యలను తప్పుబట్టారు.

గతంలోనూ ఇదే రచ్చ..

ఆసియా నుంచి వలసలు, శరణార్థుల రాకను తీవ్రంగా వ్యతిరేకించే హన్సన్, 1990ల నుంచే తనదైన వివాదాస్పద శైలితో వార్తల్లో నిలుస్తున్నారు. ఇస్లామిక్ దుస్తులపై ఆమె పోరాటం కొత్తేమీ కాదు. 2017లో కూడా ఆమె ఇలాగే బురఖా ధరించి పార్లమెంటుకు వచ్చి, జాతీయ స్థాయి నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు మరోసారి అదే పంథాను ఎంచుకున్నారు.

బ్యాన్ చేస్తారా?.. నన్ను భరిస్తారా?

ఈ హైడ్రామా అనంతరం హన్సన్ ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. తన బిల్లును సెనేట్ తిరస్కరించినందుకే ఈ నిరసన చేపట్టానని ఆమె స్పష్టం చేశారు. 'పార్లమెంటు ఈ వస్త్రాన్ని నిషేధించకపోతే, మహిళలపై అణచివేతకు, జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించే ఈ రాడికల్ వస్త్రాన్ని నేను సభలోనే ప్రదర్శిస్తాను. అప్పుడే ప్రతి ఆస్ట్రేలియన్‌కు దీని తీవ్రత అర్థమవుతుంది'.. అని స్పష్టం చేశారు. 'నేను దీన్ని ధరించడం మీకు ఇష్టం లేకపోతే.. బురఖాను బ్యాన్ చేయండి'.. అని ఆమె సవాల్ విసిరారు.

యమునా ఎక్స్‌ప్రెస్ వేపై బోల్తా పడిన బస్సు

16 మంది ప్రయాణికులకు గాయాలు

మథుర: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో యమున ఎక్స్‌ప్రెస్‌వేపై బస్సు బోల్తా పడింది. 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి సీరియస్‌గా ఉంది. సోమవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ఢిల్లీ నుంచి రాయ్‌బరేలీ వెళ్తున్న బస్సులో 50 నుంచి 60 మంది ప్రయాణికులున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

లోయలో పడిన బస్సు.. ఐదుగురు మృతి

న్యూఢిల్లీ: రిషికేశ్ నుంచి కుంజాపురి ఆలయం వైపు వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిన ఘటనలో ఐదుగురు తీర్థయాత్రికులు చనిపోయారు. మరో ఆరుగురు పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా వేర్వేరు రాష్ట్రాల వారని ఉత్తరాఖండ్ అధికారులు తెలిపారు. రిషికేశ్‌లోని దయానంద్ ఆశ్రమాన్ని సందర్శించుకున్న కొందరు భక్తులు బస్సులో సోమవారం ఉదయం కుంజాపురి ఆలయానికి బయలుదేరారు. వీరి వాహనం కుంజాపురి సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న 70 మీటర్ల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోగా బస్సు డ్రైవర్ సహా మిగతా 13 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న ఆరుగురిని రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. కాగా, మృతులు యూపీ, గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, ఢిల్లీకి చెందిన వారని అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ నేతలతో రాహుల్ గాంధీ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఓబీసీ విభాగం ముఖ్య నాయకులతో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం సమావేశమయ్యారు. బీసీ వర్గం ప్రజల అభివృద్ధి, సాధికారతపై వారితో విస్తృతంగా చర్చించారు. ఈ భేటీలో సచిన్ పైలట్, అనిల్ జైహింద్, మాణిక్యం ఠాగూర్, బీకే హరిప్రసాద్, అజయ్‌కుమార్ లల్లూ, పొన్నం ప్రభాకర్, సుభాషిణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలన్న అంశంతోపాటు కులగణన అంశంపై జరిగినట్లు సమాచారం.

నేర న్యాయ చట్టాల దుర్వినియోగం

- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: సంబంధాలు(రిలేషన్ షిప్స్) విచ్ఛిన్నమైన సందర్భాల్లో అవతలి వారిపై అత్యాచారం తదితర నేరాలను ఆపాదించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటివి నేరన్యాయ చట్టాలను దుర్వినియోగం చేయడమేనని ఎత్తి చూపింది. విఫలమైన ప్రతి సంబంధాన్ని అత్యాచార నేరంగా మార్చడం తగదని పేర్కొంది. ఇలాంటిది ఆ నేర తీవ్రతను తగ్గించడంతోపాటు నిందితుడిపై చెరపలేని అపవాదును మోపడమే కాదు, అన్యాయం చేసినట్లు కూడా అవుతుందని అభిప్రాయపడింది. అత్యాచారం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. సంబంధిత కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. అభీష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా జరిగే వాస్తవమైన లైంగిక హింసకు సంబంధించిన సందర్భాల్లో మాత్రమే అత్యాచార కేసులను నమోదు చేయాలని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది. శారీరక సాన్నిహిత్యం వివాహానికి దారి తీయని పరిస్థితుల్లో అత్యాచార నేరంగా ముద్ర వేయడం సరికాదని ధర్మాసనం పేర్కొంది. అయితే, నమ్మకాన్ని వమ్ముచేయడం, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించిన నిజమైన కేసులను చట్టం సున్నితంగా డీల్ చేయాలని కూడా ధర్మాసనం ఈ సందర్భంగా సూచించింది. మహారాష్ట్రలోని శంభాజీ నగర్‌కు చెందిన ఓ మహిళ భర్త నుంచి వేరుగా ఉంటోంది. అతడి నుంచి భరణం కోరుతూ కోర్టులో కేసు వేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ అయిన లాయర్‌తో పరిచయం ఏర్పడింది. వీరి మధ్య సాన్నిహిత్యం మూడేళ్లుగా కొనసాగింది. పెళ్లి ప్రతిపాదన తేగా ఆమె తిరస్కరించింది. అనంతరం గర్భవతి అయిన ఆమెకు గర్భస్రావం చేయించాడు. ఆ తర్వాత ఆమె పెళ్లి చేసుకోవాలని కోరగా పిటిషనర్ అంగీకరించలేదు. దీంతో, ఆమె బాంబే హైకోర్టులో కేసు వేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లోబర్చుకున్నాడని ఆరోపించింది. కోర్టు బాధితురాలికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీంతో పిటిషనర్ సుప్రీంను ఆశ్రయించారు. విచారించిన ధర్మాసనం పైవిధంగా ఆదేశాలిచ్చింది.

పాక్‌లో ఆత్మాహుతి దాడులు

- ముగ్గురు భద్రతా సిబ్బంది మృతి..12 మందికి గాయాలు

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని పారా మిలటరీ బలగాల ప్రధాన కార్యాలయంపై సోమవారం జరిగిన ఆత్మాహుతి దాడుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది చనిపోగా 12 మంది గాయపడ్డారు. ఉదయం పరేడ్‌కు బలగాలు సిద్ధమవుతుండగా ముగ్గురు ఆత్మాహుతి బాంబర్లు మెయిన్ గేట్ వద్దకు వచ్చారు. శాలువాలు ధరించిన వీరు రైఫిళ్లను లోపల దాచుకున్నారు. ఇందులో ఒకడు వెంటనే పేల్చుకోగా మిగతా ఇద్దరు పక్క గేటు గుండా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బలగాలు అప్రమత్తమై వారిని కాల్చి వేశాయి. మెయిన్ గేట్ వద్ద సంభవించిన పేలుడు అత్యంత తీవ్రమైందని అధికారులు తెలిపారు. ప్రధాన గేట్‌కు 40 మీటర్ల లోపులో ప్రధాన ఆవరణలోకి రాకుండానే వారిని హతమార్చామన్నారు. తమ జవాన్లు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం నివారించగలిగామన్నారు. జనసమ్మర్ధం ఉండే ప్రాంతంలో, సైనిక కంటోన్మెంట్‌కు సమీపంలో చోటుచేసుకున్న పేలుళ్లు సంచలనం రేపాయి. కాగా, ఘటనకు తమదే బాధ్యతని నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)కి సంబంధించిన జమాతుల్ అహ్రార్ ప్రకటించుకుంది. ఘటన నేపథ్యంలో రాజధాని ఇస్లామాబాద్‌లో అప్రమత్తత ప్రకటించారు. నగరంలోకి ప్రవేశించే అన్ని రోడ్లపైనా తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రభుత్వ వాహనాల్లో ప్రయాణించే వారిని కూడా పోలీసులు సోదాలు చేశారు.

ఆడుకుంటుండగా పేలిన రాకెట్

- ముగ్గురు చిన్నారులు మృత్యువాత

కరాచీ: రాకెట్ ప్రొపెల్లెంట్‌ను ఆట వస్తువుగా భావించి చిన్నారులు ఆడుకుంటుండగా అది హఠాత్తుగా పేలింది. ఘటనలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో ఘటన చోటుచేసుకుంది. కశ్మోర్ జిల్లా కంధ్‌కోట్ పట్టణ సమీపంలోని పొలాల్లో ఆదివారం కొందరు చిన్నారులు ఆడుకుంటున్నారు. అక్కడ వారికి ఎర్రటి రంగులో ఓ వస్తువు కనిపించింది. ఆట వస్తువనుకుని దానిని అటూఇటూ కదిల్చి చూశారు. అంతే..అది ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలింది. ఘటనలో 8–12 ఏళ్ల వయస్సున్న ముగ్గురు చిన్నారులు అక్కడికక్కడే చనిపోయారు. అదో సాలిడ్ రాకెట్ ప్రొపెల్లెంట్ అనీ, అందులో పేలుడు పదార్థాన్ని గానీ, ఇంధనాన్ని గానీ నిల్వ చేయొచ్చని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో సంచరించే బందిపోట్లు దానిని అక్కడ వదిలేసి ఉంటారని భావిస్తున్నామన్నారు. దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.

కెనడాలో భారత సంతతి వ్యక్తి అరెస్టు

టొరంటో: కెనడాలో 25 మంది మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న భారత సంతతి వ్యక్తి నికోలస్ సింగ్‌ను టొరంటో పోలీసుల అరెస్టు చేశారు. అతని నుంచి తుపాకీ, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తుపాకీని ప్రయోగించడం, సాయుధ దోపిడీ, నిషేధ ఉత్తర్వుల కింద ఆయుధాన్ని కలిగి ఉన్నాడన్న కారణంగా ఐదేళ్ల ఐదు నెలల 10రోజుల జైలుశిక్ష పడింది. గతేడాది మే 31న చట్ట విరుద్ధంగా తప్పించుకున్నాడు. 18 నెలలుగా పరారీలో ఉన్న నికోలస్.. టొరంటోలో డుపాంట్ స్ట్రీట్ సమీపంలో తనిఖీ చేస్తుండగా పోలీసుల కంటపడ్డాడు. వెంటనే అరెస్టు చేశారు.

కేసుల్ని మరో కోర్టుకు బదిలీ చేయండి: రబ్డీ దేవి

న్యూఢిల్లీ: తనపై ఉన్న సీబీఐ, ఈడీ కేసులను మరో కోర్టుకు బదిలీ చేయాలని బిహార్ మాజీ సీఎం రబ్డీదేవి కోరారు. ప్రస్తుతం విచారణ జరుగుతున్న ప్రత్యేక కోర్టులో న్యాయం జరుగుతుందన్న విశ్వాసం లేదని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులోపిటిషన్ వేశారు. ల్యాండ్ ఫర్ జాబ్స్, ఐఆర్‌సీటీసీ కుంభకోణానికి సంబంధించి రబ్డీదేవిపై ఉన్న నాలుగు కేసులను ప్రత్యేక కోర్టు జడ్జి విశాల్ గోగ్నె విచారిస్తున్నారు. ప్రత్యేక న్యాయమూర్తి తమకు నిష్పాక్షికమైన న్యాయం అందిస్తారని విశ్వాసం లేదని, అన్ని కేసుల్లోనూ ఆయన తీరు ప్రాసిక్యూషన్ వైపు అనవసరంగా మొగ్గు చూపుతున్నట్లు, పక్షపాతంతో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆమె తెలిపారు. పలు దఫాలుగా సాగిన కేసు విచారణ, జారీ చేసిన ఉత్తర్వులను బట్టి ఈ విషయం రూఢీ అవుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో న్యాయం జరగాలంటే కేసులను మరో కోర్టుకు బదిలీ చేయాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

త్వరలో భారత్‌కు కెనడా ప్రధాని మార్క్ కార్నీ

జోహన్నస్‌బర్గ్: కెనడా ప్రధాని మార్క్ కార్నీ వచ్చే ఏడాది ఇండియాలో పర్యటించనున్నారు. దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా ఇరు దేశాల నాయకుల మధ్య చర్చలు జరిగాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక, ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతోపాటు ర క్షణ, అంతరిక్ష రంగాల్లో సహకరించుకోవాలని ఇద్దరు నాయకులు అంగీకరించారు. భారత్‌లో పర్యటించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానాన్ని కెనడా ప్రధాని మార్క్ కార్నీ అంగీకరించారు. 2026 ప్రారంభంలో భారత్‌ను సందర్శించాలన్న మోదీ ఆహ్వానం మేరకు కెనడా ప్రధాని అంగీకరించారని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 'వస్తువులు, సేవలు, పెట్టుబడులు, వ్యవసాయం, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రతిష్టాత్మక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ఇరు దేశాల నాయకులు అంగీకరించారు.'అని తెలిపింది.

నగదు విరాళాలపై సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు గుర్తు తెలియని వ్యక్తులు అందించే రూ.2 వేల లోపు నగదు విరాళాలకు ఆదాయ పన్ను మినహాయింపు కల్పించే నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పారదర్శకత లేని ఈ నిబంధన కారణంగా ఎన్నికల ప్రక్రియపై గౌరవం తగ్గుతుందని, రాజకీయ పార్టీలకు అందే విరాళాలపై ఓటర్లకు కీలకమైన సమాచారాన్ని దాచినట్లే అవుతుందని పిటిషనర్ పేర్కొన్నారు. నగదు రూపంలో విరాళాలు తీసుకున్న పక్షంలో ఎన్నికల గుర్తు కేటాయించబోమని, రాజకీయ పార్టీగా నమోదు చేయబోమని షరతులు విధించేలా ఈసీకి ఆదేశాలివ్వాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం దీనిపై అభిప్రాయం తెలపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

పోలో ఆడుతూ మరణించిన సుల్తాన్ ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

రాజపుత్ర వంశాలు (క్రీ.శ. 760 - 1142)

రాజపుత్ర వంశానికి చెందిన రాజులు బెంగాల్,బిహార్ ప్రాంతాలను పాలించారు. వాస్తవానికి వీరు రాజపుత్రులు కారు. 'పాల' వంశస్థులు. ఈ వంశ స్థాపకుడు గోపాలుడు. వీరిలో 'దేవపాలుడు' గొప్పవాడు. ఇతడు తూర్పు ఈశాన్య దేశాలైన జావా, సుమత్రాతో సత్సంబంధాలు కొనసాగించాడు. ఈ వంశీయులు సుమారు 400 ఏళ్ల పాలించారు. వీరిలో చాలా మంది బౌద్ధమతాన్ని అనుసరించారు. ధర్మపాలుడు విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఉద్ధంతపురం, జగద్దల విశ్వ విద్యాలయాలను పాలరాజుల కాలంలోనే ఏర్పాటు చేశారు. వీరు అనేక విహారాలను పునర్నిర్మించారు.

గూర్జార ప్రతీహారులు - 'కనౌజ్' (క్రీ.శ. 800 -1036)

ఈ వంశస్థాపకుడు నాగభట్టు. మహేంద్రపాలుడు గొప్పవాడు. ఇతడి ఆస్థానంలో రాజశేఖరుడు అనే ప్రముఖ కవి ఉండేవాడు. మహేంద్రపాలుడు అరబ్ సైన్యాలపై విజయం సాధించాడు. అరబ్ బాటసారి సులేమాన్ మిహిరభోజుడి సామ్రాజ్యం గురించి వర్ణించాడు. మిహిరభోజుడి కుమారుడు మహేంద్రపాలుడు. ఇతడి తర్వాత ప్రతీహారుల సామ్రాజ్యం క్షీణించింది.

గహాద్వాల్ వంశం - కనౌజ్ (క్రీ.శ. 1080-1194)

ఈ వంశ స్థాపకుడు చంద్రదేవుడు (1085-1100). ఈ పాలకుల్లో గొప్పవాడు జయచంద్రుడు. మహమ్మద్ ఘోరీ 1193లో జయచంద్రుడిని ఓడించడంతో అవమానం భరించలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. గహద్వాలులు శతాబ్ద కాలం పాటు తురుష్క దండయాత్రల నుంచి మధ్యదేశాన్ని రక్షించారు.

చందేలులు - బుందేల్ ఖండ్ (క్రీ.శ. 916-1203)

చందేలుల రాజధాని ఖజురహో. ఈ వంశ మూలపురుషుడు జయశక్తి. క్రీ.శ. 950 ప్రాంతంలో యశోవర్మ స్వతంత్రంగా చందేల రాజ్యాన్ని స్థాపించాడు. చందేల రాజుల్లో విద్యాధరుడు ప్రసిద్ధుడు. మధ్యప్రదేశ్‌లోని 'ఖజురహో' దేవాలయాలను నిర్మించింది వీరే. అల్లావుద్దీన్ ఖిల్జీ 1309లో చందేలులను తుదముట్టించి బుందేల్‌ఖండ్‌ను ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపాడు.

కాలచూరులు (క్రీ.శ. 950 - 1195)

కాలచూరి వంశస్థుల రాజధాని త్రిపుర (మధ్యప్రదేశ్). ఈ వంశ స్థాపకుడు కోకల్లుడు (845 - 880). కాలచూరుల్లో గంగయదేవుడు ప్రసిద్ధుడు. ఇతడికి 'విక్రమాదిత్య', 'త్రికళింగాధిపతి' అనే బిరుదులు ఉన్నాయి. క్రీ.శ. 1212లో చందేల త్రైలోక్యమల్లుడు కాలచూరి చివరి పాలకుడైన విజయ సింహుడిని ఓడించాడు.

చౌహానులు (క్రీ.శ. 973-1192)

వీరినే చహమాణులు అని కూడా అంటారు. ఈ వంశానికి మూలకర్త సింహరాజు. వీరి రాజధాని 'శాకంబరి'. అజయరాజు అజ్మీర్‌ను నిర్మించాడు. సోమదేవ మహాకవి విశాలదేవుడి ఆస్థానంలో ఉండేవాడు. ఇతడు 'లలిత విగ్రహరాజ' నాటకాన్ని రచించాడు. ఈ వంశస్థుల్లో మూడో పాలకుడైన పృథ్వీరాజు చాలా గొప్పవాడు. పృథ్వీరాజ్ చౌహాన్ 1191లో మహమ్మద్ ఘోరీని మొదటి 'తరైన్' యుద్ధంలో ఓడించి క్షమించి వదిలేశాడు. కానీ మహమ్మద్ ఘోరీ మళ్లీ దండెత్తి వచ్చి పృథ్వీరాజ్‌ను 1192లో రెండో తరైన్ యుద్ధంలో ఓడించాడు.

గుజరాత్ చాళుక్యులు (క్రీ.శ. 974-1238)

గుజరాత్ చాళుక్య వంశస్థుల రాజధాని 'అన్హిల్ వాడ్' (గుజరాత్). వీరినే సోలంకీలు అంటారు. ఈ వంశస్థాపకుడు మూలరాజు. మొదటి భీమరాజు కాలంలో (1022-64) ఘజనీ మహమ్మద్ 1024లో సోమనాథ ఆలయాన్ని ధ్వంసం చేశాడు. భీమరాజు మనవడైన జయసింహుడి కాలంలో సోలంకీ రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉంది. జైనకవి హేమచంద్రుడు ఇతడి మంత్రి. జయసింహుడి తర్వాత సామంతులైన వాఘేల వంశస్థులు సోలంకీలను జయించి రాజ్యాన్ని ఆక్రమించారు.

పరమారులు - మాల్వా, మధ్యప్రదేశ్ (క్రీ.శ. 974 - 1233)

పరమార వంశ స్థాపకుడు 'సియక'. వీరిలో ముంజరాజు గొప్పవాడు. ఇతడినే 'వాక్పతిరాజు'గా వ్యవహరిస్తారు. ఇతడి ఆస్థానంలో ధనంజయ, హలాయుధ, ధనిక, పద్మ గుప్త తదితర మహాకవులు ఉండేవారు. వాక్పతిరాజు 'ముంజేశ్వరం' తటాకాన్ని నిర్మించాడు. ఇతడి కుమారుడైన భోజరాజుకు ఈ వంశంలో మంచి పేరు ఉంది. భారతదేశ చరిత్రలో ఇతడికి ప్రత్యేక స్థానం ఉంది. భోజరాజుకు 'కవిరాజ మాళ్వా చక్రవర్తి' అనే బిరుదు ఉంది. ఇతడు ధాన్ నగరాన్ని నిర్మించాడు.

సేన వంశస్థులు (క్రీ.శ. 1119 -1190)

వీరు బెంగాల్‌ను పాలించారు. సేన వంశీయుల్లో లక్ష్మణసేనుడు ప్రసిద్ధుడు. ఇతడు విజయయాత్రలు చేసి పూరీ,కాశీ, ప్రయాగలో విజయస్తంభాలు స్థాపించాడు. ఇతడు స్వయంగా కవి. ఇతడి ఆస్థానంలో పంచరత్నాలు అనే ప్రసిద్ధ కవులు ఉండేవారు. వీరిలో ధోయి, జయదేవుడు ముఖ్యమైనవారు. జయదేవుడి 'గీత గోవిందం' ప్రసిద్ధి చెందిన రచన.

కర్కోటక వంశం (క్రీ.శ. 630-955)

ఈ వంశం కశ్మీర్ ప్రాంతాన్ని పాలించింది. 'కర్కోటక వంశ' స్థాపకుడు దుర్లభవర్ధనుడు. కల్హణుడి 'రాజ తరంగిణి' వీరి చరిత్రకు ప్రధాన ఆధారం. ఈ వంశంలో ముక్తాపీడ లలితాదిత్య గొప్పరాజు. ఇతడు కశ్మీర్ రాజ్యాన్ని ఆసియాలోని పెద్ద రాజ్యాల్లో ఒకటిగా రూపొందించాడు. 'మార్తాండ', 'సూర్య' దేవాలయాలను నిర్మించాడు.

లోహారులు (క్రీ.శ. 939 -1339)

ఈ రాజ్యస్థాపకుడు పర్వగుప్తుడు. కశ్మీర్‌ను పరిపాలించిన లోహారులందరిలో 'రాణి దిద్దా'కు ప్రత్యేక స్థానం ఉంది. 1139లో షామీర్ (షామ్స్ ఉద్దీన్) అనే ముస్లిం వీరుడు 'శ్రీ సంస్థినా' బిరుదుతో కశ్మీర్‌ను ఆక్రమించాడు. లోహారుల కాలంలో సంస్కృతం రాజభాషగా ఉండేది. బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాబల్యం ఉండేది.

షాహీలు (క్రీ.శ. 883-1026)

షాహీలు కాబూల్, పంజాబ్ ప్రాంతాలను పాలించారు. వీరినే హిందూషాహీలుగా వ్యవహరిస్తారు. రాజ తరంగిణి, అల్‌బెరూనీ గ్రంథం వీరి చరిత్రకు ముఖ్యమైన ఆధారాలు. వీరి రాజధాని కాబూల్. అల్‌బెరూనీ ఈ వంశంలో మొదటివారిని హిందూ తురుష్కులుగా పేర్కొన్నాడు. కుషాన్ వంశంలో చివరి రాజు 'లగితూర్మానే'ను అతడి మంత్రి కల్లర్ తొలగించి, హిందూషా వంశాన్ని స్థాపించాడు. షాహీ రాజ్యాన్ని ముస్లింలు ఆక్రమించారు. అరబ్బు యాత్రికుడైన అల్‌బెరూనీ భారతదేశంలో 'కితాబ్-ఉల్-హింద్' గ్రంథం రాశాడు.

అరబ్బుల దండయాత్రలు (క్రీ.శ. 712)

అరబ్బులు సింధూ ప్రాంతంపై దండయాత్ర చేశారు. భారతదేశంపై దండయాత్రల వల్ల అరబ్బులకు పరిమిత ఫలితాలు లభించాయి. ఎడారి వల్ల సింధూ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలపైకి దాడి చేయడానికి వీలు కలుగలేదు. అరబ్బుల పాలనలో సింధ్, గుజరాత్ రాష్ట్రాలు విదేశీ వాణిజ్యాన్ని విస్తృతంగా సాగించి ఐశ్వర్యవంతమయ్యాయి. అరబ్బుల ద్వారా ఐరోపా దేశాలకు భారతీయ సంస్కృతి వ్యాపించింది.

మహమ్మద్ ఘజనీ దండయాత్రలు (క్రీ.శ. 1000-27): ఇతడు భారతదేశంపై 17సార్లు దండెత్తాడు. ఘజనీ 1026లో సోమ్‌నాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. ఇది గుజరాత్‌లోని కథియవార్‌లో ఉంది. ఇతడు రాజపుత్ర రాజ్యాల సిరిసంపదలను కొల్లగొట్టాడు. వారి సైన్యాలు చాలా వరకు క్షీణించాయి. ఘజనీ మహమ్మద్ భారతదేశంలో ముస్లిం రాజ్య స్థాపనకు అనుకూల పరిస్థితులను కల్పించాడు.

మహమ్మద్ ఘోరీ దండయాత్రలు (క్రీ.శ. 1175-1206): ఇతడిని భారతదేశంలో తురుష్క అఫ్గాన్ సామ్రాజ్య స్థాపకుడిగా పేర్కొంటారు. ఘోరీ మరణానంతరం అతడు జయించిన భూభాగాలన్నింటితో అతడి బానిస అయిన కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు. మహమ్మద్ ఘోరీ.. పృథ్వీరాజ్ చౌహాన్‌తో 1191లో మొదటి, 1192లో రెండో తరైన్ యుద్ధాలు చేశాడు. బిహార్, బెంగాల్‌ను జయించడంలో భక్తియార్ ఖిల్జీ (1197) అనే అఫ్గాన్ సాహసయోధుడు ఘోరీకి సహాయపడ్డాడు. ఘోరీని 1206లో పంజాబ్‌లోని ఖోఖర్లు అనే తెగకు చెందినవారు హత్య చేశారు.

ఢిల్లీ సుల్తాన్‌లు (క్రీ.శ. 1206-1210)

కుతుబుద్దీన్ ఐబక్: ఇతడు భారతదేశంలో తురుష్క-అఫ్గాన్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు ఇల్బారీ వంశానికి చెందిన తురుష్కుడు. ఇతడు 1206లో ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఢిల్లీకి మొదటి ముస్లిమ్ సుల్తాన్ ఇతడే. ఇతడిని బానిస వంశ స్థాపకుడిగా పేర్కొంటారు. 1210లో ఇతడు 'పోలో' ఆడుతూ గుర్రంపై నుంచి పడి మరణించాడు. ఐబక్ 'కుతుబ్ మినార్' నిర్మాణాన్ని ప్రారంభించగా, ఇల్‌టుట్ మిష్ పూర్తి చేశాడు. కుతుబుద్దీన్ ఐబక్‌కు 'లక్‌బక్ష్' అనే బిరుదు ఉంది.

ఇల్‌టుట్ మిష్ (క్రీ.శ. 1211-1236): ఇల్‌టుట్‌మిష్ తురుష్కుల్లో ఇల్బారీ తెగకు చెందినవాడు. రాజ్య రక్షణ కోసం ఇతడు 40 మందితో బానిసల దళం (చిహాల్‌గనీ) ఏర్పాటు చేశాడు. ఇల్‌టుట్‌మిష్ మంగోలుల దాడుల నుంచి భారతదేశాన్ని కాపాడాడు. స్వతంత్రంగా అరబ్బీ నాణేలను ముద్రించడం ప్రారంభించాడు. వెండి టంకా, రాగి జిటాల్ ఇతడి కాలం నుంచే వాడుకలోకి వచ్చాయి. తురుష్క సామ్రాజ్యాన్ని స్థిరపరిచాడు. కుతుబ్‌మినార్ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు.

సుల్తాన్ రజియా (క్రీ.శ. 1236-1240): ఈమె ఇల్‌టుట్ మిష్ కుమార్తె. యాకుబ్‌ఖాన్ అనే అబిసీనియన్‌ను వివాహం చేసుకున్నారు. ఈమె మధ్యయుగానికి చెందిన మొదటి, చివరి సుల్తానా (రాణి). ఇల్‌టుట్ మిష్ తన కుమారులు అసమర్థులవ్వడం వల్ల కూతురైన రజియాను వారసురాలిగా ప్రకటించాడు. ఈమె మంచి పాలనాదక్షురాలు. ఈమె కాలంలో చిహాల్‌గనీలు బలవంతులై ఆమెను ఎదిరించారు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో రజియా ప్రాణాలను కోల్పోయారు.

సుల్తాన్ నసీరుద్దీన్ మహమ్మద్ (క్రీ.శ. 1246 - 1265): ఇతడు ఇల్‌టుట్ మిష్ కుమారుడు. అసమర్థుడు. భోగలాలసుడు. అమీర్‌ల చేతిలో కీలు బొమ్మగా మారాడు.

సుల్తాన్ ఘియాసుద్దీన్ బాల్బన్ (క్రీ.శ. 1265 - 1285): ఇతడు సుల్తాన్ నసీరుద్దీన్‌కు 1246-65 మధ్య ప్రధానమంత్రిగా సర్వాధికారాలు చెలాయించాడు. ఇతడి మరణానంతరం సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. 40 మంది బానిసల దళాన్ని రద్దు చేశాడు. శత్రువుల రహస్యాలు తెలుసుకునేందుకు గూఢచార దళాన్ని ఏర్పాటు చేశాడు. సాష్టాంగపడి సుల్తాన్ పాదాలను లేదా సింహాసనాన్ని ముద్దు పెట్టుకోవడం లాంటి పారశీక రాచ మర్యాదలను బాల్బన్ ప్రవేశపెట్టాడు. సర్దార్లను అణచివేయడానికి మద్యపానం, జూదం, అతిగా మాట్లాడటం లాంటివాటిని నిషేధించాడు.

- వెనిస్ యాత్రికుడైన 'మార్కోపోలో' భారతదేశాన్ని సందర్శించాడు. రాణి రుద్రమదేవి ఆస్థానానికి వచ్చాడు.

ఖిల్జీ వంశం (క్రీ.శ. 1290-1320)

ఇది ఢిల్లీని పాలించిన రెండో తురుష్క వంశం. వీరి పాలనా కాలం క్రీ.శ. 1290-1320.

జలాలుద్దీన్ (క్రీ.శ. 1290-1296): ఇతడు బాల్బన్ కొలువులో చేరిన ఖిల్జీ వంశానికి చెందిన తురుష్క తెగకు చెందిన వ్యక్తి. 1290లో బానిస వంశ చివరి పాలకుడైన కైకోబాద్‌ను వధించి ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఇతడి అన్న కొడుకు అల్లా ఉద్దీన్ ఖిల్జీ. జలాలుద్దీన్ తన కూతురిని అల్లా ఉద్దీన్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఇతడి కాలంలో ఇస్లామ్ మతాన్ని స్వీకరించిన మంగోలులు నయా ముస్లింలుగా చెలామణి అయ్యారు. వీరు ప్రభుత్వానికి బెడదగా తయారయ్యారు.

అల్లాఉద్దీన్ ఖిల్జీ (క్రీ.శ. 1296-1316): ఇతడు 1299లో గుజరాత్‌ను జయించాడు. కాకతీయ, యాదవ, హోయసాల, పాండ్య రాజ్యాలపై అల్లాఉద్దీన్ సేనాని మాలిక్‌కపూర్ దండెత్తి జయించాడు. 1312లో మాలిక్‌కపూర్ దేవగిరి రాజైన శకదేవుడిని వధించి ఆ రాజ్యాన్ని ఢిల్లీ రాజ్యంలో కలిపాడు. 1303లో మంగోలుల దాడుల నుంచి రక్షించుకోవడానికి దుర్గాలను నిర్మించాడు.

అల్లాఉద్దీన్ ఖిల్జీకి 'సికిందర్' అనే బిరుదు ఉంది. ఇతడు జాగీర్లను రద్దు చేశాడు. ఇతడి కాలంలో సైన్యం పోషణ బాధ్యత ప్రభుత్వ పరిధిలోనే ఉండేది. గుర్రాలపై ముద్రలు వేసే పద్ధతి ప్రవేశపెట్టాడు. జీతాలను నగదు రూపంలో చెల్లించేవాడు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారులు సరకులు అమ్మాలని శాసించాడు. ఇతడు 'సిరి', 'అలైదర్వాజా' కట్టడాలను నిర్మించాడు. అమీర్‌ఖుస్రూ అనే పర్షియన్ కవిని పోషించాడు. అల్లాఉద్దీన్ 'నయాముస్లిం'లను అణచివేశాడు. అలైదర్వాజా తురుష్క వాస్తు రీతికి ప్రతీక.

అల్లాఉద్దీన్ షియాబుద్దీన్ ఉమర్, కుతుబుద్దీన్ ముబారక్ ఖిల్జీ వంశం చివరి పాలకులు. నసీరుద్దీన్ ఖుస్రూతో ఖిల్జీ వంశ పాలన పూర్తిగా అంతమైంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆంధ్రా యూనివర్శిటీలో వివిధ ఉద్యోగాలు

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్-1, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్-1, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్-2, రీసెర్చ్ ఫెలో2-1, ఎల్‌డీసీ/టైపిస్ట్-1.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 55 శాతం మార్కులతో పీజీ, ఎంఫిల్/పీహెచ్‌డీ (డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/స్టాటిస్టిక్స్ /బయోస్టాటిస్టిక్స్ /ఎకనామిక్స్ /మ్యాథ్‌మేటిక్స్/సోషియాలజీ/సోషల్ వర్క్ /సైకాలజీ/ఆంత్రోపాలజీ/జాగ్రఫీ)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు సెట్/నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.11.2025.
- » **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

ఐఐటీ ఢిల్లీలో ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీ తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- » **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్3-01, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్2-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పీజీ, పీహెచ్‌డీ(ఆర్థోపెడిక్ బయోమెకానిక్స్, ఇంప్లాంట్ డిజైన్, డొమైన్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 40 నుంచి 45 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రీసెర్చ్ సైంటిస్ట్3కు రూ.78,000, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్2కు రూ.67,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఈమెయిల్:** kmukherjee.project.iitd@gmail.com.
- » **దరఖాస్తులకు చివరితేది:** 27.11.2025.
- » **వెబ్‌సైట్:** https://ird.iitd.ac.in

'ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు' గ్రంథకర్త?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

రచయితలు - రచనలు

1. 'వెన్నెల' పాఠ్యభాగం ఎర్రన రచించిన ఏ గ్రంథంలోనిది?
   1) హరివంశం 2) నృసింహపురాణం
   3) రామాయణం
   4) అరణ్యపర్వశేషం
2. కిందివాటిలో ఎర్రన కవితా గుణం ఏది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథాకలితార్థ
   3) సూక్తి వైచిత్రి 4) వ్యంగ్య వైభవం
3. ఎర్రన వెన్నెలను ఏవిధంగా వర్ణించారు?
   1) అమృతపు జల్లు
   2) మంచిగంధపు పూత
   3) ఆనంద తరంగం
   4) పైవన్నీ
4. 'ధన్యుడు' పాఠ్యభాగ రచయిత ఎవరు?
   1) విష్ణుశర్మ 2) చిన్నయసూరి
   3) వీరేశలింగం 4) చిలకమర్తి
5. చిన్నయసూరి రచించిన ప్రామాణిక వ్యాకరణ గ్రంథం ఏది?
   1) ఆంధ్రశబ్ద చింతామణి
   2) ఆంధ్రభాషాభూషణం
   3) బాల వ్యాకరణం
   4) ప్రౌఢ వ్యాకరణం
6. నీతిచంద్రికకు మూలం ఏది?
   1) పంచతంత్ర కథలు
   2) హితోపదేశం 3) సుభాషిత త్రిశతి
   4) కాశీమజిలీ కథలు
7. 'మాతృభావన' పాఠ్యభాగం గడియారం వేంకటశేషశాస్త్రి రాసిన ఏ గ్రంథంలోనిది?
   1) రఘునాథీయం 2) శివభారతం
   3) మల్లికామారుతం
   4) పుష్పబాణ విలాసం
8. గడియారం వేంకటశేషశాస్త్రి బిరుదు ఏది?
   1) కవితావతంస 2) కవిసింహ
   3) అవధాన పంచానన
   4) పైవన్నీ
9. వేంకటశేషశాస్త్రి 'శ్రీనాథ కవితా సామ్రాజ్యం' ఏ ప్రక్రియకు చెందిన గ్రంథం?
   1) పద్యకావ్యం 2) గద్యకావ్యం
   3) విమర్శగ్రంథం
   4) చంపూకావ్యం
10. బోయి భీమన్న 'జానపదుని జాబు'లో ఇతివృత్తం ఏది?
    1) విలువలు 2) శ్రమపట్ల గౌరవం
    3) గ్రామీణ వర్ణనలు
    4) నైతిక ప్రబోధం
11. బోయి భీమన్నకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఏ గ్రంథానికి లభించింది?
    1) పాలేరు 2) రాగవైశాఖి
    3) గుడిసెలు కాలిపోతున్నాయి
    4) ధర్మం కోసం పోరాటం
12. బోయి భీమన్నకు లభించిన అత్యున్నత భారత పురస్కారం ఏది?
    1) కళాప్రపూర్ణ
    2) పద్మశ్రీ
    3) గౌరవ డాక్టరేట్
    4) పద్మభూషణ్
13. జానపదుడు సెలవుల్లో తన ఊరికి మిత్రుడు వస్తే ఏ తినుబండారాలు తినిపిస్తానన్నాడు?
    1) నారింజ పండ్లు
    2) వెలగ పండ్లు
    3) కొబ్బరి కురిడీలు
    4) పైవన్నీ
14. స్త్రీలను అవమానించకూడదని శాసనం చేసిన రాజు ఎవరు?
    1) అశోకుడు 2) సోన్‌దేవుడు
    3) శివాజీ మహారాజు 4) షాజహాన్
15. మల్లభూపాలీయ శతకకర్త ఎవరు?
    1) ఏనుగు లక్ష్మణకవి
    2) ఎలకూచి బాలసరస్వతి
    3) కూచిమంచి తిమ్మకవి
    4) పావులూరి మల్లన
16. మల్లభూపాలీయ శతకం ఏ ఛందస్సులో ఉంది?
    1) ఉత్పలమాల 2) మత్తేభం
    3) శార్దూలం 4) చంపకమాల
17. యాదవ రాఘవ పాండవీయం త్ర్యర్థి కావ్యకర్త ఎవరు?
    1) పింగళి సూరన
    2) రామరాజభూషణుడు
    3) ఎలకూచి బాలసరస్వతి
    4) ఏనుగు లక్ష్మణకవి
18. చిత్ర శతకకర్త శ్రీపతి భాస్కర కవి ఎన్నో శతాబ్దానికి చెందినవారు?
    1) క్రీ.శ. 16 2) క్రీ.శ. 17
    3) క్రీ.శ. 15 4) క్రీ.శ. 18
19. చిత్ర శతకం ఏ ఛందస్సులో ఉంది?
    1) చంపకమాల 2) శార్దూలం
    3) ఉత్పలమాల 4) మత్తేభం
20. తరిగొండ వెంగమాంబ రాసిన శతకం?
    1) నింబగిరి నరసింహ శతకం
    2) సింహాద్రి నారసింహశతకం
    3) తరిగొండ నృసింహశతకం
    4) పెంచలకోన నరసింహశతకం
21. తరిగొండ వెంగమాంబ రచన ఏది?
    1) వేంకటాచల మాహాత్మ్యం
    2) శివనాటకం
    3) నారసింహ విలాస కథ యక్షగానం
    4) పైవన్నీ
22. భక్తి చింతామణి శతక కర్త?
    1) అందె వేంకటరాజం
    2) సత్యనారాయణాచార్యులు
    3) వ.సు.రాయకవి
    4) లక్ష్మీనరసింహశర్మ
23. భక్తి చింతామణి శతకం ఏ ఛందస్సులో ఉంది?
    1) మత్తేభం 2) శార్దూలం
    3) చంపకమాల 4) సీసం
24. వ.సు.రాయకవి పూర్తి పేరు ఏమిటి?
    1) వడ్డాది సుందర రాయకవి
    2) వడ్డాది సుబ్బరాయకవి
    3) వంగూరి సుబ్బరాయకవి
    4) వావిలకొలను సుబ్బారావు
25. వ.సు. రాయకవి రచన ఏది?
    1) వేణీ సంహారం
    2) ప్రబోధ చంద్రోదయం
    3) నందనందన శతకం
    4) పైవన్నీ
26. ఉత్పలమాల శతక కర్త?
    1) అందె వేంకటరాజం
    2) ఉత్పల సత్యనారాయణాచార్యులు
    3) నంబి శ్రీధరరావు
    4) లక్ష్మీనరసింహశర్మ
27. 'ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు' గ్రంథకర్త?
    1) డాక్టర్ సి.నారాయణ రెడ్డి
    2) డాక్టర్ జె. బాపురెడ్డి
    3) ఉత్పల సత్యనారాయణాచార్యులు
    4) కుందుర్తి
28. విశ్వనాథేశ్వర శతక కర్త?
    1) సత్యనారాయణాచార్యులు
    2) నంబి శ్రీధర రావు
    3) గుమ్మన్న గారి లక్ష్మీనరసింహశర్మ
    4) దాశరథి
29. నింబగిరి నరసింహశతక కర్త ఎవరు?
    1) అందె వేంకటరాజం
    2) రామడుగు వేంకటేశ్వరశర్మ
    3) నంబి శ్రీధరరావు 4) భాస్కర కవి
30. నింబగిరి నరసింహ శతకం ఏ ఛందస్సులో ఉంది?
    1) శార్దూలం 2) కందం
    3) సీసం 4) మత్తేభం
31. 'అవధాన చతురానన', 'కవి శిరోమణి' అనే బిరుదులున్న శతక రచయిత ఎవరు?
    1) లక్ష్మీనరసింహశర్మ
    2) అందె వేంకటరాజం
    3) వ.సు. రాయకవి
    4) నంబి శ్రీధరరావు
32. 'వానమామలై వరదాచార్యులు కృతులు-అనుశీలన' అనే సిద్ధాంత గ్రంథకర్త?
    1) పుల్లాబొట్ల వేంకటేశ్వర్లు
    2) నంబి శ్రీధరరావు
    3) అందె వేంకటరాజం
    4) అలశెట్టి ప్రభాకర్
33. శ్రీ లొంక రామేశ్వర శతక కర్త?
    1) రామేశ్వర రావు
    2) నంబి శ్రీధరరావు
    3) ఆచార్య తిరుమల
    4) దాశరథి
34. 'నేనెరిగిన బూర్గుల' పాఠ్యభాగం ఏ ప్రక్రియకు చెందింది?
    1) విమర్శ వ్యాసం
    2) అభినందన వ్యాసం
    3) ప్రశంసా వ్యాసం
    4) చారిత్రక వ్యాసం
35. బహుభాషావేత్త పి.వి. నరసింహారావు అనర్గళంగా మాట్లాడగలిగిన భాషలెన్ని?
    1) 14 2) 16
    3) 17 4) 12
36. పి.వి. నరసింహారావు నిర్వహించిన పత్రిక పేరు?
    1) తెలంగాణ 2) నగారా
    3) త్రివేణి 4) కాకతీయ
37. పి.వి.నరసింహారావు ఆత్మకథ పేరు?
    1) ఒక విజేత ఆత్మకథ
    2) ది ఇన్‌సైడర్
    3) మై ఎక్స్‌పీరియన్స్ విత్ ట్రూత్
    4) గ్రేట్ స్కాలర్
38. బూర్గుల రామకృష్ణారావు ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
    1) ఆంధ్ర 2) ఆంధ్రప్రదేశ్
    3) తెలంగాణ 4) మహారాష్ట్ర
39. పి.వి.నరసింహారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఏ గ్రంథానికి వచ్చింది?
    1) రామాయణ్ కల్పవృక్ష్
    2) తెలంగాణ కథల సంపుటి
    3) సహస్రఫణ్ (వేయిపడగలు హిందీలో)
    4) విమర్శవ్యాసాలు సంపుటి
40. హైదరాబాద్ సంస్థానంలో జాగీర్‌దార్ వ్యవస్థను రూపుమాపినవారు?
    1) హైదరాబాద్ నవాబు
    2) బూర్గుల రామకృష్ణారావు
    3) నీలం సంజీవరెడ్డి
    4) సురవరం ప్రతాపరెడ్డి
41. 'నగరగీతం' పాఠ్యభాగ రచయిత?
    1) కుందుర్తి 2) శీలా వీర్రాజు
    3) ఆరుద్ర 4) అలిశెట్టి ప్రభాకర్
42. 'నగరగీతం' పాఠ్యభాగాన్ని ఏ గ్రంథం నుంచి గ్రహించారు?
    1) ఎర్రపావురాలు
    2) ఎన్నికల ఎండమావి
    3) సిటీ లైఫ్
    4) సంక్షోభ గీతం
43. రచయిత నగరాన్ని ఏవిధంగా వర్ణించాడు?
    1) అర్థంకాని రసాయనశాల
    2) అంతుచిక్కని పద్మవ్యూహం
    3) మెర్క్యూరీ నవ్వులు-పాదరసపు నడకలు
    4) పైవన్నీ
44. 'యక్షుడి అప్పు' హాస్యనాటిక రచయిత?
    1) మునిమాణిక్యం నరసింహారావు
    2) భమిడిపాటి కామేశ్వరరావు
    3) విశ్వనాథ సత్యనారాయణ
    4) చిలకమర్తి

సమాధానాలు

1) 2;	2) 3;	3) 4;	4) 2;
5) 3;	6) 1;	7) 2;	8) 4;
9) 3;	10) 2;	11) 3;	12) 4;
13) 4;	14) 3;	15) 2;	16) 2;
17) 3;	18) 2;	19) 3;	20) 3;
21) 4;	22) 3;	23) 1;	24) 2;
25) 4;	26) 2;	27) 3;	28) 3;
29) 1;	30) 3;	31) 2;	32) 3;
33) 2;	34) 2;	35) 3;	36) 4;
37) 2;	38) 3;	39) 3;	40) 2;
41) 4;	42) 3;	43) 4;	44) 3.

భిన్న ధ్రువాలను ఏకం చేసే విశ్వజనీన విధానం

వివాహం విశ్వజనీన సామాజిక - సాంస్కృతిక విధానం. దీని ద్వారా స్త్రీ, పురుషులిద్దరూ కుటుంబ జీవితానికి నాంది పలుకుతారు. కుటుంబ వ్యవస్థకు ఆధారం వివాహమే. ఇది సమాజ అనుమతితో స్థిరమైన లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకొని సంతానాన్ని పొందడానికి వీలు కల్పించే ప్రక్రియ. సమాజం నిరంతరం కొనసాగడానికి మూలాధారం ఇదే. మరణాల ద్వారా ఏర్పడే లోటును జననాల ద్వారా భర్తీ చేయడానికి వివాహమే ఆధారం.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

వివాహం

వివాహం అన్ని సమాజాల్లోనూ ఉంది. కానీ, దీని నియమాలు వివిధ సమాజాల్లో విభిన్న రీతుల్లో ఉన్నాయి. అందువల్ల సమాజ శాస్త్రవేత్తలు దీనికి విశ్వజనీన నిర్వచనాన్ని ఇవ్వలేకపోతున్నారు.

వివాహం - నిర్వచనాలు

- ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది పురుషులు, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది స్త్రీలతో ఆచారంతో లేదా చట్టంతో గుర్తింపు పొందిన, కొంత లాంఛనప్రాయంతో కూడి ఉన్న విధానంతో కొంతకాలం పాటు నిలకడగా ఉండే కలయిక లేదా సంబంధమే వివాహం.

  - ఎడ్వర్డ్ వెస్టర్ మార్క్

వెస్టర్ మార్క్ ఇచ్చిన నిర్వచనం అన్ని సమాజాల్లోని వివాహ వ్యవస్థకు సరిపోయే విధంగా లేదు. ఉదాహరణకు కింద పేర్కొన్న సమాజాలకు ఈ నిర్వచనం సరిపోదు.

ఎ) ఒనోటోవా, టుక్ సమాజాల్లో వయసుకు రాగానే న్యాయబద్ధమైన సంతానాన్ని పొందుతారు.

బి) 'కిబ్బుజ్ సమాజం'లో అసలు వివాహ వ్యవస్థే లేదు.

- సంతానోత్పత్తి, పిల్లల నిర్వహణ కోసం స్త్రీ, పురుషుల మధ్య జరిగే ఒప్పందమే వివాహం.

  - మలినో విస్కీ

ఈ నిర్వచనం కూడా కొన్ని సమాజాలకు మినహాయింపుగా ఉంది.

- భార్యాభర్తల పరస్పర హక్కులు, విధులు, సదుపాయాలకు సంబంధించిన నియమాలు, నిబంధనలు ఉన్నదే వివాహం.

  - ల్యూండ్ బర్గ్

ల్యూండ్ బర్గ్ నిర్వచనం కూడా అన్ని సమాజాలకు వర్తించదు. ఉదాహరణకు..

ఎ) ఇజ్రాయెల్‌లోని 'కిబ్బుజ్' తెగలో స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధం ఉంది కానీ, ఆర్థిక సహకారం లేదు.

బి) కేరళలోని ఒక తెగలో స్త్రీ, పురుషులకు సహ నివాసం లేదు, ఆర్థిక సహకారం లేదు.

వివాహానికి విశ్వజనీన నిర్వచనం లేనప్పటికీ దీనికి ప్రపంచవ్యాప్తంగా సామాజిక సమ్మతి ఉంది.

వివాహ విధులు

జైవిక విధులు: మానవుడిలో లైంగిక వాంఛలను వివాహం ద్వారా నెరవేర్చుకుంటారు. దీని ద్వారా స్త్రీ, పురుషులు జంటగా ఏర్పడి సంతానోత్పత్తితో తమ వంశాన్ని అభివృద్ధి చేసుకుంటారు. ఇది కేవలం ఆ దంపతులనే కాకుండా వారి భావి సంతానాన్ని కూడా సూచిస్తూ సన్నిహిత సంబంధాలతో, పరస్పర అనురాగబద్ధమై ఉంటుంది. మరణం వల్ల ఏర్పడే లోటు సంతానం ద్వారా భర్తీ అవుతుంది.



సామాజిక విధులు: వివాహం దంపతుల మధ్య కొన్ని బాధ్యతలను సంస్థాగతం చేస్తుంది. దంపతులిద్దరూ వారి సంతానాన్ని ఒకరు తండ్రిగా, మరొకరు తల్లిగా సంరక్షిస్తారు. వివాహం భార్యభర్తల్లో ఒకరికి మరొకరిపై లైంగిక గుత్తాధిపత్యాన్ని కల్పిస్తుంది. స్త్రీ, పురుషుల మధ్య ఏర్పడే శ్రమ విభజనకు కూడా వివాహమే బీజం వేస్తుంది. వివాహం తర్వాత స్త్రీ.. పిల్లల రక్షణ చూస్తూ, పురుషుడికి సహాయకారిగా ఉంటూ సామాజిక మనుగడకు దోహదం చేస్తుంది. పురుషుడు ప్రధానంగా కుటుంబ బాధ్యతలను చూస్తాడు.

సంబంధ బాంధవ్యాలు కల్పించడం: వివాహం వల్ల నూతన బంధుత్వాలు ఏర్పడతాయి. ఇది రెండు కుటుంబాలను కలపడం ద్వారా పెద్ద సంఖ్యలో బంధుత్వ వర్గాలను ఏర్పాటు చేస్తుంది. ఇరుపక్షాల వాళ్లు ఒకరికొకరు జీవనోపాధి పరంగా, రాజకీయంగా, చట్టపరంగా, మతపరంగా ఆదుకుంటారు. బంధువర్గంలో భావితరాలకు మార్గదర్శకంగా ఉంటారు. ఇతరులతో కలహం ఏర్పడినప్పుడు రక్షణగా నిలుస్తారు. వ్యవహారాల్లో అండగా ఉంటారు. ఈ సంబంధ బాంధవ్యాలు తరతరాలకు సాగిపోతూ ఉంటాయి.

విద్యా విధులు: వివాహం ద్వారా ఏర్పడిన నూతన కుటుంబం ఆ సమాజం సంస్కృతిని, అందులోని నియమ నిబంధనలు, ప్రవర్తనా రీతులను తమ సంతానానికి అందజేస్తూ వారికి విద్యాబుద్ధులు అందిస్తారు. సమాజ అభ్యున్నతికి అవసరమైన కొత్త తరాలను తయారు చేస్తారు. వివాహం ద్వారా ఏర్పడ్డ కుటుంబం పాత తరాల సంస్కృతిని కొత్త తరాలకు అందిస్తుంది.

వివాహం రకాలు

సమాజంలో వివాహానికి సంబంధించి వివిధ రకాల విధానాలున్నాయి.

అంతర్వివాహం

ఒక వ్యక్తి తమ ప్రాంతం లేదా తన సమూహానికే చెందిన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎన్నుకుంటే దాన్ని 'అంతర్వివాహం'గా పేర్కొంటారు. తన సమూహం అంటే ఆ వ్యక్తి మతం, వర్ణం, కులం, తెగ ఏదైనా కావొచ్చు.

ఈ పద్ధతి హిందూ సమాజంలోని కుల వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాచీన హిందూ సమాజంలో నాలుగు రకాల వర్ణాలు ఉన్నాయి.

అవి: 1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు 3) వైశ్యులు 4) శూద్రులు

వీరు కొన్ని నియమాల ప్రకారం వర్ణాంతర వివాహాలను అనుమతించారు.

ఎ) **అనులోమ వివాహ పద్ధతి:** హిందూ వర్ణ వ్యవస్థలో ఒక పురుషుడు తన కింది వర్ణానికి చెందిన యువతిని వివాహం చేసుకుంటే దాన్ని 'అనులోమ వివాహం' అంటారు. దీని ప్రకారం.. ఒక బ్రాహ్మణ యువకుడు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణానికి చెందిన స్త్రీని; క్షత్రియుడు - క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీని; వైశ్యుడు - వైశ్య, శూద్ర స్త్రీని; శూద్రుడు - శూద్ర స్త్రీని వివాహం చేసుకునే విధానం.

బి) **ప్రతిలోమ వివాహం:** హిందూ వర్ణ వ్యవస్థలో ఒక యువతి తన కంటే పై వర్ణానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడాన్ని 'ప్రతిలోమ వివాహం' అంటారు. దీని ప్రకారం.. బ్రాహ్మణ యువతి - బ్రాహ్మణ; క్షత్రియ స్త్రీ - క్షత్రియ, బ్రాహ్మణ; వైశ్య యువతి - వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ; శూద్ర స్త్రీ - శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ యువకులను వివాహం చేసుకునే విధానం.

అంతర్వివాహానికి కారణాలు:

- తమ సమాజం విచ్ఛిన్నం కాకుండా ఉండటానికి అంతర్వివాహాలు చేసుకునేవారు.
- తమ సమాజ ఉనికి కాపాడటానికి ఈ రకమైన వివాహం చేసుకునేవారు.
- తమ సంస్కృతిని కొనసాగించడానికి ఈ పద్ధతికి ప్రాధాన్యం ఇచ్చేవారు.
- తమ ప్రాంతం అలవాటైనందువల్ల అందులోనే జీవించడానికి ఇష్టం చూపి ఈ రకమైన వివాహం చేసుకునేవారు.
- తమ జైవిక లక్షణాలు చెడిపోకుండా ఉండటానికి దీనికి ప్రాధాన్యం ఇచ్చేవారు.

బహిర్వివాహం

ఒక సమూహానికి చెందిన వ్యక్తి మరో సమూహానికి చెందిన మహిళను జీవిత భాగస్వామిగా చేసుకునే పద్ధతిని 'బహిర్వివాహం' అంటారు. దీనికి సంబంధించి కొన్ని నిషేధాలు, ఎవరిని చేసుకోవాలనే విషయంలో విధి విధానాలు ఉన్నాయి.

ఉదా: హిందూ సమాజంలో స్వ గోత్రికుల మధ్య వివాహం నిషేధం. దీన్ని 'సంపద పద్ధతి వివాహం' అంటారు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి.

బహిర్వివాహానికి కారణాలు:

- ప్రాచీన యుగంలో పెద్ద పెద్ద మృగాలను వేటాడటానికి సహాయం కోసం ఒక సమాజంలోని వ్యక్తులు మరో సమాజంలోని వ్యక్తులపై ఆధారపడేవారు. దీని కోసం ఒకరిపై మరొకరు నమ్మకం పెంచుకునేందుకు స్త్రీలను ఇచ్చిపుచ్చుకోవడం మొదలు పెట్టారు.
- ఒకే సమాజంలోని స్త్రీ, పురుషుల మధ్య లైంగిక ఆకర్షణ తగ్గినందువల్ల బహిర్వివాహానికి మొగ్గు చూపారు.
- ఒక సమాజంలో స్త్రీల కొరత ఎక్కువగా ఉండటంతో మరో సమాజానికి చెందిన యువతులను వివాహం చేసుకున్నారు.
- ఒక సమాజంలో ఆహార కొరత తీవ్రంగా ఉండటంతో మరో ఉన్నత సమాజానికి చెందిన యువకులకు స్త్రీలను ఇచ్చేవారు.

  ఉదా: గంగానది పరీవాహక ప్రాంతంలో వ్యవసాయం అభివృద్ధి చెందడం వల్ల ఆహారం సమృద్ధిగా లభించేది. కానీ రాజస్థాన్‌లోని థార్ ఎడారి పరిసర ప్రాంతాల్లో అల్ప వర్షపాతం కారణంగా ఆహార కొరత ఉండేది.
- ఒక సమాజంలోని వ్యక్తుల మధ్య గౌరవం తగ్గడం కూడా బహిర్వివాహానికి కారణం.

ఏక వివాహం

ఒక పురుషుడు, ఒక స్త్రీని ఒకేసారి వివాహమాడటాన్ని 'ఏక వివాహం' అంటారు. భారతీయ సమాజంతోపాటు ప్రపంచవ్యాప్తంగా బాగా ప్రాచుర్యం పొందిన, మంచి ఆదరణ ఉన్న పద్ధతి ఇది. ఏక వివాహంలో ఆప్యాయత, నిజాయితీతో కూడిన ప్రేమ, అనురాగం ఉంటాయి. పిల్లల సంరక్షణ బాగుంటుంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది.

ఎ) **ఏక కాలిక ఏక వివాహం:** స్త్రీ సంతానవతి కానప్పుడు, భర్తకు, భార్యకు సరిపడక విడాకులు ఇచ్చుకున్నప్పుడు 'పునర్వివాహం' చేసుకుంటారు. దీన్నే 'ఏక కాలిక ఏక వివాహం' అంటారు. ఇది కొన్ని భారతీయ ఆదిమవాసి తెగల్లో కనిపిస్తుంది. ఇది నిలకడలేని వైవాహిక జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. కేరళలోని ఇరుళ, యూరాళి మొదలైన ఆహార సంగ్రాహక ఆదిమ తెగల్లో ఈ రకమైన వివాహం కనిపిస్తుంది.

బి) **జీవితాంతపు ఏక వివాహం:** జీవితాంతం ఒకే భాగస్వామితో జీవిస్తే దాన్ని 'జీవితాంతపు ఏక వివాహం' అంటారు. ఇది చాలా స్థిరమైన వివాహ రూపం. భార్య, భర్త మధ్య ఉండే అన్యోన్యత, నిలకడైన దాంపత్య జీవనానికి ఇది ప్రతీకగా ఉంటుంది. జీవితాంతపు ఏక వివాహం అనేక ఆదిమ వాసి తెగల్లో ఉంది.

ఉదా:

1) గోండులు 2) భిల్లులు
3) సంతాల్‌లు 4) నాగాలు

మాదిరి ప్రశ్నలు

1. **మానవ వివాహ చరిత్రను రచించిన ప్రఖ్యాత సమాజ శాస్త్రవేత్త?**
   ఎ) ఎడ్వర్డ్ వెస్టర్ మార్క్ బి) మోర్గాన్
   సి) మర్డాక్ డి) టైలర్
2. **హిందూ వివాహ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?**
   ఎ) 1955 బి) 1956
   సి) 1957 డి) 1958
3. **'మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా' గ్రంథ రచయిత?**
   ఎ) కార్వే బి) కె.ఎం. కపాడియా
   సి) ఎం.ఎన్. శ్రీనివాసన్
   డి) టి.ఎన్. మదాన్
4. **మేనరిక వివాహాలు భారతదేశంలో ఎక్కువగా ఏ ప్రాంతంలో ఉన్నాయి?**
   ఎ) పశ్చిమ భారతదేశం
   బి) ఉత్తర భారతదేశం
   సి) దక్షిణ భారతదేశం
   డి) ఈశాన్య భారతదేశం

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) బి; 4) సి.

HTML was introduced by

BANK EXAMS

COMPUTER AWARENESS

MODEL QUESTIONS

1. If you want to connect to your own computer through the Internet from a different location, you can use _____.
1) E-mail 2) FTP
3) Instant message
4) Telnet 5) None of these

2. The sharing of a medium and its path by two or more devices is called ______.
1) Modulation 2) Encoding
3) Line discipline 4) Multiplexing
5) None of these

3. The server on the internet is also identified as ______.
1) Repeater 2) Host
3) Gateway 4) AND Gate
5) None of these

4. Personal computers can be connected together to form a _____.
1) Server 2) Super computer
3) Network 4) Enterprise
5) None of these

5. DSL is an example of a (n) ______connection.
1) Network 2) Wireless
3) Slow 4) Broadband
5) None of these

6. What's considered the 'backbone' of the World Wide Web?
1) URL 2) HTML 3) HTTP
4) FTP 5) None of these

7. SMTP stands for ______.
1) Simple Mail Transfer Protocol
2) Serve Message Text Process
3) Short Messaging Text Process
4) Short Messaging Transfer Protocol
5) None of these

8. A Proxy server is used for which of the following?
1) To provide security against unauthorized users
2) To process client requests for web pages
3) To provide TCP/IP
4) To process client requests for database access
5) None of these

9. Which term identifies main page of the entire site?
1) URL 2) Web site address
3) Hyperlink 4) Domain name
5) None of these

10. Which of the following is not a network topology?
1) Star 2) Bus 3) Linear
4) Ring 5) None of these

11. A central computer that holds collections of data and programs for many PCs, work stations, and other computers is a(n)_______.
1) Supercomputer
2) Minicomputer 3) Laptop 4) Server
5) None of these

12. When the pointer is positioned on a ______ is shaped like a hand.
1) Grammar error
2) Formatting error
3) Screen Tip
4) Spelling error
5) Hyperlink

13. TCP stands for _______.
1) Transfer control protocol
2) Transfer control process
3) Transmission control protocol
4) Transmission control process
5) None of these

14. Peer-to-peer is a description-
1) Of communications between two dissimilar devices
2) Of communications between two equal devices
3) Of communications between two different devices
4) All of the above
5) None of these

15. The technique where digital signals are converted to its analog form for transmission over an analog facility is called_________.
1) Modulation 2) Digitization
3) Multiprocessing
4) All of the above
5) None of these

16. Narrowband channel is a communication channels _______.
1) That handles low volumes of data
2) Used mainly for telegraph lines and low speed terminals
3) Both a and b
4) All of the above
5) None of these

17. MIME is an acronym for______.
1) Multiprogramming Internet Mail Extension
2) Multicasting Internet Mail Extension
3) Multiple Internet Mail Extension
4) Multipurpose Internet Mail Extension
5) None of these

18. Which of the following is a network in which computers are located physically close together, often in the same building?
1) WAN 2) PAN 3) MAN
4) LAN 5) None of these

19. What is a modulator/demodulator that is connected to a circuit board or motherboard?
1) Fax modem
2) Network Interface Card (NIC)
3) Internal modem
4) External modem
5) None of these

20. What kind of server converts IP addresses to domain names?
1) File 2) DNS 3) E-mail
4) P2P 5) None of these

21. In the OSI model, the actual transmission of data is handled in the _________ layer.
1) Data link 2) Physical
3) Network 4) Transport
5) None of these

22. Which device cannot be shared in network?
1) Floppy 2) Keyword
3) Computer 4) Printer
5) None of these

23. A network of geographically distant computers and terminals is called a______.
1) Integrated Services Digital Network (ISDN)
2) Metropolitan Area Network (MAN)
3) Wide Area Network (WAN)
4) Local Area Network (LAN)
5) None of these

24. An example of a wireless medium that sends data through the air or space is:
1) Fiber-optic cable
2) Coaxial cable
3) Twisted pair
4) Microwaves
5) None of these

25. A ____ shares hardware, software, and data among authorized users.
1) Network 2) Protocol
3) Hyperlink 4) Transmitter
5) None of these

26. Granting an outside organization access to internet web pages is often implemented using a(n)?
1) Extranet 2) Intranet
3) Internet 4) Hacker
5) None of these

27. ______ is a process that permits multiple computers to use the same IP address and hide their actual IP addresses from the Internet.
1) Routing
2) Network Address Translation (NAT)
3) Signature referencing
4) Packet filtering
5) None of these

28. The topology where all the nodes are attached in a circular wiring arrangement is called a:
1) Star topology 2) Bus topology
3) Network topology
4) Ring topology
5) None of these

29. Difference engine is the machine introduced by_______.
I) Blaze Pascal 2) Napier
3) Charles Babbage 4) Newman
5) None of these

30. Valves are invented in______ generation.
I) I generation
2) II generation
3) III generation
4) IV generation
5) None of these

31. Micro-programming introduced by________.
1) John Mauchley
2) Maurice Wilkies
3) William Shockley
4) Blaise pascal
5) None of these

32. $(1024)^3$ is equivalent to______.
1) Approx I million
2) Approx 1 billion
3) Approx 10 thousand
4) 3096 5) None of these

33. Convert the $(347)_8$ into binary number
1) 111000101 2) 011100111
3) 101110101 4) 100000111
5) None of these

34. Time required by a sector to reach below the head is known as _____.
1) Seek time 2) Latency time
3) Access time 4) Disk time
5) None of these

35. Function keys, control keys, arrow keys, modifier keys, toggle keys are known as ______.
1) Special keys 2) Alpha keys
3) Esc keys
4) Multimedia key
5) None of these

36. ______can be used with any CRT monitor but not with the LCD monitor.
1) Joystick 2) Light Pen
3) Trackball 4) Mouse
5) None of these

37. ______ Technologies is used by banks for faster processing of large volumes of cheques.
1) OCR 2) OMR
3) MICR 4) Bar code
5) None of these

38. The shortcut key for undo is ____.
1) Win button + E 2) Ctrl + X
3) Win button+ R
4) Ctrl +Z 5) None of these

39. Which of the following is not hardware of a computer?
1) Monitor 2) Windows
3) Processor 4) Printer
5) None of these

40. What is the main folder on a storage device called?
I) Platform 2) Interface
3) Root-Directory
4) Home-Page 5) None of these

41. Ctrl, Shift and Delete are known as______.
1) Modifier Keys
2) Control Keys 3) Toggle keys
4) Function keys
5) None of these

42. When you start your computer from the off position then it is known as ______.
1) Hard booting 2) Processing
3) Storage 4) Soft-booting
5) None of these

43. A repair for a known software bug, usually available at no change on the internet is called ______.
1) Version 2) Patch
3) Tutorial 4) FAQ
5) None of these

44. Small application programs that run on a web page and may ensure a form is completed properly or provide animation are known as ____
1) Flash 2) Spiders
3) Cookies 4) Applets
5) Sparks

45. Which is the slowest internet connection?
1) Digital subscriber line 2) TI
3) Cable modem
4) Leased line
5) Dial-up service

46. The transmission mode which allow both communicating devices to transmit and receive data simultaneously is______.
1) Simplex 2) Full-duplex
3) Half-duplex 4) Duplex 5) None of these

47. In IP addressing scheme, which class is used for multicasting?
1) Class A 2) Class B
3) Class C 4) Class D
5) None of these

KEY

1) 4	2) 4	3) 2	4) 3
5) 4	6) 3	7) 1	8) 2
9) 1	10) 3	11) 4	12) 5
13) 3	14) 4	15) 1	16) 1
17) 4	18) 4	19) 3	20) 2
21) 2	22) 2	23) 3	24) 4
25) 1	26) 1	27) 2	28) 4
29) 3	30) 1	31) 2	32) 2
33) 2	34) 2	35) 1	36) 2
37) 3	38) 4	39) 2	40) 3
41) 1	42) 1	43) 2	44) 1
45) 5	46) 2	47) 4	